# దైవ ప్రవక్త
## (సల్లల్లాహు అలైహి వసల్లం)
# ధర్మం

మహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్

పునర్విచారకులు

హాఫిజ్ అబ్దుల్ వాహెద్ ఉమ్రీ మదని
విజయవాడ

ప్రకాశకులు
**అల్ అసర్ ఇస్లామిక్ సెంటర్**
హైదరాబాద్





**దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం**

రచన : మహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్
khaleelr1570@yahoo.co.in
+91-9993638549

పునర్విచారకులు : హాఫిజ్ అబ్దుల్ వాహెద్ ఉమ్రీ మదని,
విజయవాడ. సెల్: 9440916088

ప్రచురణ కాలం : 2009

ప్రతులు : 2000

వెల : రూ. 20-00

(ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహాయాన్ని అందించిన వారందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు. అల్లాహ్ వారికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక! - ప్రకాశకులు)

కవర్ డిజైన్, కంపోజింగ్,
ముద్రణ : అల్ బసీర్ గ్రాఫిక్స్
హైదరాబాదు.
సెల్. 9441055065

ప్రకాశకులు : అల్ అసర్ ఇస్లామిక్ సెంటర్
ఏక్ ఖానా మస్జిద్ దగ్గర,
పురాని హవేలీ, హైదరాబాద్ - 500 002.
ఫోన్ : 040-32901219

# ఆప్త వాక్కులు

బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీం

"విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌కు ఏ విధంగా భయపడాలో ఆ విధంగా భయపడండి. ముస్లింలుగా తప్ప మరణించకండి."

*(దివ్వ ఖుర్‌ఆన్ 3:103)*

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్తలో మీకు ఒక మంచి ఆదర్శం ఉంది. అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకొని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే వ్యక్తికి." *(దివ్య ఖుర్‌ఆన్ 33:21)*

ప్రస్తుతం ముస్లిం సమాజంలోని అధిక శాతం ప్రజలలో కానవచ్చే విశ్వాసాలు ఆరాధనా పద్ధతులు మరియు ఆచరణా వ్యవహారాలు అన్నీ ధర్మం పేరుమీద ధర్మ వ్యతిరేకమైన కొత్త పద్ధతులు కొనసాతున్నాయి. ఇందుకు కారణం ఖుర్‌ఆన్ మరియు ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆచరణ విధానాల గురించి ప్రజలలో నిజమైన అవగాహన లేకపోవటమే.

ప్రస్తుతం ముస్లిములలో తౌహీద్ (దేవుని ఏకత్వ) భావన అధిక శాతం లోపించింది. ఇందుకు భిన్నంగా షిర్క్ (బహుదైవారాధన) భావాలు ప్రజలలో పెరిగి పోతున్నాయి. తత్కారణంగా నేటి ముస్లిం సమాజంలో అనేక మూఢ విశ్వాసాలు, అనేక మూఢ నమ్మకాలు మరియు ఒళ్ళు గగ్గురపరిచే అనేక అజ్ఞానపు చేష్టలు సర్వసామాన్యం అయిపోయాయి.

ప్రపంచానికి మార్గదర్శకం వహించాల్సిన ముస్లిం సమాజంలోని అధిక ప్రజలు ప్రస్తుతం పతనావస్థకు చేరుకున్నారు.

ఇంతకంటే అనేక రెట్లు అజ్ఞానపు మూఢత్వంలో ఉన్న అరబ్బు జాతిని ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారు తౌహీద్, ఆఖిరత్ అనే నినాదాన్ని పునాదిగా చేసుకుని పతనావస్థలో ఉన్న ఆ సమాజాన్ని విశ్వాసపరంగా మరియు నైతికపరంగా ఉన్నత స్థాయికి చేర్చి ప్రపంచానికి ఆదర్శంగా మలిచారు. అందుకు కారణం ఖుర్‌ఆన్‌లోని వాక్యాలు ఎలా అవతరించాయో అలానే ప్రజలలో





సర్వసామాన్యం చేయటమే.

ఈ రోజు ఖుర్‌ఆన్ మరియు ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆచరణ యధాస్థితిలో ఉన్నా ముస్లిం సమాజం స్థితి మారకపోవటానికి కారణం, (ఎ) ఆహారం తమ దగ్గర ఉన్నా పస్తులుండే వానివలె (బి) మందులు తమ దగ్గర ఉన్నా అనారోగ్యాన్ని దూరం చేసుకోలేని వాని పరిస్థితి వలె దైవ మార్గదర్శకత్వాన్ని పొంది కూడా దానిని పెడచెవిన పెట్టి అంధకారంలో తచ్చాడుతున్న వారిలా మారిపోయారు ముస్లింలు. అందువల్లనే అల్లాహ్ తన గ్రంథంలో ఇలా అంటున్నాడు.

"ఇక నా తరపు నుండి మార్గదర్శకత్వం మీ దగ్గరకు వస్తే ఎవడు ఈ మార్గదర్శ కత్వాన్ని అనుసరిస్తాడో అతడు మార్గం తప్పడు, దౌర్భాగ్యానికి గురికాడు. నా జ్ఞాపికకు విముఖుడైన వానికి ప్రపంచంలో జీవితం ఇరుకే అవుతుంది. ప్రళయంనాడు మేము అతన్ని అంధుడుగా లేపుతాము." *(దివ్యఖుర్‌ఆన్ 20:123-124)*

అందుకే ఈ రోజు ముస్లింలు ప్రపంచంలో తమ స్థితిని చక్కబరచుకోవాలంటే ఒక్కటే మార్గం. అల్లాహ్ అవతరింపజేసిన ఖుర్‌ఆన్ బోధనలు మరియు దానిని ఆచరించి చూపిన ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవిత విధానాలు సర్వసామాన్యం చేయటం తప్ప వేరే మార్గం లేదు అని నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను.

ఈ పుస్తకం రచయిత జనాబ్ మహమ్మద్ ఖలీలుర్రహ్మాన్ గారు తౌహీద్ అంశంపై తెలుగు భాషలో సవివరంగా చర్చించటం జరిగినది. తౌహీద్ వాస్తవికతను అర్థం చేసుకోవ టానికి ఈ పుస్తకం ఉపకారి కాగలదు. పుస్తక రచనలో రచయిత సౌదీ అరేబియాలోని ప్రామాణిక రచయితల గ్రంథాల నుండి సేకరించిన అంశాలను పొందుపర్చటం జరిగినవి. తౌహీద్‌తోపాటు ప్రజలు చేసే షిర్క్, దేవుని వేడుకోలు, గుణాలు, నామాలు సోదాహరణగా చర్చించటం జరిగినవి. విశ్వాసాలు, ఆరాధనలలో తౌహీద్ యొక్క వాస్తవ దృక్పథాన్ని వివరించడం జరిగినది. ఈ పుస్తకం దైవదాసులైన మానవాళికి మార్గదర్శి కావాలని, సందేశ దాతలకు సందేశ సామగ్రిగా ఉపయోగ పడాలని, పుస్తక రచయితకు అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ...

**హాఫిజ్ అబ్దుల్ వాహెద్ ఉమ్రి మదని**

విజయవాడ 9440916088

## విషయ సూచిక


| విషయం | | పేజీ నెం. |
|---|---|---|
| 1. | తొలి పలుకులు | 09 |
| 2. | దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం | 17 |
| 3. | లా ఇలాహ ఇల్లల్లాహ్ మహమ్మదుర్రసూలుల్లాహ్ అని సాక్ష్యమివ్వడం | 24 |
| 4. | లా ఇలాహ ఇల్లల్లాహ్ సాక్ష్యం - నియమాలు | 35 |
| 5. | లా ఇలాహ ఇల్లల్లాహ్ వివరణ | 37 |
| 6. | తౌహీద్ అల్ రుబూబియత్ | 41 |
| 7. | తౌహీద్ అల్ ఉలూహియత్ | 53 |
| 8. | హృదయారాధనలు | 58 |
| 9. | నోటి ఆరాధనలు | 73 |
| 10. | ఇతర శారీరక ఆరాధనలు | 89 |
| 11. | తౌహీద్ అల్ అస్మా వ సిఫాత్ | 111 |
| 12. | తౌహీద్ ప్రయోజనాలు | 126 |
| 13. | షిర్క్ యొక్క ఆరంభము | 128 |
| 14. | దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం నాటి ముష్రిక్కులు | 131 |
| 15. | మహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం వాస్తవికత | 145 |







| | | |
|---|---|---|
| 16. | దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయత - లాభాలు | 168 |
| 17. | దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అవిధేయత - నష్టాలు | 170 |
| 18. | ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరుల విధేయత | 172 |
| 19. | నలుగురు ఇమాములు | 183 |
| 20. | సున్నత్ - బిద్అత్ | 190 |
| 21. | సలఫ్ మరియు సున్నత్ | 195 |
| 22. | బిద్అత్ | 197 |
| 23. | యాసిడ్ టెస్ట్ | 203 |
| 24. | ఈమాన్ | 208 |
| 25. | ఇహ్సాన్ | 239 |
| 26. | చివరిగా ... | 245 |
| 27. | సహాయం తీసుకోబడిన గ్రంథాలు, పుస్తకాలు | 248 |

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం

# ఈ పుస్తకం గురించి ...

అల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్, వస్సలాతు వస్సలాము అలా సయ్యదిల్ ముర్సలీన్ - అమ్మాబాద్!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధర్మం - దాని వాస్తవిక స్వరూపం గురించి ఎందరో పండితులు వ్రాసిన ఎన్నో పుస్తకాలు వేర్వేరు భాషల్లో వెలుగులోకి వచ్చాయి. కానీ నాకు తెలిసినంత వరకు తెలుగు భాషలో ఇలాంటి పుస్తకం ఇంత వరకు రాలేదు. ఏక దైవారాధన (తౌహీద్) గురించి, నమాజ్, ఉపవాసాలు ... వగైరా ... లాంటి విషయాలపై వేర్వేరుగా పుస్తకాలు వచ్చినప్పటికీ "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ధర్మం- దాని వాస్తవిక స్వరూపము"ను గూర్చి తెలియజేసే ఒక సమగ్రమైన పుస్తకం నాకు తెలిసినంత వరకు ఇప్పటి వరకు తెలుగు భాషలో అందుబాటులో లేదు.

ఈ కారణంగానే కేవలం తెలుగు భాష తప్ప ఇతర భాషలురాని ఎందరో ముస్లిములు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధర్మం యొక్క నిజమైన స్వరూపాన్ని, దాని ప్రాముఖ్యతను గూర్చి సరిగ్గా తెలుసుకోలేక పోతున్నారు.

దీనికి తోడు నేడు ముస్లిం సమాజంలో కానవస్తున్న వివిధ వర్గాలు కూడా వారిని అసమంజస స్థితికి గురిచేస్తూ వుంటాయి. ఏది ఒప్పో, ఏది తప్పో తెలియక సంశయంలో, అయోమయంలో కొట్టి మిట్టాడుతున్నారు. ఎలాగోలా నమాజు చేస్తూ ఇతర ఆచరణలు పాటిస్తున్నప్పటికీ ధర్మానికి పునాది అయిన విశ్వాసం గురించి వారికి సరైన జ్ఞానం వుండడం లేదు.

'లా ఇలాహ ఇల్లల్లాహ్ మహమ్మదుర్రసూలుల్లాహ్' అని వారిచ్చే సాక్ష్యానికి పాటించాల్సిన షరతులు గానీ, ఈ సద్వచనం వారి నుండి ఏం ఆశిస్తోంది అన్న విషయాలు గానీ వారికి బొత్తిగా తెలియడం లేదు.

అలాంటి వారెందరో స్వయంగా నాకు తారస పడ్డారు. ముఖ్యంగా నేటి యువతీ యువకులు.

వారి ఈ పరిస్థితులను మరియు కేవలం తెలుగు తప్ప ఇతర భాషలు రాని వారి నిస్సహాయతను గుర్తులో పెట్టుకొనే ధార్మికంగా పరిమిత జ్ఞానమున్న నేను మిత్రులు, శ్రేయోభిలాషుల ప్రోద్భలంతో ఎలాగైనా వారి ఈ అవసరాన్ని





తీర్చాలన్న దృఢ ఆకాంక్షతో అల్లాహ్‌పై భారం మోపి ఈ కార్యానికి శ్రీకారం చుట్టాను.

అల్లాహ్ దయవల్ల జరిగిన ఆ కృషి ఫలితమే మీముందున్న ఈ పుస్తకం. ఈ పుస్తక రచనలో నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ప్రామాణిక హదీసులనే ఎంపిక చేసుకున్నాను. అలాగే ఒక హదీసు వేర్వేరు గ్రంథాలలో పొందు పరచబడి వున్నప్పటికీ నేను మాత్రం ఒకే గ్రంథం పేరును ఆధారంగా వ్రాశాను. నాకున్న పరిమిత జ్ఞానం మూలంగా అవసరమనుకున్న చోట వివిధ పండితులు వ్రాసిన పుస్తకాల సహాయం కూడా తీసుకున్నాను. వాటి వివరాలు పుస్తకం చివర్లో పొందుపరిచాను. అయినప్పటికీ ఎక్కడైనా తప్పులు దొర్లివుంటే దానికి నేనే పూర్తి బాధ్యత వహిస్తూ ఆ అనంత కరుణామయుడైన అల్లాహ్‌కు మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పుకుంటున్నాను.

చివరిగా పుస్తక రచనకు ప్రోత్సాహమిచ్చి సహాయపడిన బంధుమిత్రులు, శ్రేయోభిలాషులందరికీ ముఖ్యంగా గౌరవనీయులైన మౌలానా అబుల్ కలాం రియాజి, ఇమామ్ వ ఖతీబ్, మస్జిద్ అబూ ఉబైదా బిన్ జర్రాహ్, కొత్తగూడెం గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. వారి ఈ పనికి అల్లాహ్ వారికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక! (ఆమీన్)

అల్లాహ్ దయవలన, కేవలం ఆయన సహాయంతోనే చేయబడిన ఈ చిన్న కృషిని దయతో స్వీకరించమని, దీనికి ప్రతిఫలంగా నన్నూ, నా తల్లిదండ్రులనూ, నా కుటుంబాన్ని మన్నించి ఇహపరలోకాలలోని సౌఖ్యాలను ప్రసాదించమని అర్థిస్తూ, పరలోకంలో మమ్మల్ని సజ్జనులతో కలుపమని మనస్ఫూర్తిగా అల్లాహ్‌ను వేడుకుంటున్నాను.

పాఠకులు కూడా తమ ప్రార్థనల్లో నన్ను గుర్తుంచుకుంటారని ఆశిస్తున్నాను. నాకు అల్లాహ్‌యే చాలు, ఆయన తప్ప మరొక దేవుడు లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను మరియు ఆయన వైపుకే పశ్చాత్తాపంతో మరలుతాను. అల్లాహ్ పరిశుద్ధుడు మరియు నేను ముష్రిక్కులలోని వాణ్ణికాను.

'రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అంతస్సమీ ఉల్ అలీం'

మీ సోదరుడు

17 రంజాన్ 1429 హి.
సెప్టెంబరు 18, 2008.

**మహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్**

# తొలిపలుకులు ...

ఈ రోజు ప్రపంచంలోని యావత్తు ముస్లిం సమాజం మీద ఒక్కసారి దృష్టి సారిస్తే చాలా విషయాలు మనకు బోధ పడతాయి. ముస్లిం సమాజంపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలూ, అత్యాచారాలు, ముస్లిములలో పెరుగు తున్న అసురక్షిత భావన- ఇవన్నీ మనం రోజూ మన దైనందిన జీవితంలో చూస్తూనే వున్నాం. అంతే కాకుండా మిక్కిలి బాధ కలిగించే మరొక ముఖ్య విషయం ఏమిటంటే - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి కాలంలో ఒక్కటిగా వున్న ముస్లిం సమాజం నేడు ముక్కలు ముక్కలై విభిన్న వర్గాలుగా, ముఠాలుగా చీలిపోవడం.

అల్లాహ్ యొక్క అంతిమ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ లోకాన్ని వీడిపోయి 1400 సంవత్సరాలకు పైగానే అయ్యింది. అయినప్పటికీ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అవతరించిన దైవ గ్రంథం ఖురాను మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌లు (హదీసులు) ఈ రోజు వరకూ ముస్లిముల చేతుల్లో ఏ మాత్రం చెక్కు చెదరకుండా సురక్షితంగా వున్నాయి. ఇన్షాల్లాహ్ ప్రళయ గడియ వచ్చే వరకు గూడా వుంటాయి. ఎందుకంటే వాటి సంరక్షణ బాధ్యతను స్వయంగా అల్లాహ్ యే తనపై వేసుకున్నాడు.

> "ఈ జ్ఞాపిక (జిక్ర్) ను మేమే అవతరింప జేశాము. స్వయంగా మేమే దీనిని రక్షిస్తాము". *(హిజ్ర్:9)*

వీటిని రక్షించడానికి అల్లాహ్ ఎలాంటి ఏర్పాట్లు చేశాడో ఒక్కసారి గమనిం చండి. దివ్య ఖురాను రక్షణార్థం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం మొదలుకొని ప్రతి కాలంలోనూ హుఫ్ఫాజ్ (దివ్య ఖురానును పూర్తిగా కంఠస్తం చేసినవారు)ల సమూహాన్ని పుట్టించాడు. అలాగే సున్నత్‌ల (హదీసులు) రక్షణార్థం ప్రతి కాలం లోనూ 'ముహద్దిసీన్' (హదీసులను సమీకరించి, వాటిని విశ్లేషించి, వాటి ప్రామాణికతలను నిర్ధారించి, తద్వారా ప్రామాణిక, కాల్పనిక హదీసులను వేరు చేసి గ్రంథీకరించే హదీసు వేత్తలు)ల సమూహాన్ని సృష్టించాడు.

ఇక ఇస్లాం వ్యతిరేక శక్తులన్నీ ఏకమై ఎన్ని దుష్ట పన్నాగాలు పన్నినా, అంతిమ షరియత్తు(ధర్మశాస్త్రము)ను మార్చడం మటుకు ప్రళయం వచ్చే వరకు





వారికి సాధ్య మయ్యే పనికాదు. అయితే ఆ సృష్టికర్త చేసిన ఇన్ని ఏర్పాట్ల తర్వాత కూడా ఈ రోజు ముస్లిం సమాజం కడు దీనావస్థలో వుంది. దీనికి కారణాలు ఏమిటి?

దివ్య ఖురానులో అల్లాహ్ ఏం సెలవిస్తున్నాడో కాస్త గమనించండి :

> "కృంగిపోకండి, దుఃఖపడకండి, మీరే ప్రాబల్యం పొందుతారు. మీరే గనక నిజమైన విశ్వాసులే అయితే". *(ఆలి ఇమ్రాన్ : 139)*

> "ఏ ఆపద అయినా అల్లాహ్ అనుమతి లేనిదే ఎన్నటికీ రాదు'. *(తగాబున్ : 11)*

> "మీ పైకి వచ్చే ఆపదలు స్వయంగా మీరు మీ చేజేతులా చేసుకున్న దాని పర్యవసానమే". *(అష్షూరా : 30)*

మొదటి ఆయత్‌లో 'నిజమైన విశ్వాసులుగా వుండాలి' అన్న షరతుతో అన్నిరంగాలలోనూ 'ప్రాబల్యం' అనే గ్యారంటీని అల్లాహ్ మనకు యిస్తున్నాడు.

తరువాతి రెండు ఆయతులలో - మనపై ఆపదలు ఎవరు పంపిస్తారు? ఎందుకు పంపిస్తారు? అన్న విషయాలను అతి స్పష్టంగా తెలియజేస్తున్నాడు.

ఈ రోజు ముస్లిం సమాజం యొక్క ప్రాబల్యం మాటేమోగానీ, రోజూ దానిపై కురుస్తున్న ఆపదల వర్షం అందరికీ తెలిసిందే.

అయితే ప్రస్తుతం తలెత్తే ప్రశ్న ఏమిటంటే ...

ఆ అనంత కరుణామయుడు ముస్లిములకు వాగ్దానం చేసిన ప్రాబల్యాన్ని ఎందుకు ప్రసాదించడం లేదు?

ముస్లిములు ఎందుకు ఆపదలకు గురి చేయబడుతున్నారు?

మరి ముస్లిములు అల్లాహ్ పెట్టిన షరతు ప్రకారం 'నిజమైన విశ్వాసు లు'గా లేరా?

కాస్త నిష్పాక్షికంగా ఆలోచిస్తే మన హృదయం మనకు 'లేరు' అనే సమా ధానం యిస్తుందేమో!

అయితే ఇదే ప్రశ్న యావత్తు ముస్లిం సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలకు వేస్తే మాత్రం జవాబు వేరే విధంగా వస్తోంది.

ప్రతి వర్గం 'తానే దైవ గ్రంథం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాల వెలుగులో సత్యంపై వున్నానని ఎలుగెత్తి చాటుతోంది'.

"నా అనుచర సమాజం, 73 వర్గాలుగా చీలిపోతుంది. కేవలం ఒక వర్గం తప్ప మిగతా వన్నీ నరకంలోకి పోతాయి."

*(తిర్మిజి : అబ్వాబుల్ ఈమాన్, బాబ్ : ఇఫ్తెరాఖి హాజిహిల్ ఉమ్మతి)*

"నా అనుచర సమాజంలోని ఒక వర్గము ఎల్లప్పుడూ సత్యంపై స్థిరంగా వుంటుంది." (ముస్నద్ అహ్మద్)

అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన భవిష్యవాణి మా వర్గం గురించే అని ఆనందపడుతోంది.

పైన పేర్కొన్న హదీసులను గూర్చి ఇన్షాల్లాహ్ మున్ముందు సవివరంగా చర్చిస్తాను.

ప్రస్తుత సమయంలో సత్యాన్వేషకులకు ముఖ్యంగా నేటి యువతరానికి వస్తున్న సందేహాలేమిటంటే ...

ఒక వేళ ప్రతి వర్గమూ దైవ గ్రంథం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాల వెలుగులో సత్యంపై వుంటే - మరి వారి విశ్వాసాల్లో, ఆచరణల్లో తేడాలు ఎందుకు కనిపిస్తున్నాయ్?

దైవ గ్రంథం మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసులు అన్నీ అసంపూర్ణంగా అర్థంచేసుకో నలవికాకుండా వున్నాయా?

ఉలమాలకు (ధార్మిక పండితులు) కూడా సత్యం ఏమిటో అర్థం కావడం లేదా?

ఈ వర్గాలన్నింటినీ సృష్టించింది ఉలమాలే అన్న విషయం మనం మరువకూడదు.

అయితే అంతిమ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాత్రం ఈ విషయంలో ఏం సెలవిచ్చారో కాస్త గమినించండి!





"నేను మీకు ఎలాంటి ధర్మంపై విడిచి వెళుతున్నానంటే, దాని రాత్రులు కూడా పగటి వెలుతురు లాగ తేజోవంతమైనవి. కేవలం శిక్షార్హులు, మార్గ భ్రష్టులు మాత్రమే ఈ ధర్మం నుండి వైదొలుగుతారు". *(ఇబ్నె ఆసిం: కితాబుస్సున్న)*

"నేను మీకు రాత్రులూ, పగళ్ళూ ఒకే లాగున్న ఒక తేజోవంతమైన ధర్మంపై విడిచి వెళుతున్నాను".

అబూదర్దా (రజి అల్లాహు అన్హు) కథనం : అల్లాహ్ సాక్షిగా! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మమ్మల్ని ఒక తేజో వంతమైన మార్గంపై విడిచి వెళ్ళారు ". *(ఇబ్నెమాజా)*

మరి దైవ గ్రంథం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచనాలు అన్నీ గజిబిజిగా, అర్థం కాకుండా వుండి వుంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై విధంగా చెప్పేవారా?

నిస్సందేహంగా అలా ఎప్పుడూ చెప్పి వుండేవారు కారు.

అందువల్ల పై హదీసుల ద్వారా మనకు తెలిసిందేమిటంటే ధార్మిక విషయాలేవీ అసంపూర్ణంగా, అర్థం చేసుకోలేనట్లుగాలేవు. అన్ని విషయాలు అతి స్పష్టంగా పగటి వెలుతురు లాగా వున్నాయి.

ఇక 'మున్ముందు సవివరంగా చర్చిస్తాను' అన్న హదీసుల లోనికి వద్దాం.

మొదటి హదీసు :

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ఇస్రాయీలు సంతతికి ఏవైతే సంభవించాయో నిస్సందేహంగా నా అనుచర సమాజానిక్కూడా ఒక్కొక్కటిగా సంభవిస్తాయి. అవి ఎంతగా సంభవిస్తాయంటే ఒక వేళ ఇస్రాయీలు సంతతిలో తమ తల్లులతో వ్యభిచరించిన వారుంటే నా అనుచర సమాజంలో కూడ అలాంటి వారుంటారు. నిస్సందేహంగా ఇస్రాయీలు సంతతి వారు 72 వర్గాలుగా విడిపోయారు. నా అనుచర సమాజం 73 వర్గాలుగా విడిపోతుంది.

కేవలం ఒక వర్గం తప్ప మిగతావన్నీ నరకాగ్నిలోకి పోతాయి. దీనికి సహచరులు- ఓ దైవ ప్రవక్తా! ఆ వర్గం ఏది? అని అడగ్గా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ - నేనూ నా సహచరులూ వున్న ధార్మిక మార్గం పై నడిచేది" అని చెప్పారు.

*(తిర్మిజి: అబ్వాబుల్ ఈమాన్, బాబ్: ఇఫ్తిరాఖి హాజిహిల్ ఉమ్మతి)*

"నేనూ, నా సహచరులూ వున్న ధార్మిక మార్గంపై నడిచే వర్గం" అంటే- ధర్మానికి సంబంధించిన అన్ని విషయాలలోనూ-అవి విశ్వాసానికి సంబంధించినవి కానివ్వండి , లేదా ఆచరణల విషయం కానివ్వండి, ప్రాపంచిక వ్యవహారాలు కానివ్వండి లేదా సామాజిక, రాజకీయ, ఆర్థిక వ్యవహారాలు కానివ్వండి-

ఈ అన్ని విషయాల్లోనూ తమ అభిప్రాయాలకు గానీ, ఇతరుల అభిప్రాయాలకు గానీ (ఉలమాలు కూడా కావచ్చు) ఏమాత్రం తావివ్వకుండా, కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయన ప్రియ సహచరుల దృక్పథాన్ని (మన్హజ్) ఆకళింపు చేసుకొని వారి పద్ధతి (సున్నత్) ప్రకారమే నడుచుకునే వర్గం.

పైన చెప్పబడిన విషయాలను ధృవ పరుస్తూ దివ్య ఖురాను లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

(ప్రవక్త సహచరులారా)! మీరు విశ్వసించినట్లు వారూ విశ్వసిస్తే అప్పుడు వారు రుజు మార్గంలో వున్నట్లు. *(బఖర: 137)*

"అందరికంటే ముందు విశ్వాస సందేశాన్ని స్వీకరించడానికి ముందంజ వేసిన ముహాజిరుల పట్లా, అన్సారుల పట్లా, తరువాత నిజాయితీతో వారిని అనుసరించిన వారి పట్లా అల్లాహ్ సంతృప్తి చెందాడు. వారుకూడా అల్లాహ్ పట్ల సంతృప్తి చెందారు అల్లాహ్ వారి కొరకు క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలను సిద్ధపరచి వుంచాడు"

*(తౌబా: 100)*

అంతేకాక, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక హదీసులో ఇలా సెలవిచ్చారు:





"అందరికంటే శ్రేష్ఠమైన వారు నాకాలం వారు, ఆ తర్వాత తర్వాతి కాలం వారు (తాబయీలు), ఆ తర్వాత తర్వాతి కాలం వారు (తబా తాబయీలు)"

*(సహీ బుఖారి: 2652)*

అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), ఆయన ప్రియ సహచరులు, తాబయీలు, తబా తాబయీలు అని అర్థం. వీరినే సలఫుస్సాలిహీన్ (గతించిన మొదటి మూడు తరాల సజ్జనులు) అని కూడా పిలుస్తారు.

పైన పేర్కొన్న ఆయతులు, హదీసుల ద్వారా మనకు తెలిసే విషయాలేమిటంటే:

(1) కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు సలఫుస్సాలిహీన్ల దృక్పథాన్ని స్వీకరించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ప్రకారం జీవనం సాగిస్తేనే సాఫల్యం దొరికేది. తమ యిష్ట ప్రకారం లేదా ఇతరుల అభిప్రాయాల మేరకు జీవితం సాగిస్తే సాఫల్యం దొరకదు.

(2) అందరికంటే శ్రేష్ఠమైన ముస్లిములు సలఫుస్సాలిహీన్లు- అంటే - ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం మొదలు కొని మూడు తరాల వారు.

ఇక్కడ ఓ ముఖ్య విషయం గుర్తుంచు కోవాల్సి వుంటుంది.

పైన వివరించబడ్డ మొదటి మూడు తరాలవారు ధార్మిక జ్ఞానం విషయంలో అందరూ సమానులుగా లేరు. అయినా వారి గురించి 'నేను సంతృప్తి చెందాను' అని అల్లాహ్ మరియు 'అందరికన్నా శ్రేష్ఠులు' అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధృవీకరించారు- దానికి కారణం జ్ఞానపరంగా వారు సమానులు కాక పోయినప్పటికీ వారి ధృక్పథం మరియు సంకల్పము ఒకేలాగ వుండేవి-జీవితానికి సంబంధించిన అన్ని వ్యవహారాల్లోనూ వారు కేవలం దైవ గ్రంథం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవచానాలకు మాత్రమే అత్యున్నత ప్రాధాన్యత నిచ్చేవారు. వారి దృష్టిలో తమ అభిప్రాయానికైనా, ఇతరుల అభిప్రాయాలకైనా విలువ కేవలం ఖురాను, మరియు ప్రామాణిక హదీసుల రుజువు లభించనంతవరకే వుండేది. ఖురాను మరియు ప్రామాణిక హదీసుల రుజువు లభించగానే దానిని వెంటనే స్వీకరించి ఆచరణలోపెట్టేవారు అంతవరకూ వున్న తమ అభిప్రాయాన్ని గానీ, ఇతరుల అభిప్రాయాన్ని గానీ వారు ఎంత పెద్ద

పండితులైనా సరే వదిలేసే వారు. ఈ వైఖరే వారిని ఉన్నత స్థాయికి చేర్చింది.

అల్లాహ్ దృష్టిలో సంకల్పానికున్న ప్రాధాన్యతను గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ మీ ముఖాలనూ, సంపదలనూ చూడడు, మీ హృదయ సంకల్పాలను, ఆచరణలను మాత్రమే చూస్తాడు."

*(సహీ ముస్లిం: కితాబుల్ బిర్ర్ వస్సిలా వల్ అదబి, బాబ్: తహ్రీము జుల్మిల్ ముస్లిమి వఖజ్లిహి)*

(3) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజంలో చాలా తక్కువ మంది మాత్రమే రుజుమార్గంలో వుంటారు. ఎందుకంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 73 వర్గాల్లో కేవలం ఒక వర్గమే సత్యంపై వుంటుందన్నారు.

ఇక రెండవ హదీసులోకి వద్దాం:

"నా అనుచర సమాజం లోని ఒక వర్గం ఎల్లప్పుడూ సత్యంపై స్థిరంగా వుంటుంది. ప్రళయం వచ్చేవరకు కూడా దానిని ఎగతాళి చేసేవాడు దానికి ఏమాత్రం నష్టం కలిగించలేడు". *(ముస్నద్ అహ్మద్)*

ఇలాంటిదే మరో హదీసు:

"నా అనుచర సమాజంలోని ఒక వర్గం ఎల్లప్పుడూ సత్యంపై స్థిరంగా వుండి ప్రళయం వచ్చేవరకు అసత్యంపై పోరాడుతూ ప్రాబల్యం వహించి వుంటుంది"

*(సహీ ముస్లిం: కితాబుల్ ఈమాన్, బాబ్: బయానె నుజూలె ఈసా ఇబ్నె మర్యమ హాకిమన్ బిషరియతె నబియ్యినా మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం))*

పై రెండు హదీసుల ద్వారా తెలిసిందేమింటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజంలో ఒకే ఒక్క వర్గం ఎల్లప్పుడూ సత్యంపై స్థిరంగా వుంటుంది.

సత్యంపై స్థిరంగా ఆ వర్గం వుంటుందీ అంటే- ఆ వర్గం కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చినట్లు, ఆయన (సల్లల్లాహు అలైహి





వసల్లం) మరియు ఆయన ప్రియ సహచరులు నడిచిన ధార్మిక మార్గం పైనే ఎల్లప్పుడూ నడుస్తూ వుండాలి. జీవితానికి సంబంధించిన అన్నిరంగాల లోనూ వారి దృక్పథాన్నే అలవర్చుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ నే అనుసరిస్తూ వుండాలి. అప్పుడే ఆ వర్గం సత్యంపై స్థిరంగా వుండగలుగుతుంది.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ వర్గం ఎల్లప్పుడూ వుంటుంది అని అన్నారు- అంటే అది ఇంతకు ముందు కూడా వుండాలి, ఇప్పుడూ వుండాలి, భవిష్యత్తులో కూడా వుండాలి.

ప్రస్తుతం వున్న వర్గాలలో ఆ వర్గం ఏది ? అన్న విషయంపై నేను చర్చించ దలచుకోలేదు. దాన్ని పాఠకులకే వదిలేస్తున్నాను. వారే నిర్ణయించాలి.

ఈ పుస్తకంలో నేను కేవలం దైవ ప్రవక్త ధర్మం గురంచి, సలఫుస్సాలిహీన్ ల దృక్పథం గూర్చి చర్చించాలనుకుంటున్నాను. ఈ విషయాలు గనక తెలిస్తే సత్యాన్వేషకులు ఎవరైనా నిష్పాక్షికంగా ఆలోచిస్తే అతి తేలికగా ఆ వర్గాన్ని గుర్తించవచ్చు. ఎందుకంటే ధర్మానికి సంబంధించిన అన్ని వ్యవహారాల్లోనూ దాని దృక్పథం సలఫుస్సాలిహీన్‌ల దృక్పథంలాగే వుంటుంది కనుక.

అది రుజుమార్గంలో ఎల్లప్పుడూ వుంటుంది గనక వారు కూడా అదే రుజు మార్గంలో పయనించి సృష్టికర్తను ప్రసన్నుణ్ణి చేసి తద్వారా ఇహపర లోకాల సౌఖ్యాలను ఆస్వాదించవచ్చు.

ఓ అనంత కరుణామయుడా !

హృదయాలను మళ్ళించేవాడా !!

మా అందరి హృదయాలను రుజుమార్గం వైపుకు మళ్ళించు. మా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రియ సహచరులు నడిచిన ధార్మిక మార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదించు! (ఆమీన్)

**మహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్**

# దైవ ప్రవక్త
## (సల్లల్లాహు అలైహి వసల్లం)
# ధర్మం

ఈ భూమి మీద దైవ ప్రవక్తల ఆగమన ప్రక్రియ ఆరంభమైనప్పటినుండి అల్లాహ్ ఏ ప్రదేశానికి ప్రవక్తను పంపినా వారందరికీ ఒకే సందేశాన్ని యిచ్చి పంపాడు. తద్వారా వారి జాతి ప్రజలను హెచ్చరించాడు.

"మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా, అతనికి వహీ ద్వారా, నేను తప్ప దేవుడు లేడు, కనుక మీరు నాకే దాస్యం చేయండి అనే విషయాన్నే తెలియజేశాము." *(అంబియా : 25)*

"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింప జేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము- అల్లాహ్‌ను ఆరాధించండి, మిధ్యా దైవాల ఆరాధనకు దూరంగా వుండండి." *(నహ్ల్:36)*

"ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయించాడు. దానినే ఇప్పుడు నీ వైపునకు మేము వహీ ద్వారా పంపాము. దానినే మేము ఇబ్రాహీముకు, మూసాకు, ఈసాకు బోధించాము. ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దానిని గురించి విభేదాలకు లోనుకాకండి అని తాకీదు చేస్తూ". *(అష్షూరా: 13)*

"అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం ఇస్లాం మాత్రమే" *(ఆలిఇమ్రాన్:19)*

ఇదే దైవ విధేయతా మార్గం. అంటే మనిషి తన యిష్టాయిష్టాలకు లోబడి కాకుండా అల్లాహ్ యిష్టాయిష్టాలకు లోబడి జీవితం కొనసాగించడం. ఎల్లప్పుడూ





తన విశ్వాస ఆచరణల ద్వారా ఆ కరుణామయిణ్ణి ప్రసన్నుణ్ణి చేయడానికి ప్రయత్నించడం. ఆయన యిష్టపడని పనులకు దూరంగా వుండడం. వాస్తవానికి ఇస్లాం అనేది అత్యంత విస్తృతార్థము కలిగిన ఒక సమగ్రమైన పదం. దీని గురించి ఇన్షాల్లాహ్ మున్ముందు సవివరంగా చర్చిస్తాను.

ఈ ధర్మాన్ని యిచ్చింది కేవలం దైవ ప్రవక్తలకే కాదు, ఆ మాట కొస్తే సృష్టి అంతటా కూడా ఈ ధర్మమే అనుసరించబడుతోంది.

సమస్తమూ తమ తమ తరహాలో అల్లాహ్ స్తోత్రమూ, నమాజునూ చేస్తున్నాయి. అన్నీ ఆయన విధేయతకు కట్టుబడి వున్నాయి.

"సప్తాకాశాలూ, భూమీ, భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ ఆయన స్తోత్రం చేస్తున్నాయి. ఆయన స్తోత్రంతో పాటు ఆయన పరిశుద్ధతను కొనియాడనటువంటిది ఏదీ లేదు. కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు." *(బనీ ఇస్రాయీల్: 44)*

"ఆకాశాలలోనూ, భూమిపైనా వున్న సమస్తమూ, రెక్కలు విప్పి ఎగిరే పక్షులు సైతమూ అల్లాహ్ స్తోత్రం చేయటాన్ని నీవు చూడటం లేదా? ప్రతి ఒక్కటీ తన నమాజునూ, స్తోత్రం చేసే పద్ధతినీ ఎరుగును." *(నూర్: 41)*

"చీమలు అల్లాహ్ స్తోత్రం చేస్తాయి" *(సహీ బుఖారి : 3019)*

"వాస్తవంగా భూమ్యాకాశాలలో ఉన్న సకల వస్తువులూ ఇష్టం వున్నా ఇష్టం లేక పోయినా అన్నీ అల్లాహ్ విధేయతకు కట్టుబడి వున్నాయి." *(ఆలిఇమ్రాన్: 83)*

అంతేకాదు, ఇక ఈ ధర్మాన్ని వదిలిపెట్టి ఎవరైనా వేరే ధర్మాన్ని అనుసరిస్తే దాన్ని ఎంత మాత్రమూ స్వీకరించను అని అల్లాహ్ గట్టిగా హెచ్చరిస్తున్నాడు.

"ఎవడైనా ఇస్లాం ధర్మాన్ని వదిలి వేరే ధర్మాన్ని అవలంబించదలిస్తే ఆ ధర్మం ఎంత మాత్రం ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్టపోతాడు." *(ఆలి ఇమ్రాన్: 85)*

దైవ ధర్మమైన 'ఇస్లాం'కు సంబంధించినంతవరకు అల్లాహ్ ఏ ప్రవక్త

విషయంలోనైనా దాన్ని మార్చలేదు. కానీ ధర్మ శాస్త్రము (షరియత్), ఆరాధనా పద్ధతులు మాత్రం అందరి విషయంలో ఒకేలాగ వుంచలేదు.

"మేము మీలోని ప్రతి ఒక్కరికీ ఒక షరియత్తునూ, ఒక జీవిత విధానాన్ని నిర్ణయించాము." *(మాఇద: 48)*

"ప్రతి అనుచర సమాజానికీ (ఉమ్మత్) మేము ఒక ఆరాధనా పద్ధతిని నిర్ణయించాము". *(హజ్: 67)*

"ప్రతి అనుచర సంఘానికీ మేము ఒక ఖుర్బానీ పద్ధతిని నిర్ణయించాము." *(హజ్: 34)*

ఇలా షరియత్తులూ, ఆరాధనా పద్ధతులు మార్చడంలో అల్లాహ్ ఉద్దేశ్యం కేవలం మానవ సంతతిని పరీక్షించటమే.

"మేము మీలోని ప్రతి ఒక్కరికీ ఒక్క షరీయత్తునూ, ఒక జీవిత విధానాన్నీ నిర్ణయించాము. మీ దేవుడు కోరుకున్నట్లయితే మీ అందరినీ ఒకే ఒక సంఘంగా కూడా రూపొందించి వుండేవాడు. కానీ ఆయన మీకు ఇచ్చిన దాని విషయంలో మిమ్మల్ని పరీక్షించేందుకే ఈ విధంగా చేశాడు." *(మాఇద : 48)*

వేర్వేరు ప్రవక్తలూ-వేర్వేరు షరీయత్తులూ - కానీ ధర్మం మాత్రం ఒక్కటే. ఈ విషయాన్నే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చాలా చక్కగా వర్ణించి చెప్పారు:

"దైవ ప్రవక్తల సమూహమైన మేము సవతి సోదరుల వంటి వారము. మాధర్మం ఒక్కటే." *(సహీ బుఖారి : 3443)*

ఇక అంతిమ దైవ ప్రవక్త అయిన మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం గురించి అల్లాహ్ ఏం సెలవిచ్చాడో చూద్దాం.

"ప్రవక్తా! ఇలా అను :

మానవులారా ! మీరు గనక ఇంకా నా ధర్మం గురించి ఏదైనా సందేహం కలిగివుంటే వినండి- మీరు అల్లాహ్‌ను కాదని ఆరాధించే వారిని నేను ఆరాధించను. ఏ దేవుని ఆధీనంలో మీ మరణం వున్నదో ఆ దేవుడినే నేను ఆరాధిస్తాను. నేను విశ్వాసులలో ఒకడిగా ఉండాలని నాకు ఆజ్ఞ ఇవ్వబడింది. నాతో ఇలా అనబడినది:





ఏకాగ్రతతో, చిత్తశుద్ధితో నిన్ను నీవు పూర్తిగా ఈ ధర్మానికి సమర్పించుకో. ముష్రిక్కులలో ఎంత మాత్రమూ కలిసి పోకు. అల్లాహ్‌ను వదిలి నీకు నష్టాన్ని గానీ లాభాన్ని గానీ కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒక వేళ అలాచేస్తే నీవూ దుర్మార్గుడవై పోతావు. అల్లాహ్ గనక నిన్ను ఏదైనా ఆపదకు గురిచేస్తే స్వయంగా ఆయన తప్ప ఆ ఆపదను తొలగించే వారెవ్వరూ లేరు. ఇంకా ఆయన గనక నీ విషయంలో ఏదైనా మేలు చెయ్యాలని సంకల్పిస్తే, ఆయన అనుగ్రహాన్ని మళ్ళించే వాడు కూడా ఎవ్వడూలేడు. ఆయన తన దాసులలో తానుకోరిన వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను." *(యూనుస్ : 104-107)*

స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ధర్మం గురించి యావత్తు ముస్లిం సమాజానికీ సుపరిచితమైన, 'హదీసే జిబ్రయీల్' యందు ఇలా తెలియజేశారు.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఓరోజు మా నాన్న గారైన ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) మాకిలా తెలియ జేశారు:

ఒక రోజు మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చొని వుండగా అత్యంత తెల్లని వస్త్రాలు ధరించి, నల్లటి శిరోజాలు కలిగివున్న ఒక వ్యక్తి మా దగ్గరి కొచ్చాడు. అతని ముఖంపై ప్రయాణపు బడలికలు కూడా మాకు కనబడలేదు. నేరుగా వచ్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మోకాళ్ళతో తన మోకాళ్ళను అనించి ఎదురుగా కూర్చొని ఓ మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! నాకు ఇస్లాంను గురించి తెలియజేయండి, అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ - ఇస్లాం అంటే నీవు, అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దైవం ఎవ్వరూలేరు, మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌చే పంపబడిన సందేశహరులు అని సాక్ష్యమివ్వాలి, నమాజును స్థాపించాలి, జకాత్ ను చెల్లించాలి, రంజాన్ నెల ఉపవాసాలు పాటించాలి, ఆర్థిక స్థోమతను బట్టి హజ్‌ను విధిగా నిర్వర్తించాలి' అని చెప్పారు.

దానికా వ్యక్తి 'సత్యం పలికారు మీరు' అని అన్నాడు. తనే ప్రశ్నిస్తూ, తిరిగి సమాధానాన్ని కూడా తానే ధృవీకరిస్తున్న ఆ వ్యక్తిని చూసి మాకు ఆశ్చర్యం కలిగింది.

ఆ వ్యక్తి తిరిగి ప్రశ్నిస్తూ - నాకు ఈమాన్ (విశ్వాసం) అంటే ఏమిటో తెలియజేయండి అని అడిగాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధానమిస్తూ- ఈమాన్ అంటే నీవు అల్లాహ్‌నూ, ఆయన దూతలనూ, ఆయన గ్రంథాలనూ, ఆయన ప్రవక్తలనూ, పరలోక దినాన్నీ మరియు విధి వ్రాత, దాని యొక్క మంచీ చెడుల గురించి హృదయ పూర్వకంగా విశ్వసించాలి అని అన్నారు.

ఆ వ్యక్తి మళ్ళీ 'మీరు సత్యం పలికారు' అని ధృవీకరించాడు. తిరిగి ప్రశ్నిస్తూ- 'ఇహ్‌సాన్' అంటే ఏమిటో నాకు తెలియజేయండి అని అడిగాడు-

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ-ఇహ్సాన్ అంటే నీవు దైవాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లు (అత్యంత భయ భక్తులతో) అతణ్ణి ఆరాధించు. నీవు ఆయన్ని చూడలేకపోయినా అతను మాత్రం నిన్ను తప్పకుండా చూస్తున్నాడు (అన్న యథార్థాన్ని గుర్తుంచుకో) అని అన్నారు.

ఆ వ్యక్తి మళ్ళీ- 'ప్రళయం ఎప్పుడొస్తుందో నాకు తెలియజేయండి' అని ప్రశ్నించాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ- 'దీని గురించి ప్రశ్నించేవాడికన్నా సమాధానమిచ్చేవాడికి ఎక్కువేమీ తెలియదు' అన్నారు. దానికా వ్యక్తి- మరయితే దాని సూచనలు తెలియజేయండి అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ- 'దాని సూచనలేమిటంటే దాసి తన యజమానిని కంటుంది. మరో సూచనేమిటంటే ఈ రోజు కాళ్ళకు చెప్పులు, శరీరానికి బట్టలు కూడాలేని అత్యంత బీద వాళ్ళు సైతం పెద్ద పెద్ద భవంతులు నిర్మించడం నీవు చూస్తావు' అని అన్నారు.

తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. నేను మాత్రం చాలా సేపటి వరకు అక్కడే వున్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో- ఓ ఉమర్! ఆ ప్రశ్నించిన వ్యక్తి ఎవరో నీకు తెలుసా? అని అడిగారు. నేను అల్లాహ్ మరియు ఆమన ప్రవక్తకే బాగా తెలుసు అని అన్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ- ఆవ్యక్తి (ఎవరో కాదు) జిబ్రయీల్ (అలైహిస్సలాం). మీకు మీ ధర్మాన్ని గురించి తెలియ జేయడానికి విచ్చేశారు అని అన్నారు.

*(సహీ ముస్లిం- కితాబుల్ ఈమాన్)*





ఇలా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ధర్మాన్ని ఇస్లాం, ఈమాన్, ఇహ్సాన్ అనే మూడు ముఖ్య విభాగాలుగా విభజించి చెప్పారు. అయినప్పటికీ ఈ మూడు విభాగాలకు బదులుగా కేవలం ఇస్లాం ను కూడా యావత్తు ధర్మంగా పిలవచ్చు.

"అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం ఇస్లాం మాత్రమే" *(ఆలి ఇమ్రాన్ : 19)*

వాస్తవానికి కాస్త నిశితంగా పరిశీలిస్తే, ధర్మం యావత్తూ ఈ మూడు విభాగాల చుట్టే తిరుగుతూ వుంటుంది. ఈ మూడు విభాగాలు కూడా ఎలాంటి వంటే ఒకదానికొకటి ఎలాంటి సంబంధం లేకుండా కాకుండా అంతర్గతంగా గట్టి సంబంధం కలిగి వున్నాయి. అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక హదీసులో ఇస్లాం మౌలిక అంశాలను పాటించడాన్ని, ఒకే దేవుణ్ణి విశ్వసించడంతో పోల్చిచెప్పారు.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), అబ్దుల్ ఖైస్ మనుషులకు 'మిథ్యా దైవాలన్నిటినీ వదిలి ఒకే దేవుణ్ణి విశ్వసించాలని చెబుతూ' ఒకే దేవుణ్ణి విశ్వసించడమంటే ఏమిటో తెలుసా? అని ప్రశ్నించారు. దానికి వారు 'అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకు మాత్రమే బాగా తెలుసు. మాకు తెలియదు' అని పలికారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివరిస్తూ- ఏక దైవ విశ్వాసం అంటే అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయనచే నియమించబడ్డ ఒక ప్రవక్త అని సాక్ష్యమివ్వాలి. తర్వాత నమాజును స్థాపించాలి, జకాత్‌ను చెల్లించాలి, రంజాన్ నెల ఉపవాసాలు పాటించాలి, యుద్ధ సొత్తులో ఐదోవంతు సొమ్ము ప్రభుత్వ ధనాగారానికి యివ్వాలి అని బోధించారు. *(సహీ బుఖారి : 53)*

ఇస్లాం, ఈమాన్, ఇహ్సాన్- వీటిలో ఏ ఒక్కటి లోపించినా అతని ధర్మం పరిపూర్ణం కానేరదు. అందుకనే వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపై వుంది.

ఇక ధర్మంలోని మొదటి భాగమైన ఇస్లాంను గురించి సవివరంగా తెలుసుకొందాం.

జిబ్రయీల్ దైవదూత ఇస్లాంను గురించి అడిగిన ప్రశ్నకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన జవాబు యిది:

(1) లా ఇలాహ ఇల్లల్లాహ్, మహమ్మదుర్రసూలల్లాహ్ (అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు మరియు మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌చే పంపబడిన సందేశహరులు) అని సాక్ష్యమివ్వడం.

(2) నమాజును స్థాపించడం.

(3) జకాత్ యివ్వడం.

(4) రంజాన్ నెలలో ఉపవాసాలు పాటించడం.

(5) ఆర్థిక స్థోమతను బట్టి హజ్ యాత్ర చేయడం.





## లా ఇలాహ ఇల్లల్లాహ్ మహమ్మదుర్రసూలుల్లాహ్ అని సాక్ష్యమివ్వడం

ఒక వ్యక్తి ఎప్పుడైనా సరే **'లా ఇలాహ ఇల్లల్లాహ్, మహమ్మదుర్రసూలుల్లాహ్'** అని సాక్ష్య మిచ్చి ఇస్లాంలో ప్రవేశించగలుగుతాడు. అసలీ సద్వచనం (కలిమా) అనేది ధర్మానికి పునాది లాంటిది. ఇంటి నిర్మాణంలో పునాదికి ఎంత ప్రాముఖ్యం వుందో ధర్మం విషయంలో ఈ సద్వచనానిక్కూడా అంతే ప్రాధాన్యత వుంది. అందుకే దీని గురించి వివరంగా తెలుసుకోవాలి.

ముందుగా ఈ కలిమాలోని మొదటి వచనమైన 'లా ఇలాహ ఇల్లల్లాహ్' గురించి తెలుసుకొందాం:

**'లా ఇలాహ ఇల్లల్లాహ్**- అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు'.

ఈ వచనం అల్లాహ్ దృష్టిలో ఎంత ముఖ్యమైనదంటే తను పంపిన ప్రవక్తలందరికీ గూడా అల్లాహ్ ఈ సద్వచనాన్నే యిచ్చి పంపాడు.

"మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా అతనికి వహీ ద్వారా 'నేను తప్ప మరో దేవుడు లేడు. కనుక మీరు నాకే దాస్యం చేయండి' అనే విషయాన్నే తెలియజేశాము." *(అంబియా : 25)*

"ఒక స్థిరమైన వాక్కు ఆధారంగా ఇహలోకంలోనూ, పరలోకంలోనూ విశ్వాసులకు అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు". *(హజ్ : 27)*

పై ఆయత్‌లో స్థిర వాక్కు అంటే, లా ఇలాహ ఇల్లల్లాహ్ మహమ్మదుర్రసూలుల్లాహ్' అని అర్థం. *(సహీ బుఖారి- తఫ్సీర్ సూరె ఇబ్రాహీం)*

అంతేగాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'లా ఇలాహ ఇల్లల్లాహ్' గురించి ఇలా ఉద్బోధించారు :

"ఎవరైనా 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలికి దానిపైనే నిలకడగా వుండి మరణిస్తే అతను స్వర్గం లోకి వెళ్తాడు".

*(సహీ ముస్లిం- కితాబుల్ ఈమాన్, బాబ్: దలీలె అలా అన్న మమ్మాత అలత్తౌహీదె దఖలల్ జన్నత ఖతాఅన్)*

"అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడని సాక్ష్యమిచ్చి అదే మాట పై చనిపోయేదాక నిలకడగా వుండేవారు తప్పకుండా స్వర్గానికి వెళతారు. వారు వ్యభిచారం, దొంగతనం వంటి నేరాలు చేసివున్నాసరే."

*(సహీ ముస్లిం- కితాబుల్ ఈమాన్, బాబ్: దలీలె అలా అన్న మమ్మాత లాయుష్రికు బిల్లాహి షయ్యిన్ దఖలల్ జన్నత)*

"అత్యంత శ్రేష్ఠమైన దైవ ధ్యానం 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని అనటం మరియు అత్యంత శ్రేష్ఠమైన ప్రార్థన, 'అల్ హమ్దులిల్లాహ్' అని అనడం."

*(తిర్మిజి- అబ్‌వాబుద్దుఆత్, బాబ్: మాజాఅ అన్నదావతల్ ముస్లిమ ముస్తజాబతున్)*

ఇలా 'లా ఇలాహ ఇల్లల్లాహ్' ప్రాధాన్యత గురించి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పలుపలు విధాలుగా నొక్కి చెప్పారు. మరి ఇంత ప్రాధాన్యం సంతరించుకున్న ఈ కలిమాను కేవలం నోటితో పలికితేనే సరిపోతుందా? లేక దానికి కూడా ఏవైనా షరతులూ, నియమాలూ వున్నాయా?

దివ్య ఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులనూ క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే కొన్ని ప్రత్యేక షరతులకు, నియమాలకు లోబడి మాత్రమే దీని సాక్ష్యం స్వీకరించబడుతుంది తప్ప కేవలం నోటితో పలికినంత మాత్రాన ఈ సాక్ష్యం స్వీకరించబడదు అన్న విషయం సుస్పష్టం అవుతుంది.

ముందు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యం ద్వారా స్వర్గ ప్రాప్తికి కావలసిన షరతులూ, నియమాలను గురించి తెలుసుకుందాం.

తరువాత 'లా ఇలాహ ఇల్లల్లాహ్' గురించి విస్తృతంగా చర్చిస్తాను.

'లా ఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యం ద్వారా స్వర్గంలోకి వెళ్ళాలనుకొనే ప్రతి





ఒక్కరూ ఈ షరతులనూ, నియమాలనూ ఖచ్చితంగా పాటించవలసి వుంటుంది. అప్పుడే మనం అల్లాహ్ అనుగ్రహం పొందగలమని ఆశించవచ్చు.

**ఆ షరతులు యివి:**

(1) జ్ఞానము (అల్ ఇల్మ్)

(2) నమ్మకము (అల్ యఖీన్)

(3) శుద్ధత, నిష్కపటత (అల్ ఇఖ్లాస్)

(4) నిజాయితి (అల్ సిద్క్)

(5) ప్రేమ (అల్ ముహబ్బహ్)

(6) సమర్పణ (అల్ ఇన్‌కియాద్)

(7) సమ్మతి (అల్ ఖుబూల్)

'లా ఇలాహ ఇల్లల్లాహ్' ను, దాని షరతులనూ, దంతాలున్న ఒక తాళం చెవితో పోల్చవచ్చు. ఏదైనా తాళం తెరవడానికి ఒక ప్రత్యేక శైలిలో రూపొందిన దంతములు గల తాళం చెవి ఎంత అవసరమో, ధర్మం ఆమోదించబడటానికి 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే తాళం చెవితో పాటు ఏడు షరతుల్లాంటి దంతములు కూడా అంతే అవసరం. స్వర్గ ద్వారం 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనే తాళం చెవితోనే తెరువబడుతుంది. అందుకే ఈ సద్వచనానికీ, దాని షరతులకూ ఎంతో ప్రాధాన్యత వుంది. ఇక ఆ షరతులను గురించి విస్తృతంగా తెలుసుకొందాం.

## 1) జ్ఞానము (అల్ ఇల్మ్) :

'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని సాక్ష్యం పలికి దానిపైనే నిలకడగా వుండాలంటే దానికి సంబంధించిన పూర్తి జ్ఞానం సముపార్జించడం ఎంతైనా అవసరం. అందుకోసం మనం ముందుగా అల్లాహ్‌ను గురించి, అతని ఏకత్వం గురించి, అతని అధికారాలూ, శక్తి సామర్థ్యాల గురించి, అతని పేర్లు, గుణగణాల గురించి, అతని ఆరాధనలూ, వాటి పద్ధతుల గురించి, మిథ్యా దేవుళ్ళ (తాగూత్) శక్తి సామర్థ్యాలను గురించిన పూర్తి జ్ఞానం సంపాదించాలి. అప్పుడే మనం ఇస్లాంనూ, లా ఇలాహ ఇల్లల్లాహ్‌నూ బాగా అర్థం చేసుకొని ఆచరణలో పెట్టిన

వారమవుతాము. బహుదైవారాధన (షిర్క్) అనే రొంపిలోకి పడకుండా సురక్షితంగా వుండగలగుతాం. అందుకే దివ్య ఖురాన్ లో అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నుద్దేశించి ఇలా సెలవిచ్చాడు.

“ప్రవక్తా ! బాగా తెలుసుకో! అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడు”. *(మహమ్మద్ : 19)*

మరి స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కే, లా ఇలాహ ఇల్లల్లాహ్ ను గురించి ‘బాగా తెలుసుకో’ అని అల్లాహ్ సెలవిచ్చాడంటే, ఆయన అనుచర సమాజమైన (ఉమ్మత్) మనకు దానికి సంబంధించిన పూర్తి జ్ఞానం సంపాదించడం ఎంత ముఖ్యమో అర్థమవుతోంది.

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు:

“ఎవరైనా ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ అని పలికి మరణించేవరకు యిక దానిపైనే నిలకడగా వుంటే అతను స్వర్గంలోకి వెళతాడు”.

*(సహీ ముస్లిం- కితాబుల్ ఈమాన్, బాబ్: దలీలె అలా అన్న మమ్మాత అలత్తౌహీదె దఖలల్ జన్నత ఖతాఅన్)*

మరి జ్ఞానమే లేకపోతే, ‘నిలకడ’ అనేది ఎలా సాధ్యం?

### 2) నమ్మకము (అల్ యఖీన్):

‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ యొక్క సాక్ష్యం తోపాటు ఈ సద్వచనం మీద మనకు పూర్తి నమ్మకం వుండాలి. హృదయంలో ఎలాంటి సందేహం కానీ సంకోచంగానీ వుండకూడదు.

“అసలు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ విశ్వసించి ఇక ఎలాంటి అనుమానానికీ గురికాకుండా, తమ ప్రాణాలతో, తమ సిరిసంపదలతో అల్లాహ్ మార్గంలో పోరాడేవారే నిజమైన విశ్వాసులు, వారే సత్యసంధులు.” *(హుజురాత్ :15)*

అబూహుర్రైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా బోధించారు:





‘అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరూ లేరనీ మరియు నేను అల్లాహ్ చే పంపబడిన సందేశహరుణ్ణి’ అని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇక ఎవరైనా ఈ రెండు విషయాల మీద పూర్తి నమ్మకం వుంచి గనక అల్లాహ్‌ను కలిస్తే అతను స్వర్గం నుండి దూరం గావించబడడు.

*(సహీ ముస్లిం- కితాబుల్ ఈమాన్, బాబ్: దలీలె అలా అన్న మమ్మాత అలత్తౌహీదె దఖలల్ జన్నత ఖతాఅన్)*

మరొక హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), అబూహుర్రైరా (రజి అల్లాహు అన్హు) కు ఒక తోటలో ఇలా బోధించారు:

“ఈ తోట బయట నీకెవరు కలిసినా వారుగనక ‘అల్లాహ్’ తప్ప మరొక ఆరాధ్య దైవం ఎవ్వరూ లేరని సాక్ష్యమిచ్చి, ఆ తరువాత 7 హృదయంలో దాని మీద పూర్తి నమ్మకంతో నిలకడగా వుంటారో అలాంటి వారికి స్వర్గం యొక్క శుభవార్తను వినిపించు.”

*(సహీ ముస్లిం- కితాబుల్ ఈమాన్, బాబ్: దలీలె అలా అన్న మమ్మాత అలత్తౌహీదె దఖలల్ జన్నత ఖతా అన్)*

పైన పేర్కొన రుజువుల ద్వారా అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ విశ్వసించి దాని మీద పూర్తి నమ్మకం వుంచడం ఎంత ముఖ్యమో తెలుస్తోంది.

### 3) శుద్ధత- నిష్కపటత (అల్ ఇఖ్లాస్)

‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ అని సాక్ష్యమివ్వడంతో పాటు దానిని గురించి మనసులో పూర్తి శుద్ధత పాటించాల్సి వుంటుంది. హృదయంలో దానిని గురించి ఎలాంటి కల్మషం గానీ, కాపట్యము గానీ వుండకూడదు. అప్పుడే అది అల్లాహ్ దగ్గర స్వీకార యోగ్యమవుతుంది.

“ప్రవక్తా! నీవు ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకిస్తూ, అల్లాహ్‌కు మాత్రమే దాస్యం చేయి. జాగ్రత్త! ధర్మం ప్రత్యేకంగా అల్లాహ్‌కు చెందిన హక్కు మాత్రమే.” *(జుమర్ : 2-3)*

“ప్రవక్తా! ఇలా చెప్పు: నేను మాత్రం నా ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించి ఆయనకు మాత్రమే దాస్యం చేస్తాను.” *(జుమర్: 14)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు: కేవలం అల్లాహ్ కోసమే 'లాఇలాహ ఇల్లల్లాహ్' అని పలికి, దానిని గురించి హృదయంలో పూర్తి శుద్ధతను పాటించిన వారిపై అల్లాహ్ నరకాగ్నిని నిషేధించాడు.

*(సహీ బుఖారి : 425)*

మరో హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

ఎవరైతే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని మనస్పూర్తిగా పలుకుతారో అలాంటి వారే ప్రళయం రోజు నా సిఫారసు పొందడానికి ఎక్కువ అర్హులు.

*(సహీ బుఖారి: 6570)*

## 4) నిజాయితి (అల్ సిద్క్)

'లా ఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యానికి హృదయంలో దానిని గురించిన నిజాయితీ కూడా ఎంతో అవసరం. హృదయంలో నిజాయితీని ప్రదర్శించడం ద్వారానే మనం సద్వచనానికి సంబంధించిన జ్ఞానాన్ని కానీ, అల్లాహ్‌కు సంబంధించిన జ్ఞానాన్ని కానీ సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాము.

కేవలం నోటితో అనే మాటల ద్వారానే అల్లాహ్ మెప్పు పొందడం సాధ్యం కాదు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో కపటులు (మునాఫిఖ్‌లు) కూడా 'లాఇలాహ ఇల్లల్లాహ్' అని సాక్ష్యం యిచ్చేవారు. అయినప్పటికీ వారు నరకంలో అట్టడుగు ప్రదేశానికి పోతారని అల్లాహ్ సెలవిచ్చాడు.

ఎందుకంటే నోటితో వారు 'లాఇలాహ ఇల్లల్లాహ్' అని సాక్ష్యమిచ్చినప్పటికీ మనస్పూర్తిగా దానిపట్ల నిజాయితీని ప్రదర్శిచలేదు.

"వారు తమ మనస్సులలో లేని విషయాలను నోటితో అంటారు"

*(ఫతహ్ :11 )*

"బాగా తెలుసుకోండి! కపటులు నరకంలో అట్టడుగు ప్రదేశానికి పోతారు. వారికి సహాయం చేసే వాడెవడూ మీకు దొరకడు." *(నిసా :145)*

వాస్తవానికి మానవ హృదయం అనేది ఒక రాజు లాంటిది. అవయవాలన్నీ అతని సైనికుల్లాంటివి. రాజు యొక్క హృదయ సంకల్పం, నిజాయితీల మీదే





అతని సైనికుల కార్యకలాపాలు మొత్తం ఆధారపడి వుంటాయి. అలాగే మనిషి యొక్క హృదయ సంకల్పం, నిజాయితీల మీదే అతని అవయవాల మొత్తం ఆచరణలు ఆధారపడి వుంటాయి.

ఇదే విషయాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చాలా చక్కగా వివరించారు.

"వినండి ! మానవ శరీరంలో ఒక మాంసపు ముద్ద వుంది. అది గనక బాగుంటే యావత్తు శరీరం బాగుంటుంది. ఒకవేళ అది పాడయిపోతే మొత్తం మానవ శరీరమే పాడయి పోతుంది. బాగా గుర్తుంచుకోండి! ఆ మాంసపు ముద్దే మానవ హృదయం". *(సహీ బుఖారి : 52)*

మనిషి ఎల్లప్పుడూ అల్లాహ్ మీది ప్రేమతో తన హృదయాన్ని నింపుకోవడానికి ప్రయత్నం చేస్తూ వుంటే అతని హృదయం కూడా ఎల్లప్పుడూ నిజాయితీని ప్రదర్శిస్తూ వుంటుంది. ఎప్పుడైతే మనిషి అల్లాహ్ ప్రేమను వదిలి పెట్టి తన మనో వాంఛలతో, తుచ్ఛమైన కోరికలతో హృదయాన్ని నింపుకోవడం ప్రారంభిస్తాడో అక్కడే కాపట్య, భ్రష్టత్వాల ద్వారాలు తెరుచుకుంటాయి. అతని హృదయం కూడా నిజాయితీని ప్రదర్శించడం మానేస్తుంది. తద్వారా అతను తన మనస్సులో లేని లేక తన మనస్సు అంగీకరించని లేదా యిష్టపడని మాటలను తన నోటితో అనేస్తూ ఉంటాడు.

ఆదర్శ హృదయం అంటే ఎలా వుండాలి? అన్నదానికి షేఖ్ సాలెహ్ అల్ సాలెహ్ గారు ఒక చక్కటి వివరణ యిచ్చారు. వారి ప్రకారం :

ఒక పటిష్ఠమైన ఆదర్శ హృదయం అనేది ఈ క్రింది విషయాలకు దూరంగా, అతీతంగా వుంటుంది.

(1) దైవేతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేర్చుట.

(2) గర్వము

(3) అసూయ, ఈర్ష్య

(4) దుఃఖము, బాధ.

(5) ప్రాపంచిక జీవితం పట్ల వ్యామోహం.

(6) నాయకత్వం, అధికారాల మీద ప్రేమ.

(7) అత్యాశ

(8) బిద్అత్ (ధర్మంలో కొత్త పోకడలు సృష్టించడం)

పై విషయాలకు అతీతంగా వున్న హృదయమే, సద్వచనానికి (కలిమా) కావలసిన షరతులను నెరవేర్చ గలుగుతుంది. దివ్య ఖురాను లో అల్లాహ్ ఇలాంటి హృదయాన్నే 'అల్ ఖల్బ్ అస్సలీం'- ఏ లోపమూ లేని స్వచ్ఛమైన, పాపాల నుండి సురక్షితంగా వున్న హృదయం అని అన్నాడు.

"ఆ రోజు సంపద వల్ల కానీ, సంతానం వల్ల కానీ ఏ లాభమూ కలుగదు. ఏ వ్యక్తి అయినా, అల్ ఖల్బ్ అస్సలీం (ఏ లోపమూలేని స్వచ్ఛమైన, పాపాల నుండి సురక్షితంగా వున్న హృదయం) తో హాజరైతే తప్ప".

*(అష్షుఅరా : 88 - 89)*

(టెస్టిమొని ఆఫ్ తౌహీద్ - డా॥ సాలెహ్ అస్సాలెహ్- ఇంటర్నెట్ ఎడిషన్)

## (5) ప్రేమ (అల్ ముహబ్బహ్)

'లా ఇలాహ 'ఇల్లల్లాహ్ సాక్ష్యం అల్లాహ్ వద్ద ఆమోద యోగ్యం కావడానికి ఈ క్రింది విషయాలు కూడా కారకులవుతాయి.

(1) అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ అందరికంటే ఎక్కువగా ప్రేమించడం.

(2) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రేమించిన వారిని మనమూ ప్రేమించడం.

(3) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వేషించిన లేక యిష్టపడని వాటిని మనమూ ద్వేషిచడం లేదా అయిష్టపడడం.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"కొందరు అల్లాహ్‌ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి వుండవలసిన ప్రేమతో





వారిని ప్రేమిస్తారు. కానీ విశ్వాసులు అన్నిటికంటే అధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు."

*(బఖర : 165)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియ జేశారు:

ఈ మూడు లక్షణాలు కలిగి వున్నవాడు విశ్వాస మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు

(1) అందరి కంటే ఎక్కువగా అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)నూ ప్రేమించడం.

(2) ఎవరిని అభిమానించినా కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం అభిమానించడం.

(3) (నరక) అగ్నిలో పడటానికి ఎంత అసహ్యంచుకుంటాడో అవిశ్వాస స్థితి (కుఫ్ర్) వైపునకు మరలిపోవడానికి కూడా అంతగానే అసహ్యంచుకోవడం. *(సహీ బుఖారి : 16)*

## 6) సమర్పణ (అల్ ఇన్‌కియాద్)

'లాఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యంతో పాటు మనిషి తనను తాను పూర్తిగా అల్లాహ్‌కు సమర్పించుకోవడానికి మానసికంగా సిద్ధంకావాలి. అంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు పూర్తి విధేయత పాటించాలి. వారు నిషేధించిన వాటి జోలికి పోకుండా వుండాలి. అప్పుడే ఈ షరతు నెరవేరగలుగుతుంది.

"ఏ వ్యక్తి అయితే తనను తాను అల్లాహ్‌కు సమర్పించుకుంటాడో (ఇస్లాం ధర్మాన్ని పాటిస్తాడో), ఆచరణ రీత్యా సద్వర్తనుడో (అన్ని విషయాలందు అల్లాహ్‌కూ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపిస్తాడో) అతను నిజానికి ఒక నమ్మదగిన ఆధారాన్ని పట్టుకున్నాడు."

*(లుఖ్మాన్: 22)*

ఈ సమర్పణ అనేది హృదయంలో ఏ విధమైన సందేహ, సంకోచాలు లేకుండా పూర్తి నిజాయితీతో మనస్ఫూర్తిగా జరగాలి.

"విశ్వసించేవారి మాటేమిటంటే, తమ వ్యాజ్యాన్ని పరిష్కరించే విషయంలో వారు అల్లాహ్ వైపునకూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వైపునకూ పిలువబడితే మేము విన్నాము, విధేయత చూపాము అని అంటారు. అటువంటి వారే సాఫల్యం పొందుతారు." *(నూర్: 51)*

## 7) సమ్మతి (అల్ ఖుబూల్)

కేవలం నోటితో ఇస్లామ్ గొప్పదనాన్నీ, ఇదే నిజమైన దైవ ధర్మమని గుర్తిస్తే సరిపోదు. ఈ గుర్తింపు అనేది పూర్తి నిజాయితీతో, నమ్రతతో 'లా ఇలాహ ఇల్లల్లాహ్' ను అంగీకరించడం ద్వారా జరగాలి. ఈ సద్వచనం యొక్క వాస్తవిక అర్థాన్ని తెలుసుకొని దానిపై నిలకడగా వుండగలిగినప్పుడే అది మనల్ని గర్వమూ, తుచ్ఛమైన మనోవాంఛల నుండి సురక్షితంగా వుంచుతుంది.

"వారు (ముష్రిక్కులు) ఎలాంటి వారంటే- లా ఇలాహ ఇల్లల్లాహ్' అని చెప్పినప్పుడు వారు అహంకారంతో- మేము ఒక పిచ్చికవి కోసం మా దేవుళ్ళను వదులుకోవాలా? అని అనేవారు". *(సాఫ్ఫాత్ : 35-36)*

వాస్తవ మేమిటంటే 'లా ఇలాహ ఇల్లల్లాహ్ ' మనల్ని తాత ముత్తాతల పద్ధతుల్ని, గ్రుడ్డిగా అనుసరించడాన్ని (ఉలమాలైనా కావచ్చు) త్యజించి, ధర్మాను సరణలో కేవలం సలఫుస్సాలిహీన్‌ల దృక్పథాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించి, వారి మార్గాన్నే అనుసరించమని ఆహ్వానిస్తూ వుంటుంది.

తను తెచ్చిన ఋజుమార్గాన్ని, ధర్మోపదేశాలనూ అంగీకరించేవారిని, తిరస్కరించే వారిని పోలుస్తూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక చక్కటి ఉదాహరణ నిచ్చారు.

"అల్లాహ్ నాకిచ్చి పంపిన ఋజు మార్గము, జ్ఞానముల ఉదాహరణ ఇలా వుంది. భూమి మీద విస్తారంగా వర్షం కురిసింది. అందులో కొంత భాగం సారవంతంగా వుంది. అది వర్షం నీటిని బాగా పీల్చుకొని గడ్డినీ, ఇతర వృక్ష రాసులనూ పండించింది. అందులో కొంతభాగం గట్టిగావుంది. అది వర్షపు నీటిని తనలో ఆపివుంచింది. అల్లాహ్ ఆ నీటిని ప్రజలకూ, వారి జంతువులకూ, త్రాగ డానికీ, వ్యవసాయం చేసుకోవడానికీ ఉపయోగపడేలా చేశాడు.





మరోభాగం నిస్సారమైన మైదానం. అది గడ్డినీ పండించలేదు, నీళ్ళనూ ఆపి వుంచలేదు. ఎవరైతే అల్లాహ్ ధర్మాన్ని అర్థం చేసుకొని, అల్లాహ్ నాకు (ప్రవక్తకు) ప్రసాదించిన జ్ఞానం ద్వారా ప్రయోజనం పొందుతారో- ఆ వ్యక్తి వంటిదే మొదటి రకం భూమి. అతను స్వయంగా ముందు నేర్చుకుంటాడు, తర్వాత ఇతరులకూ నేర్పుతాడు.

యిక ఎవరైతే దీన్ని పట్టించుకోలేదో, అల్లాహ్ నాకు ప్రసాదించిన ఋజు మార్గాన్ని కూడా స్వీకరించలేదో - ఆ వ్యక్తి వంటిది ఆఖరి రకం భూమి. (అంటే అతను నిస్సారమైన మైదానం వంటివాడన్న మాట). *(సహీ బుఖారి: 79)*

# 'లా ఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యం - దాని నియమాలు

'లా ఇలాహ ఇల్లల్లాహ్' సాక్ష్యం అల్లాహ్ వద్ద ఆమోదయోగ్యం కావాలంటే పైన పేర్కొన్న షరతులు ఎంత ముఖ్యమో, ముందు వివరించబోయే నియమాలు / ఆవశ్యకతలు కూడా అంతే అవసరం. అప్పుడే మన సాక్ష్యంలో పరిపక్వత, పరిపూర్ణత వస్తుంది. తద్వారా మనం ఋజుమార్గంలో వుండగలుగుతాం.

'లా ఇలాహ ఇల్లల్లాహ్' అనేది రెండు పదాల కలయిక.

మొదటిది- 'లా ఇలాహ', రెండవది- ఇల్లల్లాహ్.

'లా ఇలాహ' అంటే తిరస్కరణ- ఆరాధ్యులందరినీ తిరస్కరించడం.

అంటే మొట్ట మొదట మిధ్యా దేవుళ్ళందరితో పూర్తిగా, అన్నివిధాల సంబంధాలను తెగత్రెంపులు చేసుకొని, హృదయంలో దాగివున్న వారి దైవత్వాన్ని, ఆరాధననూ సంపూర్ణంగా తిరస్కరించి హృదయాన్ని పూర్తిగా ఖాళీచేసేయడం- ఇదే మొదటి నియమం.

ఇక రెండవది- 'ఇల్లల్లాహ్' - 'అల్లాహ్ తప్ప'- అంటే మిధ్యా దైవాల దైవత్వ తిరస్కరణతో ఖాళీ అయిన హృదయాన్ని, అల్లాహ్‌ను మాత్రమే ఆరాధ్యుడిగా స్వీకరించి కేవలం అతని ఆరాధనతోనే దాన్ని పూర్తిగా నింపేయడం - ఇది రెండవ నియమం.

'లా ఇలాహ' అనేది మిధ్యా దేవుళ్ళందరి తిరస్కరణను అనివార్యం చేస్తుంది.

'ఇల్లల్లాహ్' అనేది కేవలం అల్లాహ్ యొక్క ఆరాధనను అనివార్యం చేస్తుంది.





పై విషయాలను ధృవపరుస్తూ దివ్య ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెల విచ్చాడు.

"ఇక నుండి తాగూత్ (మిధ్యా దేవుళ్ళు) ను తిరస్కరించి, అల్లాహ్‌ను విశ్వసించినవాడు సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే".

*(బఖర: 256)*

ఇక్కడ తాగూత్‌ను తిరిస్కరించడం అంటే 'లా ఇలాహ' అనీ, అల్లాహ్ ను విశ్వసించడ మంటే 'ఇల్లల్లాహ్' అని తెలుస్తూనే వుంది.

ఈ విషయమే ఇబ్రాహీం (అలైహిస్సలాం) మాటల్లో కూడా తెలుస్తోంది.

" మీరు పూజిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించిన వానితోనే వున్నది." *(జుఖ్‌రుఫ్ : 26-27)*

ఇక్కడ కూడా - 'ఏ సంబంధమూ లేదు' అంటే 'లా ఇలాహ' అనీ, నన్ను సృష్టించిన వానితోనే వున్నది అంటే 'ఇల్లల్లాహ్' అని అర్థమవుతోంది.

యిక 'లా ఇలాహ ఇల్లల్లాహ్' యొక్క అర్థాన్ని వివరంగా తెలుసుకొందాం.

## 'లా ఇలాహ ఇల్లల్లాహ్' - దాని వివరణ

'లా ఇలాహ ఇల్లల్లాహ్' - అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు.

అంటే మిధ్యా దేవుళ్ళన్నింటి నుండి పూర్తిగా తెగత్రెంపులు చేసుకొని కేవలం అల్లాహ్‌ను నిజమైన ఆరాధ్యుడిగా గుర్తించి అతని దైవత్వంలో ఏకత్వాన్ని హృదయ పూర్వకంగా విశ్వసించి, నోటి ద్వారా సాక్ష్యం పలికి, తమ ఆచరణల ద్వారా దానిని రుజువు చేయడం.

దీనినే తౌహీద్ (ఏకదైవారాధన) అని అంటారు. దివ్య ఖురానును కాస్త నిశితంగా అధ్యయనం చేస్తే మొత్తం మూడు రకాల తౌహీద్ మనకు బోధపడు తుంది.

"ఆకాశాలకూ, భూమికీ, భూమ్యాకాశాల మధ్య వున్న సర్వానికీ ఆయన ప్రభువు. కాబట్టి మీరు ఆయనకు దాస్యం చేయండి. ఆయన దాస్యం లోనే స్థిరంగా వుండండి. మీకు తెలిసింనంతవరకు ఆయనను పోలిన, ఆయనతో సమానమైన స్థాయి గలవాడెవడైనా వున్నాడా?" *(మర్యమ్: 65)*

ఈ ఆయత్‌లో అల్లాహ్ మనకు మూడు రకాల తౌహీద్‌ను గురించి తెలియ జేస్తున్నాడు:

ఆకాశాలకూ, భూమికీ, భూమ్యాకాశాల మధ్య వున్న సర్వానికీ ఆయన ప్రభువు. ఈ వాక్యములో అల్లాహ్ తానొక్కడే ప్రభువని తెలియ జేస్తున్నాడు. దీనినే 'తౌహీద్- అల్- రుబూబియత్' (ప్రభువుగా విశ్వసించడంలో ఏకత్వం) అని అంటారు.

"కాబట్టి మీరు ఆయనకు దాస్యం చేయండి, ఆయన దాస్యంలోనే స్థిరంగా వుండండి"





ఈ వాక్యములో అల్లాహ్ - విధేయతకూ, దాస్యానికీ, ఆరాధనకూ తానొక్కడే అర్హుణ్ణని తెలియజేస్తున్నాడు. దీనినే 'తౌహీద్- అల్ - ఉలూహియత్' (ఆరాధనలో ఏకత్వం) అంటారు.

"మీకు తెలిసినంతవరకు ఆయనను పోలిన, ఆయనతో సమానమైన స్థాయిగల వాడెవడైనా వున్నాడా?"- ఈ వాక్యములో అల్లాహ్ తన గుణగణాల్లో, తన స్థాయిలో తనకు సాటిగానీ, సహవర్తులుగానీ ఎవరూలేరని తెలియ జేస్తున్నాడు.

దీనినే 'తౌహీద్- అల్- అస్మా వ సిఫాత్' (పేర్లు, గుణగణాల్లో ఏకత్వం) అని అంటారు.

పై మూడు విషయాలలో అల్లాహ్‌ను ఒక్కడిగా విశ్వసించడం.

రుబూబియత్, ఉలూహియత్ , అస్మా వ సిఫాత్ లలో అంటే అల్లాహ్‌ను ప్రభువుగా గుర్తించడంలో, ఆయన పరిపాలనాధికారాలలో, ఆయన విధేయతలో, ఆయన ఆరాధనలో, ఆయనకున్న పేర్లు, గుణగణాలలో ఒక్కడిగా, సహవర్తులు, భాగస్వాములు ఎవరూ లేని వాడిగా విశ్వసించి తదనుగుణంగా ఆచరించడం.

ఇదే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' - ఏక దైవారాధన.

పైన పేర్కొనబడిన విషయాల్లో ఏ ఒక్క విషయంలో నైనా దైవేతరులను ఎవరినైనా, ప్రజలదృష్టిలో వారి మహత్యం, వారిస్థాయి, వారి పలుకుబడి ఎంత గొప్పదైనా సరే, అల్లాహ్‌కు సాటిగానీ, సహవర్తులుగా గానీ కల్పించడం బహుదైవారాధన (షిర్క్) అవుతుంది.

ఈ బహు దైవారాధన (షిర్క్ ) అల్లాహ్ దృష్టిలో అన్నిటికన్నా పెద్ద పాపం. అందుకే తన దాసుల సమస్త పాపాలను క్షమించినా షిర్క్‌ను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ క్షమించేది లేదు అని అల్లాహ్ గట్టిగా హెచ్చరించాడు. షిర్క్ చేసిన వారికి స్వర్గాన్ని కూడా నిషిద్ధం చేశాడు.

"అల్లాహ్‌కు భాగస్వాములుగా ఇతరులను చేర్చటం పరమ దుర్మార్గం." *(లుఖ్మాన్ : 13)*

"అల్లాహ్ క్షమించనిది షిర్క్ మాత్రమే. అది తప్ప ఏ పాపాన్ని అయినా ఆయన తాను ఇష్టపడిన వారి కొరకు క్షమిస్తాడు". *(నిసా : 48)*

"ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయంచేసే వాడెవ్వడూ లేడు". *(మాఇద : 72)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో ఇలా తెలియజేశారు:

అల్లాహ్ దృష్టిలో అన్నింటి కంటే ఘోరమైన పాపం ఏది అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అడిగాను. దానికి ఆయన- నిన్ను సృష్టించినవాడు అల్లాహ్ అయినప్పటికీ, అతనికి సమానులుగా, సహవర్తులుగా దైవేతరుల్ని నిలబెట్టడం అని అన్నారు. *(సహీ బుఖారి : 4477)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు. ఆదం తనయుడు నన్ను తిరస్కరించాడు. వాస్తవానికిది అతనికి మంచిది కాదు. అతను నన్ను తిట్టాడు. ఇది కూడా అతనికి మంచిది కాదు. నన్ను తిరస్కరించడం ఎలా అంటే నేను అతణ్ణి తిరిగి జీవంపోసే శక్తిని కలిగిలేను అని అతడంటాడు. యిక నన్ను తిట్టడం ఎలా అంటే అతడు నాకు సంతానం అంటగడతాడు. వాస్తవానికి నా కొరకు భార్యా పిల్లలను కలిగి వుండడం నుండి నా వ్యక్తిత్వం ఎంతో అతీతమైనది, పవిత్రమైనదీను.

*(సహీ బుఖారి: 4482)*

"గ్రంథ ప్రజలలో, బహు దైవారాధకుల్లో సత్యాన్ని తిరస్కరించిన వారు తప్పని సరిగా నరకాగ్ని లోకే పోతారు. అందులోనే శాశ్వతంగా వుంటారు. వారు సృష్టిలో కెల్లా పరమనీచులు." *(బయ్యినహ్ : 6-7)*

షిర్క్ ఇంత ప్రమాదకరమైనది అయినందువల్లే దీని విషయంలో అల్లాహ్ దైవ ప్రవక్తలను సైతం వదిలిపెట్టలేదు. వారిని కూడా గట్టిగా హెచ్చరించాడు.

"ప్రవక్తా! నీ వద్దకూ, నీకు పూర్వం గతించిన ప్రవక్తల వద్దకూ ఇలా వహీ (దైవవాణి) పంపబడింది. ఒకవేళ మీరు షిర్క్ చేస్తే మీ కర్మలన్నీ వ్యర్థమై పోతాయి. మీరు నష్టానికి గురవుతారు." *(జుమర్ : 65)*





షిర్క్ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గట్టిగా నొక్కిచెప్పారు.

"విశ్వసించిన నా దాసులారా! అల్లాహ్ భూమి విశాలమైనది. కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి" *(అన్‌కబూత్: 56)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరుడైన ముఆజ్ ఇబ్నె జబల్ (రజి అల్లాహు అన్హు)కు ఇలా తాకీదు చేశారు: ఓ ముఆజ్! అల్లాహ్‌తో షిర్క్ ఎట్టి పరిస్థితుల్లోనూ చేయకు. ఒక వేళ నిన్ను అగ్నిలో పడవేసినా సరే లేక నీ శరీరాన్ని ముక్కలు ముక్కలుగా చేసేసినా సరే. *(ముస్నద్ అహ్మద్)*

ఏ సదాచరణ అయినా అల్లాహ్ వద్ద అమోదయోగ్యం కావడానికి తౌహీద్ అనేది ఎంత ముఖ్యమో, షిర్క్ అంటే అల్లాహ్‌కు ఎంత అసహ్యమో పైన పేర్కొన్న ఋజువుల ద్వారా తెలుస్తోంది. షిర్క్ చేసే వారు నన్ను తిడతారు, సృష్టిలో కెల్లా పరమనీచులు అని స్వయంగా అల్లాహ్ ధృవీకరించాడంటే అల్లాహ్ దృష్టిలో ముష్రిక్కుల స్థాయి ఏమిటో అర్థమవుతోంది.

అందుకే షైతాను కూడా అందరి కన్నా ముందు మనిషి యొక్క విశ్వాసంపై దాడి చేస్తాడు. వాడి ధ్యేయమే ఇదయివుంటుంది- 'ఎలాగైనా మనిషిని తౌహీద్ నుండి లాగి షిర్క్ అనే రొంపిలోనికి నెట్టేయడం.' ఆతర్వాతే ఆచరణల మీద దాడి చేస్తాడు. అందుకే మనం మన విశ్వాసాన్ని గూర్చి, దానిపైన నిలకడ గురించి ఎల్లప్పుడూ జాగ్రత్తపడుతూ వుండాలి.

ఉత్తమ విశ్వాసం, దానిపై నిలకడ అనేది ధార్మిక జ్ఞానం సముపార్జించడం ద్వారా అల్లాహ్ యెడల భయభక్తులు గలిగి విధేయత చూపడం ద్వారా, స్వర్గాన్ని పొందాలన్న ఆకాంక్ష, నరకాగ్ని నుండి సురక్షితంగా వుండాలన్న తపనల ద్వారానే సాధ్యం కాగలుగుతుంది. అప్పుడే షిర్క్ అనే రొంపిలోకి కూడా పడకుండా మనం సురక్షితంగా వుండగలుగుతాం.

షిర్క్ అసలు మానవ జీవితాల్లో ఎలా ప్రారంభమైనదో మున్ముందు తెలుసుకుందాం. ముందు మూడు రకాల తౌహీద్‌ను గురించి విస్తృతంగా, సవివరంగా తెలుసుకొందాం.

# తౌహీద్ అల్ రుబూబియత్

తౌహీద్ అల్ రుబూబియత్ అంటే అల్లాహ్‌ను ప్రభువుగా విశ్వసించడంలో ఏకత్వం.

రబ్ అన్నపదం సాధారణంగా ప్రభువు, యజమాని, చక్రవర్తి, సృష్టికర్త, స్వామి, పెంచేవాడు, పోషించేవాడు, సంరక్షించేవాడు లాంటి అర్థాలలో వాడబడు తుంది.

మరి అల్లాహ్‌ను 'రబ్'గా విశ్వసించడంలో ఏకత్వం పాటించడం అంటే అల్లాహ్‌ను విశ్వం యావత్తుకు ప్రభువుగా, సృష్టికర్తగా, యజమానిగా, సృష్టి సామ్రాజ్యాన్ని నడిపేవాడుగా, తన అధికారాలను ఈ సృష్టి అంతటా స్వేచ్ఛగా చలాయించే వాడుగా విశ్వసించడంలో ఏకత్వాన్ని పాటించాలి.

అంటే - కేవలం అల్లాహ్‌యే విశ్వం యావత్తుకు ప్రభువని,

- ◆ కేవలం అల్లాహ్‌యే యావత్తు విశ్వానికి సృష్టికర్త అనీ,
- ◆ కేవలం అల్లాహ్‌యే సృష్టి అంతటికీ యజమాని అనీ,
- ◆ కేవలం అల్లాహ్‌యే సమస్త గోచర, అగోచర విషయాలు, హృదయాలలో దాగి వున్న రహస్యాలూ తెలిసిన జ్ఞాని అనీ,
- ◆ కేవలం అల్లాహ్ చేతుల్లోనే అందరి జీవన్మరణాలు, కష్ట సుఖాలు, మంచీ చెడులూ, ఆయురారోగ్యాలు, ధనిక బీదరికాలు వున్నాయనీ,
- ◆ అల్లాహ్ అనుమతి లేకుండా సృష్టిలో ఏ ప్రక్రియ అయినా కార్యరూపం దాల్చదని, చివరకు చెట్టు నుండి ఆకు అయినా ఆయన అనుమతి లేకుండా రాలదనీ,





- ◆ కేవలం అల్లాహ్ చట్టమే సృష్టి అంతటా అనుసరించబడుతోందనీ, కేవలం ఆయన అధికారమే సృష్టిలో చలామణిలో వుందనీ హృదయ పూర్వకంగా విశ్వసించి తదనుగుణంగా ఆచరించాలి.

దివ్య ఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను కాస్త నిశితంగా అధ్యయనం చేస్తే పైన పేర్కొన్న అన్ని విషయాలకూ మనకు ఆధారాలు లభిస్తాయి. కొన్ని ఋజువులను మున్ముందు ప్రస్తావిస్తాను.

ఇక ఎవరైనా పైన పేర్కొన్న ఏ ఒక్క విషయంలోనైనా దైవేతరుల్ని ఎవరినైనా (సృష్టిలో, ప్రజల దృష్టిలో వారి స్థానం, గొప్పదనం ఎంత పెద్దదైనా సరే) అల్లాహ్‌కు సమానులుగా కానీ, లేక భాగస్వాములుగా కానీ విశ్వసిస్తే వారు అల్లాహ్ యొక్క రుబూబియత్‌లో షిర్క్ చేసిన వారవుతారు.

దివ్య ఖురానులో అల్లాహ్ యిలా సెలవిచ్చాడు :

"సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్‌కే సమస్త స్తోత్రాలు". *(ఫాతిహా :1)*

"సృష్టి ఆయనదే, దానిపై ఆధిపత్యమూ ఆయనదే. అల్లాహ్ అనంతమైన శుభాలు కలవాడు. సకల లోకాలకూ ప్రభువు". *(ఆరాఫ్ :54)*

"ప్రతి వస్తువునూ సృష్టించిన వాడు అల్లాహ్ యే. ప్రతి వస్తువునకూ సంరక్షకుడు కూడా ఆయనే." *(జుమర్ : 62)*

"అల్లాహ్ యే మిమ్మల్ని సృష్టించాడు, మీరు తయారు చేసే వస్తువులనూ సృష్టించాడు." *(సాఫ్ఫాత్ : 96)*

"భూమిపై సంచరించే ఏ ప్రాణి ఉపాధి అయినా అల్లాహ్ బాధ్యతలో లేకుండా లేదు". *(హూద్ : 6)*

"మిమ్మల్ని పుట్టించిన వాడు అల్లాహ్ యే. ఆయనే మీకు వినే, చూసే శక్తులు యిచ్చాడు. ఇంకా ఆయనే మీకు ఆలోచించే, అర్థం చేసుకునే మనస్సు కూడా యిచ్చాడు. కానీ మీరు చాలా తక్కువగా కృతజ్ఞతలు తెలుపుతారు." *(ముల్క్ : 23)*

గోచర, అగోచర విషయాల జ్ఞానం గురించి, హృదయాలలో దాగి వున్న రహస్యాలను గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"ఆకాశాలలోనూ, భూమిలోనూ అల్లాహ్ తప్ప అగోచరజ్ఞానం కలవాడు మరెవ్వడూ లేడు." (నమ్ల్ : 65)

"ఆ ఘడియకు (ప్రళయం) సంబంధించిన జ్ఞానం అల్లాహ్ వద్దనే వున్నది. తమ తొడిమల నుండి బయటికి వచ్చే ఫలాలన్నింటినీ ఆయనే ఎరుగును. ఆయనకు తెలియకుండా ఏ స్త్రీ అయినా గర్భం దాల్చదు, ఏ స్త్రీ అయినా ప్రసవించదు." (హామీమ్ అస్ సజ్దా: 47)

"అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే వున్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు. భూమిలోనూ, సముద్రంలోనూ ఉన్నదంతా ఆయనకు తెలుసు. చెట్టు నుండి ఏ ఆకైనా ఆయనకు తెలియకుండా రాలదు. భూమిలోని చీకటి పొరలలో వున్న ఏ గింజైనా ఆయనకు తెలియకుండా లేదు. తడిగా వున్నదీ, పొడిగా వున్నదీ అంతా ఒక విపులమైన గ్రంథంలో వ్రాయబడి వుంది."

(అన్ఆమ్ : 59)

"అల్లాహ్ వారి గుప్త విషయాలనూ ఎరుగును, వారి బహిరంగ విషయాలనూ ఎరుగును. ఆయన హృదయాలలో దాగి వున్న రహస్యాలను సైతం ఎరుగును". (హూద్ : 5)

యిక సృష్టి వ్యవహారాల గురించి, తన పరిపాలనాధికారాల గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"పరిపాలించే అధికారం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు".

(యూసుఫ్ : 40)

"భూమిలోనూ, ఆకాశాలలోనూ ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే శక్తిమంతుడు, వివేకవంతుడూను. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు ఆయనే. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు, మరణాన్ని కలిగిస్తున్నాడు, ప్రతి వస్తువుపై అధికారం కలిగి వున్నాడు. ఆయనే ఆరంభమూ, ఆయనే అంతమూ, ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి





వస్తువును గురించీ తెలుసు. ఆయనే ఆకాశాలనూ, భూమినీ ఆరు దినాలలో సృష్టించాడు, తరువాత అధికార పీఠాన్ని (అర్ష్) అధిష్టించాడు. భూమి లోపలకు పోయేదీ, అందులో నుండి బయటకు వచ్చేదీ, ఆకాశం నుండి దిగేదీ, దాని లోపలకు ఎక్కేదీ అంతా ఆయన జ్ఞాన పరిధిలో వున్నది. మీరు ఎక్కడ వున్నా ఆయన మీతో వున్నాడు. మీరు ఏ పని చేస్తూ వున్నా, దానిని ఆయన చూస్తున్నాడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి. సమస్త వ్యవహారాలూ నిర్ణయ నిమిత్తం ఆయన వైపునకే తీసుకుపోబడతాయి. ఆయనే రాత్రిని పగలులోకి, పగలును రాత్రిలోకి ప్రవేశింప చేస్తాడు. హృదయాలలో దాగి వున్న రహస్యాలను సైతం ఆయన ఎరుగును." (హదీద్ : 1-6)

"ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు, ఆయనే మరణం యిచ్చాడు, ఆయనే జీవితం ప్రసాదించాడు. విడిచే ఒక బిందువు ద్వారా ఆడా మగల జంటను కూడా ఆయనే సృష్టించాడు. మరొక జీవితాన్ని ప్రసాదించటం కూడా ఆయన బాధ్యతే. సంపన్నునిగా చేసిందీ ఆయనే, ఆస్తి పాస్తులను ప్రసాదించిందీ ఆయనే." (నజ్మ్ : 43-48)

"భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అల్లాహ్ ప్రభువు. ఆయన తాను కోరిన దానిని సృష్టిస్తాడు. తనకు ఇష్టమయిన వారికి కూతుళ్ళనూ, తాను కోరిన వారికి కొడుకులనూ ఇస్తాడు. తనకు ఇష్టమయిన వారికి కొడుకులనూ, కూతుళ్లనూ కలిపి యిస్తాడు. తాను కోరిన వారికి అసలు సంతానమే యివ్వడు. ఆయనకు అంతా తెలుసు. ఆయనకు అన్నింటిపైనా అధికారం వున్నది."

(అష్షూరా : 49-50)

"ఆయనే మీకు తన సూచనలను చూపిస్తాడు. ఆకాశం నుండి మీ కొరకు ఆహారాన్ని అవతరింప జేస్తాడు." (మూమిన్ : 13)

"ఏ ఆపద అయినా అల్లాహ్ అనుమతి లేనిదే ఎన్నటికీ రాదు".

(తగాబున్ : 11)

"అల్లాహ్ అనుమతి లేనిదే ఏ ప్రాణీ చావ జాలదు".

(ఆలిఇమ్రాన్ : 145)

యిక దైవేతరుల, మిధ్యా దేవుళ్ళ శక్తి సామర్థ్యాలను గురించి, సృష్టి వ్యవహారాలు నడపడంలో వారి పాత్రను గురించి అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో చూద్దాం :

"ప్రజలు అల్లాహ్‌ను కాదని కల్పించుకున్నట్టి దేవుళ్లు ఏ వస్తువునూ సృష్టించలేరు, కానీ, వారే సృష్టించబడతారు. వారు స్వయంగా తమ కొరకైనా ఏ లాభ నష్టాల అధికారాన్ని కలిగిలేరు. వారు చంపనూ లేరు, బ్రతికించనూ లేరు, మరణించిన వాణ్ణి మళ్ళీ లేపనూ లేరు". *(ఫుర్ఖాన్ : 3)*

"అల్లాహ్ గనక మీకు ఏదైనా నష్టం కలిగిస్తే, ఆయన తప్ప ఆ నష్టాన్నుండి మిమ్మల్ని రక్షించ గలిగే వారెవరూ లేరు. ఆయన మీకు ఏదైనా మేలు కలుగజేస్తే, ఆయనకు అన్నింటిపైనా అధికారం వుంది". *(అన్ఆమ్ : 16-17)*

"అల్లాహ్ ప్రజల కొరకు ఏ కారుణ్య ద్వారాన్ని తెరచినా, దానిని అడ్డుకొనే వాడెవ్వడూ లేడు. ఆయన మూసి వేసిన దానిని అల్లాహ్ తర్వాత మళ్ళీ తెరిచే వాడూ ఎవ్వడూ లేడు. ఆయన శక్తి మంతుడూ, వివేచనా పరుడూ."

*(ఫాతిర్ : 2)*

"అల్లాహ్‌ను కాదని మీరు ఆరాధ్యులుగా భావించిన వారిని పిలిచి చూడండి. వారు ఆకాశాలలో గానీ, భూమిలో గానీ రవ్వంత వస్తువుకు కూడా యజమానులు కారు. ఇంకా వారు భూమ్యాకాశాల ఆధిపత్యంలో అల్లాహ్‌కు భాగస్వాములునూ కారు. వారిలో ఎవ్వడూ అల్లాహ్‌కు సహాయకుడూ కాడు."

*(సబా : 22)*

"మానవులారా! ఒక ఉదాహరణ యివ్వబడుతోంది. దానిని శ్రద్ధగా వినండి. అల్లాహ్‌ను కాదని మీరు ఏ దేవుళ్ళను వేడుకొంటున్నారో, వారందరూ కలిసి సమైక్యంగా ఒక్క ఈగను సృష్టించదలచినా, అలా చేయలేరు. అంతేకాదు, ఒక వేళ ఈగ వారి నుండి ఏదైనా వస్తువును లాక్కుపోయినా, వారు దానిని విడిపించుకు రానూ లేరు. సహాయాన్ని అర్థించే వారూ బలహీనులే, సహాయం కోసం అర్థింపబడే వారూ బలహీనులే". *(హజ్ : 73)*

"ఏ వస్తువునూ సృష్టించ లేని వారినీ, స్వయంగా తామే సృష్టించబడే



దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

వారినీ ఎవరికీ సహాయం చెయ్యలేని వారినీ, స్వయంగా తమకు తామే సహాయం చేసుకోలేని వారినీ వీరు అల్లాహ్‌కు భాగస్వాములుగా చేస్తున్నారు."

*(ఆరాఫ్ : 191-192)*

"అల్లాహ్‌ను కాదని ఇతరులను సంరక్షకులుగా చేసుకున్న వారు సాలెపురుగును పోలి వున్నారు. అది కూడా తన కొరకు ఒక యిల్లు కట్టుకుంటుంది. కానీ, అన్ని ఇళ్ళకంటే అతి బలహీనమైన ఇల్లు సాలెపురుగు ఇల్లే అవుతుంది. అయ్యో! వారికి ఈ విషయం తెలిస్తే ఎంత బాగుటుంది!"

*(అన్‌కబూత్ : 41)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విషయాలనే ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు)కు ఇలా వివరించి చెప్పారు :

"అబ్బాయ్ ! నేను కొన్ని వచనాలను నీకు నేర్పిస్తాను. నువ్వు అల్లాహ్‌ను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకో, అల్లాహ్ నిన్ను గుర్తు పెట్టుకుంటాడు. నీవు గనక అల్లాహ్‌ను ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకుంటే, అల్లాహ్‌ను నీ ముందర పొందుతావు. ఏదైనా వేడుకోవాలంటే కేవలం అల్లాహ్‌నే వేడుకో, సహాయం కావాలంటే కేవలం అల్లాహ్ సహాయాన్నే అర్థించు.

బాగా గుర్తుంచుకో! ప్రజలందరూ ఏకమై నీకేదైనా మేలు చేయాలనుకొంటే, వారు కూడా, ఎంతైతే అల్లాహ్ ఇదివరకే నీ అదృష్టంలో రాసి పెట్టాడో అంత వరకే మేలు చేయగలుగుతారు. ఇంకా, ప్రజలందరూ ఏకమై నీకేదైనా నష్టం కలిగించాలనుకున్నా, వారు కూడా, ఎంతైతే అల్లాహ్ ఇదివరకే నీ అదృష్టంలో రాసి పెట్టాడో అంత వరకే నష్టం కలిగించగలరు. కలములు ఎత్తుకోబడ్డాయి. విధి వ్రాత పుస్తకాలు ఆరిపోయాయి. (అంటే విధి వ్రాత రాయడం ఎప్పుడో పూర్తయిపోయింది)

*(తిర్మిజి : అబ్‌వాబుల్ సిఫతుల్ ఖియామహ్, బాబున్ అన్ అబీ ఉస్మాన అన్ హంజల)*

పై బుజువుల ద్వారా అల్లాహ్ ఎవరో, అతని అధికారాలు, శక్తి సామర్థ్యాలూ ఎలాంటివో, దైవేతరుల శక్తి సామర్థ్యాలు, సృష్టి నిర్వహణలో వారి పాత్ర ఎంత వుందో- ఈ విషయాలన్నీ మనం తెలుసుకున్నాం.

అయినా ఇంకా ఎవరికైనా మనస్సులో అల్లాహ్‌ను గురించి, ఆయన శక్తి సామర్థ్యాల గురించి ఏవైనా సంకోచ సందేహాలు వుంటే అలాంటి వారికి అల్లాహ్ కొన్ని క్రియాత్మక ప్రశ్నలు వేస్తున్నాడు. మనం కూడా ఆ ప్రశ్నలను కాస్త గమనిద్దాం.

“అల్లాహ్ శ్రేష్ఠుడా లేక ఆయనకు సాటిగా వారు కల్పించే దేవుళ్ళు శ్రేష్ఠులా? సరే, ఆకాశాలనూ, భూమినీ ఎవరు సృష్టించారు? మీ కోసం ఆకాశం నుండి నీటిని కురిపించి, తద్వారా మనోహరమైన తోటలను ఎవరు పండించారు? వాటిలోని చెట్లను మొలిపించటం మీకు సాధ్యమయ్యే పని కాదు. అల్లాహ్‌తో పాటు మరొక దేవుడు కూడా ఎవడైనా వున్నాడా?

కానీ, వారే ఋజు మార్గం నుండి తొలగిపోతున్నారు. భూమిని నివాస స్థలంగా చేసినవాడు ఎవడు? అందులో నదులను ప్రవహింప జేసిన వాడు ఎవడు? దాని మీద (పర్వతాల) మేకులను పాతినవాడు ఎవడు? రెండు రకాల జలధుల మధ్య అడ్డు తెరలను పెట్టిన వాడు ఎవడు? అల్లాహ్‌తో పాటు మరొక దేవుడు కూడా ఎవడైనా వున్నాడా? లేడు. కానీ వారిలో చాలా మందికి తెలియదు. బాధితుడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి అతని బాధను తొలగించే వాడు ఎవడు?

భూమిపై మిమ్మల్ని ప్రతినిధులుగా చేసినవాడు ఎవడు? అల్లాహ్‌తో పాటు మరొక దేవుడు కూడా ఎవడైనా వున్నాడా? మీరు చాలా తక్కువగా ఆలోచిస్తారు.

నేలపై, సముద్రంపై అంధకారంలో మీకు దారి చూపేవాడు ఎవడు? తన కారుణ్యానికి ముందు గాలులను శుభవార్తతో పంపేవాడు ఎవడు? అల్లాహ్‌తో పాటు మరొక దేవుడు కూడా ఎవడైనా వున్నాడా? వారు చేస్తూ వున్న షిర్క్‌కు అల్లాహ్ ఎంతో అతీతుడూ, ఉన్నతుడూను.

సృష్టిని మొదటి సారిగా చేసిన వాడు ఎవడు?
దానిని పునః సృష్టించే వాడు ఎవడు?
నింగి నుండీ, నేల నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు?
అల్లాహ్‌తో పాటు మరొక దేవుడు ఎవడైనా వున్నాడా?
మీరు సత్యవంతులే అయితే మీ ఆధారాన్ని తీసుకురండి”.

*(నమ్ల్ : 59-64)*





“మీరు విడిచే ఈ రేతస్సుతో బిడ్డను మీరు తయారు చేస్తారా? లేక దానిని సృష్టించే వారము మేమా?” *(వాఖిఅహ్ : 58-59)*

“మీరు నాటే ఈ విత్తనాలతో పొలాలను మీరు పండిస్తారా లేక వాటిని పండించే వారము మేమా?” *(వాఖిఅహ్ : 63-64)*

“మీరు త్రాగే ఈ నీటిని మేఘాల నుండి మీరు కురిపించారా ? లేక దానిని కురిపించే వారము మేమా? మేము తలుచుకుంటే దానిని ఎంతో ఉప్పగా వుండేలా చేయగలము. అలాంటప్పుడు మీరు కృతజ్ఞులై ఎందుకు వుండరు?” *(వాఖిఅహ్ : 68-70)*

“మీరు రాజేసే అగ్నిని గురించి ఎప్పుడైనా ఆలోచించారా? దానికి సంబంధించిన వృక్షాన్ని మీరు సృష్టించారా? లేక దానిని సృష్టించిన వారము మేమా?” *(వాఖిఅహ్ : 71-72)*

“ఒకవేళ కరుణామయుడైన అల్లాహ్ తాను ప్రసాదించే ఆహారాన్ని ఆపివేసినట్లయితే, ఇంకెవరు మీకు ఆహారమివ్వగలరు?” *(ముల్క్ : 21)*

“ఒకవేళ మీ బావులలోని నీరు భూమిలోపలకు ఇంకిపోతే, ప్రవహించే ఈ నీటి ఊటలను మళ్ళీ మీ కోసం బయటకు తెచ్చేదెవరు? *(ముల్క్ : 30)*

“అల్లాహ్ మీ చూపునూ, మీ వినికిడినీ మీ నుంచి లాక్కుంటే, మీ హృదయాలకు ముద్ర వేస్తే మళ్ళీ మీకు ఆ శక్తులను అల్లాహ్ తప్ప తిరిగి యివ్వగల మరొక దేవుడెవడున్నాడు?” *(అన్ ఆమ్ : 46)*

“భూ సముద్రాల చీకట్లలోని ప్రమాదాల నుండి మిమ్మల్ని కాపాడేదెవరు? మీరు (ఆపద సమయంలో) కడు దీనంగా విలపిస్తూ, అతి గోప్యంగా వేడుకొనేది ఎవరినీ?”

“ఈ ఉపద్రవం నుండి ఆయన గనక మమ్మల్ని రక్షిస్తే, మేము తప్పకుండా కృతజ్ఞులం అవుతాము అని మీరు అనేది ఎవరితో?” *(అన్ ఆమ్ : 63)*

“ఒకవేళ అల్లాహ్ మీకు నష్టం కలిగించదలిస్తే ఆయన నుండి మిమ్మల్ని కాపాడగలిగే వాడెవడెవడు?”

"ఒకవేళ అల్లాహ్ మిమ్మల్ని కరుణించదలిస్తే, ఆయన కరుణను ఆపగల వాడెవడు? అల్లాహ్‌కు ప్రతిగా వారు ఏ సంరక్షకుణ్ణీ, ఏ సహాయకుణ్ణీ పొందలేరు."
*(అహ్‌జాబ్ : 17)*

పై ప్రశ్నలన్నింటికీ యావత్తు ముస్లిం సమాజం నుండి సామాన్యంగా ఒకే సమాధానం వస్తుంది. అదేమిటంటే - అల్లాహ్ ఒక్కడే దేవుడని, మరొక దేవుడు లేడని, ఆయన ఒక్కడే సృష్టి వ్యవహారాలు నడుపుతున్నాడని.

కానీ మనస్ఫూర్తిగా విశ్వసించి, నోటితో పలికే ఈ సాక్ష్యం క్రియా రూపం లోకి వచ్చేవరకు మారిపోతోంది. అజ్ఞానం వల్ల చాలా మందికి తాము యిచ్చే సాక్ష్యానికీ, తమ ఆచరణలకూ పూర్తిగా వ్యతిరేక సంబంధం వుంది అన్న విషయం కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

అందుకే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని సాక్ష్యం యిచ్చినప్పటికీ, దైవేతరులైన ఒకర్ని కష్టాలు దూరం చేసేవాడు అనీ, మరొకర్ని సంతానం యిచ్చేవాడనీ, ఇంకొకర్ని నిర్విరామంగా దాన ధర్మాలు చేసేవాడని బిరుదులిచ్చి, కేవలం అల్లాహ్‌కే చెందిన అధికారాలను వారికి ఆపాదిస్తున్నారు. ఇది 'షిర్క్' అన్న సంగతి కూడా వారికి తెలియడం లేదు.

కనుక తమ హృదయాల్లో ఇలాంటి తప్పుడు విశ్వాసాలను పెంపొందించుకున్న వారికి నేను సవినయంగా చేసే మనవి ఏమిటంటే - మీరు చేసేది 'షిర్క్' అని గ్రహించండి. ఈ బూటకపు విశ్వాసాలకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంతో ఏ మాత్రం సంబంధం లేదు అని తెలుసుకోండి. ధార్మిక జ్ఞానం సంపాదించండి. అల్లాహ్ యొక్క శక్తి సామర్థ్యాలనూ, గౌరవోన్నతులనూ తగు విధంగా గుర్తించండి. హృదయాల్లో దాగి వున్న బహుదైవారాధపు విశ్వాసాలను విడిచిపెట్టండి. వివిధ బిరుదులతో ఈనాడు ముస్లిం సమాజంలో కొనియాడబడే దైవేతరులంతా మీ మాదిరిగానే అల్లాహ్ దాసులనీ, ఏ వస్తువునూ సృష్టించలేరనీ, ఎవరికీ ఏమీ సహాయం చెయ్యలేరనీ, తమకు తాము గూడా సహాయం చేసుకోలేరని గట్టిగా నమ్మి వారి ఆరాధనకు దూరంగా వుండండి. అల్లాహ్ శిక్షకు భయపడండి. మనమంతా ఒక రోజు అల్లాహ్ ముందు హాజరుపరచబడనున్నామని మరవకండి.





యిక 'తౌహీద్ - అల్ - రుబూబియత్' గురించి స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విశ్వాసం ఎలా వుండేదో చూద్దాం.

దివ్యఖురాన్‌లో అల్లాహ్ తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేత ఇలా ప్రకటింపజేశాడు :

"అల్లాహ్‌యే నా ప్రభువు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయన వైపుకే నేను (పశ్చాత్తాపంతో) మరలుతాను". *(షూరా : 10)*

"నాకు అల్లాహ్‌యే చాలు. ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయన మహత్తరమైన పీఠానికి (అర్ష్) ప్రభువు."
*(తౌబా : 129)*

"ఈ గ్రంథాన్ని అవతరింప జేసిన అల్లాహ్‌యే నాకు రక్షకుడు, సహాయకుడూను. ఆయన సజ్జనులకు సహాయ పడతాడు" *(ఆరాఫ్ : 196)*

"మీకు నష్టం కలిగించడం, లేదా మేలు చెయ్యటం అనేది నా వశంలో లేదు. ఇలా చెప్పు - నన్ను అల్లాహ్ పట్టు నుండి ఎవ్వరూ కాపాడలేరు. నాకు ఆయన ఆశ్రయం తప్ప మరొక ఆశ్రయం కూడా లేదు". *(జిన్న్ : 21-22)*

అంతేకాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక హదీసులో అల్లాహ్ మీద తనకున్న విశ్వాసాన్ని ఇలా ప్రకటించారు. ఈ వచనాలను తాను నమాజు ముగించిన పిదప పలికేవారు.

"అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. యావత్తు విశ్వ సామ్రాజ్యం ఆయనదే. స్తోత్రాలన్నీ ఆయనకే శోభిస్తాయి. ఆయనే ప్రతి దానిపై అధికారం కలవాడు. ఓ అల్లాహ్! నీవు ప్రసాదించే దానిని అడ్డుకొనే వారెవరూ లేరు, నీవు అడ్డుకొనే దానిని తిరిగి ఇప్పించగలిగే వారు కూడా ఎవరూ లేరు. నీకు వ్యతిరేకంగా ఎవరి ప్రయత్నం కూడా సఫలం కాజాలదు". *(సహీ బుఖారి : 844)*

అలాగే, ఇంకో హదీసు ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రతి ఫర్జ్ నమాజ్ తర్వాత బిగ్గరగా ఇలా పలికే వారు :

"అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. యావత్తు విశ్వ సామ్రాజ్యం ఆయనదే. స్తోత్రాలన్నీ ఆయనకే శోభిస్తాయి. ఆయనే ప్రతిదానిపై అధికారం కలవాడు. ఆయన సహాయం లేనిదే ఎవరూ పాపాల నుండి కాపాడు కోలేరు, అలాగే పుణ్య కార్యాలూ చేయలేరు. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనను తప్ప మేము మరెవరినీ ఆరాధించము. అనుగ్రహాలన్నీ ఆయన ప్రసాదించినవే. సమస్త ఘనతలు, గొప్పదనాలు, స్తోత్రాలూ, ప్రశంసలూ ఆయనకే. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. మేము మాత్రం మా ధర్మాన్ని కేవలం ఆయనకే అంకితం చేసుకుంటున్నాం, ఇది తిరస్కారులకు ఎంత అయిష్టమయినాసరే.

*(సహీ ముస్లిం - కితాబుల్ మసాజిద్, బాబ్ : ఇస్తెహ్‌బాబుజ్జిక్రె బాదస్సలాతి వ బయాని సిఫతిహి)*

తౌహీద్ - అల్ - రుబూబియత్ ను గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంత పటిష్ఠమైన విశ్వాసం కలిగి వుండేవారో పైన పేర్కొన్న ఋజువుల ద్వారా తెలుస్తోంది. మరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనుచర సమాజమయిన మనం కూడా తాత ముత్తాతల కాలం నాటి నుండి వస్తూ మన హృదయాల్లో తిష్టవేసిన తప్పుడు విశ్వాసాలను పూర్తిగా విడిచిపెట్టి, మనస్ఫూర్తిగా ఈ విశ్వాసాన్ని స్వీకరించి, దానికి అనుగుణంగానే ఆచరించాలి. అప్పుడే మనం అల్లాహ్ దగ్గర మోక్షం పొందగలమని ఆశించవచ్చు.

ఈ తౌహీద్ - అల్ - రుబూబియత్ ను గురించి అంతిమ దైవ ప్రవక్తే కాదు, ఆ మాట కొస్తే ప్రవక్తలందరూ ఈ విశ్వాసాన్నే ప్రకటించారు.

ఉదాహరణకు ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఏమని ప్రకటించారో చూడండి

"మీరూ, పూర్వం మీ తాత ముత్తాతలూ పూజిస్తూ వస్తున్న వాటిని ఎప్పుడైనా మీరు చూశారా? నాకు యివన్నీ శత్రువులే, ఒక్క సకల లోకాల ప్రభువు తప్ప. ఆయనే నన్ను సృష్టించాడు. తరువాత ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు. నేను వ్యాధికి గురైనప్పుడు ఆయనే నాకు స్వస్తతను చేకూరుస్తాడు. ఆయనే నాకు మృత్యువును కలిగిస్తాడు. తరువాత





మళ్ళీ నాకు జీవితాన్ని అనుగ్రహిస్తాడు. తీర్పుదినం నాడు నా పాపాలను క్షమిస్తాడని నేను ఆయన మీదే ఆశలు పెట్టుకున్నాను." *(షు ఆరా : 75-82)*

యాఖూబ్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు :

"నేను నా ఆందోళనను గురించి, నా ఆవేదనను గురించి అల్లాహ్‌కు తప్ప మరెవరికీ ఫిర్యాదు చెయ్యను. అల్లాహ్‌ను నేను ఎరిగినట్లు మీరు ఎరుగరు. కుమారులారా! వెళ్ళి యూసుఫ్‌ను గురించీ, అతని సోదరుని గురించీ దర్యాప్తు చేయండి. అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. ఆయన కారుణ్యం పట్ల కేవలం అవిశ్వాసులే నిరాశ చెందుతారు." *(యూసుఫ్ : 86-87)*

ఇదే తౌహీద్ - అల్ - రుబూబియత్‌కు సంబంధించిన వాస్తవికత. యిక తౌహీద్ యొక్క రెండవ ముఖ్య విభాగమైన 'తౌహీద్-అల్- ఉలూహియత్'ను గురించి విస్తృతంగా తెలుసుకొందాం.

# తౌహీద్ -అల్ - ఉలూహియత్

తౌహీద్ - అల్ - ఉలూహియత్ - అంటే (ముందుగా చెప్పినట్లు) ఆరాధనలో అల్లాహ్ ఏకత్వాన్ని మనస్ఫూర్తిగా విశ్వసించి తదనుగుణంగా ఆచరించడం. మిథ్యా దైవాల ఆరాధనకు దూరంగా వుండడం.

అసలు, 'తౌహీద్ - అల్ - రుబూబియత్'ను సంపూర్ణంగా అర్థం చేసుకొని స్వీకరించిన వ్యక్తికి, అంటే - కేవలం అల్లాహ్‌ను తప్ప మరెవర్నీ ప్రభువుగా, సృష్టికర్తగా, సృష్టి వ్యవహారాలు నడిపే వాడుగా గుర్తించిన వ్యక్తికి 'తౌహీద్ - అల్ - ఉలూహియత్' అనివార్యమై పోతుంది.

ఎందుకంటే తౌహీద్ - అల్ - ఉలూహియత్ కు ముందు తనే స్వయంగా కేవలం అల్లాహ్‌నే ప్రభువుగా, సృష్టికర్తగా, సమస్త సృష్టివ్యవహారాలు నడిపే వాడుగా, మరియు మిథ్యా దేవుళ్ళందరూ ఒక గడ్డిపోచకు కూడా యజమానులు కారని, వారందరు కూడా సమైక్యంగా ఒక్క ఈగను కూడా సృష్టించలేరనీ, ఏ సహాయమూ చేయలేరని మనస్ఫూర్తిగా విశ్వసించి వున్నాడు.

కేవలం అల్లాహ్‌నే ప్రభువుగా, సృష్టికర్తగా, సృష్టి వ్యవహారాలు నడిపే వాడుగా విశ్వసించటం-'కేవలం అల్లాహ్‌నే ఆరాధించాలి' అన్న దానిని అనివార్యం చేస్తుంది.

అలాగే మిథ్యా దేవుళ్ళందరూ దేనినీ సృష్టించలేరనీ, దేనికీ యజమానులు కారనీ, ఎవరికీ ఏ సహాయమూ చెయ్యలేరని విశ్వసించడం - 'వారి ఆరాధనను సంపూర్ణంగా తిరస్కరించాలి' అన్న దానిని అనివార్యం చేస్తుంది.

ఇదే తౌహీద్ - అల్ - ఉలూహియత్.

"కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించడం - మిథ్యా దైవాల ఆరాధనను పూర్తిగా తిరస్కరించడం".





దైవ సందేశ హరులంతా తెచ్చిన సందేశ సారం కూడా ఇదే.

"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము : అల్లాహ్‌ను ఆరాధించండి. మిథ్యా దైవాల ఆరాధనకు దూరంగా వుండండి". *(నహ్ల్ : 36)*

దైవ సందేశహరులైన నూహ్ (అలైహిస్సలాం) మొదలుకొని అంతిమ దైవ ప్రవక్త అయిన మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) వరకు అందరూ ఇదే సందేశంతో పంపబడ్డారు.

"మేము నూహ్ (అలైహిస్సలాం)ను అతని జాతి వద్దకు పంపాము. అతను ఇలా అన్నాడు : నా జాతి సోదరులారా! అల్లాహ్‌ను ఆరాధించండి. ఆయన తప్ప మీకు మరొక దేవుడు లేడు." *(ఆరాఫ్ : 59)*

అంతిమ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు అల్లాహ్ ఇలా చెప్పాడు.

"వారికి ఇలా చెప్పు : ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించి, ఆయనకు మాత్రమే దాస్యం చేయి అని నాకు ఆజ్ఞ యివ్వబడింది." *(జుమర్ : 11)*

అంటే, అన్ని రకాల ఆరాధనలను కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం చేయాలి. మిథ్యా దైవాల ఆరాధనను పూర్తిగా తిరస్కరించాలి.

అసలు 'ఆరాధన' అనేది ఒక విస్తృత పదం. కేవలం నమాజ్, రోజా, హజ్, జకాత్ లనే ఆరాధన అనుకోవడం పొరపాటు. వాస్తవానికి ఆరాధన అంటే - అల్లాహ్ ఇష్టపడే, అతణ్ణి సంతోషపెట్టే, అతణ్ణి తృప్తి పరచే సమస్త విషయాలు. అవి అంతరంగా గానీ, బాహ్యంగా కానీ, మనిషి సంకల్పించే, నోటితో పలికే పలుకులైనా కావచ్చు, లేదా శారీరక చర్యలైనా కావచ్చు.

అలాగే అల్లాహ్‌ను ఆరాధించడం అంటే - తనను తాను సంపూర్ణంగా అల్లాహ్‌కు సమర్పించుకొని, జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలోనూ పూర్తిగా ఆయనకే విధేయత చూపిస్తూ, అతని మీద ప్రేమతోనూ, భయంతోనూ, ఆశతోనూ కేవలం ఆయన నిర్దేశించిన ధర్మశాస్త్రము (షరీయత్)నకు అంటే, దివ్యఖురాన్‌లో నిర్దేశించబడిన ఆదేశాల మేరకు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు

అలైహి వ సల్లం) ద్వారా ప్రస్తావించబడిన ప్రామాణిక హదీసుల మేరకు లోబడి మాత్రమే జీవితాన్ని కొనసాగించడం.

'ఆరాధన' పదంలోని సమగ్రత, విశాలతలను దృష్టిలో పెట్టుకొనే దివ్యఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకు తప్ప మరి దేని కొరకూ సృష్టించలేదు. నేను వారి నుండి ఎలాంటి ఉపాధినీ కోరను. వారు నాకు అన్నం పెట్టాలనీ కోరను. అల్లాహ్ స్వయంగా ఉపాధి ప్రదాత, గొప్ప శక్తి సంపన్నుడు, అత్యంత ధృఢమైనవాడూను". *(జారియాత్ : 56-58)*

అందుకే మార్గదర్శకత్వం అనేది ప్రతి విషయంలోనూ యివ్వబడింది. దివ్యఖురాన్‌లోని ఆదేశాల ద్వారా, అంతిమ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రవచనాల ద్వారా జీవితానికి సంబంధించిన ప్రతి విషయమూ క్షుణ్ణంగా వివరించడం జరిగింది. తద్వారా సమస్త మానవులూ, జిన్నాతులూ తమతమ జీవితాలను అల్లాహ్ ఆదేశాల మేరకు గడుపుకోవాలని. అందుకే జీవితానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలతో పాటు ప్రతి చిన్న విషయం లోనూ కూడా షరియత్తు ప్రకారం నడుచుకొంటే దానికి 'పుణ్యం' అనే శుభవార్త వినిపించబడింది.

అబూజర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోదించారు : "ఆదం సంతానంపై ప్రతి ఉదయం అతని శరీరంలోని ప్రతీ కీలుకు ప్రతిగా ఒక సదఖా (దానం) అనివార్యమై వుంటుంది. యిక ఒక వేళ అతను తనను కలిసిన వారికి సలాం చేస్తే అది అతని తరపున ఒక సదఖాగా పరిగణించబడుతుంది. ఎవరికైనా మంచిని గురించి ఆజ్ఞాపిస్తే ఇది కూడా సదఖాయె. చెడు నుండి నిరోధిస్తే ఇది కూడా సదఖాయే. దారిన పడి వున్న కష్టం కలిగించే ఏదైనా వస్తువును తొలగించినా ఇది కూడా సదఖాయే, తన భార్యతో సంభోగం జరిపినా ఇది కూడా సదఖాయే. అయి నప్పటికీ ఇవన్నీ కాకుండా చాష్త్ సమయంలో రెండు రకాతుల నమాజ్ చేయటం వీటన్నింటి తరపున సరిపోతుంది".

దానికి సహచరులు (ఆశ్చర్యపడి) ఓ దైవ ప్రవక్తా! మాలో ఎవరైనా తన





(భార్యతో) అవసరాన్ని తీర్చుకుంటే ఇది కూడా సదఖాయేనా? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ : (ఎందుక్కాదు) ఒక వేళ అతను నిషిద్ధమైన చోట తన అవసరాన్ని తీర్చుకొని వుంటే పాపాత్ముడై పోయేవాడు కాదా? అని అన్నారు. *(అబూదావూద్ : 1285)*

అయితే షరియత్తు ప్రకారం అల్లాహ్‌ను ఆరాధించడంలో గుర్తుంచుకో వలసిన ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే : సోమరితనమూ, మితిమీరి తనమూ - ఈ రెండింటినీ త్యజించి మధ్యేమార్గాన్ని అవలంబించడం. దానిపైనే స్థిరంగా వుండడం.

దివ్యఖురాన్‌లో అల్లాహ్ దైవ ప్రవక్తకు ఇలా ఉపదేశించాడు :

"నీవూ, (అవిశ్వాసం నుండి) మరలి వచ్చిన నీ సహచరులూ నీకు ఆజ్ఞాపిం చిన ఋజుమార్గంపై స్థిరంగా వుండండి. దైవ దాస్యపు హద్దులను అతిక్రమించ కండి" *(హూద్ : 112)*

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం : ముగ్గురు సహచరులు (అలీ బిన్ అబూతాలిబ్, అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్, ఉస్మాన్ బిన్ మజ్ఊన్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సతీమణుల ఇళ్ళకు వచ్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఆరాధనల గురించి వాకబు చేశారు. వారికి జవాబు యివ్వబడింది. అయితే వాళ్ళు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆరాధనలను స్వల్పమని తలపోశారు.

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో మాకెలాంటి పోలికా ! ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి భూత భవిష్యత్ కాల పొరపాట్లు కూడా మన్నించబడ్డాయి. అందుకే మనం ఆయన కన్నా ఎక్కువగా ఆరాధనలు చేయవలసి వుంది" అని పరస్పరం చెప్పుకున్నారు. కడకు, వారిలో ఒకతను - తాను ఎల్లకాలం రాత్రిళ్ళు నిద్రపోకుండా నమాజ్ చేస్తానని అంటే, తాను నిరాఘాటంగా ఉపవాసాలు పాటిస్తాననీ, వాటిని ఎప్పుడూ త్యజించననీ రెండో వ్యక్తి అన్నాడు. మూడో వ్యక్తి తాను స్త్రీలకు దూరంగా వుంటాననీ, అసలు వివాహమే చేసుకోననీ తీర్మానించుకున్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వచ్చిన తర్వాత (విషయం తెలిసి)

మీరీ విధంగా అన్న మాట నిజమేనా? అని అడిగారు. (అవును అని వాళ్ళు అంగీకరించిన తరువాత) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు : జాగ్రత్త! అల్లాహ్ సాక్షి! నేను మీ అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడే వాణ్ణి. మీ అందరికన్నా ఎక్కువగా భక్తి ప్రపత్తులు గలవాణ్ణి. అయితే నేను ఉపవాసం వుండడంతో పాటు ఉపవాస విరమణ కూడా చేస్తాను. రాత్రి జాగరణ చేయడంతో పాటు విశ్రాంతి కూడా తీసుకుంటాను. నేను స్త్రీలను వివాహం కూడా చేసుకున్నాను. (బాగా గుర్తుంచుకోండి!) ఎవరయితే నా సున్నత్ పట్ల వైముఖ్య ధోరణి చూపుతాడో అతడితో నాకు ఏ సంబంధం లేదు."

*(సహీ బుఖారి : 5063)*

దివ్య ఖురానునూ, దైవ ప్రవక్త (సల్లం) గారి ప్రామాణిక హదీసులను నిశితంగా అధ్యయనం చేస్తే మొత్తం మూడు రకాల ఆరాధనలు మనకు బోధ పడతాయి. అవి :

(1) హృదయారాధనలు

(2) నోటి ఆరాధనలు

(3) ఇతర శారీరక ఆరాధనలు

హృదయారాధనల్లో ముఖ్యమైనవి - భయం, ఆశ, ప్రేమ, నమ్మకము వగైరా.

నోటి ఆరాధనల్లో - దుఆ , దివ్యఖురాన్ పారాయణం, ధ్యానము (జిక్ర్), ప్రశంసించడం, కృతజ్ఞతలు తెలుపడం వగైరా ... ముఖ్యమైనవి.

యిక ఇతర శారీరక ఆరాధనలంటే శరీరంలోని వివిధ అవయవాల ద్వారా చేయబడే ఆరాధనలు. వీటిలో నమాజ్, రుకూ, సజ్దా, రోజా (ఉపవాసం), హజ్, జకాత్, ఖుర్బానీ, మొక్కుబడి, సమర్పణలు, విధేయత, మంచిని ఆజ్ఞాపించడం, చెడు నుండి నిరోధించడం వగైరా ... ముఖ్యమైనవి.





# హృదయారాధనలు

హృదయారాధనల్లోని ముఖ్యమైనవాటిని గూర్చి విపులంగా తెలుసు కొందాం:

## 1) భయం

భయం ఒక ఆరాధన. కనుక దీనిని కేవలం అల్లాహ్‌కే ప్రత్యేకం చేసుకోవాలి. అంటే కేవలం అల్లాహ్‌కు మాత్రమే భయపడాలి. భయం కోసం సామాన్యంగా రెండు పదాలు వాడుతారు.

ఒకటి 'ఖౌఫ్' మరియు రెండవది 'ఖషియత్'. దివ్యఖుర్ఆన్‌లో కూడా అల్లాహ్ ఈ పదాలను వాడాడు. ఈ రెండు పదాలకు బాహ్యంగా 'భయం' అనే అర్థమే వచ్చినా, అంతరంగా వీటి అర్థాల్లో కాస్త బేధం వుంది. ఈ రెండు పదాల అర్థాలను షేఖ్ మహమ్మద్ బిన్ సాలెహ్ ఉసైమీన్ గారు 'షరియత్ కే తీన్ బునియాదీ ఉసూలోఁకీ షరహ్' పుస్తకంలో చాలా చక్కగా విశ్లేషించి చెప్పారు.

భయం (ఖౌఫ్) అంటే మనిషి ఏదైనా ప్రాణహానిని గానీ, కష్టాన్ని గానీ, నష్టాన్ని గానీ మనసులో ఊహించడం వల్ల అతనిపై ఆవహించే గుణం. దివ్యఖుర్ ఆన్‌లో అల్లాహ్ 'తనకు మాత్రమే భయపడమని, షైతాను మిత్రులకు భయపడవద్దని' సెలవిచ్చాడు.

"మీరు నిజమైన విశ్వాసులే అయితే ఇక ముందు వారికి భయపడకండి. నాకు భయపడండి". *(ఆలి ఇమ్రాన్ : 175)*

ఖౌఫ్ (భయం)ను మూడు రకాలుగా విభజించవచ్చు :

మొదటిది : 'సహజ సిద్ధమయిన భయం' - అంటే మనిషి క్రూర జంతువు లతో, అగ్నితో, నీటిలో మునిగిపోవడం గురించి పడే భయం. ఇలాంటి భయం మూలంగా మనిషిని తప్పు పట్టడానికి వీలుండదు.

దివ్యఖురానులో  అల్లాహ్  మూసా (అలైహిస్సలాం) గురించి ఇలా సెలవిచ్చాడు.

"మరుసటి రోజు ఉదయం అతను భయపడుతూ, ఏదైనా ప్రమాదం ముంచుకొస్తుందేమో అని జాగ్రత్తగా నలువైపులా పరికిస్తూ నగరంలో పోతూ వుండగా ..." *(ఖసస్ : 18)*

కానీ ఈ భయమే మనిషి విధిగా, తప్పనిసరిగా పాటించవలసిన విషయాలకు కూడా దూరంగా వుండిపోవడానికి కారణ భూతమవుతోందంటే అలాంటి భయం మాత్రం ధర్మంలో నిషేధించబడింది.

"మీరు నిజమైన విశ్వాసులే అయితే ఇక ముందు వారికి భయపడకండి. నాకు భయపడండి" *(ఆలి ఇమ్రాన్ : 175)*

రెండవ రకం భయం ఎలాంటిదంటే - మనిషి ఒక దానితో ఎంతగా భయపడతాడంటే, దాని భయం వల్ల ఏకంగా దాన్నే ఆరాధించడం మొదలు పెడతాడు. ఇలాంటి భయం కేవలం అల్లాహ్‌కే చెందుతుంది. దైవేతరుల విషయంలో అది 'బహుదైవారాధన' (షిర్క్) అవుతుంది.

యిక మూడవది : అంతర్గతంగా హృదయాల్లో దాగి వుండే భయం - అంటే సమాధులలో ఖననమై వున్న గత కాలానికి చెందిన పుణ్య పురుషులను గురించి, వలీలను గురించి, పీర్లను గురించి మనస్సులో అంతర్గతంగా భయం కలిగి వుండడం. వాస్తవానికి ప్రజలకు సంభవించే కష్ట సుఖాల్లో వారి పాత్ర ఏమీ వుండదు. భౌతికంగా కూడా వారు ప్రజల మధ్య వుండరు. ఇలాంటి భయాన్ని కూడా 'ఉలమాలు' షిర్క్‌గా పరిగణించారు.

యిక దివ్య ఖురానులో అల్లాహ్ భయం కోసం ఉపయోగించిన రెండవ పదం 'ఖషియత్'ను గూర్చి తెలుసుకొందాం.

ఖషియత్ (భయం) అంటే - ఒకరి అధికారాలూ, శక్తి సామర్థ్యాలూ, జ్ఞానమూ, గొప్పదనముల గురించి తెలిసిన తర్వాత మనిషిలో వారి యెడల సహజంగా జనించే భయం.





"వాస్తవానికి అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే అల్లాహ్‌కు భయ పడతారు" *(ఫాతిర్ : 28)*

ఖషియత్‌ను గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మీరు వారికి భయపడకండి. నాకు భయపడండి." *(మాఇద : 3)*

ఖషియత్ విషయంలో కూడా ఖౌఫ్‌కు వర్తించిన షరతులే వర్తిస్తాయి.

*(షరియత్ కే తీన్ బునియాదీ ఉసూలో(కీ షరహ్ - సాలెహ్ ఉసైమీన్ - 68-75 పేజీలు)*

భయం గురించి, దాని వాస్తవికతను గురించి, దాని ద్వారా మనిషి ఎలా 'షిర్క్' అనే రొంపిలోకి నెట్టివేయబడతాడో తెలుసుకున్న తర్వాత ప్రస్తుత ముస్లిం సమాజం మీద ఒక్కసారి దృష్టి సారిస్తే దైవేతరులకు భయపడి వారిని ఆరాధించే ముస్లింలు మనకు చాలా మంది కనబడతారు. నమాజ్ స్థాపించకపోవడం వల్ల అల్లాహ్ మనల్ని శిక్షిస్తాడు అన్న భయం వారికి అంతగా వుండదు కానీ శవాల పండుగలు, గతకాలపు పుణ్యపురుషుల పేరుతో చేసే పండుగలు, ఫాతిహాలు ... గనక చేయలేకపోతే మాత్రం భయంతో నిలువెల్లా వణికిపోతారు. ఈ దైవేతరులకు గనక ఆగ్రహం తెప్పిస్తే మనకిక పుట్టగతులే వుండవు అని మనసులో తీవ్రంగా ఆందోళన చెందుతారు. వాస్తవానికి ఇది షిర్క్ అనీ, వారికీ మరియు యావత్ ప్రజానీకానికీ సంభవించే కష్ట సుఖాలకు దైవేతరులు ఎంత మాత్రమూ కారకులు కారనీ, అన్నింటికీ కారకుడు కేవలం నిజమైన సృష్టికర్త అయిన అల్లాహ్ యే అనీ వీరు గ్రహిస్తే ఎంత బాగుంటుందో!

## (2) ప్రేమ

ప్రేమ కూడా ఆరాధనే.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"కొందరు అల్లాహ్‌ను కాదని ఇతరులను ఆయనకు సమానులుగా, ప్రత్యర్థులుగా భావిస్తారు. వారు అల్లాహ్ పట్ల కలిగి వుండవలసిన ప్రేమతో వారిని ప్రేమిస్తారు. కానీ విశ్వాసులు అన్నిటికంటే అధికంగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు" *(బఖర : 165)*

ఇక్కడ ప్రేమ అంటే తల్లిదండ్రులూ, భార్యాపిల్లల మీద వుండే సహజ సిద్ధమైన ప్రేమ కాదు. సంపూర్ణమైన ప్రేమ. అంటే - అల్లాహ్‌ను నిజమైన సృష్టికర్తగా గుర్తించి, పూర్తిగా ఆయనకే విధేయత చూపడం వల్ల జనించే ప్రేమ. ఇలాంటి ప్రేమ కేవలం అల్లాహ్‌కే చెందాలి.

అల్లాహ్ యెడల సంపూర్ణమయిన ప్రేమ కలిగి వుండటం అనేది అతనికి పూర్తిగా విధేయత చూపడం ద్వారానే సాధ్యమవుతుంది.

దైవేతరుల కోసం ఇది 'షిర్క్' అవుతుంది.

అల్లాహ్‌కు విధేయత చూపడం అంటే అతని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపాలి.

"ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవానికి అల్లాహ్‌కు విధేయత చూపినట్లే" *(నిసా : 80)*

అదీగాక మరొక చోట అల్లాహ్ తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఇలా సెలవిచ్చాడు :

"ప్రవక్తా ! నీవు ప్రజలకు యిలా చెప్పు: మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ వుంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, కరుణించే వాడూను. వారితో ఇంకా - అల్లాహ్‌కూ ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ విధేయత చూపండి అని అను. ఒక వేళ వారు, నీ ఈ సందేశాన్ని స్వీకరించకపోతే, అల్లాహ్ తనకూ, తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపడానికి నిరాకరించిన వారిని ప్రేమించటం అనేది నిశ్చయంగా జరుగదు". *(ఆలి ఇమ్రాన్ : 31-32)*

అంటే అల్లాహ్ మీద మనకున్న ప్రేమ ఆమోద యోగ్యం కావాలంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అనుసరించడం, ఆయనకు విధేయత చూపడం తప్పనిసరి.

ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి తన జీవితాన్ని అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆదేశాలకు లోబడి గడుపుతూ, ధార్మిక ఆదేశాలను పాటించడంలో తనకూ, అల్లాహ్‌కూ మధ్య ఏ విధమైన





అడ్డు రాకుండా జాగ్రత్త పడగలిగినప్పుడే అల్లాహ్‌ను సంపూర్ణంగా ప్రేమించ గలుగుతాడు. ఆ ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదించ గలుగుతాడు. అలాకాక, ధార్మిక ఆదేశాలను పాటించడంలో అతనికీ, అల్లాహ్‌కూ మధ్య ఏదైనా అడ్డువస్తోం దంటే మాత్రం పరోక్షంగా అతను దానిని దేవుడిగా చేసేసి దాని ఆరాధన చేస్తున్న వాడయిపోతాడు. ఇలా ఏ వస్తువైనా గానీ, చివరికి అతని మనో వాంఛలైనా కానీ దేవుని రూపం దాల్చే అవకాశ ముంది.

ఈ విషయాన్నే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా నొక్కి చెప్పారు :

"దీనారు, దిర్హముల భక్తుడు నాశనమైపోయాడు"

*(సహీ బుఖారి : 2886, 2887)*

అల్లాహ్ కూడా దివ్య ఖురాన్‌లో ఇలా సెలవిచ్చాడు.

"తన మనోవాంఛలను దేవుడిగా చేసుకొన్న వ్యక్తి యొక్క స్థితిని ఎప్పుడైనా నీవు గమనించావా ...?" *(ఫుర్ఖాన్ : 43)*

యిక సహజ సిద్ధమయిన ప్రేమ అంటే మనిషికి తన తల్లి దండ్రుల, భార్యా పిల్లల, ఇతర బంధు మిత్రుల యెడల సహజంగా వుండే ప్రేమ. దీని మూలంగా మనిషిని తప్పుపట్టడానికి వీలుండదు. వాస్తవానికి వీరిని ప్రేమించడం కూడా అల్లాహ్‌కు విధేయత చూపడంలో ఒక భాగమే.

కానీ అల్లాహ్ యెడల వుండే ప్రేమ సంపూర్ణమయినది. కేవలం అతనికే చెందుతుంది. అలాంటి సంపూర్ణమైన ప్రేమను దైవేతరుల యెడల కలిగి వుండడం 'షిర్క్' అవుతుంది.

దివ్యఖురానులో ముష్రిక్కుల మనస్తత్వాన్ని అల్లాహ్ ఇలా చిత్రీకరించాడు.

"ఒక్క అల్లాహ్‌ను గురించి మాత్రమే ప్రస్తావించటం జరిగినప్పుడు, పరలోకం పట్ల విశ్వాసం లేని వారి హృదయాలు బాధ పడతాయి. ఆయనను తప్ప ఇతరులను గూర్చి ప్రస్తావించడం జరిగినప్పుడు, హటాత్తుగా వారి ముఖాలు సంతోషంతో వెలిగిపోతాయి". *(జుమర్ : 45)*

దురదృష్ట వశాత్తూ, సరిగ్గా ఇదే లక్షణం ఈ రోజు ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహంలో మనకు కానవస్తుంది. ఈ లక్షణం వారి వినాశానికి దారి తీస్తుంది అని వారు తెలుసుకుంటే ఎంత బాగుండేదో!

**(3) నమ్మకము**

ఎదుటి వాడి శక్తి సామర్థ్యాలూ, గుణగణాలు తెలిసిన తర్వాత అతని యెడల జనించే విశ్వాసమే 'నమ్మకము'. ఇది కూడా ఆరాధనే. నమ్మకం దాని సంపూర్ణ రూపంలో కేవలం అల్లాహ్‌కే చెందుతుంది. దైవేతరుల కోసం అది 'షిర్క్' అవుతుంది.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మీరు నిజంగానే ముస్లిములయితే అల్లాహ్‌పై నమ్మకం వుంచండి".

*(మా ఇద : 23)*

మరొక చోట యిలా అన్నాడు :

"అల్లాహ్‌ను నమ్ముకున్న వానికి అల్లాహ్ చాలు" *(తలాఖ్ : 3)*

అంతేగాక, తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సైతం ఇలా ఆదేశించాడు :

"ప్రవక్తా! వారితో ఇలా అను : "నాకు అల్లాహ్‌యే చాలు. ఆయన తప్ప ఆరాధ్యుడు ఎవ్వడూ లేడు. ఆయననే నేను నమ్ముకున్నాను. ఆయన మహత్తర మైన అధికార పీఠానికి (అర్ష్) ప్రభువు". *(తౌబా : 129)*

అయితే యిక్కడ ఓ ముఖ్య విషయం గమనించాల్సి వుంది.

అదేమిటంటే ఈ నమ్మకం అనేది ఒక షరతుకు లోబడి దైవేతరులకు కూడా ధర్మ సమ్మతం అవుతుంది.

అదెలా అంటే - నమ్మకం పెట్టుకొనే వ్యక్తిగానీ, వస్తువుగానీ ఏ విషయం లోనైతే తనపై నమ్మకం పెట్టుకొంటున్నారో దానిని పూర్తి చేయగలిగే సామర్థ్యం కలిగి వుండాలి. వాస్తవానికి ఆ సామర్థ్యాన్ని కూడా అల్లాహ్‌యే వారికి అనుగ్రహించి వుంటాడు.

ఉదాహరణకు : ఒక వ్యక్తి, కేవలం ఫలానా డాక్టరు నా జ్వరం తగ్గడానికి సరైన మందులివ్వగలడు లేక ఫలానా టీచరు నాకు సరైన విద్య నందించగలడు అని నమ్మకం పెట్టుకున్న కారణంగా ఆ వ్యక్తిని తప్పు పట్టడానికి వీలుండదు.





ఎందుకంటే ఆ వ్యక్తి నమ్మకముంచిన వాళ్ళు సహజంగానే అతని నమ్మకాన్ని పూర్తి చేసే సామర్థ్యం కలిగి వుంటారు.

యాఖూబ్ (అలైహిస్సలాం) తన కుమారులకు ఇలా ఆదేశించారు.

"కుమారులారా! వెళ్ళి యూసుఫ్‌ను గురించి, అతని సోదరుని గురించీ దర్యాప్తు చేయండి". *(యూసుఫ్ : 87)*

అంతేగాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా కూడా తన సహచరులలో కొంత మందిని జకాత్ నిధులు వసూలు చేయడానికి, వాటిని సంరక్షించడానికి నియమించారు.

ఇలాంటి నమ్మకం పెట్టుకొనే వ్యక్తిగానీ, వస్తువుగానీ, ఏ విషయంలోనైతే తమపై నమ్మకం పెట్టుకోబడిందో - దానిని పూర్తి చేయగలిగే సామర్థ్యం కలిగి వుండకపోతే - అలాంటి నమ్మకం నిషిద్ధమవుతుంది. కొన్ని సందర్భాలలో అది షిర్క్‌కు కూడా దారి తీస్తుంది.

ఉదాహరణకు : మానవ జీవితాల్లో సంభవించే కష్టనష్టాలు, బాధలు, అనారోగ్యాలు దూరం చేసే శక్తి సామర్థ్యాలు మరియు ధనం, సంతానం, ఆరోగ్యం లాంటి వరాలను ప్రసాదించే శక్తి సామర్థ్యాలు కలిగి వున్నారని దైవ ప్రవక్తల మీదా, గత కాలానికి చెందిన పుణ్య పురుషుల మీదా, సూఫీ మత గురువుల మీదా, చివరికి తావీజులూ, జ్యోతిష్యులూ, మాంత్రికుల మీదా నమ్మకం పెట్టు కుంటే అది నిస్సందేహంగా 'షిర్క్' అవుతుంది.

ఎందుకంటే పైన పేర్కొన్న పనులన్నిటినీ పూర్తి చేయగలిగే శక్తి సామర్థ్యాలు కేవలం అల్లాహ్‌కు మాత్రమే వున్నాయి. దైవేతరులెవరైనా సరే, వారి స్థానం ఎంత గొప్పదైనా సరే- పైన పేర్కొన్న కార్యాలను పూర్తి చేయగలిగే శక్తి సామర్థ్యాలు వారికి లేవు.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"ఆయనే నవ్విస్తున్నాడు, ఆయనే ఏడిపిస్తున్నాడు. ఆయనే మరణం యిచ్చాడు. ఆయనే జీవితం ప్రసాదించాడు. విడిచే ఒక బిందువు ద్వారా ఆడా మగల జంటను ఆయనే సృష్టించాడు. మరో జీవితాన్ని ప్రసాదించటం కూడా

ఆయన బాధ్యతే. సంపన్నునిగా చేసిందీ ఆయనే, ఆస్తిపాస్తులను ప్రసాదించిందీ ఆయనే". *(నజ్మ్ : 43-48)*

"ప్రజలు అల్లాహ్‌ను కాదని కల్పించుకున్నట్టి దేవుళ్లు ఏ వస్తువునూ సృష్టించలేరు, కానీ వారే సృష్టించబడతారు. వారు స్వయంగా తమ కొరకైనా ఏ లాభ నష్టాల అధికారాన్ని కలిగిలేరు. వారు చంపనూ లేరు, బ్రతికించనూ లేరు, మరణించిన వాణ్ణి మళ్ళీ లేపనూ లేరు." *(ఫుర్ఖాన్ : 3)*

అంతేకాక, స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఇలా ఆదేశించాడు :

"ఇలా నొక్కి చెప్పు : మీకు నష్టం కలిగించటం లేదా మేలు చెయ్యటం అనేది నా వశంలో లేదు. ఇలా చెప్పు- నన్ను అల్లాహ్ పట్టు నుండి ఎవ్వరూ కాపాడలేరు. నాకు ఆయన ఆశ్రయం తప్ప మరొక ఆశ్రయం కూడా లేదు". *(జిన్న్ : 21-22)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం : "మీ దగ్గరి బంధువులను హెచ్చరించు" (26:214) అన్న దైవ సూక్తి అవతరించినప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) లేచి నిలబడి ఇలా ప్రకటించారు. ఓ ఖురైష్ ప్రజలారా! మీ ప్రాణాలను (నరకాగ్ని నుండి) కాపాడు కోండి, నేను మిమ్మల్ని అల్లాహ్ శిక్ష నుండి ఏ విధంగానూ కాపాడలేను. ఓ అబ్దె మునాఫ్ సంతతి ప్రజలారా! నేను మిమ్మల్ని అల్లాహ్ పట్టు నుండి ఏ మాత్రం రక్షించలేను. ఓ అబ్బాస్ బిన్ ముత్తలిబ్ ! నేను మిమ్మల్ని అల్లాహ్ పట్టు నుండి ఏ మాత్రం కాపాడలేను. ఓ ప్రవక్త మేనత్త సఫియా! నేను అల్లాహ్ పట్టు నుండి నీకే మాత్రం సహాయపడలేను. ఓ నా చిట్టి తల్లి ఫాతిమా! నువ్వు కోరితే నా ఆస్తి పాస్తుల నుండి ఏమైనా తీసుకో. కానీ అల్లాహ్ పట్టు నుండి మాత్రం నీకే విధంగానూ నేను సహాయ పడలేను". *(సహీ బుఖారి : 4771)*

మరి స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కే ఇలాంటి శక్తి సామర్థ్యాలు లేనప్పుడు ఇతరులను ఆ శక్తి సామర్థ్యాలు కలవారుగా భావించి వారి మీద నమ్మకం పెట్టుకోవడం వట్టి మూర్ఖత్వం కాకపోతే మరింకేమవుతుందో చెప్పండి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధర్మంలో ఇలాంటి నమ్మకాలకు ఏ విధమైన స్థానం లేదు.





యింకా కొందరు తావీజులు, శకునాలు, జ్యోతిష్యమూ, నక్షత్రాలూ, గ్రహాల ప్రభావం మీద నమ్మకాలు కలిగి వుంటారు. వీటి వాస్తవికతను గూర్చి కూడా విపులంగా తెలుసుకుందాం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తావీజులూ, మంత్రించి ఊదడం గురించి ఇలా ఉద్బోధించారు :

"తావీజు వ్రేలాడ దీసే వ్యక్తి కోరికను అల్లాహ్ నెరవేర్చకుండుగాక! మరియు రక్షరేకులు వగైరా... వ్రేలాడ దీసే వ్యక్తికి అల్లాహ్ స్వస్థత నీయ కుండుగాక!" *(ముస్నద్ అహ్మద్)*

"ఎవరైతే తావీజును వ్రేలాడ దీశారో వారు షిర్క్ చేశారు". *(ముస్నద్ అహ్మద్)*

"మంత్రించడం, తావీజు వ్రేలాడ దీయడం, తోలా (ఒక రకపు మంత్ర విద్య)- యివన్నీ బహుదైవారాధన (షిర్క్) పనులే." *(అబూదావూద్ : 3883)*

"బహుదైవారాధన (షిర్క్) పదజాలం లేకుండా మంత్రించడం ధర్మ సమ్మతమే". *(అబూదావూద్ : 3886)*

దివ్యఖురాన్ ఆయతులు వాడకుండా తయారు చేయబడిన తావీజులూ- అవి ఎముకలు, రక్షరేకులు, దారములు, జంతువుల వెంట్రుకలు లాంటి ఏ రూపంలో వున్నా సరే, పూర్తిగా నిషేధించబడినవి.

అయితే దివ్యఖురాను ఆయతులు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ప్రవచింపబడ్డ ప్రామాణిక దుఆ ల ద్వారా తయారు చేయబడిన తావీజులు మాత్రం ధర్మ సమ్మతమే అని కొందరు తల పోస్తూ వుంటారు. కానీ ఇవి కూడా నిషిద్ధమే.

కారణం - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మంత్రించి ఊదడం విషయంలో అయితే, ధర్మ సమ్మత పదజాలం మరియు ధర్మ సమ్మతం కాని షిర్క్ పదజాలం అని రెండుగా విశ్లేషించి ఒకదానిని ధర్మ సమ్మతమనీ మరొకదాన్ని నిషిద్ధమని పేర్కొన్నారు.

కానీ తావీజుల విషయంలో అలా విశ్లేషించి దేనినైనా ధర్మ సమ్మతం

చేసినట్లు ఎక్కడా ఆధారాలు లభించవు. అందుకే తావీజులను గురించిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశం అన్ని రకాల తావీజులకు వర్తిస్తుంది. అదీగాక స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా తన జీవితంలో ఎప్పుడైనా ఖురాన్ ఆయతుల తావీజు ధరించినట్లు ఎక్కడా ఆధారాలు దొరకవు.

ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే - ఖురాను ఆయతుల తావీజు ధరించిన వ్యక్తి అన్ని సమయాల్లో పరిశుద్ధంగా వుంటాడన్న గ్యారంటీ లేదు. అంతే కాక, ఇలాంటి తావీజులు ధరించి అతను మల మూత్రశాలలకు కూడా వెళుతూ వుంటాడు. యిలా చేయడం అల్లాహ్ గ్రంథాన్ని అగౌరవ పరచడమే అవుతుంది.

అల్లాహ్ గ్రంథాన్ని అగౌరవ పరచే హక్కు ఎవరికీ లేదు.

పై విషయాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల తావీజులకు దూరంగా వుండడమే ఉత్తమం. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేర్కొన్నట్లు కేవలం ఖురాను ఆయతులు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసుల ద్వారా లభ్యమయ్యే దుఆలతో మంత్రించు కుంటే సరిపోతుంది. స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా దీనినే పాటించేవారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనారోగ్యంతో వున్నప్పుడు ముఅవ్విజాత్ (113, 114 వ సూరాలు) పఠించి తనపై ఊదుకొనేవారు. ఆయన అనారోగ్యం మరింత ఎక్కువైనప్పుడు నేను ముఅవ్విజాత్‌లను పఠించి ఆయనపై ఊదేదాన్ని. తదుపరి ఆయన చేతులతో తన శరీరాన్ని శుభం కోసం నిమిరే దాన్ని".

*(సహీ ముస్లిం - కితాబుస్సలామ్, బాబ్ : ఇస్తెహ్‌బాబి రుకియతిల్ మరీజ్)*

## శకునాలు

ఈ దురాచారం ముస్లిమేతర సమాజాల ద్వారా ముస్లిం సమాజంలోకి ప్రవేశించింది. ఈ రోజు ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహం యీ దురాచారంలో యిరుక్కుపోయి వుంది. అజ్ఞాన కాలంలో అరబ్బులలో కూడా ఈ





దురాచారం వుండేది. ఏ ప్రదేశానికయినా ప్రయాణం చేయాలని సంకల్పించు కున్న వ్యక్తి ఒక పక్షిని పైకి ఎగురవేసే వాడు. అది గనక కుడివైపునకు ఎగిరిపోతే, దాన్ని మంచి శకునంగా భావించి తన ప్రయాణాన్ని యథావిధిగా కొనసాగించే వాడు. ఒక వేళ ఆ పక్షి ఎడమ వైపునకు ఎగిరి పోతే దాన్ని దుశ్శకునంగా భావించి తన ప్రయాణాన్ని వాయిదా వేసేవాడు.

ఈనాడు ముస్లిం సమాజంలో కూడా ఇలాంటి దురాచారాలు కనిపిస్తూ వుంటాయి. 'సఫర్' నెలను దుశ్శకునంగా భావించి ఆ నెలలో వివాహాలు చేయకపోవడం, ప్రతి నెలలో కొన్ని ప్రత్యేక దినాలను దుశ్శకునంగా భావించి ఆ రోజుల్లో శుభకార్యాలూ, క్రొత్త పనులు ఏవీ చేయక పోవడం, ఏదైనా కార్యం నిమిత్తం బయలుదేరుతుండగా, పిల్లిగానీ, వికలాంగుడు కానీ ఎదురొస్తే తన ప్రయాణాన్ని వాయిదా వేయడం .. లాంటివి మనం చూస్తూనే వున్నాం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో దుశ్శకునాలకు ఏ విధమైన పాత్ర లేదు.

యిక దుశ్శకునాలను గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన ఆజ్ఞలు తెలుసు కొందాం.

"దుశ్శకునం పాటించడం షిర్క్, దుశ్శకునం పాటించడం షిర్క్, దుశ్శకునం పాటించడం షిర్క్". *(అబూదావూద్ : 3910)*

"ఒకరికి మరొకరి వ్యాధి తగలడంలో, దుశ్శకునంలో ఎలాంటి వాస్తవం లేదు. అయితే మంచి శకునం (ఫాల్) అంటే నాకిష్టమే. మంచి శకునమంటే మంచి మాట అన్నమాట". *(అబూదావూద్ : 3916)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దుశ్శకునాలను పాటించడం షిర్క్ అని సెలవిచ్చిన కారణంగా ఈ దురాచారం అల్లాహ్ దృష్టిలో ఎంత ఘోరమైన పాపమో అర్థమవుతోంది. కాబట్టి అల్లాహ్ సంతోషం పొందగోరే వారు దుశ్శకునాలు పాటించడం నుండి దూరంగా వుండాలి.

## జ్యోతిష్యము - జ్యోతిష్యులు

ఈ దురాచారం కూడా నేటి ముస్లిం సమాజంలో బాగా ప్రబలి వుంది.

స్వల్ప మూల్యానికి తావీజులు కూడా యివ్వబడుతున్నాయి, జ్యోతిష్యాలూ చెప్పబడుతున్నాయి. గురు, ఆదివారాల్లో జ్యోతిష్యుల ఇండ్ల ముందు పండగ వాతావరణం కనిపిస్తూ వుంటుంది. రెడీమేడ్ ఫుడ్ మరియు ఫాస్ట్ ఫుడ్‌లకు అలవాటు పడిన వాళ్ళలాగ ఎంతో మంది అమాయకులు తమ దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం గంపెడంత ఆశతో వీరిని ఆశ్రయిస్తుంటారు. భవిష్యత్తును గూర్చిన జ్ఞానం వీరికి వుందని, తమ సమస్యలను పరిష్కరించగల శక్తి సామర్థ్యాలు వీరికి వున్నాయని గట్టిగా నమ్మి తమ సంపాదనను వీరికి ధారపోస్తూ వుంటారు.

వాస్తవానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మానికీ, జ్యోతిష్యానికీ దూరపు సంబంధం కూడా లేదు.

దివ్యఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అగోచరాల తాళం చెవులు ఆయన వద్దనే వున్నాయి. వాటిని ఆయన తప్ప ఎవరూ ఎరుగరు." *(అన్ఆమ్ : 59)*

"ఆకాశాలలోనూ, భూమిలోనూ అల్లాహ్ తప్ప అగోచర జ్ఞానం కలవాడు మరెవ్వడూ లేడు". *(నమ్ల్ : 65)*

అంతేకాక, స్వయాన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

"వారితో ఇలా అను : నాకు సంబంధించిన లాభ నష్టాలపై నాకు ఏ అధికారమూ లేదు. కేవలం అల్లాహ్ కోరింది మాత్రమే అవుతుంది. నాకే గనక అగోచర విషయజ్ఞానం వున్నట్లయితే, నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది వుండే వాణ్ణి. నాకు ఎన్నటికీ ఏ నష్టమూ వాటిల్లేది కాదు. నేను నా మాటను నమ్మే వారి కొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే. శుభవార్త వినిపించే వాణ్ణి మాత్రమే." *(ఆరాఫ్ : 188)*

మరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కే అగోచర విషయజ్ఞానం లేనప్పుడు ఒక జ్యోతిష్యునిలో ఆ జ్ఞానం వుందని నమ్మడం ఎంత వరకు సమంజసం?

జ్యోతిష్య జ్ఞానము, జ్యోతిష్యులను గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు





అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు.

"ఎవడైతే జ్యోతిష్యంలో కొంత జ్ఞానాన్ని అర్జించాడో వాడు తాంత్రిక విద్యలో కొంత భాగాన్ని అర్జించాడన్న మాట. యిక అతను ఆ జ్ఞానాన్ని ఎంత పెంచు కుంటే, అంత పాపాన్ని మూటగట్టుకుంటాడు". *(అబూదావూద్ : 3905)*

"ఎవరైతే జ్యోతిష్యుని దగ్గరికెళ్ళి అతను చెప్పిన దాన్ని నమ్ముతారో వారు మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అవతరించిన ధర్మంతో సంబంధం లేని వారయి పోతారు." *(అబూదావూద్: 3904)*

"ఎవరైతే జ్యోతిష్యుని వద్దకెళ్ళి, అతణ్ణి ఏ విషయంలోనైనా ప్రశ్నిస్తే అతని నమాజు 40 రోజుల వరకు స్వీకరించబడదు."

*(సహీ ముస్లిం - కితాబుస్సలామ్, బాబ్ : తహ్రీమిల్ కహానతి వ ఈతానిల్ కుహ్హాని)*

"ముఆవియా బిన్ హకం సల్మి (రజి అల్లాహు అన్హు) కథనం: "నేనొక రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో ఓ దైవ ప్రవక్తా ! మేము అజ్ఞాన కాలంలో కొన్ని పనులు చేసేవాళ్ళం. మేము జ్యోతిష్యుల వద్దకు వెళుతూ వుండేవాళ్ళం అని విన్న వించుకున్నాను. దానికాయన - 'యిక వారి వద్దకు వెళ్ళకండి' అని సెలవిచ్చారు. తదుపరి నేను - 'మేము దుశ్శకునాలను పాటించే వాళ్ళం' అని అన్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ - మీ మనసులో ఇలాంటి భావన వస్తూనే వుంటుంది. కానీ దీని కారణంగా మీరు ఏ పనినీ వదిలి పెట్టకండి" అని హితవు చేశారు.

*(ముస్లిం- కితాబుస్సలామ్, బాబ్ : తహ్రీమిల్ కహానతి వ ఈతానిల్ కుహ్హాని)*

పైన పేర్కొన్న రుజువుల ద్వారా జ్యోతిష్యము ఎంత పెద్ద పాపమో జ్యోతి ష్యుల వద్దకు వెళ్ళడం ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మాన్ని అనుసరించి ఇహపర లోకాల్లోని సౌఖ్యాలను పొందగోరే వారు ఇలాంటి పాపాలకు దూరంగా వుండాలి.

అలాగే తాంత్రిక విద్య నర్జించడం, చేతబడి చేయడం కూడా పూర్తిగా నిషేధించబడినవి. వీటి వల్ల నష్టమే తప్ప ప్రయోజనమేమీ వుండదు.

"వారు నేర్చుకున్నది (తాంత్రిక విద్య) వారికి నష్టం కలిగించేదే కాని లాభం కలిగించేది ఎంత మాత్రం కాదు." *(బఖర : 102)*

"మాంత్రికుడు ఎన్నడూ సఫలుడు కాలేడు, వాడు ఎంత నేర్పరి అయినా సరే" *(తాహా : 69)*

ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రభోదించారు : ఎవరైతే దుశ్శకునం పాటించారో లేదా ఎవరి కోసమైతే దుశ్శకునం పాటించబడిందో, ఎవరైతే జ్యోతిష్యం చెప్పారో లేదా ఎవరి కొరకైతే జ్యోతిష్యం చెప్పబడిందో - వారు మాలోని వారు కారు. (అంటే ముస్లింలే కారు).

హదీసు ఉల్లేఖకుని కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - 'ఎవరైతే చేతబడి చేశారో లేదా ఎవరికొరకైతే చేతబడి చేయబడిందో' - అని కూడా పలికారని నా అనుమానం. *(తబ్రాని)*

యిక సృష్టి వ్యవహారాల్లో నక్షత్రాల ప్రభావం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన వివరణను తెలుసుకుందాం.

జైద్ బిన్ ఖాలిద్ జుహ్నీ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో కలిసి హుదైబియా ప్రాంతంలో ఉదయం నమాజు చేశారు. రాత్రి వర్షం కురిసి ఉదయం వరకు నేల తడిగానే వుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజు ముగిసిన తర్వాత సహచరుల వైపునకు తిరిగి, అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో మీకు తెలుసా? అని అడిగారు. దానికి సహచరులు "అల్లాహ్‌కూ ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ బాగా తెలుసు" అని పలికారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివరిస్తూ : అల్లాహ్ ఇలా అన్నాడు : ఈ రోజు ఉదయం నా దాసులలో కొందరు విశ్వాసులయిపోతే మరికొందరు అవిశ్వాసులయిపోయారు. అల్లాహ్ దయవల్ల మనకు వర్షం కురిసింది అని అన్నవారు తారా బలాన్ని నిరాకరించి, నన్ను విశ్వసించిన వారయ్యారు. దీనికి భిన్నంగా ఫలానా నక్షత్ర ప్రభావంతో వర్షం కురిసిందని అన్నవారు నక్షత్ర విశ్వాసులయి నన్ను తిరస్కరించిన వారయ్యారు.

*(ముస్లిం - కితాబుల్ ఈమాన్, బాబ్ : తస్మియతిల్ అబ్దిల్ ఆబికి కాఫిరన్)*





యివన్నీ నమ్మకానికి సంబంధించిన వాస్తవాలు. అల్లాహ్ ఆరాధనల్లో నమ్మకానికి ఎంత ప్రాముఖ్యత వుందో మనకు వీటి ద్వారా అర్థమవుతుంది. దైవేతరులను నమ్మడం వల్ల వాటిల్లే నష్టాలు కూడా తెలిసాయి. అందుకే మనం అల్లాహ్ పైనే సంపూర్ణంగా నమ్మకం కలిగి వుండాలి. అప్పుడే మన ఆచరణలు అల్లాహ్ వద్ద స్వీకార యోగ్యమవుతాయని ఆశించవచ్చు.

**(4) ఆశ**

ఇది కూడా ఆరాధనే.

వాస్తవానికి సమస్త ఆరాధనలూ - ప్రేమ, భయం, ఆశ అనే మూడు మౌలికాంశాలపై ఆధారపడి వున్నాయి.

ప్రేమ అనేది వినమ్రతతో పాటు ఏర్పడగా, భయం అనేది ఆశతో పాటు ఏర్పడుతుంది. అందువల్ల అల్లాహ్‌ను ఆరాధించడంలో ఈ మూడు అంశాలను తప్పనిసరిగా పాటించవలసి వుంటుంది.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్ వారిని ప్రేమిస్తాడు, వారు అల్లాహ్‌ను ప్రేమిస్తారు". *(మా ఇద : 54)*

"కానీ విశ్వాసులు అన్నిటికంటే ఎక్కువగా అల్లాహ్‌నే ప్రేమిస్తారు". *(బఖర : 165)*

యింకా తన ప్రవక్తల వృత్తాంతాలను వివరిస్తూ యిలా తెలియజేశాడు.

"వారు మంచి పనుల కోసం ఎక్కువగా శ్రమించేవారు. ఆశతోనూ, భయంతోనూ మమ్మల్ని ప్రార్థించేవారు, మా సమక్షంలో వినమ్రులై వుండేవారు". *(అంబియా : 90)*

"వారు భయంతోనూ, ఆశతోనూ తమ ప్రభువును వేడుకుంటారు". *(సజ్దా : 16)*

ఆరాధనల్లో పైన పేర్కొన్న మూడు అంశాలలో ఏ ఒక్కటి లోపించినా అది సంపూర్ణ ఆరాధన అనబడదు. అందుకే ఈ మూడు విషయాల గురించి తగు జాగ్రత్త వహించవలసి వుంటుంది.

# నోటి ఆరాధనలు

హృదయారాధనలను గురించి వివరంగా తెలుసుకున్నాక యిక నోటి ఆరాధనలలోకి వద్దాం. వీటిలో ముఖ్యమైనవి :

1) ప్రార్థన, సహాయాన్ని అర్థించడం, శరణు కోరడం

2) ధ్యానము (జిక్ర్) మరియు దివ్యఖురాన్ పారాయణం

3) ప్రశంసించడం

4) కృతజ్ఞతలు తెలపడం

**(1) ప్రార్థన (దుఆ), సహాయాన్ని అర్థించడం, శరణుకోరడం :**

ఈ మూడు కార్యాలూ మనిషి చేసే ఆరాధనల్లో చాలా ముఖ్యమైన ఆరాధనలు. ఈ మూడు కూడా కొన్ని ప్రత్యేక షరతులకు లోబడి దైవేతరుల విషయంలో ధర్మ సమ్మతమైనప్పటికీ, వాటి సంపూర్ణ రూపంలో మాత్రం కేవలం అల్లాహ్‌కే చెందిన హక్కులు.

ప్రార్థనను గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నీ ప్రభువు ఇలా అంటున్నాడు : నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను అంగీకరిస్తాను. గర్వానికి లోనై నా ఆరాధనకు విముఖులయ్యేవారు తప్పనిసరిగా అవమానానికీ, పరాభవానికీ గురై నరకంలో ప్రవేశిస్తారు". *(మూమిన్ : 60)*

"మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ ప్రార్థించకండి." *(జిన్న్ : 18)*

నోమాన్ బిన్ బషీర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "దుఆ (ప్రార్థన) కూడా ఆరాధనే అని తదుపరి దివ్య ఖురానులోని "మీ ప్రభువు ఇలా అంటున్నాడు :





నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను స్వీకరిస్తాను" (40 : 60) అన్న సూక్తిని పఠించారు. *(అబూదావూద్ : 1479)*

పై ఆధారాల ద్వారా దుఆ ఆరాధన అని తేలిపోయింది. మరి ఆరాధన అనేది ప్రత్యేకంగా అల్లాహ్‌కే చెందిన హక్కు కాబట్టి 'దుఆ' కూడా అల్లాహ్‌కే చెందాలి. దైవేతరుల కోసం అది షిర్క్ అవుతుంది.

అయితే, కొన్ని ప్రత్యేక షరతులకు లోబడి దైవేతరులను వేడుకోవడం కూడా ధర్మ సమ్మతమవుతుంది. ఆ షరతులు ఇవి :

1) ఎవరినైతే వేడుకుంటున్నారో అతను బ్రతికి వుండడమే కాకుండా వారి మాటలను వినగలిగే లేదా కనీసం అర్థం చేసుకోగలిగే స్థితిలో వుండాలి.

2) ఏ విషయం నిమిత్తం వేడుకుంటున్నారో - దానిని పూర్తి చేయగల శక్తి సామర్థ్యాలు కలిగి వుండాలి.

ఉదాహరణకు : మనిషి తన ఇంట్లో ఎవరినైనా 'కాస్త నీళ్ల త్రాగించండి' అని వేడుకోవడము.

దీని మూలంగా అతణ్ణి తప్పు పట్టడానికి వీలుండదు.

కానీ, ఆ నీళ్ళనే లేదా అల్లాహ్ ఒక్కడే తీర్చగల విషయాలను గురించి దైవేతరుల సమాధుల వద్ద (వారు ప్రజల దృష్టిలో ఎంత గొప్ప వారైనా సరే) ప్రార్థిస్తే నిస్సందేహంగా అది షిర్క్ అవుతుంది.

ఎందుకంటే ఆ దైవేతరుడు వారి మధ్య బ్రతికి లేడు సరికదా కనీసం వారి ప్రార్థనను కూడా వినే స్థితిలో లేడు. అంతేకాక వారి అవసరాన్ని తీర్చగలిగే శక్తి సామర్థ్యాలను కూడా కలిగి లేడు.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్‌ను కాదని, ప్రళయం వచ్చేవరకు అతనికి సమాధానమయినా ఇవ్వలేనివారిని, మొరపెట్టుకుంటున్నవారు తమను మొరపెట్టుకుంటున్నారనే విషయం కూడా ఎరుగని వారిని వేడుకొనే వాడికంటే పరమ భ్రష్టుడయిన మానవుడు ఎవడు వుంటాడు? (ప్రళయం రోజు) మానవులందరినీ సమావేశ పరచినప్పుడు, వారు తమను వేడుకున్న వారికి విరోధులై పోతారు, వారి ఆరాధనను తిరస్కరిస్తారు." *(అహ్ఖాఫ్ : 5-6)*

యిక సహాయాన్ని అర్థించడం విషయానికొస్తే ఇది కూడా దీని సంపూర్ణ రూపంలో అల్లాహ్‌కే చెందిన హక్కు. అంటే మనిషి తన నిస్సహాయతను దృష్టిలో పెట్టుకొని కేవలం అల్లాహ్‌నే తన సమస్త అవసరాలను తీర్చే వాడుగా నమ్మి సహాయం కోసం కేవలం అల్లాహ్‌నే అర్థించడానికి సిద్ధపడాలి.

అల్లాహ్ విషయంలో ముస్లిముల ప్రార్థన యిలా వుండాలి.

"మేము నిన్నే ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము"

*(ఫాతిహ : 4)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ వచనాలు సదా గుర్తు పెట్టుకో అని ఉపదేశించారు :

"ఏదైనా వేడుకోవాలంటే కేవలం అల్లాహ్‌నే వేడుకో, సహాయం కావాలంటే అల్లాహ్ సహాయాన్నే అర్థించు" *(తిర్మిజి - అబ్వాబుల్ సిఫతుల్ ఖియామహ్)*

దైవేతరుల ద్వారా సహాయాన్ని అర్థించడాన్ని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

1) తమకు అవసరమైన విషయంలో సహాయం చేయగలిగే శక్తి సామర్థ్యాలు కలిగి వున్న వ్యక్తిని సహాయం కొరకు అర్థించడం - ఇది ధర్మ సమ్మతమే. అయితే సహాయం అర్థించబడే కార్యం ధర్మ సమ్మతమైనదా, కాదా అన్న విషయాన్ని ముందు పరిగణలోనికి తీసుకోవలసి వుంటుంది. ఎందుకంటే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మంచికి, దైవ భక్తికి సంబంధించిన పనులలో అందరితో సహకరించండి. పాప కార్యాలలో, అత్యాచారాలలో ఎవరితోనూ సహకరించకండి".

*(మాఇద : 2)*

2) స్వయంగా తమ కళ్ళ యెదుట జీవించి వున్నప్పటికీ మన అవసరాన్ని తీర్చగలిగే శక్తి సామర్థ్యాలు కలిగిలేని వారితో సహాయాన్ని అర్థించడం - ఇది ఒక నిష్ప్రయోజనమైన చర్య.

ఉదాహరణకు : ఒక పిల్లవాణ్ణి, చాలా బరువుగా వున్న ఒక వస్తువును ఎత్తడానికి సహాయాన్ని అర్థించడం వృథాయే అవుతుంది.





3) సమాధులలో ఖననమై వున్న వారిని, మన మధ్య భౌతికంగా లేకుండా మన అవసరాన్ని సైతం తీర్చ గల శక్తి సామర్థ్యాలు లేనివారిని, వారు జీవించి వున్నప్పటికీ సహాయం కొరకు అర్థించడం - ఇది నిస్సందేహంగా షిర్క్ అవుతుంది. ఎందుకంటే ఈ పనిని చేసేవాడు అర్థించబడే వారికి మానవాతీత శక్తులున్నాయని నమ్ముతాడు. అంటే కేవలం అల్లాహ్‌కే చెందిన శక్తి సామర్థ్యాలను దైవేతరులకు ఆపాదిస్తాడు.

## శరణుకోరడం :

ఇది కూడా ఆరాధనే. అందుకే ఇది కూడా దీని సంపూర్ణ రూపంలో కేవలం అల్లాహ్‌కే చెందాలి.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఇలా అను : నేను ఉదయం ప్రభువు శరణు కోరుతున్నాను".

*(ఫలఖ్ : 1)*

"ఇలా అను : నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్య దైవం (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను". *(నాస్ : 1-3)*

అల్లాహ్‌ను శరణు కోరడం అంటే తమ నిస్సహాయతను దృష్టిలో పెట్టుకొని తమకు ప్రస్తుతం కలుగుతున్న కష్ట నష్టాలను, రాబోయే కష్ట నష్టాలను సంపూర్ణంగా తీర్చడంలో అల్లాహ్‌ను పరిపూర్ణుడిగా నమ్మి కోరే శరణు అన్నమాట. అయితే అల్లాహ్ యొక్క పరిపూర్ణ సద్వచనాల ద్వారా, ఆయన పరువు ప్రతిష్టలు, అధికారాలు, ఆయనకు గల పేర్ల ద్వారా శరణు కోరడం కూడా అల్లాహ్ శరణు కోరడమే అవుతుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉస్మాన్ బిన్ అబుల్ ఆస్ (రజి అల్లాహూ అన్హు) కు ఈ విధంగా ప్రార్థించమని ఉపదేశించారు :

"నేను అల్లాహ్‌ను, ఆయన అధికారాన్ని సాధనంగా చేసుకొని నాకు కలిగిన లేదా కలుగుతుందేమోనన్న భయమున్న వ్యాధి నుండి శరణు వేడుతున్నాను."

*(సహీ ముస్లిం - కితాబుస్సలామ్, బాబ్ : తఅవ్వుజి మిన్ షైతానిల్ వస్‌వసతి ఫిస్సలాతి)*

ఇంకో వ్యక్తిని ఇలా ప్రార్థించమని ఆదేశించారు :

"నేను అల్లాహ్ సృష్టితాల కీడు నుండి ఆయన పరిపూర్ణ సద్వచనాల శరణు వేడుతున్నాను".

*(సహీ ముస్లిం- కితాబుజ్జిక్రి వద్దుఆయి వత్తౌబా వల్ ఇస్తెగ్‌ఫారి, బాబ్ : దావాతి వత్తఅవ్వుజి)*

యిక ఈ శరణు పొందడమనేది ఒక షరతుకు లోబడి దైవేతరుల విషయంలో కూడా ధర్మ సమ్మతమవుతుంది. అదేమిటంటే ఆ దైవేతరులు శరణు పొందగోరే వారికి శరణు యివ్వగలిగే స్థితిలో వుండాలి.

ఉదాహరణకు : తమకు జరగబోయే అపాయాన్ని ముందుగా ఊహించి ఏదైనా ఇంటి ద్వారా, వ్యక్తుల ద్వారా శరణు పొందడం. ఈ స్థితిలో మనిషి పాపాత్ముడు కాజాలడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రళయానికి ముందు రాబోయే ఉపద్రవాల గురించి చెబుతూ యిలా సెలవిచ్చారు :

"ఎవరైతే వాటిలో పడాలనుకుంటాడో అవి అతణ్ణి తమలో కలుపుకుంటాయి. అందుకే ఎవరికి ఏ శరణు దొరికినా దాని శరణు తీసుకోండి".

*(సహీ ముస్లిం)*

మరి శరణు పొందడమనేది మృతులతో గానీ, బ్రతికి వున్నప్పటికీ ప్రస్తుతం వారి దగ్గర లేని వారితో గానీ జరిగితే అది నిస్సందేహంగా షిర్క్ అవుతుంది. ఎందుకంటే వీరిద్దరు కూడా శరణు కోరే వారికి శరణు యివ్వగలిగే స్థితిలో లేరు కాబట్టి.

## వసీలా

యిక 'వసీలా' ను గురించి, దాని వాస్తవికతను గురించి తెలుసు కొందాము.

'వసీలా' అంటే ధార్మిక దృష్టిలో - అల్లాహ్ వద్ద తన ప్రార్థనలు స్వీకరించ బడటానికి, ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి మనిషి ఉపయోగించే సాధన మన్నమాట.





స్వర్గంలోని ఉన్నతమైన స్థానాన్ని కూడా 'వసీలా' అని అంటారు. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు.

తాను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇలా చెబుతుండగా విన్నానని అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు : ముఅజ్జిన్ అజాన్ పలికేటప్పుడు మీరు కూడా ముఅజ్జిన్ పలికే పలుకులను ఉచ్చరించండి. తదుపరి నాపై దరూద్ పఠించండి. ఎందుకంటే, ఎవరైతే నాపై ఒకసారి దరూద్ పఠిస్తాడో అల్లాహ్ అతనికి పది పుణ్యాలు ప్రసాదిస్తాడు. తర్వాత నాకు 'వసీలా'ను ప్రార్థించండి. వాస్తవానికి 'వసీలా' అనేది స్వర్గంలోని ఉన్నతమైన స్థానం. అది అల్లాహ్ దాసుల్లో కేవలం ఒకరికి మాత్రమే ప్రాప్తమవుతుంది. ఆ దాసుణ్ణి నేనే అవుతానని నేను ఆశిస్తున్నాను. ఎవరైతే నాకోసం 'వసీలా' ను ప్రార్థిస్తారో (అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు 'వసీలా' స్థానం ప్రసాదించమని అల్లాహ్‌ను ప్రార్థిస్తారో) వారి కొరకు నా 'సిఫారిష్' తప్పనిసరి అయిపోతుంది.

*(సహీ ముస్లిం : కితాబుస్సలాత్, బాబ్ : ఇస్తెహ్‌బాబిల్ ఖౌలిమిస్‌ల ఖౌలిల్ ముఅజ్జిని)*

యిక మనిషి ఉపయోగించే 'వసీలా' లోకి వద్దాం.

వాస్తవానికి అల్లాహ్‌ను వేడుకోవడానికి 'వసీలా' అనేది తప్పనిసరి అన్న షరతు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) షరియత్తులో ఎక్కడా దొరకదు. 'వసీలా' అనేది కేవలం ప్రార్థన ప్రభావాన్ని పెంచడానికి సహాయ పడుతుంది. అంతే కాని, వసీలా లేకుండా చేసే ప్రార్థన అసలు స్వీకరించబడదు, వసీలా లేకుండా అల్లాహ్‌ను నేరుగా వేడుకో కూడదు ... అని కొందరు చేసే వాదనకు ఋజువు ఎక్కడా దొరకదు.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నా దాసులు నన్ను గురించి నిన్ను అడిగితే, నేను వారికి అత్యంత సమీపంలో ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను పిలిచినపుడు నేను అతని పిలుపును వింటాను, సమాధానం పలుకుతాను అని ఓ ప్రవక్తా! నీవు వారికి తెలుపు".

*(బఖర : 186)*

ఇంకో చోట ఇలా సెలవిచ్చాడు :

"విశ్వాసులారా ! అల్లాహ్‌కు భయపడండి. ఆయన సాన్నిధ్యానికి చేరే మార్గాన్ని (వసీలా) అన్వేశించండి. ఆయన మార్గంలో నిరంతరం కృషి (జిహాద్) చేయండి. బహుశా మీకు సాఫల్య భాగ్యం లభించవచ్చు". *(మాఇద : 35)*

ఈ రెండు ఆయతుల ద్వారా 'అల్లాహ్'ను నేరుగా వేడుకోవచ్చనీ, అయితే వసీలా ఉపయోగించి వేడుకోవడం ఉత్తమం అనీ తెలుస్తోంది.

దివ్యఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే మొత్తం మూడు రకాల వసీలాలు ధర్మ సమ్మతమని తెలుస్తాయి. వాటి వివరాలు ఇవి :

### (1) అల్లాహ్ యొక్క పేర్లు, గుణగణాల ద్వారా అతణ్ణి వేడుకోవడం

"అల్లాహ్ మంచి పేర్లకు అర్హుడు. ఆయనను మంచి పేర్లతోనే వేడుకోండి.
*(ఆరాఫ్ : 180)*

బురైదా అస్లమీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక వ్యక్తి ఈ విధంగా ప్రార్థిస్తుండగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విన్నారు :

"ఓ అల్లాహ్! నీవే దేవుడవనీ, నీవు తప్ప మరొక ఆరాధ్యుడు లేడనీ, నీవు ఒక్కడివేననీ, నిరపేక్షాపరుడవనీ, నీది సంతానానికి అతీతమైన అస్తిత్వమనీ, నీవు కూడా ఎవరి సంతానం కాదనీ, నీకు సాటి రాగలవారు ఎవరూ లేరనీ, నేను సాక్ష్యమిచ్చి నిన్ను అభ్యర్థిస్తున్నాను".

ఈ ప్రార్థన విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా పలికారు : ఎవరి చేతుల్లో నా ప్రాణం వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షి! ఇతను అల్లాహ్ యొక్క మహోన్నత నామాన్ని సాధనంగా చేసుకొని ప్రార్థించాడు. దాన్ని సాధనంగా చేసుకొని ప్రార్థిస్తే ప్రార్థన స్వీకరించబడుతుంది. ఇంకా దాన్ని సాధనంగా చేసుకొని అర్థిస్తే ప్రసాదించడం జరుగుతుంది.

*(తిర్మిజి - అబ్‌వాబుద్దుఆత్, బాబ్ : మాజా అఫిజామె యిద్దావాతి అన్ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం))*





అనస్ (రజి అల్లాహు అన్హు) ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు ఏదైనా ఆపద వస్తే ఇలా ప్రార్థించేవారు :

"ఓ సజీవుడా! ఓ నిత్యుడా! నేను నీ కారుణ్యాన్ని సాధనంగా చేసుకొని నిన్ను అభ్యర్థిస్తున్నాను".

*(తిర్మిజి : అబ్‌వాబుద్దుఆత్, సహీ తిర్మిజి, అల్‌బానీ : 2796)*

### (2) తాము చేసిన మంచి పనులను సాధనంగా చేసుకొని అల్లాహ్‌ను వేడుకోవడం

"వారు (విశ్వాసులు) ఇలా వేడుకుంటారు : ప్రభూ ! మేము విశ్వసించాము. మా తప్పులను మన్నించు. మమ్మల్ని నరక జ్వాలల నుండి కాపాడు."
*(ఆలి ఇమ్రాన్ : 16)*

యిక్కడ "విశ్వసించాము" అన్న సదాచరణను సాధనంగా చేసుకొని అల్లాహ్‌ను వేడుకోవడం జరిగింది.

అదీగాక, బనీ ఇస్రాయీల్ లోని ముగ్గురు వ్యక్తులు తమ తమ సదాచరణలను సాధనంగా చేసుకొని అల్లాహ్‌ను వేడుకొని తాము చిక్కుకుపోయిన గుహలో నుండి బయటపడ్డ వృత్తాంతము అందరికీ తెలిసిందే.

*(సహీ ముస్లిం - కితాబుజ్జిక్రి వద్దుఆయె వత్తౌబా వల్ ఇస్తెగ్‌ఫారి. బాబ్ : ఖిస్సతి అస్‌హాబిల్ గారి)*

### (3) బ్రతికి వున్న సత్పురుషుని ప్రార్థనను సాధనంగా చేసుకొని అల్లాహ్‌ను వేడుకోవడం

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : (ఉమర్ (రజి అల్లాహు అన్హు) గారి పరిపాలనా కాలంలో) ప్రజలు కరువు కాటకాలకు గురయినప్పుడు ఉమర్ (రజి అల్లాహు అన్హు) అబ్బాస్ బిన్ ముత్తలిబ్ (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి బాబాయి) చేత ప్రార్థన చేయించే వారు. ఆ సందర్భంగా ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా ప్రార్థించేవారు : దేవా ! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ లోకంలో వున్నప్పుడు మేము ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) (ప్రార్థన)ను సాధనంగా చేసుకొని వర్షం కోసం ప్రార్థిస్తే నీవు వర్షం

కురిపించే వాడివి. (ప్రవక్త తదనంతరం) ఇప్పుడు మేము మా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి బాబాయి (ప్రార్థన)ని సాధనంగా చేసుకొని ప్రార్థిస్తున్నాం. కనుక యిప్పుడు కూడా మాకు వర్షాన్ని కురిపించు''.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) చేత (ప్రార్థన చేయించిన తర్వాత) బాగానే వర్షం కురిసేది.

*(సహీ బుఖారీ : 1010)*

యీ మూడు రకాల వసీలాలు తప్ప మరే రకమైన వసీలా అయినా అది పూర్తిగా నిషిద్ధము. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో వాటికి ఎంత మాత్రం స్థానం లేదు.

ప్రార్థన, సహాయాన్ని అర్థించడం, శరణు కోరడం, వసీలాల గురించి ధర్మ సమ్మతమైన విషయాలు, నిషేధించబడ్డ విషయాలను గురించి సవివరంగా తెలుసుకున్నాక ప్రస్తుత ముస్లిం సమాజం మీద ఒక్కసారి దృష్టి సారిస్తే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో నిషేధించబడ్డ ఎన్నో కార్యాలను ఈ రోజు ముస్లింలు చేస్తున్నారు. మామూలుగా చేయడం కాకుండా, ఇదే వాస్తవ దైవ ధర్మమని గ్రుడ్డిగా నమ్మి పూర్తి భక్తి శ్రద్ధలతో చేస్తున్నారు.

'యా గౌస్ అల్ మదత్' (అల్లాహ్ క్షమించుగాక) అని షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహమతుల్లా అలై) గారి సహాయాన్ని అర్థిస్తూ వాడే నినాదం ఈ రోజు ముస్లిం సమాజంలో సర్వసామాన్యమైపోయింది.

'ఖర్‌దే ఝోలీ మేరీ యా మహమ్మద్' అంటూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహాయాన్ని అర్థిస్తూ పాడబడే ఖవ్వాలీ కూడా అందరికీ సుపరిచితమే. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ, గతించిన పుణ్య పురుషులను వసీలాగా చేసుకొని అల్లాహ్‌ను వేడుకోవడంతో పాటు, సమాధుల (మజార్లు) వద్ద కూడా తమ విన్నపాలు చేసుకోవడం జగమెరిగిన సత్యమే.

మరి ఇంత బాహాటంగా దైవేతరులు పూజింపబడుతుంటే అల్లాహ్ కారుణ్యం ఆ సమాజం పై వర్షిస్తుందా? సుఖశాంతులు ఆ సమాజంలో వుంటాయా?





అల్లాహ్ కారుణ్య, సుఖశాంతుల మాటేమో గానీ అల్లాహ్ శిక్ష మాత్రం పడే పూర్తి అవకాశముంది.

కనుక ముస్లింలారా! యికనైనా కళ్ళు తెరవండి. తమ సమస్యల నివారణ నిమిత్తం దైవేతరులతో పెంపొందించుకున్న సంబంధాలను పూర్తిగా త్రెంచేయండి. వాటిలో ఎలాంటి వాస్తవమూ లేదు. అల్లాహ్‌ను గట్టిగా నమ్మండి. సహాయం కొరకు కేవలం మీ సృష్టికర్తనే ప్రార్థించండి. ఆయన శరణు మాత్రమే పొందండి.

అల్లాహ్ తన దాసునికి సరిపోడా?(39:36) అని అల్లాహ్ మాటి మాటికీ మనల్ని ప్రశ్నిస్తున్నాడు.

ఒక రోజు మనమందరం అల్లాహ్ సన్నిదిలో హాజరు కాబోతున్నామన్న విషయం మరువకండి. ఈ వ్యవహారిక జీవితంలోని విశ్వాస ఆచరణల మీదే మన పరలోక గమ్యస్థానం ఆధారపడి వుందన్న విషయం ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోండి.

## (2) దివ్య ఖురాను పారాయణం, ధ్యానము (జిక్ర్) :

నోటిద్వారా చేయబడే ఆరాధనల్లో ఈ రెండు కూడా ముఖ్యమైనవే. వీటి ద్వారా కూడా మనం అల్లాహ్ ను ప్రసన్నుణ్ణి చేసి ఎంతో పుణ్యాన్ని సంపాదించ వచ్చు. ఈ రెండు ఆచరణలు అల్లాహ్ వద్ద స్వీకృతి పొందడానికి మూడు షరతులు పాటించాల్సి వుంటుంది. ఆమాట కొస్తే ఏ సదాచరణ అయినా అల్లాహ్ వద్ద ఆమోద యోగ్యం కావడానికి ఈ షరతులు అవసరమవుతాయి. వాటిలో ...

**మొదటిది** - పటిష్టమైన విశ్వాసం కలిగి వుండి షిర్క్ కు దూరంగా వుండడం.

**రెండవది -** దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్ ప్రకారం దానిని ఆచరించడం.

**మూడవది -** దానిని పాటించడంలో ప్రదర్శనా బుద్ధికి దూరంగా వుండడం.

"తమ ప్రభువును విశ్వసించని వారి పనులను తుఫాను రోజున వీచే పెనుగాలి ఎగుర వేసే బూడిదతో పోల్చవచ్చు. వారు తాము చేసిన దానికి

ఎటువంటి ప్రతిఫలాన్నీ పొందలేరు. ఇదే మార్గ భ్రష్టత్వానికి పరాకాష్ఠ అంటే''.

*(ఇబ్రాహీం : 18)*

''విశ్వాసులారా! మీరు అల్లాహ్ కు విధేయత చూపండి, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు విధేయత చూపండి. (అవిధేయత చూపి) మీ పనులను వృధా చేసుకోకండి''. *(మహమ్మద్ : 33)*

యిక ప్రదర్శనా బుద్ధి (రియాకారీ) విషయానికొస్తే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దీనిని షిర్కె అస్గర్ (చిన్న షిర్క్) అని అభివర్ణించారు.

కావున వీటిని ఎల్లప్పుడూ మనసులో పెట్టుకొని తగు జాగ్రత్తగా వ్యవహ రించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

దివ్యఖురాను పఠనం, దాని ప్రయోజనాన్ని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక హదీసులో ఇలా సెలవిచ్చారు.

''దివ్య ఖురానును స్వయంగా పఠిస్తూ ఇతరులకు కూడా నేర్పేవాడే మీలో శ్రేష్ఠమైన వ్యక్తి''. *(సహీ బుఖారి)*

యిక్కడ పఠించి నేర్పడమంటే కేవలం అరబ్బీ భాషలో పఠిస్తూ ఇతరులకు నేర్పడమే కాదు, దాని అర్ధాన్ని కూడా స్వయంగా ముందు తెలుసుకొని తరువాత ఇతరులకు కూడా దానిని గూర్చి వివరించడం. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు అర్ధం చేసుకొని పఠించే వారు. అరబ్బీ వారి మాతృభాష అన్న విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. ఆ మాటకొస్తే వారు దివ్యఖురాను పఠనం, దానికనుగుణంగా ఆచరించడం - రెండూ ఒకేసారి పాటించేవారు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా బోధిస్తుండగా తాను విన్నానని ఉమామా బాహిలీ (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు:

''ఖురాను పారాయణం చేయండి. ప్రళయ దినాన అది తనను పారా యణం చేసే వారి కొరకు సిఫారసు దారుగా వస్తుంది.

*(సహీ ముస్లిం - కితాబుల్ ఫజాయిల్ ఖురాన్)*

వేరే హదీసుల్లో, సూరే బఖర, సూరే ఆలి ఇమ్రాన్, సూరే ముల్క్ గూడా తమను పఠించే వారి కొరకు సిఫారసు చేస్తాయని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సెలవిచ్చారు. *(సహీ ముస్లిం, అబూదావూద్)*





యావత్తు ఖురానును పారాయణం చేయడానికి తీసుకోవాల్సిన కనీస సమయం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

''మూడు రోజుల కన్నా తక్కువ సమయంలో ఖురానును పారాయణం చేసిన వాడు దాన్ని అర్ధం చేసుకోలేడు''. *(అబూదావూద్ : 1390)*

ఖురాను పారాయణానికి సంబంధించిన యీ వాస్తవాలను తెలుసుకున్న తర్వాత మన ముస్లిం సమాజంలో ప్రస్తుతం బాహాటంగా జరిగే 'ఖురాన్ ఖానీ'లలో ఎంత వాస్తవ ముందో మనం ఇట్టే గ్రహించవచ్చు.

మొట్టమొదట : 'ఖురాన్ ఖానీ'యే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో లేని ఒక క్రొత్త పోకడ (బిద్ అత్).

యిక రెండవది: కొన్ని గంటల వ్యవధిలో మొత్తం ఖురాను ను పారాయణం చేయడం.

ఇలాంటి ఆచరణ అల్లాహ్ వద్ద స్వీకృతి పొందగలదా? చెప్పండి.

ఆశ్చర్యమేసే మరో విషయమేమిటంటే, రంజాన్ నెలలో ఒకే రాత్రి మొత్తం ఖురాను ను పూర్తి చేయడానికి కొందరు ఉలమాలు సైతం ప్రోత్సహించడం. వాస్తవానికి ఇలాంటి ఆచరణల వల్ల ప్రయోజనమేమీ దొరకదు సరికదా ధర్మంలో లేని క్రొత్త పద్ధతులను ప్రవేశ పెట్టినందుకు గాను శిక్ష పడే అవకాశముంది.

యిక ధ్యానము (అల్లాహ్ సంస్మరణము)ను గూర్చి తెలుసుకొందాం.

ధ్యానం కూడా కేవలం అల్లాహ్ మెప్పును పొందడానికి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నేర్పిన పద్ధతి ప్రకారమే జరగాలి. అప్పుడే అది ఆమోద యోగ్యమవుతుంది.

అల్లాహ్ సంస్మరణము ప్రాధాన్యత గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

''బాగా తెలుసుకోండి! అల్లాహ్ సంస్మరణ ద్వారానే హృదయాలకు తృప్తిని పొందే భాగ్యం లభిస్తుంది''. *(రాద్ : 28)*

అబూ మూసా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

“అల్లాహ్‌ను స్మరించే వాడు సజీవంగా వున్న వ్యక్తి లాంటివాడు. అల్లాహ్‌ను స్మరించనివాడు మృతుడి లాంటివాడు”. *(సహీ బుఖారి : 6407)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన అనుచర సమాజానికి, అల్లాహ్‌ను స్మరించడానికి ఎన్నో సద్వచనాలు నేర్పారు. వాటిని ఆచరణలో పెట్టడం ద్వారా మనం ఎంతో పుణ్యాన్ని మూటగట్టుకోవచ్చు.

అయితే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా తెలియజేయబడని వచనాలతో అల్లాహ్‌ను ధ్యానించడం లేదా గత కాలానికి చెందిన పుణ్యపురుషుల, సూఫీ మహాశయుల పేర్లను జపించి వారి సంతోషాన్ని పొందగోరడం అనేవి పూర్తిగా నిషిద్ధం.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

“సూర్యుడుదయించే ప్రపంచంలోని వస్తువులలో అన్నింటికన్నా నాకు ఈ వచనాలు ప్రియమైనవి.

“సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు, అల్లాహు అక్బర్”.

“అల్లాహ్ పరిశుద్ధుడు, సకల స్తోత్రాలూ అల్లాహ్ కే శోభిస్తాయి. అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు”.

*(సహీ ముస్లిం - కితాబుజ్జిక్రి వద్దుఆ వత్తౌబా వల్ ఇస్తెగ్ ఫార్, బాబ్ : ఫజ్లిత్తహ్లీలి వత్తస్బీహి వద్దుఆయి).*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: “ రెండు వచనాలున్నాయి. అవి పలకటానికి నాలుకపై చాలా తేలికగా వున్నా అల్లాహ్ త్రాసులో చాలా బరువుగా తూగుతాయి. ఆ రెండు వచనాలు అల్లాహ్‌కు ఎంతో ప్రియమైనవి. అవి- సుబ్‌హానల్లాహి వబిహమ్దిహి, సుబ్‌హానల్లా హిల్ అజీం”.





అల్లాహ్ తన స్తోత్ర సమేతంగా పరిశుద్ధుడు, మహోన్నతుడైన అల్లాహ్ పరిశుద్ధుడు.

*(సహీ ముస్లిం- కితాబుజ్జిక్రి వద్దుఆ వత్తౌబా వల్ ఇస్తెగ్ ఫార్, బాబ్ : ఫజ్లిత్తహ్లీలి వత్తస్బీహి వద్దుఆయి)*

ఇంకో హదీసులో - ‘లాహౌల వలా ఖువత ఇల్లాబిల్లాహ్’ ను స్వర్గ నిధుల్లో ఒకటి అని చెప్పబడింది.

*(సహీ ముస్లిం - కితాబుజ్జిక్రి వద్దుఆ వత్తౌబా వల్ ఇస్తెగ్‌ఫార్, బాబ్ : ఇస్తెహ్ బాబి ఖఫ్జిస్ సౌతి బిజిక్రి)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసుల ద్వారా రుజువు చేయబడిన ఎన్నో ధ్యాన వచనాలు వున్నప్పటికీ ముస్లిం సమాజం లోని ఒక పెద్ద వర్గం ఇక్కడ కూడా పెడత్రోవ పట్టింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నేర్పని వచనాలతో, మృతుల పేర్లతో జపించడం సర్వ సామాన్యమై పోయింది.

అల్లాహూ, అల్లాహూ అని ధ్యానించడం, శనగిత్తులతో 70 వేల సార్లు కలిమా పఠించడం, లక్షన్నర సార్లు ఆయతే కరీమా పూర్తి చేయడం, షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహమతుల్లా అలై) పేరును జపించడం, దాని ద్వారా ముష్టెత్తుకోవడం - లాంటి ప్రక్రియలు మనం చూస్తూనే వున్నాం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో ఇలాంటి సాంప్రదాయ విరుద్ధమైన జపాలకు ఎలాంటి స్థానమూ లేదు. వీటిలో కొన్ని ‘బిద్అత్’ కోవకు చెందితే, కొన్ని మాత్రం నేరుగా షిర్క్ కోవకు చెందుతాయి. అందువల్ల వీటికి దూరంగా వుండడం ఎంతో అవసరం.

**(3) ప్రశంసించడం :**

దీనిని కూడా అల్లాహ్ కే ప్రత్యేకించాలి. కొన్ని విషయాలలో ఇది దైవేతరులకు కూడా ధర్మ సమ్మతమైనప్పటికీ, దీని సంపూర్ణ రూపంలో మాత్రం ఇది కేవలం అల్లాహ్‌కే చెందుతుంది.

‘అల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్’ *(ఫాతిహా : 1)*

సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్‌కే సమస్త స్తోత్రాలు.

"సప్తాకాశాలూ, భూమీ, భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ ఆయన స్తోత్రం చేస్తున్నాయి" *(బనీ ఇస్రాయీల్ : 44)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను ప్రశంసించడానికి, ఆయన గొప్పతనాన్ని చాటడానికి విభిన్న సద్వచనాలు తన ఉమ్మత్ కోసం విడిచి వెళ్ళారు.

సుబ్‌హానల్లాహ్, అల్‌హమ్దులిల్లాహ్, లా ఇలాహ ఇల్లల్లాహ్, అల్లాహు అక్బర్, లాహౌల వలా ఖువత ఇల్లాబిల్లాహ్, సుబ్‌హానల్లాహి వబి హమ్దిహి, సుబ్ హానల్లా హిల్ అజీమ్ - వీటిలో కొన్ని.

అయితే దైవేతరులను ప్రశంసించే విషయంలో మాత్రం మితిమీరకుండా జాగ్రత్తపడాలి.

అబూబక్ర (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధిలో మరొక వ్యక్తిని ప్రశంసించాడు. దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ- నీవు నీ సోదరుని మెడ కోసేశావు, నీవు నీ సోదరుని మెడ కోసేశావు .... ఇలా పలు సార్లు అన్నారు. తదుపరి ఇలా ఉపదేశించారు :

మీలో ఎవరైనా తన సోదరుణ్ణి ప్రశంసించాలనుకుంటే యిలా అనాలి - ఇలా, ఇలా అని నేను అనుకొంటున్నాను, వాస్తవం అల్లాహ్‌కే తెలుసు. నాకు అతని హృదయ వాస్తవికతను గూర్చి తెలియదు. అగోచర జ్ఞానం అల్లాహ్ వద్దనే వున్నది. నాకు తెలిసినంత వరకు అతను ఇలాంటి వాడు".

*(సహీ ముస్లిం - కితాబుజ్జుహుద్, బాబ్ : నహీయి అనిల్ మద్ హి ఇజాకాన ఫీహి)*

ఉసామా బిన్ జైద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు.

"తమ పట్ల ఎవరైనా మంచిగా మెలిగినప్పుడు వారికోసం 'జజాకల్లా హు ఖైరా' (అల్లాహ్ నీకు ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక) అని గనక ప్రార్థిస్తే, తాము వారిని మేలైన రీతిలో కొనియాడినట్లే." *(తిర్మిజి, సహీవుల్ జామె : 6244)*





## (4) కృతజ్ఞతలు తెలుపడం :

ఇది కూడా దీని సంపూర్ణ రూపంలో కేవలం అల్లాహ్‌కే చెందే హక్కు. కొన్ని విషయాల్లో ఇది దైవేతరులకు ధర్మ సమ్మతమైనప్పటికీ, వారి విషయంలో మితిమీరకుండా జాగ్రత్త వహించవలసి వుంటుంది.

దివ్య ఖురానులో అల్లాహ్ ఉపవాసాల ఉద్దేశ్యాన్ని వివరిస్తూ ఇలా సెలవిచ్చాడు:

"అల్లాహ్ మీకు ప్రసాదించిన మహోపదేశానికి గాను మీరు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడటానికీ, ఆయనకు మీరు కృతజ్ఞతలు తెలుపుకోవడానికీ ఈ పద్ధతి తెలుపబడుతోంది". *(బఖర : 186)*

మరో చోట ఇలా సెలవిస్తున్నాడు :

"మీరు నన్ను జ్ఞాపకం పెట్టుకోండి, నేను మిమ్మల్ని జ్ఞాపకం పెట్టుకుంటాను. నాకు కృతజ్ఞతలు తెలుపండి. చేసిన మేలును మరువకండి".

*(బఖర : 152)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఏదైనా తిని తనకు కృతజ్ఞతలు తెలిపే, ఏదైనా త్రాగి తనకు కృతజ్ఞతలు తెలిపే దాసులంటే అల్లాహ్ ఎంతో ఇష్టపడతాడు."

*(సహీ ముస్లిం - కితాబుజ్జిక్రి వద్దుఆ వత్తౌబా వల్ ఇస్తెగ్ ఫార్, బాబ్ : ఇస్తెహ్ బాబిల్ హమ్ది బాదల్ అక్లి వష్షుర్ బి)*

నోటి ఆరాధనలకు సంబంధించిన వాస్తవికత యిది.

# ఇతర శారీరక ఆరాధనలు

హృదయారాధనలు, నోటి ఆరాధనలను గూర్చి తెలుసుకున్నాక, యిక శరీరంలోని ఇతర అవయవాల ద్వారా చేయబడే ఆరాధనలను గురించి తెలుసు కొందాం. వీటిలో ముఖ్యమైనవి :

1) నమాజ్, రుకూ, సజ్దా

2) జకాత్

3) ఉపవాసము (రోజా)

4) హజ్, ఖుర్బానీ

5) మొక్కుబడులు, అర్పణలు

6) మంచిని ఆజ్ఞాపించడం, చెడు నుండి నిరోధించడం

వీటిని గూర్చి వివరంగా తెలుసుకొందాం.

**1) నమాజ్, రుకూ, సజ్దా :**

సృష్టికర్తను సంతృప్తి పరచడానికి మనిషి చేసే ఆరాధనల్లో కెల్లా అతి ముఖ్యమైనది నమాజ్. అందుకే నమాజ్‌ను విశ్వాస తిరస్కారాలకు మధ్య అడ్డు తెర లాంటిదనీ, ప్రళయం రోజు కూడా విశ్వాసం తర్వాత మనిషి ప్రశ్నించబడేది నమాజ్ గురించే అనీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివరించడం జరిగింది. కనుక నమాజ్, రుకూ, సజ్దాలను కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకం చేసుకొని వాటిద్వారా అల్లాహ్ మెప్పునూ, సహాయాన్ని పొందడానికి ఎల్లప్పుడూ ప్రయత్నం చేస్తుండాలి.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :





"ప్రవక్తా! ఇలా అను : నా నమాజ్, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణము - సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే". *(అన్‌ఆమ్ : 162)*

యిక నమాజు ప్రయోజనాలను, దానిని త్యజించడం వల్ల లేదా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్ ప్రకారం పాటించకపోవడం వల్ల జరిగే నష్టాలను గురించి తెలుసుకుందాం.

"వాస్తవానికి నమాజ్ విశ్వాసులు నిర్ణీత సమయాలలో విధిగా పాటించ వలసిన ధర్మం". *(నిసా : 103)*

"నమాజును స్థాపించు, నిశ్చయంగా నమాజు అశ్లీల కార్యాల నుండి, చెడు పనుల నుండి నిరోధిస్తుంది". *(అన్ కబూత్ : 45)*

" పరిశుద్ధతను పాటించి, తన ప్రభువు నామాన్ని స్మరించి, ఆ తరువాత నమాజ్ చేసినవాడు తప్పక సాఫల్యం పొందుతాడు." *(ఆలా: 14-15)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకసారి తన సహచరులతో, "మీలో ఎవరి గడప ముందైనా ఒక కాలువ ప్రవహిస్తూ వుండి, అందులో అతను ప్రతిరోజూ ఐదు సార్లు స్నానం చేస్తూ వుంటే అతని దేహం పైన యిక మాలిన్యం అనేది వుండ గలదా? అని అడిగారు. దానికి సహచరులు - లేదు- మాలిన్యం అసలు వుండదు అని జవాబిచ్చారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ - ఐదు వేళల నమాజ్ కూడా యింతే. అల్లాహ్ ఈ నమాజ్ ద్వారా పాపాలను తుడిచి వేస్తాడు" అని వివరించారు.

*(సహీ ముస్లిం - కితాబుల్ మసాజిద్ బాబ్ ఫజలిస్సలాతిల్ మక్‌తూబతి ఫిజమాతి)*

ఇంకో హదీసులో నమాజును దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కంటి చల్లదనంగా వర్ణించారు.

యిక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజు విషయానికొస్తే అది సమతుల్యంగా, సమగ్రంగా వుండేది. పూర్తి వినమ్రత తో, నింపాదిగా ఖౌమా, రుకూ, సజ్దాలను పూర్తి చేసేవారు.

బరా బిన్ ఆజిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం : నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి నమాజును పరిశీలిస్తే నాకు తెలిసిన విషయాలేమిటంటే : ఆయన ఖౌమా, రుకూ, రుకూ తర్వాత లేచి నిలబడటం, మొదటి సజ్దా, రెండు సజ్దాల మధ్య జల్సా, రెండవ సజ్దా మరియు సజ్దా, సలాంల మధ్య జల్సా - వీటన్నింటి సమయం దాదాపు సమానంగా వుంది.

*(సహీ ముస్లిం - కితాబుస్సలాత్, బాబ్- ఏతిదాలి అర్కానిస్సలాతి)*

ఎవరికైనా నమాజ్ ద్వారా ప్రయోజనం అనేది, ఈ హదీసును దృష్టిలో పెట్టుకొని, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ప్రకారం పూర్తి వినమ్రతతో నింపాదిగా ఆచరిస్తేనే దొరుకుతుంది. అలా కాని పక్షంలో అతని శ్రమ వృథా అయ్యే అవకాశం వుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇలా ప్రవచిస్తుండగా తాను విన్నానని అమ్మార్ బిన్ యాసిర్ (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు : మనిషి (నమాజ్ చేసి) తిరిగొస్తాడు. అతనికి తన నమాజ్ పుణ్యంలో పదో వంతుగానీ, తొమ్మిదో వంతుగానీ, ఎనిమిదవ వంతుగానీ, ఏడవ వంతుగానీ, ఆరవ వంతు గానీ, ఐదవ వంతుగానీ, నాల్గవ వంతుగానీ, మూడవ వంతుగానీ, సగం గానీ దొరుకుతుంది." *(అబూదావుద్ : 796)*

యిక నష్టాల విషయానికొస్తే, దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"వారు (కుడి పక్షం వారు) అపరాధులను - మిమ్మల్ని ఏ విషయం నరకంలోకి తీసుకువెళ్ళింది? అని అడుగుతారు. దానికి వారు ఇలా అంటారు. మేము నమాజు చేసే వారిలోని వారం కాము". *(ముద్దస్సిర్ : 40-43)*

అబ్దుర్రహ్మాన్ బిన్ షబల్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మమ్మల్ని కాకిపొడుపులు పొడవడం నుండి (మొక్కుబడిగా త్వరత్వరగా నమాజు చదవడం నుండి), జంతువుల లాగ చేతులు నేలపై పరచడం నుండి, ఒంటె లాగా మనిషి కూడా మస్జిద్‌లో ఒక స్థలాన్ని తన కోసం ప్రత్యేకం చేసుకోవడం నుండి వారించారు. *(అబూదావూద్ : 862)*





ఇంకో హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు : "అందరికన్నా పెద్ద దొంగ ఎవడంటే తను చదివే నమాజు నుండి సైతం దొంగిలించేవాడు. దానికి సహచరులు (ఆశ్చర్యపోయి) ఓ దైవ ప్రవక్తా! నమాజులో దొంగతనం ఎలా అవుతుంది? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ - నమాజులో రుకూ, సజ్దాలు పూర్తి వినమ్రతతో నింపాదిగా చేయకపోవడం నమాజులో నుండి దొంగిలించినట్లే" అని అన్నారు.

*(ముస్నద్ అహ్మద్)*

దురదృష్టవశాత్తూ పైన వివరించబడిన గుణాలు నేడు ముస్లిం సమాజంలో ప్రవేశించాయి. చాలా మంది 'కేవలం మొక్కుబడి కోసం నమాజు చేస్తున్నారా' అని అనిపించేలా నమాజ్ చేస్తున్నారు.

కొంత మంది నమాజులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ లను త్యజిస్తే మరి కొందరు వినమ్రతను (ఖుషూ) పూర్తిగా విస్మరించారు. ఈ రోజు ఏ మస్జిద్‌కు వెళ్ళినా అక్కడ నమాజ్ చదివే చాలా మంది విషయంలో ఈ దృశ్యం మనకు కనబడుతుంది.

"నా అనుచర సమాజంలో అన్నిటికన్నా ముందు పైకి లేపబడేది ఖుషూ. చివరికి (పరిస్థితి ఎలా అయిపోతుందంటే) ఒక్క వ్యక్తి లోనూ ఖుషూ అనేది, మిగిలి వుండదు" *(తబ్రానీ)* అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన భవిష్యవాణి వాస్తవ రూపం దాల్చే సమయం ఆసన్నమైనదేమో అని అనిపిస్తోంది.

దీనికి తోడు నేడు ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహం మగవారికి, ఆడవారికి, నమాజు పద్ధతుల్లో తేడాలున్నాయని బోధిస్తోంది. వాస్తవానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే పైవాదనకు ఆధారాలే దొరకవు. కనుక సత్యం ఏమిటంటే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి నమాజు విధానం ఒక్కటే. అది మగవారికి, ఆడ వారికి వేర్వేరుగా లేదు. "నన్నెలాగైతే నమాజ్ చేస్తుండగా మీరు చూశారో మీరు కూడా అలాగే నమాజ్ చేయండి." *(సహీ బుఖారి)* అన్న దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆదేశం ఆడా, మగ అన్న తేడా లేకుండా అందరికీ సమానంగా వర్తిస్తుంది.

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మాన్ని అనుసరించ

గోరేవారు ఈ చెడు అలవాట్లకు దూరంగా వుంటూ ఆడా, మగ అన్న తేడా లేకుండా అందరూ కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ప్రకారం పూర్తి ఖుషూతో నమాజు చేయడాన్ని అనివార్యం చేసుకోవాలి. అప్పుడే మన నమాజులు అల్లాహ్ వద్ద స్వీకృతి పొందుతాయని ఆశించవచ్చు.

యిక రుకూ, సజ్దాల వాస్తవికతను గూర్చి తెలుసుకొందాం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఈ రేయింబవళ్ళు, ఈ సూర్య చంద్రులు అల్లాహ్ సూచనల లోనివే. సూర్య చంద్రులకు సాష్టాంగ పడకండి, వాటిని సృజించిన అల్లాహ్‌కు సాష్టాంగ పడండి; నిజంగానే మీరు ఆయనను ఆరాధించేవారు అయితే".

*(హామీమ్ అస్ సజ్దా : 37)*

"విశ్వాసులారా! రుకూ చేయండి, సజ్దా చేయండి, మీ ప్రభువుకు దాస్యం చేయండి, మంచి పనులు చేయండి. దీని ద్వారానే మీకు సాఫల్య భాగ్యం లభిస్తుందని ఆశించవచ్చు." *(హజ్ : 77)*

స్వయానా మర్యమ్ (అలైహిస్సలాం)కు కూడా ఇలా ఆదేశించాడు.

"మర్యమ్ ! నీవు నీ ప్రభువునకు విధేయురాలవుగా వుండు. ఆయన సాన్నిధ్యంలో సజ్దా చెయ్యి. రుకూ చేసే దాసులతో నీవూ రుకూ చెయ్యి."

*(ఆలి ఇమ్రాన్ : 43)*

ఖైస్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం : నేనొకసారి హిరా (ఒక ప్రాంతం)కు వెళ్తే అక్కడ ప్రజలు తమ నాయకుడికి సజ్దా చేయడం చూసి, -'సజ్దా చెయ్యడానికి ఈ నాయకుడి కన్నా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎక్కువ హక్కుదారులు' అని మనసులో అనుకున్నాను. తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చినపుడు యిలా విన్నవించుకున్నాను : నేను హిరా ప్రాంతానికి వెళ్ళినపుడు అక్కడి ప్రజలను తమ నాయకుడికి సజ్దా చేస్తుండగా చూశాను. మరి ఓ దైవ ప్రవక్తా ! మేము సజ్దా చేయడానికి మీరు ఎక్కువ హక్కుదారులు కదా! దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)- ఒక వేళ నీవు నా సమాధి దగ్గర్నుండి వెళ్ళడం జరిగితే దానిక్కూడా సజ్దా చేస్తావా? అని అడిగారు. దానికి నేను-'లేదు' అని చెప్పాను. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు





అలైహి వసల్లం) (నా మాటను సమర్థిస్తూ) నువ్విలా చేయకు, నేనొకవేళ ఎవరినైనా, ఎవరికైనా సజ్దా చేయమని ఆదేశించాలని అనుకొని వుంటే స్త్రీలను వారి భర్తలకు సజ్దా చేయమని ఆదేశించి వుండేవాణ్ణి. ఎందుకంటే భర్తల హక్కు అల్లాహ్ ద్వారా నిర్దేశించబడింది." *(అబూదావూద్ : 2140)*

పైన పేర్కొన్న రుజువుల ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో నమాజ్, రుకూ, సజ్దాలకు గల ప్రాముఖ్యత మరియు దైవేతరుల విషయంలో, వారు ఎంతటి మహాత్ములైనా సరే, ఇవి ఎలా నిషేధించబడ్డాయో స్పష్టంగా తెలుస్తుంది.

ఈ వాస్తవాలను తెలుసుకున్న తర్వాత ప్రస్తుత ముస్లిం సమాజం మీద ఒక్కసారి దృష్టి సారించండి. నిజ స్వరూపం కళ్ళకు కట్టినట్లు మీకే తెలుస్తుంది.

ఇస్లాం పేరుతో, దైవేతరుల మీద ప్రేమతో వారి సమాధుల వద్ద జరిగే కార్యకలాపాలు ఈరోజు ఎవరికీ తెలియకుండా లేవు. ఉర్సుల పేరుతో అమాయక ప్రజానీకాన్ని దోచుకోవడం కూడా మనం చూస్తూనే వున్నాం. ఈ దురాచారాలకూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మానికి దూరపు సంబంధం కూడా లేదు. యివన్నీ బహుదైవారాధన (షిర్క్) పనులు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన మరణానికి ఐదు రోజుల ముందు ఇలా ఆదేశిస్తుండగా తాను విన్నానని జున్దుబ్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు :

"బాగా వినండి! మీకు ముందు గతించిన ప్రజలు తమ ప్రవక్తల, పుణ్య పురుషుల సమాధుల్ని మస్జిద్‌లు (ఆరాధనాలయాలు)గా చేసుకున్నారు. మీరు సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకోకండి. నేను మిమ్మల్ని ఈ విషయం నుండి వారిస్తున్నాను".

*(సహీముస్లిం : కితాబుల్ మసాజిద్, బాబ్ : నహ్యాఅన్ బినా ఇల్ మస్జిది అలల్ ఖుబూరి ...)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు :

"మీ ఇండ్లను శ్మశాన వాటికలుగా చేయకండి మరియు నా సమాధిని

పండుగ ప్రదేశం (ఉర్సు ప్రదేశం)లాగా చేయకండి". *(అబూదావూద్ : 2042)*

తన సమాధి ఆరాధనను శంకించే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను ఇలా వేడుకొనే వారు : "నా సమాధిని ప్రజల ద్వారా పూజింప బడే విగ్రహం (వసన్) లాగా చేయకు". *(ముఅత్తా ఇమామ్ మాలిక్)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు : మానవ సంతతిలో అందరికన్నా నీచమైన పాపాత్ములెవరంటే ప్రళయం వచ్చే సమయంలో బ్రతికుండే వారు మరియు సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకొనేవారు."

*(ముస్నద్ అహ్మద్)*

పై హదీసుల ద్వారా ఇస్లాంలో సమాధి పూజలకు వున్న స్థానమేమిటో, సమాధి పూజారుల వాస్తవికత ఏమిటో మనం తెలుసుకున్నాం. స్వయాన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సమాధి వద్దే ఎలాంటి కార్యకలాపాలకు అనుమతి లేనప్పుడు ఇతర సమాధుల వద్ద జరిగే పనులు ఎలా ధర్మ సమ్మతం కాగలుగుతాయి?

సమాధుల వద్ద నమాజ్, రుకూ, సజ్దాలు మరియు దైవేతరుల మెప్పు పొందడానికి జరిగే ఇతర కార్యక్రమాలు - ఇవన్నీ పూర్తిగా నిషేధించబడ్డ కార్యాలు.

కనుక ఈ పనులన్నిటినీ త్యజించి కేవలం అల్లాహ్ కోసమే నమాజ్, రుకూ, సజ్దా, మరియు ఇతర ఆరాధనలు పాటించడం ఎంతైనా అవసరం.

అల్లాహ్ తన దాసునికి సరిపోడా?

## 2) జకాత్ :

జకాత్ అనేది ధనవంతులయిన ముస్లింలపై తమ సంపద, ఆభరణాల నుండి ఒక నిర్దిష్ట భాగాన్ని అల్లాహ్ మార్గంలో, తమ అవసరాలు తీర్చుకోలేని పేదవారికి చెల్లించడానికి అల్లాహ్ నిర్ణయించిన ఒక ముఖ్యమైన విధి. దివ్యఖురానులో పలు చోట్ల నమాజ్‌తో పాటు జకాత్‌ను కలిపి అల్లాహ్ ప్రస్తావించిన తీరూ, గత అనుచర సమాజాలకు కూడా దీని ఆదేశాన్ని యివ్వడం బట్టి చూస్తే అల్లాహ్ దృష్టిలో దీనికున్న ప్రాధాన్యత అర్థమవుతుంది.





దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నమాజును స్థాపించండి, జకాతును ఇవ్వండి, దైవ ప్రవక్తకు విధేయులుగా వుండండి". *(నూర్ : 56)*

"విశ్వసించి మంచి పనులు చేసేవారికీ, నమాజు స్థాపించే వారికీ, జకాత్ యిచ్చేవారికీ వారి ప్రభువు వద్ద తగిన ప్రతిఫలం లభిస్తుంది. వారికి భయం కానీ, శోకం కానీ కలిగే అవకాశం లేదు". *(బఖర : 277)*

"అల్లాహ్ ప్రసన్నతను పొందే ఉద్దేశ్యంతో, మీరు ఇచ్చే జకాతు - దానిని యిచ్చే వారే తమ సంపదను వృద్ధి చేసుకుంటారు". *(రూమ్ : 39)*

గ్రంథ ప్రజల గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"వారు (గ్రంథ ప్రజలు) అల్లాహ్‌కు దాస్యం చేయాలనీ, పూర్తి ఏకాగ్రతతో తమ ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, నమాజును స్థాపించాలనీ, జకాత్ ఇస్తూ వుండాలని మాత్రమే ఆదేశించడం జరిగింది. ఇదే ఎంతో సరియైన, సవ్యమైన ధర్మం." *(బయ్యినహ్ : 5)*

జకాత్ ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విషయం గురించి తీవ్రంగా హెచ్చరించారు.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) ద్వారా ఉల్లేఖించబడ్డ ఒక సుదీర్ఘ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు : బంగారము, వెండి మీద జకాత్ చెల్లించని వాడికి ప్రళయం రోజు వాటితోనే పీటలు తయారు చేసి తదుపరి వాటిని నరకాగ్నిలో వేడి చేసి అతడి ముఖం, వీపుల మీద వాతలు పెట్టడం జరుగుతుంది. ఆ పీటలు గనక చల్లారితే మళ్ళీ వాటిని నరకాగ్నిలో వేడి చేసి వాతలు పెట్టడం జరుగుతూ వుంటుంది. ఇలా యావత్తు మానవుల తీర్పు ముగిసే వరకు కొనసాగుతూనే వుంటుంది.

*(సహీ ముస్లిం - కితాబుజ్జకాత్, బాబ్ : ఇస్మిమానె ఇజ్జకాతి)*

వేరొక హదీసులో ఇలా హెచ్చరించారు :

"ఒంటెలు, ఆవులు, లేదా మేకలు కలిగి వున్న వ్యక్తి వాటి హక్కు (జకాత్)ను గనక చెల్లించకపోతే ప్రళయ దినాన ఆ పశువులు బాగా పెరిగి బలిసిపోయిన వాటిలా చేసి తీసుకు రాబడతాయి. తదుపరి అవి ఒకదాని తర్వాత

మరొకటి వరుసగా ఆ వ్యక్తిని కొమ్ములతో పొడిచి కాళ్ళతో తొక్కి వేస్తాయి. చివరి పశువు కూడా పొడిచి తొక్కి వేసిన తర్వాత తిరిగి మొదటి పశువు వచ్చేస్తుంది. ఈ విధంగా ఈ యాతన యావత్తు మానవులను గురించి తీర్పు ముగిసే వరకు కొనసాగుతుంది''. *(సహీ ముస్లిం - కితాబుజ్జకాత్, బాబ్ : తగ్‌లీజ ఉఖూవతి మల్లాయు వద్దిజ్జకాత)*

ఇంకో హదీసులో ఇలా సెలవిచ్చారు.

''జకాత్ చెల్లించని వారి సంపద నాశనమైపోతుంది''. *(తబ్రాని)*

పై విషయాల ప్రాధాన్యతను గుర్తించే అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) తన పరిపాలనా కాలంలో నమాజ్, జకాత్‌ల మధ్య వ్యత్యాసం చూపే వారితో, నమాజ్‌ను స్థాపించినప్పటికీ జకాత్ చెల్లించని వారితో జిహాద్ చేస్తానని చెబు తుండేవారు.

జకాతే కాకుండా మనిషి మామూలుగా చేసే దానం (సదఖా) ప్రాధాన్యతను గూర్చి వివరిస్తూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఓసారి తన సహచరులతో మాట్లాడుతూ-మీలో తన ధనం కన్నా తన వారసుల ధనాన్ని ఎక్కువగా ఇష్టపడే వాళ్ళెవరైనా వున్నారా? అని అడిగారు.

అది విన్న సహచరులు ''మాలో ప్రతి ఒక్కరికీ తన ధనమంటేనే యెక్కువ ఇష్టం దైవ ప్రవక్తా! అని విన్నవించుకున్నారు. దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ : మనిషి (దాన ధర్మాలు చేసి) ముందుకు పంపించుకున్నదే అతని ధనం. ఆ తరువాత అతను వదిలిపెట్టి పోయే ధనమంతా అతని వారసులదే'' అని వివరించారు. *(సహీ బుఖారి : 6442)*

జకాత్ చెల్లింపు వివరాలను గూర్చి సమగ్రంగా తెలుసుకోవడానికి ఇక్బాల్ కీలానీ గారి 'జకాత్ కే మసాయల్' పుస్తకాన్ని చదవగలరు. పూర్తి వివరాలు వ్రాయడానికి ఇక్కడ అవకాశం లేదు.

యిక ప్రస్తుత ముస్లిం సమాజానికి వస్తే, ఇందులో ధనవంతులై వుండి కూడా జకాత్ చెల్లించని వారు ఎంతో మంది మనకు కాన వస్తారు. అలాంటి వారు అల్లాహ్ శిక్ష నుండి ఎలా బయట పడగలరు?





దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో నమాజ్, జకాత్‌లకు సమాన ప్రాధాన్యత వుందనీ, వీటిలో ఏది లోపించినా ముందు కష్టాలు తప్పవని వీరికి తెలిస్తే ఎంత బాగుండేదో!

ప్రళయం రోజు నమాజుల నిధులతో అల్లాహ్ వద్ద హాజరైనప్పటికీ జకాత్ శిక్షలను చవిచూసే పరిస్థితి ఎవరికీ రాకూడదు సుమా!

## 3) ఉపవాసం (రోజా)

నమాజ్, జకాత్‌ల లాగే ఉపవాసము కూడా అల్లాహ్‌ను సంతృప్తిపరచడానికి మనిషి చేసే ఆరాధనల్లో ఒక ముఖ్యమైన ఆరాధన.

దీనిని గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

''విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడినది. ఏ విధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించిన వారిపై విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది.'' *(బఖర : 183)*

''అల్లాహ్ మీకు ప్రసాదించిన మహోపదేశానికి గాను మీరు అల్లాహ్ ఔన్నత్యాన్ని కొనియాడటానికి, ఆయనకు మీరు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ఈ పద్ధతి తెలుపబడుతోంది.'' *(బఖర : 186)*

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా వేర్వేరు హదీసుల్లో ఉపవాసం వాస్తవికతను, దాని ప్రయోజనాలను చక్కగా వివరించి చెప్పారు.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు.

''అల్లాహ్ ఇలా తెలియ జేస్తున్నాడు: ఆదం తనయుడు చేసే సత్కార్యా లన్నీ తనకోసమే వున్నాయి. కానీ ఉపవాసం మాత్రం ప్రత్యేకంగా నాకోసమే వుంది. అందుకు నేనే స్వయంగా దానికి ప్రతిఫలమిస్తాను. ఉపవాసం ఒక డాలు వంటిది. మీలో ఎవరైనా ఉపవాసం పాటిస్తే వారు అశ్లీలపు పలుకులు పలుక రాదు, గొడవల్లోకి దిగరాదు, ఎవరైనా దూషించినా, లేక జగడానికి దిగినా, వారితో తాము ఉపవాసం పాటిస్తున్నామని చెప్పేయాలి.''

ఎవరి ఆధీనంలో మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణం వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షి! ఉపవాసకుడి నోటివాసన ప్రళయం రోజు అల్లాహ్ దగ్గర కస్తూరి సువాసన కన్నా శ్రేష్ఠమైనది. ఉపవాసి రెండు రకాల ఆనందాలతో తన్మయం చెందుతాడు. మొదటిది, తన ఉపవాసం విరమించేటప్పుడు, రెండవది ఉపవాస ప్రతిఫలంతో తన ప్రభువును సందర్శించినప్పుడు.''

*(ముస్లిం- కితాబుస్సియామ్, బాబ్: ఫజ్లిస్సియామి)*

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: ఉపవాసం మరియు ఖురాన్ ప్రళయం రోజు దాసుని గురించి సిఫారసు చేస్తాయి. ఉపవాసం ఇలా అంటుంది: ప్రభూ !నేను ఈ దాసుణ్ణి అన్నపానీయాల నుండి, మనో వాంఛలు తీర్చుకోవడం నుండి ఆపి వుంచాను. కనుక ఇతని విషయంలో నా సిఫారసును ఆమోదించు. తర్వాత ఖురాన్ ఇలా విన్నవించుకుంటుంది: ప్రభూ! నేను ఈ దాసుణ్ణి రాత్రిళ్ళు నిద్ర పోకుండా ఆపి వుంచాను. కనుక ఇతని విషయంలో నా సిఫారసు ఆమోదించు. ఆవిధంగా వారిరువురి సిఫారసూ ఆమోదించబడుతుంది.'' *(ముస్నద్ అహ్మద్)*

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: స్వర్గంలో 'రయ్యాన్' అనే ఒక ద్వారం వుంది. ప్రళయదినాన ఉపవాసం పాటించేవారు మాత్రమే ఆ ద్వారం గుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. (దైవ దూతలు) ఉపవాసం పాటించేవారు ఎక్కడున్నారు? అని పిలుస్తారు. దానికి వారంతా ఆ ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశిస్తారు. చివరికి వారంతా (స్వర్గంలో) ప్రవేశించిన తర్వాత ఆ ద్వారం మూసి వేయబడుతుంది. ఇక ఎవరూ దాని గుండా ప్రవేశంచలేరు.

*(ముస్లిం- కితాబుస్సియామ్, బాబ్: ఫజ్లిస్సియామ్)*

ఉపవాసం పాటించే సమయంలో మనిషి చెడు చేష్టలకు, ప్రదర్శనాబుద్ధికి దూరంగా వున్నప్పుడే పైన పేర్కొన్న ప్రయోజనాలు చేకూరుతాయని ఆశించవచ్చు. అలా కాని పక్షంలో అంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.





అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరైనా (ఉపవాసం వుండి) అబద్ధమాడటాన్ని, చెడు చేష్టలను త్యజించలేదో అలాంటి వ్యక్తి అన్న పానీయాలు వదులుకోవడం అల్లాహ్‌కు ఎంత మాత్రం అవసరం లేదు.'' *(సహీ బుఖారి: 1903)*

మరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజమైన మనం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ రంజాన్ నెలలో విధిగా పాటించాల్సిన నెలరోజుల ఉపవాసమే కాకుండా వీలైనంత ఎక్కువగా నఫిల్ ఉపవాసాలు పాటించి అల్లాహ్ మెప్పును పొందటానికి ప్రయత్నించాలి.

నఫిల్ (ఐచ్ఛిక) ఉపవాసాలకు సంబంధించిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞలను పరిశీలిస్తే షవ్వాల్ నెలలో ఆరు రోజులు, ప్రతినెలా మూడు రోజులు, ప్రతి సోమ, గురు వారాల్లో, ప్రతినెలా 13, 14,15 వ తేదీలూ, (హిజ్రీ క్యాలండర్ ప్రకారం) ముహర్రం నెల 9, 10 లేదా 10, 11 వ తేదీలలో, అరఫాత్ దినం నాడు ఉపవాసం పాటించడం కానవస్తాయి. అలాగని వేరే ఇతర సమయాల్లో ఉపవాసం పాటించకూడదన్న షరతు ఏమీ లేదు. మనిషి స్వచ్ఛందంగా తన సౌలభ్యాన్ని బట్టి ఎప్పుడైనా నఫిల్ ఉపవాసాలు పాటించవచ్చు. అయితే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా పేర్కోన బడని దినాలను తమ కోసం ప్రత్యేకం చేసుకొని కేవలం ఆ రోజుల్లోనే ఉపవాసం పాటించడం మాత్రం. ఖచ్చితంగా త్యజించదగ్గ విషయం. అలాగే స్త్రీ కూడా తన భర్త ఇంట్లో ఉన్నప్పుడు అతని అనుమతి తీసుకున్న తర్వాతనే నఫిల్ ఉపవాసాలు పాటించవలసివుంటుంది.

## (4) హజ్ - ఖుర్బానీ

శారీరక ఆరాధనల్లో, అల్లాహ్ ఆర్థిక స్థోమతను ప్రసాదించిన వారిపై అనివార్యమైవున్న ముఖ్య ఆరాధనల్లో హజ్ కూడా ఒకటి. అల్లాహ్ దీనిని ఇస్లాం మౌలికాంశాలలో చేర్చడాన్ని బట్టి చూస్తే దీనికున్న ప్రాధాన్యత అర్థమవుతుంది. అందుకే ఆర్థిక స్థోమత కలిగిన ప్రతివ్యక్తీ, తన జీవిత కాలంలో కనీసం ఒక్కసారైనా హజ్ యాత్రను గావించవలసి వుంటుంది.

"ప్రజలపై అల్లాహ్‌కు వున్న హక్కు ఏమిటంటే ఈ కాబా గృహానికి వెళ్ళే శక్తి గలవారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి". *(ఆలిఇమ్రాన్: 97)*

"హజ్, ఉమ్రాలను అల్లాహ్ సంతోషం కోసం నెరవేర్చండి". *(బఖర:196)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా చేయటం, వాటి మధ్య జరిగిన పాపాలకు బదులుగా పరిహారం (కఫ్ఫారా) అవుతుంది మరిము స్వీకార ముద్ర పడిన హజ్‌కు ప్రతిఫలం స్వర్గం తప్ప మరొకటిదిలేదు."

*(సహీ ముస్లిం: కితాబుల్ హజ్, బాబ్: ఫజలిల్ హజ్ వల్ ఉమ్రా)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరైనా ఈ ఇంటికి (కాబా గృహం) విచ్చేసి (హజ్ కోసం), ఏవిధమైన అశ్లీలపు మాటలు పలకకుండా, ఎలాంటి పాపాలకు, వ్యర్థ విషయాలకు, దైవ అవిధేయతకు పాల్పడకుండా జాగ్రత్త పడతాడో, అతను ఆరోజే మాతృగర్భం నుంచి పుట్టినవానిలా (పరమ పవిత్రుడై) తిరిగి వెళతాడు."

*( సహీముస్లిం: కితాబుల్ హజ్, బాబ్: ఫజ్లిల్ హజ్ వల్ ఉమ్రా)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం మూడు మస్జిద్‌లకు తప్ప మరే చోటికీ పుణ్యఫలాపేక్షతో ప్రయాణం చేయడాన్ని వారించారు.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"మూడు మస్జిద్‌ల సందర్శనం కోసం తప్ప మరే స్థల సందర్శనానికి (పుణ్యఫలాపేక్షతో ) ప్రయాణం చేయకండి. ఆ మస్జిద్‌లు 1) మస్జిదుల్ హరాం 2) మస్జిదె నబవి 3) మస్జిదె అఖ్సా."

*(సహీ ముస్లిం: కితాబుల్ హజ్ , బాబ్: ఫజ్లిల్ మసాజిదిస్సలాసతి)*

అయితే ప్రస్తుత ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహం ఇక్కడ కూడా త్రప్పటడుగు వేసింది. అల్లాహ్ మెప్పును పొందటానికి హజ్, ఉమ్రా





యాత్రలు చేయటానికి ప్రయత్నించడానికి బదులు, వివిధ దేశాల్లో, వివిధ ప్రాంతాలలో నెలకొని వున్న గతకాలానికి చెందిన పుణ్య పురుషులు, సూఫీ మహాశయులు, మతి స్థిమితంలేని పిచ్చివాళ్ళు, చివరికి జంతువుల సమాధుల్ని కూడా పుణ్య ఫలాన్ని ఆశించి సందర్శిస్తోంది. ఈ సందర్భంగా, "ఎవరైతే ఏడు సార్లు ఆజ్మీర్ షరీఫ్ ను సందర్శిస్తారో అతనికి ఒక హజ్ చేసినంత పుణ్యం లభిస్తుంది." అన్న విచిత్రమాట మనకు వినిపిస్తూ వుంటుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంతో ఈ మాటకు ఏదైనా సంబంధం వుందా చెప్పండి? మూడు మస్జిద్‌లకు తప్ప ఇతర ప్రదేశాలకు పుణ్య ఫలాపేక్షతో సందర్శించడానికి షరియత్తు అనుమతి ఇవ్వలేదు. మరి అలాంటప్పుడు ఏదో ఒకటి ఆశించి దైవేతరుల సమాధుల్ని సందర్శించడం అనేది ఎంత వరకు సమంజసం? ఇలాంటి పనుల్లో నిమగ్నమై వున్న వారికి ఇహలోకం ఎలా వున్నా పరలోకంలో మాత్రం కష్టాలు తప్పవు.

సమాధుల సందర్శనం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు. 'నేను గతంలో మిమ్మల్ని సమాధుల్ని సందర్శించడాన్ని వారించాను. కానీ ఇప్పుడు మీరు సమాధుల్ని సందర్శించవచ్చు. ఎందుకంటే సమాధుల సందర్శనం మీకు మరణాన్ని జ్ఞప్తికి తెస్తుంది.' *(అబూదావుద్ : 3235)*

ఇక్కడ సమాధుల సందర్శనం అంటే సామాన్య ప్రజానీకం యొక్క సమాధులు గానీ, మజార్లు కాదు. ఎందుకంటే స్మశాన వాటికను సందర్శించే వ్యక్తికి సహజంగానే దైవభక్తి, పరలోక చింతన మరియు మరణం అనేవి గుర్తుకు వస్తాయి. మరి మజార్లను చూసి ఎవరికైనా ఈ విషయాలు గుర్తుకొస్తాయా?

ఇక ఖుర్బానీ గురించి తెలుసుకొందాం.

దివ్యఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ప్రవక్తా! : నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి, ఖుర్బానీ కూడా యివ్వు."

*(కౌసర్ : 2)*

ఈ ఆయత్ ద్వారా మనకు బోధపడే విషయమేమిటంటే నమాజు, ఖుర్బానీ- ఈ రెండూ కేవలం అల్లాహ్‌కే చెందిన హక్కులు. కాబట్టి దైవేతరుల కోసం వీటిని పాటించడం అనేది బాహాటంగా షిర్క్‌కు ఒడిగట్టడమే అవుతుంది.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఇస్లాం లో 'అఖ్ర్' అనేది లేదు."

అబ్దుర్రజ్జాఖ్ కథనం : ప్రజలు అజ్ఞాన కాలంలో సమాధుల వద్ద మేకలు వగైరా... బలి యిచ్చేవారు. (దీనినే అఖ్ర్ అని పిలుస్తారు) *(అబూదావూద్ : 3222)*

పై హదీస్ ద్వారా సమాధుల వద్ద జంతు బలి అనేది అజ్ఞాన కాలపు ముష్రిక్కుల ఆచారమనీ, ఇస్లాంలో అది పూర్తిగా నిషేధించబడినదని తెలుస్తోంది. అందుకే అల్లాహ్ కూడా నిషేధ వస్తువులను గురించి వివరిస్తూ దివ్య ఖురాన్‌లో ఇలా తెలియజేశాడు:

"బలిపీఠం (అస్థానా) పై వధించబడిన జంతువు కూడా మీకు హరాం".
*(మాఇద : 3)*

ఈ వాస్తవాలను తెలుసుకున్న తర్వాత, దైవేతరుల సమాధుల వద్ద, నేడు ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహం ఉర్సుల పేరుతో, న్యాజ్, ఫాతిహాల పేరుతో జంతువులను జిబహ్ చెయ్యటంలో ఎంత నిజం వుందో ఇట్టే అర్థమవుతుంది.

ఇవన్నీ బహుదైవారాధన (షిర్క్) పనులనీ, ఇస్లాం వీటిని పూర్తిగా నిషేధించిందనీ వీరికి తెలిస్తే ఎంత బాగుండేదో!

## 5. మొక్కుబడులు, అర్పణలు

ఈ రెండు విషయాలు కూడా అల్లాహ్‌కే చెందిన ప్రత్యేక హక్కులు. దైవేతరుల కొరకు, వారెంత గొప్పవారైనా సరే, ఇవి పూర్తిగా నిషేధించబడ్డాయి. అయితే మొక్కుబడి విషయానికొస్తే మాత్రం దానికి దూరంగా వుండడమే ఉత్తమం. ఎందుకంటే మెక్కుబడి వల్ల ప్రయోజనమేమీ కలుగదని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారు.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:





"మొక్కబడి అనేది మనిషికి తన అదృష్టంలో లేని ఏ ప్రయోజనమూ చేకూర్చదు. కాకపోతే మొక్కుబడి అతణ్ణి తన అదృష్టంలో వ్రాసి వున్న దానివైపునకు తీసుకెళ్ళి కలుపుతుంది. మొక్కుబడి ద్వారా అల్లాహ్ పిసినారి చేత కూడా డబ్బు ఖర్చు చేయిస్తాడు. ఆ పిసినారి, మొక్కుబడికి పూర్వం ఇవ్వనిది, మొక్కుబడి కారణంగా ఇచ్చివేస్తాడు." *(సహీ బుఖారి: 4694)*

అయినప్పటికీ, ఒకవేళ అల్లాహ్ కొరకు ఏదైనా మొక్కబడి చేసుకొంటే దానిని మాత్రం తప్పని సరిగా నెరవేర్చవలసి వుంటుంది.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) ఒకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు: దైవ ప్రవక్తా! "నేను అవిశ్వాసిగా వున్నప్పుడు ఓ రోజు (కాబా గృహంలో) ఏతెకాఫ్ పాటిస్తానని మొక్కుబడి చేసుకొన్నాను" అని విన్నవించు కున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ : 'నీ మొక్కుబడిని తీర్చుకో' అన్నారు. *(సహీ బుఖారి : 3144)*

కానీ దైవేతరుల కోసం చేసుకొన్న మొక్కుబడిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ తీర్చకూడదు. ఇది పూర్తిగా నిషేధించబడినది.

ప్రస్తుత ముస్లిం సమాజంలో ఈ దురాచారం కూడా బాగా ప్రబలి వుంది. బాహాటంగా దైవేతరుల కోసం మొక్కుబడులు చేసుకొంటోంది. తమ ఫలానా కోరిక నెరవేరితే మీ మజార్‌ను దర్శించుకొని తలనీలాలు అర్పించుకుంటానని ఒకరు మ్రొక్కుకుంటే, న్యాజ్, ఫాతిహా చేసి ఒక మేకను అర్పించుకుంటానని మరొకరు మ్రొక్కుకుంటున్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధర్మం వీటన్నింటికీ అతీతమైనది, పరిశుద్ధ మైనదీను.

యిక అర్పణల విషయానికొస్తే:

దానాలూ, అర్పణలు అనేవి కేవలం అల్లాహ్ కొరకు, అల్లాహ్ ప్రసన్నతను పొందడానికి మాత్రమే జరగాలి. దైవేతరుల అస్థానాల వద్ద జరిగే దానాలూ, అర్పణలు ఇస్లాంలో పూర్తిగా నిషేధించబడినవి.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"విశ్వసించిన ప్రజలారా ! మీరు సంపాదించిన ధనంలోని, మేము మీ కొరకు నేల నుండి ఉత్పత్తి చేసిన దాని లోని మేలైన భాగాన్ని అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టండి. ఆయన మార్గంలో ఇవ్వటానికి పనికి రాని వస్తువులను ఏరి తీసే ప్రయత్నం చేయకండి." *(బఖర: 267)*

"మంచి మార్గంలో మీరు ఖర్చు చేసే ధనం మీకే మేలు చేకూరుస్తుంది. అసలు మీరు ఖర్చు చేసేది అల్లాహ్ సంతోషం పొందటానికేగా. కనుక మంచి మార్గంలో మీరు ఏమి ఖర్చు చేసినా దాని ప్రతిఫలం మీకు పూర్తిగా లభిస్తుంది. మీకు అన్యాయం మటుకు ఎంత మాత్రం జరుగదు." *(బఖర : 272)*

అదీ బిన్ హాతిం (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు:

"ఒక ఖర్జూరపు ముక్కనయినా సరే దానం చేసి నరకాగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడు కొండి."

*(సహీ ముస్లిం: కితాబుజ్జకాత్, బాబుల్ హస్సి అలస్సదఖతి వలోబెషిక్కిన్)*

యిక దైవేతరుల మందిరాలు, అస్థానాల వద్ద జరిగే దానాలూ, అర్పణలను గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒక వ్యక్తి కేవలం ఒక్క ఈగ వల్ల స్వర్గంలో ప్రవేశించగా, మరొక వ్యక్తి ఒక్క ఈగ వల్లనే నరకంలో ప్రవేశించాడు." ఇది విని సహచరులు (ఆశ్చర్యంతో) ... ఓ దైవ ప్రవక్తా! అదెలా జరిగిందని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ- ఒకసారి ఇద్దరు స్నేహితులు ప్రయాణిస్తూ ఒక ప్రాంతం గుండా వెళ్తుండగా, ఆ ప్రాంతీయులు వారిని ఆపి ముందుకు వెళ్ళనివ్వలేదు. వారి దగ్గర్నుండి బయట పడటానికి 'తమ ఆరాధ్య దైవమైన ఒక విగ్రహానికి ఏదైనా అర్పించాలి' అన్న షరతు విధించారు. దీనికి, ఆ ఇద్దరు స్నేహితుల్లో ఒకడు - 'అర్పించడానికి నా దగ్గరేమీ లేదు' అని విన్నవించుకున్నాడు. వారతనితో- ఏదైనా సరే, చివరికి ఒక ఈగనైనా సరే అర్పించుకో అని పలికారు. దానికతడు





ఒక ఈగను పట్టి తెచ్చి ఆ విగ్రహానికి అర్పించాడు. దానికి వారు సంతృప్తిపడి అతణ్ణి విడిచిపెట్టారు. కానీ అతను షిర్క్‌కు పాల్పడినందున నరకాగ్నిలోకి విసిరి వేయబడ్డాడు. ఇక రెండవ వ్యక్తి మాత్రం (ఏకదైవారాధకుడు అయినందువల్ల) నేను అల్లాహ్‌కు తప్ప యెవరికీ ఏమీ అర్పించుకోనని స్పష్టం చేశాడు. ఈ మాట విని వారు ఆగ్రహం చెంది అతణ్ణి చంపేశారు. కానీ వాస్తవానికతను వీరమరణం పొంది స్వర్గ ప్రవేశ భాగ్యం పొందాడు. *(ముస్నద్ అహ్మద్)*

అలాగే దైవేతరుల పేరుతో ప్రమాణం చేయటం కూడా షిర్కే. అయితే దీనిని షిర్కె అస్‌గర్ (చిన్న షిర్క్) అంటారు.

సాద్ బిన్ ఉబాదా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఒక వ్యక్తిని, 'కాబా గృహం సాక్షి! అని ప్రమాణం చేస్తుండగా విని, అతనికి, దైవేతరుల మీద ప్రమాణం చేయకు. దైవేతరుల మీద ప్రమాణం చేసేవాడు దైవ తిరస్కారానికీ లేక బహుదైవారాధన (షిర్క్)కు పాల్పడినట్లేనని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చెబుతుండగా నేను విన్నాను' అని ఉపదేశించారు. *(అబూదావూద్ : 3251)*

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు.

"మీరు మీ తాత ముత్తాతల మీద ప్రమాణం చేయటాన్ని అల్లాహ్ వారించాడు. కనుక మీలో ఎవరైనా ప్రమాణం చేయదలుచుకుంటే అల్లాహ్ మీద ప్రమాణం చేయాలి లేదా వూరుకోవాలి."

*(సహీ ముస్లిం : కితాబుల్ హజ్, బాబ్ : జవాజి తాలిఖిల్ ఇహ్రామి)*

ప్రస్తుత ముస్లిం సమాజంలో చాలా మంది అజ్ఞానం వల్ల తెలియక దివ్య ఖురాన్ మీద ప్రమాణం చేస్తుంటారు. ఇది కూడా ఒక తప్పుడు కార్యము. కనుక దీనిని కూడా త్యజించవలసిన అవసరం ఎంతైనా వుంది.

## 6) మంచిని ఆజ్ఞాపించడం, చెడు నుండి నిరోధించడం :

మనిషి చేసే శారీరక ఆరాధనల్లో ఇది కూడా ఒక ముఖ్యమైన ఆరాధన. వాస్తవానికి ఇది దైవ ప్రవక్తల పనిగా వుండేది. అయినప్పటికీ ప్రతి అనుచర

సమాజానికి 'మంచిని ఆజ్ఞాపించండి, చెడు నుండి నిరోధించండి' అని అల్లాహ్ ఆదేశించాడు. దీనిని బట్టే అల్లాహ్ దృష్టిలో దీనికెంత ప్రాధాన్యత వుందో అర్థమవుతుంది. యిక అంతిమ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజమైన మనం ఈ ఆదేశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ త్యజించలేం. కారణం ఇక ప్రళయం వరకూ ఏ ప్రవక్త కూడా రాడు. అందుకే ప్రవక్తలపై మోపబడిన బరువు బాధ్యతలన్నీ ప్రస్తుతం ముస్లిం సమాజంపై మోపబడ్డాయి.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఇక నుండి ప్రపంచంలో మానవులకు సన్మార్గం చూపటానికి, వారి సంస్కరణకు రంగంలోకి తీసుకురాబడిన ఉత్తమ సమాజం మీరే. మీరు మంచిని చెయ్యండి అని ఆజ్ఞాపిస్తారు. చెడు నుండి ఆపుతారు, అల్లాహ్‌ను విశ్వసిస్తారు".

*(ఆలి ఇమ్రాన్ : 110)*

"మీలో మంచి వైపుకు పిలిచేవారూ, మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించే వారూ, చెడు నుండి వారించేవారు కొందరు తప్పకుండా వుండాలి. ఈ పనిని చేసేవారే సాఫల్యం పొందుతారు". *(ఆలి ఇమ్రాన్ : 104)*

హుజైఫా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు: "ఎవరి గుప్పెట్లో నా ప్రాణం వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షిగా చెబుతున్నాను! మీరు తప్పనిసరిగా మంచిని గురించి ఆజ్ఞాపించండి, చెడు నుండి వారించండి. లేకపోతే త్వరలోనే అల్లాహ్ మీపై తన తరపు నుండి ఏదైనా శిక్షను అవతరింపజేయవచ్చు. ఇక ఆ తరువాత మీరు ఎంతగా ప్రార్థించినా మీ ప్రార్థనలు ఆలకించబడవు."

*(తిర్మిజి : అబ్ వాబుల్ ఫితన్, బాబ్ మాజా ఫిల్ అమ్రి బిల్ మారూఫి వన్నహ్యి అనిల్ మున్కరి)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఇలా ప్రభోదిస్తుండగా తాను విన్నానని అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు : మీలో ఎవరైనా, ఏదైనా చెడు జరుగుతుండగా చూస్తే (ముందు) దాన్ని చేత్తో ఆపడానికి ప్రయత్నించాలి. అంత శక్తి గనక లేకపోతే నోటితోనైనా దాన్ని వారించాలి. అదీ





చేయలేకపోతే (కనీసం) మనసులోనైనా దానిని చెడుగా భావించాలి. ఇది విశ్వాసపు అతి బలహీన స్థాయి.

*(సహీ ముస్లిం : కితాబుల్ ఈమాన్, బాబ్ : కౌనిన్నహ్యి అనిల్ మున్కరి మినల్ ఈమాన్)*

ఇక ఈ కార్యాన్ని సక్రమంగా నిర్వహించని అనుచర సమాజాలకు ఏం గతి పట్టిందో చూడండి :

"ఇస్రాయీలు సంతతి వారిలో అవిశ్వాస మార్గం అవలంబించిన వారిని దావూద్ (అలైహిస్సలాం) నోట, మర్యమ్ కుమారుడైన మసీహ్ (అలైహిస్సలాం) నోట శపించడం జరిగింది. ఎందుకంటే వారు అవిధేయులయ్యారు, అత్యాచారాలు చేయసాగారు. చెడు పనులు చెయ్యకుండా ఒకరి నొకరు నిరోధించడం మానివేశారు. వారు అవలంబించిన మార్గం చాలా చెడ్డది." *(మాఇద : 78-79)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా తెలియజేశారు : ఇస్రాయీలు జాతి దురాగతాలకు ఒడిగట్టినప్పుడు వారి మత పండితులు వారిని వారించారు. కానీ వారు మాత్రం పాపాలు చేయటం మానలేదు. ఆ తర్వాత మత పండితులు కూడా (నిర్మొహమాటంగా) వారితో పాటు కూర్చోవడం, తినడం, త్రాగడం మొదలు పెట్టారు. దానితో అల్లాహ్ వారందరి హృదయాలను ఒకేలా మార్చేశాడు. ఇంకా దావూద్ (అలైహిస్సలాం) మరియు ఈసా (అలైహిస్సలాం) నోట వారిని శపించాడు. ఎందుకంటే వారు (అల్లాహ్‌కు) అవిధేయత చూపారు. అత్యాచారాలు చేయడం మొదలు పెట్టారు.

ఇలా అన్నాక, ఆనుకొని కూర్చొని వున్న ఆయన ఒక్కసారిగా లేచి సరిగ్గా కూర్చొని "తప్పదు, ఎవరి గుప్పెట్లో నా ప్రాణం వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. మీరు ప్రజల్ని సత్యం వైపునకు మళ్ళించే దాకా (మీకు మోక్షం లభించదు)" అని ఉపదేశించారు.

*(తిర్మిజి : అబ్‌వాబ్ తఫ్సీరుల్ ఖురాన్, వమిన్ సూరతుల్ మాఇద)*

సమాజంలో ప్రబలే చెడును నిరోధించకుండా, చూసీ చూడనట్లు వూరుకుంటే జరిగే పర్యవసానాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక చక్కటి ఉదాహరణతో పోల్చి చెప్పారు.

నోమాన్ బిన్ బషీర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు. "అల్లాహ్ హద్దులకు లోబడి నడుచుకొనే వారు మరియు వాటిని అతిక్రమించే వారి ఉదాహరణ ఎలాగుం దంటే, కొంత మంది (ఒక నావలో ప్రయాణించదలచి అందులోని పై మరియు క్రింది భాగాల కోసం) చీటీ వేశారు. దాని ప్రకారం కొంత మంది పైభాగం లో కూర్చున్నారు. మరికొంత మంది క్రింది భాగంలో కూర్చున్నారు. (నావ సముద్రంలో ప్రయాణిస్తున్నప్పుడు) క్రింది వాళ్ళకు నీళ్ళు అవసరమైతే వాళ్ళు పైభాగానికి, పైన కూర్చున్న వారి మధ్య నుండి వెళ్ళవలసి వచ్చేది. (ఇది పైనున్న వారికి ఇబ్బందికరంగా వుండేది)

(అది గమనించిన) క్రింది వాళ్ళు, మనం క్రింది భాగంలోనే ఒక రంధ్రం చేసుకొని (నీళ్ళు తోడుకుంటే) పైన వున్నవాళ్ళకు ఇబ్బంది కలుగకుండా ఉంటుంది కదా- అని అనుకున్నారు. అలాంటి సమయంలో పై భాగంవాళ్ళు గనక క్రింది వారిని వారు తలబెట్ట దలచిన కార్యం నుండి వారించకపోతే అందరూ (మునిగి) చనిపోతారు. అలా కాక, క్రింది వాళ్ళను అలా చేయకుండా చేత్తో ఆపితే తామూ మరియు వారందరూ కూడా బ్రతికి బయటపడతారు."

*(సహీ బుఖారీ : 2686)*

అయితే ప్రస్తుత ముస్లిం సమాజంలో ఒక విచిత్ర పరిస్థితి నెలకొని వుంది. కొందరు ఈ కార్యాన్ని పూర్తిగా నిర్వర్తించడమే మానేశారు. మరికొందరు దీనిని పాటిస్తున్నప్పటికీ దీనికి ముందస్తు కావలసిన షరతులను పెడచెవిన పెడు తున్నారు. అవి యేమిటంటే :

1. మంచీ చెడులకు సంబంధించిన జ్ఞానము : ధార్మిక పరంగా మంచి పనులంటే కేవలం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పాటించమని ఆదేశించిన పనులు. యిక చెడ్డ పనులంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారించిన పనులు. మంచి పనుల్లో ఏకదైవారాధన (తౌహీద్) మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్‌లు శ్రేష్ఠమైనవి కాగా షిర్క్ మరియు బిద్అత్ (ధర్మంలో లేని కొత్త పోకడలు) అత్యంత చెడ్డ పనులు. వీటిని గురించిన జ్ఞానం కలిగి వుండాలి.





2. తనకు తెలిసిన వాటిని ఇతరులకు బోధించే ముందు స్వయంగా తాను పాటిస్తూ వుండాలి.

3. ప్రదర్శనా బుద్ధి నుండి దూరంగా వుండాలి.

ఈ మూడు షరతులు పాటిస్తూ ఈ కార్యాన్ని నిర్వర్తించినపుడే దాని ప్రభావం ఇతరులపై పడే అవకాశం వుంది. అలా కాని పక్షంలో, ప్రజలను రుజుమార్గం వైపునకు ఆహ్వానించే మాట అటుంచి మార్గ భ్రష్టత్వానికి గురి చేసే ప్రమాదం వుంది.

తౌహీద్ గురించి సంపూర్ణంగా తెలియని వాడు దానిని గురించి ఇతరు లకు బోధించగలడా?

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి నమాజ్ విధానం తెలియని వాడు ఇతరులకాపద్ధతి నేర్పగలడా?

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజమైన మనం ముందుగా దైవ ప్రవక్తల (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మానికి సంబం ధించిన సామాన్య జ్ఞానాన్ని కనీసం ముందు అర్జించాలి. తదుపరి దానిని ముందు స్వయంగా ఆచరణలో పెట్టాలి. ఆ తర్వాతే ఇతరులకు దానిని గురించి బోధించాలి.

తౌహీద్ అల్ ఉలూహియత్‌ను గురించిన సమగ్రమైన వాస్తవికత యిది.

# తౌహీద్-అల్ - అస్మా వ సిఫాత్

తౌహీద్ అల్ రుబూబియత్, తౌహీద్ అల్ ఉలూహియత్ తర్వాత తౌహీద్ లోని మూడవ రకమైన తౌహీద్ అల్ అస్మా వ సిఫాత్ గురించి వివరంగా తెలుసు కుందాం.

తౌహీద్ అల్ అస్మా వ సిఫాత్ అంటే అల్లాహ్‌కు చెందిన పేర్లలో, గుణ గణాల్లో అల్లాహ్‌ను సంపూర్ణుడిగా, ఒక్కడిగా విశ్వసించడం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్ మంచి పేర్లకు అర్హుడు, ఆయనను మంచి పేర్లతోనే వేడుకోండి. ఆయనను మంచి పేర్లతో పిలిచే విషయంలో సత్యం నుండి వైదొలిగే వారిని వదిలి పెట్టండి". *(ఆరాఫ్ : 180)*

"ఇలా అను : అల్లాహ్ అని అయినా పిలవండి లేదా రహ్మాన్ అని అయినా సరే. ఏ పేరుతో ఐనా పిలవండి, ఆయనకుగల పేర్లన్నీ చక్కనివే".

*(బనీ ఇస్రాయీల్ : 110)*

"అల్లాహ్ - ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనకు ఉత్తమ మైన పేర్లు వున్నాయి." *(తాహా : 8)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్‌కు తొంబై తొమ్మిది పేర్లు వున్నాయి. వాటిని గుర్తు పెట్టుకున్నవాడు స్వర్గానికి పోతాడు."

*(సహీ బుఖారి : 6410)*

వీటిలో కొన్ని యివి :

| | |
|---|---|
| అర్రహ్మాన్ | : కరుణామయుడు |
| అర్రహీం | : కృపాశీలుడు |





| | |
|---|---|
| అస్సమీ | : అంతా వినేవాడు |
| అల్ బసీర్ | : అన్నిటినీ చూసేవాడు |
| అల్ హయ్ | : ఎల్లప్పుడూ సజీవంగా వుండేవాడు |
| అల్ ఖయ్యూం | : నిత్యుడు, అనంతుడు |
| అల్ అలీం | : అంతా తెలిసిన వాడు |
| అల్ ఖదీర్ | : అన్నిటిపై అధికారం కలవాడు |
| అల్ ఖాలిఖ్ | : సృష్టికర్త |
| అల్ రాజిఖ్ | : పోషించేవాడు. |

అయితే దివ్యఖురానులోగానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ప్రామాణిక హదీసుల్లో గానీ పేర్కొనబడని పేర్లతో అల్లాహ్‌ను పిలవడం గానీ, వర్ణించడం గానీ నిషేధించబడినది. ఎందుకంటే, ఒక వేళ వర్ణించబడ్డ పేరు అల్లాహ్ స్థాయికి తగ్గట్టు వుంటే స్వయంగా అల్లాహ్‌యే తన గ్రంథంలో ఉల్లేఖించేవాడు లేదా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ప్రార్థనల్లో ఉపయోగించేవారు. మరి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ పేరును ఎప్పుడూ వాడలేదు కాబట్టి ముస్లిం సమాజానికి కూడా దానిని ఉపయోగించే అనుమతి వుండదు.

## ఇక గుణగణాలను గూర్చి తెలుసుకుందాం

అల్లాహ్ యొక్క గుణగణాలను గూర్చి స్వయంగా అల్లాహ్ తన గ్రంథం లోనూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన హదీసుల్లోనూ వివరించారు. అయితే వాటిని అర్థం చేసుకోవడంలో మాత్రం సలఫుస్సాలిహీన్‌ల దృక్పథాన్ని అనుసరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. అప్పుడే మనం రుజుమార్గంలో వుండగలం. సలఫ్‌ల దృక్పథాన్ని పెడచెవిన బెట్టి స్వంత బుద్ధిని గానీ, ఇతరుల బుద్ధిని గానీ ఉపయోగించి వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే మాత్రం ఖచ్చితంగా పెడత్రోవ పట్టే అవకాశం వుంది. గతించిన ముస్లిం సమాజాన్నీ, ప్రస్తుత ముస్లిం సమాజాన్నీ, నిశితంగా పరిశీలిస్తే దురదృష్ట వశాత్తూ జరిగింది

కూడా అదే. తమ స్వంత బుద్ధి జ్ఞానాలు ఉపయోగించి కొందరు అల్లాహ్ గుణగణాలకు వేరే అర్థాన్ని ఆపాదిస్తే మరికొందరు ఏకంగా వాటన్నింటినీ తిరస్కరించారు. ఈ విధంగా వారు రుజుమార్గం నుండి వైదొలిగారు.

దివ్యఖురానులో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసుల్లో వివరించ బడ్డ అల్లాహ్ యొక్క గుణ గుణాలను గూర్చి సలఫ్ల దృక్పథం ఎలా వుందో డా॥ షేఖ్ సాలెహ్ బిన్ ఫౌజాన్ గారు చాలా చక్కగా వివరించారు. దాని వివరణ యిలా వుంది.

1. వారు (సలఫ్లు) దైవ గ్రంథంలోనూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసుల్లోనూ వివరించబడిన అల్లాహ్ యొక్క గుణగణాలను వాటి బాహ్యార్థం ప్రకారం సంపూర్ణంగా ధృవీకరించి విశ్వసిం చారు. వాటికి వేరే అర్థాలు తొడిగించడం గానీ, వాటి కోసం ప్రయోగిం చబడ్డ పదాల అర్థాన్ని తిరస్కరించడం గానీ చేయలేదు.

2. అల్లాహ్ గుణగణాలకు పోలికలు కల్పించడాన్ని వారు సంపూర్ణంగా తిరస్కరించే వారు. దానికి కారణం-

   దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

   "ఆయనను పోలిన వస్తువు సృష్టిలో ఏదీ లేదు. ఆయన అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడూను." *(షూరా : 11)*

3. అల్లాహ్ యొక్క పేర్లు, గుణగణాల విషయంలో వారు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధృవ పరిచిన హద్దుల లోపలే వుండేవారు. అల్లాహ్, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధృవ పరిచిన వాటిని వారు కూడా సంపూర్ణంగా ధృవీకరించి, వారు తిరస్కరిం చిన వాటిని వీరు కూడా తిరస్కరించేవారు. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేయని విషయాల్లో మౌనం పాటించేవారు.

4. అల్లాహ్ పేర్లు, గుణగణాలు వివరించబడిన ఆయతులు, హదీసులను





వారు ముహ్కమాత్ (స్పష్టమైనవి) కోవకు చెందినవనీ, వాటి అర్థం కూడా స్పష్టంగా వివరించబడిందని విశ్వసించేవారు. వాటి (బాహ్య) అర్థాన్ని ఇతరులకు బోధించడానికి వెనుకాడేవారు కాదు.

5. అల్లాహ్ యొక్క గుణగణాల వాస్తవికతకు సంబంధించిన జ్ఞానాన్ని వారు అల్లాహ్కే వదిలేసేవారు. అంటే దానిని అల్లాహ్ తప్ప మరెవ్వరూ ఎరు గరని ధృఢంగా విశ్వసించేవారు.

*(అఖీదా ఆఫ్ తౌహీద్ - డా॥ సాలెహ్ బిన్ ఫౌజాన్, ఇంటర్నెట్ ప్రతి)*

దివ్యఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ప్రామా ణిక హదీసులను క్షుణ్ణంగా పరిశీలిస్తే అల్లాహ్ గుణగణాలకు సంబందించిన ఎన్నో విషయాలు మనకు బోధపడతాయి. వాటన్నింటినీ వాటి బాహ్యార్థం ప్రకారం సంపూర్ణంగా విశ్వసించి ధృవీకరిస్తూ సలఫ్లను అనుసరించడం తప్పనిసరి.

వాటిలో కొన్నింటిని గూర్చి తెలుసుకుందాం :

## చేతులు :

"ఇబ్లీస్ ! నేను నా రెండు చేతులతో సృజించిన వానికి సజ్దా చెయ్యకుండా నిన్ను ఏ విషయం ఆపింది?" *(సాద్ : 75)*

"అల్లాహ్ చేతులు విశాలంగా వున్నాయి. తాను కోరిన ప్రకారం ఆయన ఖర్చు చేస్తాడు." *(మాఇద : 64)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు. "అల్లాహ్ ఇలా అంటున్నాడు: మీరు ఇతరుల కోసం ఖర్చు చేయండి. నేను మీ కోసం ఖర్చు చేస్తాను" తదుపరి ఇలా ప్రవచించారు:

"అల్లాహ్ కుడి చేయి పూర్తిగా నిండి వుంది. రాత్రింబవళ్ళు ఖర్చు చేసినా ఏ మాత్రం తగ్గదు. మీరు ఒక్కసారి ఆలోచించండి, భూమ్యాకాశాలను సృష్టించి నప్పటి నుండి అల్లాహ్ ఎంతగా ఖర్చు చేశాడో! అయినప్పటికీ తన కుడి చేతిలో వున్నది ఇప్పటి వరకూ ఏ మాత్రం తగ్గలేదు. ఆయన 'అర్ష్' నీటి మీద వుంది

మరియు అతని ఇంకో చేతిలో మరణం వుంది. తాను తలుచుకున్నవారిని ఉన్నత శిఖరాలకు ఎత్తుతాడు, తాను తలుచుకున్న వారిని అణగద్రొక్కుతాడు."

*(సహీ ముస్లిం : కితాబుజ్జకాత్, బాబుల్ హస్సి అలన్నఫ్ఖతి వ తబ్ షీరిల్ మున్ఫఖి బిల్ ఖల్ఫి)*

**కాళ్ళు :**

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు : నరక వాసుల్ని నరకంలో వేయడం జరుగుతూ వుంటుంది. దానికి నరకం "ఇంకా" "ఇంకా" అని అరుస్తూ వుంటుంది. చివరికి మన ప్రభువు తన కాలిని (వేరొక ఉల్లేఖనంలో 'అడుగు' అని వుంది) దానిలోకి వేస్తాడు. దానితో నరకం ఒక్కసారిగా ముడుచుకుపోయి "యిక చాలు" "యిక చాలు" అని అరుస్తుంది. *(సహీ బుఖారి : 7384)*

**కళ్ళు :**

"ప్రవక్తా ! నీ ప్రభువు ఉత్తరువు వచ్చేవరకు ఓర్పు వహించు. నీవు మా దృష్టిలో వున్నావు." *(తూర్ : 48)*

"మేము నూహ్ (అలైహిస్సలాం)ను పలకలు, మేకులు గల దానిపైకి ఎక్కించాము. అది మా కళ్ళ ముందు నడుస్తూ వుండేది." *(ఖమర్ : 13-14)*

"నేను నా తరపు నుండి నీపై (మూసా పై) ప్రేమను ఆవరింప జేశాను. నీవు నా కళ్ళ ముందు పెంచబడే ఏర్పాటు చేశాను" *(తాహ : 39)*

**ముఖం :**

"ఈ పుడమిపై వున్న ప్రతి వస్తువూ నాశనమై పోయేదే, కేవలం మహోన్నత మైన నీ ప్రభువు ముఖం మాత్రమే మిగిలి వుండేది." *(రహ్మాన్ : 26-27)*

"ఒక్క ఆయన ముఖం తప్ప ప్రతీదీ నశించేదే." *(ఖసస్ : 88)*

**రావడం :**

"మేఘాల షామియానాలలో దూతలు వెంట రాగా, అల్లాహ్ వారి





ముందుకు స్వయంగా వచ్చి తీర్పు చెప్పే సమయం కోసం వారు నిరీక్షిస్తున్నారా?" *(బఖర : 210)*

"భూమిని ఎడా పెడా దంచి తుత్తునియలుగా చేయడం జరిగినప్పుడు మీ ప్రభువు అవతరిస్తాడు. దైవదూతలు బారులుగా తీరి నిలబడి వుంటారు."

*(ఫజ్ర్ : 21-22)*

"దైవదూతలు వచ్చి వారి ముందు నిలబడాలనీ, లేదా నీ ప్రభువే స్వయంగా రావాలనీ లేదా నీ ప్రభువు యొక్క కొన్ని బహిరంగ నిదర్శనాలు ప్రత్యక్షం కావాలనీ ప్రజలు నిరీక్షిస్తున్నారా?" *(అన్ఆమ్ : 158)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: మన ప్రభువు ప్రతి రాత్రి మూడింట ఒక్క వంతు రాత్రి మిగిలి వున్న సమయంలో ప్రాపంచిక ఆకాశం వైపునకు వచ్చి ఇలా అంటాడు :

ఎవరైనా నన్ను ప్రార్థించే వారున్నారా? నేను వారి ప్రార్థనలను స్వీకరిస్తాను. ఎవరైనా నాతో ఏదైనా అడిగే వారున్నారా? నేను వారికది ప్రసాదిస్తాను. ఎవరైనా నాతో క్షమించమని వేడుకొనేవారున్నారా? నేను వారిని క్షమిస్తాను".

*(సహీ బుఖారి : 1145)*

**వినడం, చూడడం :**

"తన భర్త వ్యవహారంలో నీతో వాదిస్తూ వున్న, అల్లాహ్‌తో మొరపెట్టు కుంటూ వున్న స్త్రీ మాటలను అల్లాహ్ విన్నాడు. అల్లాహ్ మీ ఉభయుల సంభా షణను వింటున్నాడు. ఆయన అన్నీ వినేవాడు, చూసేవాడూను."

*(ముజాదలహ్ : 1)*

"అల్లాహ్ దరిద్రుడు, మేము ధనికులం అని అన్న వారి ప్రేలాపన అల్లాహ్ విన్నాడు". *(ఆలి ఇమ్రాన్ : 181)*

"మేము వారి రహస్య విషయాలనూ, వారి గుసగుసలనూ వినటం లేదని వారు అనుకొంటున్నారా? మేము అన్నీ వింటూనే వున్నాము". *(జుఖ్రుఫ్ : 80)*

"భయపడకండి. మీతో పాటు (మూసా (అలై హిస్సలాం), హారూన్ (అలైహిస్సలాం) లు) నేనూ వున్నాను. అంతా వింటూ ఉన్నాను, చూస్తూ వున్నాను."

*(తాహా : 46)*

"అల్లాహ్ చూస్తున్నాడని అతనికి తెలియదా?" *(అలఖ్ : 14)*

అబూ మూసా (రజి అల్లాహు అన్హు) కథనం : మేమొకసారి ప్రయాణంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంట వున్నాం. ప్రజలు బిగ్గరగా గొంతెత్తి 'తక్బీర్' పలకడం మొదలు పెట్టారు. అది విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ : ప్రజలారా! మీ ప్రాణాలపై కారుణ్యం చూపండి. మీరు చెవిటి వాణ్ణిగానీ, దగ్గర్లో లేని వాణ్ణిగానీ ప్రార్థించడం లేదు. పైగా వినేవాణ్ణి, చూసేవాణ్ణి, దగ్గర్లో వున్నవాణ్ణి ప్రార్థిస్తున్నారు. ఎవరినైతే మీరు ప్రార్థిస్తున్నారో అతను మీ వాహనం యొక్క కంఠం కన్నా చాలా దగ్గర్లో వున్నాడు.

*(సహీ బుఖారి : 4205)*

## ప్రేమించడం :

"న్యాయం చేయండి, నిశ్చయంగా న్యాయం చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు". *(హుజురాత్ : 9)*

"ప్రవక్తా ! నీవు ప్రజలకు ఇలా చెప్పు : మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ వుంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు."

*(ఆలి ఇమ్రాన్ : 31)*

## కరుణించడం :

"మీ ప్రభువు కరుణించడాన్ని తనపై విధిగా విధించుకున్నాడు."

*(అన్ ఆమ్ : 54)*

"అల్లాహ్‌యే ఉత్తమ రక్షకుడు, ఆయనే అధికంగా కరుణించేవాడు"

*(యూసుఫ్ : 64)*

"నా కారుణ్యం ప్రతి వస్తువునూ ఆవరించి వుంది". *(ఆరాఫ్ : 156)*





## నవ్వడం :

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు : ఒకర్నొకరు చంపుకొని స్వర్గం లోకి వెళ్ళిన ఇద్దరు వ్యక్తులను చూసి అల్లాహ్ నవ్వుతాడు. దానికి సహచరులు (ఆశ్చర్యంతో) ఓ దైవ ప్రవక్తా! ఇదెలా సాధ్యం! అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ- ఒక వ్యక్తి అల్లాహ్ మార్గంలో జిహాద్ చేస్తూ వీరమరణం పొందితే, అతణ్ణి చంపిన వ్యక్తి తర్వాత విశ్వాసిగా మారి తను కూడా అల్లాహ్ మార్గంలో పోరాడి వీరమరణం పొందాడు.

*(సహీ బుఖారి : 2826)*

## ఆనందించడం, ఆశ్చర్యపడడం :

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు : అల్లాహ్‌కు తన దాసుని పశ్చాత్తాపం వల్ల ఎంతగా ఆనందం కలుగుతుందంటే, తప్పి పోయిన మీ జంతు వాహనం మీకు దొరకినప్పుడు ఎంత ఆనందం కలుగుతుందో అంతకన్నా ఎక్కువే ఆనందం కలుగుతుంది. *(సహీ బుఖారి : 6308,6309)*

వేరొక హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు :

"మన ప్రభువు తన దాసులు బాధ పడడాన్ని, (దానికి) ఇతరులు వారికి దగ్గర కావడాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. ఆయన మీ కష్టాల, బాధల పరిస్థితిని చూసి నవ్వుతాడు. ఎందుకంటే మీ కష్టాలన్నీ త్వరలోనే తీరిపోతాయని అతనికి బాగా తెలుసు కాబట్టి." *(ముస్నద్ అహ్మద్)*

## మాట్లాడడం :

"వారిలోని (ప్రవక్తలలో) కొందరితో అల్లాహ్ స్వయంగా మాట్లాడాడు".

*(బఖర : 253)*

"మేము మూసాతో ప్రత్యక్షంగా మాట్లాడాము". *(నిసా : 164)*

"వారి ప్రభువు వారిని (ఆదమ్ (అలై హిస్సలాం) దంపతులను) పిలిచి

ఇలా అన్నాడు : నేను ఆ చెట్టు వద్దకు పోవద్దని మిమ్మల్ని వారించలేదా? షైతాను మీకు బహిరంగ శత్రువని చెప్పలేదా?'' *(ఆరాఫ్ : 22)*

అదీ బిన్ హాతిం (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు. (ప్రళయం రోజు) మీలో ప్రతి ఒక్కరితో అల్లాహ్ స్వయంగా మాట్లాడతాడు. మీకూ, అల్లాహ్‌కూ మధ్య ఏ అనువాదకర్త కూడా వుండడు.

మనిషి తన కుడివైపుకు చూస్తాడు- అతని ఆచరణలు దర్శనమిస్తాయి. ఎడమవైపుకు దృష్టి సారిస్తాడు. అక్కడ కూడా అతని ఆచరణలే దర్శనమిస్తాయి. ముందుకు చూస్తాడు. కేవలం నరకం తప్ప అతని మనసుకేదీ తట్టదు. ఎందు కంటే నరకం అతని ముందు వుంటుంది. అందుకే కనీసం ఒక ఖర్జూరపు పండు అయినా సరే దానం చేసి ఆ నరకాగ్ని నుండి రక్షించుకోండి''.

ఇంకో హదీసులో అదనంగా, 'కనీసం ఒక మంచి మాట పలికి ఐనా సరే' అని వుంది. *(సహీ బుఖారి : 7512)*

### అల్లాహ్ ఆకాశంలో వుండడం :

''నిశ్చయంగా ఆకాశాలనూ, భూమినీ ఆరు రోజులలో సృష్టించి, తర్వాత తన రాజ్యపీఠాన్ని (అర్ష్) అధిష్టించిన దేవుడే మీ ప్రభువు''. *(యూనుస్ : 3)*

''ఆ కరుణామయుడు అర్ష్ ను అధిష్టించి వున్నాడు'' *(తాహా : 5)*

''ఆకాశంలో వున్నవాడు మిమ్మల్ని భూమిలోకి దిగత్రొక్కడని, భూమి హఠాత్తుగా తీవ్ర కంపనాలకు గురికాదని మీరు నిర్భయంగా వున్నారా? ఆకాశంలో వున్నవాడు మీ పైకి రాళ్లను విసిరే పెనుగాలిని పంపడని మీరు నిర్భయంగా వున్నారా?'' *(ముల్క్ : 16, 17)*

ముఆవియా బిన్ హక్మ్ సల్మీ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), ముఆవియా బిన్ హక్మ్ సల్మీ (రజి అల్లాహు అన్హు) గారి బానిస స్త్రీతో మాట్లాడుతూ - అల్లాహ్ ఎక్కడ వున్నాడు? అని అడిగారు.





దానికా స్త్రీ- 'ఆకాశంలో' అని అన్నది. అది విని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెతో - నేనెవర్ని? అని అడిగారు. ఆమె జవాబిస్తూ - 'మీరు అల్లాహ్ సందేశహరులు' అని అనింది. దీనికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - 'ఈమెకు స్వేచ్ఛను ప్రసాదించు, తను విశ్వాసురాలు' అని నన్ను పురమాయించారు.

*(సహీ ముస్లిం : కితాబుల్ మసాజిద్, బాబ్, తహ్రీమిల్ కలామి ఫిస్సలాతి ...)*

అబూసయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఇంకో హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక వ్యక్తితో సంభాషిస్తూ యిలా అడిగారు: నీవు నన్ను అమానతుదారుడని భావించడం లేదా? వాస్తవానికి నేను ఆకాశంలో వున్న ఆ దైవం యొక్క అమానతు దారుణ్ణి. *(సహీ బుఖారి : 7432)*

### అల్లాహ్ దగ్గర్లో వుండడం - దాని వాస్తవ పరిస్థితి :

''విచార పడకు, అల్లాహ్ మనకు తోడుగా వున్నాడు''. *(తౌబా : 40)*

''భయపడకండి, మీతో పాటు నేనూ వున్నాను, అంతా వింటూ వున్నాను, చూస్తూ వున్నాను.'' *(తాహా : 46)*

అబూ మూసా (రజి అల్లాహు అన్హు) కథనం : మేమొకసారి ప్రయాణంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంట వున్నాం. ప్రజలు బిగ్గరగా గొంతెత్తి 'తక్బీర్' పలకడం మొదలు పెట్టారు. ఇది విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ - ''ప్రజలారా! మీ ప్రాణాలపై కారుణ్యం చూపండి. మీరు చెవిటి వాణ్ణి గానీ, దగ్గర్లో లేనివాణ్ణి గానీ ప్రార్థించడం లేదు. పైగా వినేవాణ్ణి, చూసేవాణ్ణి, దగ్గర్లో వున్నవాణ్ణీ ప్రార్థిస్తున్నారు. ఎవరినైతే మీరు ప్రార్థిస్తున్నారో అతను మీ వాహనం యొక్క కంఠం కన్నా చాలా దగ్గర్లో వున్నాడు.''

*(సహీ బుఖారి : 4205)*

పై రుజువుల ద్వారా 'అల్లాహ్ దగ్గర్లోనే వున్నాడు' అన్న విషయం స్పష్టమవు తోంది. అయితే దీని వాస్తవిక పరిస్థితి ఏమిటి?

దివ్య ఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులనూ, సలఫ్‌ల దృక్పథాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే ఈ క్రింది విషయాలు మనకు బోధ పడతాయి :

1. అల్లాహ్ తన అస్తిత్వపరంగా ఆకాశంలో అర్ష్ ను అధిష్టించి వున్నాడు. అంతేగాని, తన అస్తిత్వంతో ప్రతి వస్తువులో లేడు.

సృష్టి వేరు, సృష్టికర్త వేరు.

2. తన జ్ఞానం రీత్యా, తన కారుణ్యం రీత్యా, తన అధికారం రీత్యా ప్రతి వస్తువుకు దగ్గర్లో వున్నాడు. ఆయన జ్ఞానం, కారుణ్యం, అధికారం ప్రతి వస్తువును పరివేష్టించి వున్నది.

"అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలిగి వున్నాడనీ, అల్లాహ్ జ్ఞానం ప్రతి వస్తువునూ పరివేష్టించి వున్నదనీ మీరు తెలుసుకోవడానికి (ఈ విషయం తెలుపబడుతోంది)". *(తలాఖ్ : 12)*

"ప్రభూ ! నీవు నీ కారుణ్యంతో, నీ జ్ఞానంతో ప్రతి వస్తువుపై వ్యాపించి వున్నావు." *(మూమిన్ : 7)*

"నా కారుణ్యం ప్రతి వస్తువునూ ఆవరించి వుంది." *(ఆరాఫ్ : 156)*

అల్లాహ్‌కు చెందిన పేర్లు, గుణగణాలలో కొన్నింటిని గూర్చిన వివరణ యిది. ఆయనకు గల పేర్లలో, గుణగణాలలో అల్లాహ్‌ను సంపూర్ణుడు, ఒక్కడు అని విశ్వసిస్తూ వాటికి వేరే అర్థాలు తొడిగించడం గానీ లేదా వాటిని సంపూర్ణంగా తిరస్కరించడం గానీ చేయకుండా వుండాలి. వాటికి పోలికలను కూడా కల్పించకూడదు.

"ఆయనను పోలిన వస్తువు సృష్టిలో లేదు. ఆయన అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడూను". *(షు అరా : 11)*

వాటిని ముహ్కమాత్ (స్పష్టమైనవి) కోవకు చెందినవిగా పరిగణిస్తూ, వాటి వాస్తవిక పరిస్థితికి సంబందించిన జ్ఞానాన్ని మాత్రం అల్లాహ్‌కే వదిలేయాలి. ఎందుకంటే దానిని అల్లాహ్ తప్ప మరెవరూ ఎరుగరు.





అల్లాహ్ యొక్క గుణగణాలను గూర్చి గతంలో సౌదీ అరేబియాకు ప్రధాన ముఫ్తీ గా వున్న షేఖ్ అబ్దుల్ అజీజ్ అబ్దుల్లా బిన్ బాజ్ (రహమతుల్లా అలై) గారు తన 'ముఖాలాత్ వ ఫతావా' అనే గ్రంథంలో సలఫుస్సాలిహీన్‌ల విశ్వాసాన్ని, దృక్పథాన్ని చక్కగా వివరిస్తూ ఇలా పేర్కొన్నారు.

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియా (రహమతుల్లా అలై) తన పుస్తకమైన 'అల్ ఫత్వల్ ఉమూయ'లో ఇలా వివరించారు:

ఇమామ్ అబూబక్ర్ బైహఖీ తన గ్రంథమైన 'అల్ అస్మా వ సిఫాత్' నందు ప్రామాణిక పరంపరతో ఇమామ్ ఔజాయీ గారి ఈ వచనాన్ని పొందు పరిచారు.

"మేము చాలా మంది తాబయీల సమక్షంలో ఇలా అంటూ వుండే వాళ్ళం-

"అల్లాహ్ అర్ష్ మీద వున్నాడు, అలాగే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన హదీసులలో పేర్కొన్న అల్లాహ్ యొక్క గుణగణాలపై కూడా మా విశ్వాసం వుంది."

ఔజాయీ, మాలిక్ బిన్ అనస్, లైస్ మరియు సుఫియాన్ సౌరి ప్రసిద్ధి చెందిన తాబయీలు.

అబూబక్ర్ ఖిలాల్ తన గ్రంథమైన 'కితాబుస్సున్న' యందు ఇమామ్ ఔజాయీ గారి ఈ ఉల్లేఖనాన్ని పేర్కొన్నారు:

మక్ హూల్ మరియు జుహ్రీలతో అల్లాహ్ గుణగణాలు వివరించబడ్డ హదీసుల విశ్లేషణను గురించి కోరగా దానికి వారు, "అవి ఎలాగైతే మీ దగ్గరికి వచ్చాయో వాటిని అలాగే విశ్వసించండి" అని అన్నారు.

వలీద్ బిన్ ముస్లిం (రహమతుల్లా అలై) కథనం : నేను మాలిక్ బిన్ అనస్, సుఫియాన్ సౌరీ, లైస్ బిన్ సాద్ మరియు ఔజాయీ (రహమతుల్లా అలై) లతో అల్లాహ్ గుణగణాలు వివరించబడ్డ ఉల్లేఖనాల గురించి అడిగాను. దానికి వారు ఇలా జవాబిచ్చారు. 'అవి ఎలాగైతే వచ్చాయో అలాగే విశ్వసించు.'

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది :

"వాటి వాస్తవిక పరిస్థితిని తెలియజేయబడకుండా అవి ఎల్లాగైతే వచ్చాయో వాటిని అలాగే విశ్వసించు."

అబూబక్ర్ బైహఖి గారు యహ్యా బిన్ యహ్యా ద్వారా ఈ ఉల్లేఖనాన్ని పేర్కొన్నారు : మేమొకసారి మాలిక్ బిన్ అనస్ దగ్గర కూర్చొని వున్నాం. ఒక వ్యక్తి ఆయన దగ్గరకు వచ్చి ఓ అబూ అబ్దుల్లా! 'ఆ కరుణామయుడు అర్ష్ ను అధిష్టించి వున్నాడు' అన్న దైవ సూక్తిని ఆధారంగా చేసుకొని అడుగుతున్నాను - 'అధిష్టించడం యొక్క వాస్తవిక పరిస్థితి' ఎలా వుంటుంది?

ఈ ప్రశ్న విని మాలిక్ బిన్ అనస్ (రహమతుల్లా అలై) తల క్రిందికి వంచుకున్నారు. శరీరమంతా చెమటలు పట్టేసింది. తదుపరి యిలా జవాబిచ్చారు:

అధిష్టించడమనేది ఏ మాత్రం శంక లేని విషయం. దాని వాస్తవిక పరిస్థితి వివరించలేని విషయం. దీనిని విశ్వసించడం అనివార్యం మరియు దీనిని గురించి ప్రశ్నించడం బిద్అత్. తిరిగి యిలా అన్నారు : నేను నిన్ను బిద్అతీ వనీ అనుకుంటున్నాను. తర్వాత 'ఇతణ్ణి ఇక్కణ్ణుండి వెళ్ళగొట్టండి' అని ఆదేశించారు.

*(ముఖాలాత్ వ ఫతావా - అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లా బిన్ బాజ్)*

పైన పేర్కొన్న రుజువుల ద్వారా అల్లాహ్ గుణగుణాలను గూర్చి సలఫ్ల దృక్పథం మనకు చక్కగా అర్థమవుతోంది. యిక మనం కూడా అదే దృక్పథాన్ని అలవర్చుకున్నప్పుడే రుజుమార్గంలో వుండగలం.

ఇదే తౌహీద్ అల్ అస్మా వ సిఫాత్ కు సంబంధించిన అసలు వాస్తవికత.

అయితే షైతాను ఇక్కడ కూడా ఖాళీగా కూర్చోలేదు. పైగా ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహాన్ని భ్రష్టు పట్టించాడు.

అల్లాహ్ పేర్లు, గుణగణాలలో సలఫ్ల విశ్వాసాన్ని, దృక్పథాన్ని పెడచెవిన బెట్టి చాలా మంది ముస్లిములు తప్పుడు విశ్వాసాలను అలవర్చుకున్నారు. తద్వారా 'తౌహీద్ అల్ అస్మా వ సిఫాత్' లో షిర్క్ మరియు కుఫ్ర్ను యథేచ్ఛగా





చేస్తున్నారు.

తమ స్వంత బుద్ధిజ్ఞానాలనుపయోగించి ఒక వర్గం వారు అల్లాహ్ గుణ గణాలకు పోలికలు కల్పిస్తే మరొక వర్గం వారు ఏకంగా అల్లాహ్ గుణగణాలనే పూర్తిగా తిరస్కరించారు. యిక సూఫీ మహాశయులైతే - 'అల్లాహ్ అర్ష్ ను అధిష్టించి' వున్నాడు. తన కారుణ్యం, జ్ఞానం రీత్యా ప్రతి వస్తువును పరివేష్టించి వున్నాడన్న వాస్తవాన్ని పూర్తిగా త్రోసిపుచ్చి,

"ఇందుగలడందు లేడని సందేహము వలదు, ఎందెందు వెతికినా అందందుగలడు."

అని విశ్వసించే హిందూ సమాజాన్ని అనుసరిస్తూ, తమ విశ్వాసాలను సమర్థించుకోవడానికి నిరాధారమైన కాల్పనిక హదీసుల సహాయం తీసుకొని "సృష్టిలోని ప్రతి వస్తువులోనూ అల్లాహ్ వున్నాడు. వాస్తవానికి ప్రతి వస్తువూ దేవుడే. దేవుడు, దాసుడు అన్న బేధమేమీ లేదు, అందరూ ఒక్కటే" - లాంటి తప్పుడు విశ్వాసాలను ప్రచారం చేసి ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహాన్ని భ్రష్టు పట్టించారు. నేటికీ, ఈ కార్యకలాపాల్లో నిమగ్నమై వున్న రెండు పెద్ద వర్గాలను మన కళ్ళతో వీక్షించవచ్చు. వీరి బాహ్యాన్ని చూస్తే వీరిని గురించి అంచనా వేయడం కొంత కష్టమైనప్పటికీ వీరి విశ్వాసాలను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే వీరి గ్రంథాలను కాస్త తిరగేస్తే చాలు, అంతా కళ్ళకు కట్టినట్లు అర్థమవుతుంది.

"ప్రతిచోటా తనకు అల్లాహ్ యే కానరావడం వల్ల 15, 15 రోజుల వరకు గూడా ఓ మహానుభావుడు కాల కృత్యాలకు గూడా వెళ్ళకుండా వుండేవాడు", అని ఓ గ్రంథకర్త వ్రాస్తే, మరొకతను "మూడు సంవత్సరాల వరకు అల్లాహ్ నా హృదయంలో వున్నాడు. అతణ్ణి అడక్కుండా నేనేపనీ చేయలేదు" అని వ్రాశాడు. ఇలాంటి విషయాలు వీరి గ్రంథాల్లో కోకొల్లలు.

మరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కనీసం కాలకృత్యాలైనా

తీర్చుకోకుండా 15 రోజుల వరకు ఎప్పుడైనా వున్నారా?

సలఫుస్సాలిహీన్‌లలో ఎవరైనా ఇలా జీవితం గడిపారా?

జవాబు 'లేదు' అనే వస్తుంది.

మరి వీరికి ప్రతి చోటా అల్లాహ్ కనబడలేదా?

వాస్తవమేమిటంటే అల్లాహ్ సన్మార్గం చూపని వారికి ఇక ఎవరూ సన్మార్గాన్ని చూపలేరు.

యివన్నీ భ్రష్టుపట్టిన తప్పుడు విశ్వాసాలు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంతో వీటికేమాత్రం సంబంధం లేదు.

తౌహీద్‌లోని మూడు రకాల వాస్తవికతను గూర్చి క్షుణ్ణంగా తెలుసుకున్నాం. అలాగే మనిషి 'షిర్క్' అనే రొంపిలోకి ఎలా పడతాడో కూడా వివరంగా తెలుసుకున్నాం.

యిక తర్వాతి విషయాలకొద్దాం:





# తౌహీద్ (ఏక దైవారాధన) ప్రయోజనాలు

తౌహీద్ వల్ల మనిషికి ఎన్నో ప్రయోజనాలు వున్నాయి. వాటిలో కొన్నింటిని చర్చిస్తాను :

1. దీనివల్ల మనిషి తన నిజమైన సృష్టికర్త అయిన అల్లాహ్‌ను గురించి తెలుసుకోగలుగుతాడు. దివ్యఖురానులోని ఆయతులు, ఆయన పేర్లు గుణగణాలపై దృష్టిని సారించడం ద్వారా ఆయన శక్తి సామర్థ్యాలు, అధికారాలకు సంబంధించిన జ్ఞానాన్ని సముపార్జించుకోగలుగుతాడు.
2. దీనివల్ల మనిషికి ఆత్మ సంతృప్తి కలుగుతుంది. అల్లాహ్‌ను విశ్వసించి, దైవేతరులందర్నీ తిరస్కరించడం ద్వారా మనిషికి సహజంగానే సన్మార్గం పొందానన్న భావన మనసులో కలుగుతుంది. ఎందుకంటే తనకు ఒకే ఒక రక్షకుడు వుండి, కేవలం అతని మాటనే వినాలనీ, అతనికే విధేయత చూపాలనీ ప్రతి మనసూ సహజంగా కోరుకుంటుంది.
3. అల్లాహ్ శక్తి సామర్థ్యాలతో పాటు మనిషి తన నిస్సహాయతను గుర్తించడం ద్వారా అతని మనసులో అల్లాహ్ యెడల సహజ సిద్ధమైన భయం మరియు ఆశ జనిస్తాయి. దానితో అతను అల్లాహ్‌కు పూర్తి విధేయత చూపించడానికి ప్రయత్నిస్తూ తన అవసరాలన్నింటినీ అల్లాహ్ తీరుస్తాడని ఆశిస్తాడు.
4. దీనివల్ల అల్లాహ్‌పై పూర్తి నమ్మకం మనిషికి కలుగుతుంది. తద్వారా 'తనను విశ్వసించిన వారిని పరాభవం పాలు కానివ్వను' అని అల్లాహ్ చేసిన వాగ్దానం పట్ల అతను పూర్తిగా సంతృప్తి చెందగలుగుతాడు.
5. దీని మూలంగా మనిషికి ప్రపంచం పట్ల అనాసక్తి మరియు పరలోకం పట్ల ఆత్రుత పెరుగుతాయి. తాను కేవలం అల్లాహ్ ఆరాధన కొరకే

సృజించబడ్డాననీ, ఈ ప్రాపంచిక జీవితం అనేది కేవలం ఒక మాయ తప్ప మరేమీ కాదనీ, అసలు జీవితం కేవలం పరలోక జీవితమే అని తెలుసుకోవడం, అతనిలో ఇతరులక్కూడా ఈ నగ్న సత్యాలను తెలియ జేయాలన్న ఆకాంక్షను రేకెత్తిస్తుంది. తద్వారా అతను తన జీవితాన్ని పూర్తి క్రమశిక్షణతో గడుపుతూ ఇతరులక్కూడా ఈ విషయాలను తెలుప గలుగుతాడు.

6. దీనివల్ల మనిషి, దాసుల దాస్యం నుండి విముక్తి పొంది సృష్టికర్త దాస్యానికి వచ్చేస్తాడు.

7. దీని స్వీకారం మనిషి జీవితంలో విప్లవాత్మకమైన మార్పును తీసుకొస్తుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరుల జీవితాలు ఇందుకు పూర్తి నిదర్శనం.

8. దీనివల్ల విశ్వాసుల పట్ల ప్రేమ, అవిశ్వాసుల పట్ల (వారు దగ్గరి సంబంధీకులైనా సరే) సహజ సిద్ధమైన అసహనం, ఎడబాటు పెరుగుతాయి.

9. దీని స్వీకారం వల్ల మనిషి అల్లాహ్ మార్గంలో తన సర్వస్వాన్నీ, చివరికి తన ప్రాణాల్ని సైతం ధారపోయడానికి సిద్ధపడతాడు.

10. కేవలం తౌహీద్ (ఏక దైవారాధన) ఒక్కటే సంపూర్ణ మానవ జాతిని సమైక్యంగా వుంచగలుగుతుంది. అందుకే దీనిని వెలుగుతో, షిర్క్ ను చీకటితో పోల్చవచ్చు.

యిక ఈ సూచనలను, ప్రయోజనాలను ఎవరైనా గుర్తించగలిగే స్థాయికి చేరుకుంటే మాత్రం దానికి వారు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. అలాంటి స్థితి గనక మనసును ఆవహించడం లేదంటే మాత్రం అతను తన తౌహీద్ పై తిరిగి దృష్టి సారించాల్సిన అవసరం వుంటుంది.





# షిర్క్ యొక్క ఆరంభము

ఈ భూమి మీద ఆదమ్ సంతతి ఆవిర్భావము మొదలుకొని షైతాను చేసే ప్రతి ప్రయత్నమూ మానవ జాతిని భ్రష్టు పట్టించడమే. తన శక్తి యుక్తులను ఉపయోగించి ఎలాగైనా సరే ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పించి మార్గ భ్రష్టులుగా చేయడం వాడి పని. స్వర్గంలో నుండి వెళ్ళగొట్టబడినప్పుడు తానే ఈ విషయాన్ని స్వయంగా అల్లాహ్ ముందు ప్రకటించాడు.

"నీవు నన్ను మార్గ భ్రష్టత్వానికి గురిచేసినట్లు నేను కూడా నీ రుజుమార్గంపై ఈ మానవుల కొరకు మాటు వేసి కూర్చుంటాను. వెనుకా, ముందూ, కుడీ, ఎడమా అన్ని వైపుల నుండీ వారిని చుట్టుముట్టుతాను. వారిలో అధిక సంఖ్యాకులను నీవు కృతజ్ఞులుగా చూడవు." *(ఆరాఫ్ : 17)*

"నీ గౌరవం సాక్షిగా! నేను వారందరినీ మార్గభ్రష్టులుగా చేసి తీరుతాను" నీవు ప్రత్యేకంగా ఎన్నుకొన్న దాసులను తప్ప". *(సాద్ : 82, 83)*

అప్పటి నుండి ప్రతిరోజూ వాడి ప్రయత్నము కొనసాగుతోంది.

అల్లాహ్ క్షమించనిది షిర్కే కాబట్టి షైతాను మొట్టమొదటి ప్రయత్నం కూడా మనిషిని ఎలాగైనా బహు దైవారాధకుడిగా మార్చడమే అవుతుంది. ఇతర కార్యాలపై వాడి ఆక్రమణ ఎలా వున్నా తౌహీద్‌పై మాత్రం వాడి ఆక్రమణ తీవ్ర స్థాయిలో వుంటుంది.

ఈ ఆక్రమణ అనేది ఆదమ్ సంతతి ఆవిర్భావము నుంచే ప్రారంభమైనప్పటికీ ఆదమ్ (అలైహిస్సలాం) తర్వాత పది తరాల వరకు వాడు మానవ జాతిని వశపరుచుకోలేకపోయాడు. చివరకు నూహ్ (అలైహిస్సలాం) కాలంలో వాడి ఆక్రమణ ఫలించింది.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం : ఆదమ్ (అలైహిస్సలాం) మరియు నూహ్ (అలైహిస్సలాం)ల మధ్య పది తరాలు గతించాయి. వారంతా స్వచ్ఛమైన దైవ ధర్మం (తౌహీద్)పై స్థిరంగా వున్నారు. ఆతర్వాతే ప్రజల్లో అభిప్రాయ భేదాలు పొడచూపాయి. *(హాకిం)*

అంతేగాక, అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) సూరహ్ నూహ్ యొక్క ఆయత్ "మీరు మీ ఆరాధ్య దైవాలను ఎంత మాత్రం విడిచిపెట్టకండి. వద్ద్, సువాలను విడిచిపెట్టకండి. యగూస్, యఊఖ్, నసర్‌లను కూడా విడనాడ కండి." *(నూహ్ : 23)* ను గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు :

"ప్రవక్త నూహ్ (అలైహిస్సలాం) జాతిలో పూజింపబడ్డ విగ్రహాలనే తర్వాతి కాలాల్లో అరబ్బులు కూడా పూజింపసాగారు. వద్ద్ అనే విగ్రహం దౌమతిల్ జిందల్ లోని బనీ కల్బ్ సమూహము యొక్క ఆరాధ్య దైవంగా వుండేది. సువా బనీ హుజైల్ సమూహానిది కాగా, యగూస్ బనీ మురాద్ సమూహానిది. యఊఖ్ బనీ హమ్‌దాన్ సమూహానిది కాగా, నసర్ విగ్రహం హిమ్‌యర్ సమూహ ఆరాధ్య దైవంగా వుండేది. వాస్తవానికి ఈ ఐదుగురు నూహ్ (అలైహిస్సలాం) జాతికి చెందిన పుణ్యపురుషులు. వీళ్ళు మరణించిన సమయంలో షైతాను వారి అనుయాయుల మనస్సులో వారు కూర్చొనే స్థలాల్లో వారి విగ్రహాలు నెలకొల్పండి మరియు ఆ విగ్రహాలకు వారి పేర్లు పెట్టుకోండి అని ఉసిగొల్పాడు. ఆ సమ యంలో వారు అలానే చేశారు. కానీ అప్పుడు వాటి పూజ జరిగేది కాదు. కానీ తర్వాత ఆ సంతతి కూడా నశించింది, ఇటు ధార్మికజ్ఞానం కూడా ప్రజల్లో సన్నగిల్లి ఆ విగ్రహాల పూజ ఆరంభమైనది". *(సహీ బుఖారి : 4920)*

ఈ విధంగా మానవ సంతతిలో 'షిర్క్' ప్రారంభమయ్యింది.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) గారి వ్యాఖ్యానాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే మనకు కొన్ని ఆసక్తికరమైన విషయాలు బోధపడతాయి.

1. మానవ సంతతిపై షైతాను ఆక్రమణ అనేది సామాన్యంగా అకస్మాత్తుగా కానీ, ఒక్కసారిగా కానీ కాకుండా మెల్లమెల్లగా వుంటుంది. అంటే స్లో పాయిజనింగ్ లాగా అన్నమాట. అందుకే ముందు తరాల వారు షైతాను





ఆదేశం ప్రకారం పుణ్యపురుషుల విగ్రహాలను నెలకొల్పినప్పటికీ వాటిని పూజించలేదు. ఇది షైతాను వేసిన మొదటి ఎత్తు. తర్వాతి తరాల వారు వాటిని పూజించడం మొదలు పెట్టారు. ఇది వాడి రెండో ఎత్తు.

2. మానవ జీవితాల్లో షిర్క్ ప్రారంభమయింది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తల మీద, గతించిన పుణ్య పురుషుల మీద ద్వేషంతో ఎంత మాత్రం కాదు. ప్రవక్తల మీదా, గతించిన పుణ్య పురుషుల మీదా వున్న మితి మీరిన ప్రేమ (గులూ) కారణంగానే ఇది ఆరంభమైనది. అంటే వారి వాస్తవిక స్థాయి నుండి వారిని పైకి లేపి వారికి చెందని స్థాయికి వారిని చేర్చడం ద్వారా అన్నమాట. ప్రవక్తలను, గతించిన పుణ్యపురుషులను తగు విధంగా గౌరవించడం, ప్రేమించడం ముస్లిములుగా మనందరి కర్తవ్యం.

   అయితే ఆ గౌరవం, ప్రేమ అనేది ఆరాధనా రూపం దాల్చకూడదు. అప్పుడే షిర్క్ ప్రారంభమవుతుంది.

3. నూహ్ జాతి మొదలుకొని మహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం వరకు అరబ్బులు పూజించిన విగ్రహాలు చిరునామా తెలియని నామ మాత్రపు విగ్రహాలు కావు. అవి నూహ్ జాతికి చెందిన పుణ్యపురు షుల విగ్రహాలు.

యిక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం నాటి ముష్రిక్కుల విశ్వాసాలనూ, వారి ఆచరణలను గురించి క్షుణ్ణంగా తెలుసుకొందాం.

# దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం నాటి ముష్రిక్కులు

ఈ అధ్యాయంలో మనం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం నాటి ముష్రిక్కుల విశ్వాసాలూ, వారి ఆచరణలు, ఆరాధనలను గురించి వివరంగా తెలుసుకొందాం :

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు దైవదౌత్య బాధ్యతలు అప్పగించబడిన కాలంలో అక్కడి ప్రజలు విభిన్న జాతులు గాను, తెగలుగానూ, సమూహాలుగానూ నివసించే వారు. తమ విశ్వాస ఆచరణల రీత్యా వారు ముష్రిక్కులై పోయినప్పటికీ తమను తాము మాత్రం ఇబ్రాహీం (అలైహిస్సలాం) ధర్మం పైనే వున్నామని అనుకొంటూ వుండేవారు. వీరితో పాటు యూదులు, క్రైస్తవులు కూడా నివసించే వారు. అల్లాహ్ గ్రంథం వీరి దగ్గర వున్నప్పటికీ కేవలం కొద్ది మంది తప్ప అందరూ తమ విశ్వాస ఆచరణల రీత్యా ముష్రిక్కులై పోయారు.

ఇక మక్కా బహుదైవారాధకుల విశ్వాసాల విషయానికొస్తే, దివ్య ఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే తెలిసేదేమిటంటే "తౌహీద్ అల్ రుబూబియత్"లో వారి విశ్వాసము ముస్లిముల విశ్వాసము మాదిరిగానే వుండేది. అల్లాహ్ పేర్లు మరియు గుణగణాల్లో కూడా కొన్నిటిపై వారి విశ్వాసం వుండేది. కానీ 'తౌహీద్ అల్ ఉలూ హియత్' విషయంలో వారు పెడత్రోవ పట్టి షిర్క్ చేయడం ప్రారంభించారు.

ముష్రిక్కుల విశ్వాసాలు ఎలా వుండేవో కాస్త గమనించండి:

"ఒకవేళ నీవు వారిని భూమినీ ఆకాశాలను ఎవడు సృష్టించాడు? అని





అడిగితే, స్వయంగా వారే, వాటిని ఆ మహాబలవంతుడే, ఆ మహాజ్ఞానియే (అల్లాహ్) సృష్టించాడు అని అంటారు". *(జుఖ్రుఫ్ : 9)*

"నీవు 'మిమ్మల్ని ఎవరు పుట్టించారు' అని వారిని అడిగితే స్వయంగా వారే 'అల్లాహ్' అని అంటారు." *(జుఖ్రుఫ్ : 87)*

"వారిని అడుగు : ఆకాశం నుండి, భూమి నుండీ మీకు ఉపాధినిచ్చేవాడు ఎవడు? వినేశక్తీ, చూసే శక్తీ ఎవడి ఆధీనంలో వున్నాయి? ప్రాణమున్న దాని నుండి ప్రాణము లేని దానిని, ప్రాణం లేని దాని నుండి ప్రాణమున్న దానిని వెలికి తీసేవాడు ఎవరు? ఈ విశ్వ వ్యవస్థను నడుపుతున్న వాడు ఎవరు? వారు తప్పకుండా 'అల్లాహ్' అని అంటారు." *(యూనుస్ : 31)*

"వారిని ఇలా అడుగు : మీకు తెలిస్తే చెప్పండి : ఈ భూమీ, దానిలోని ప్రాణులన్నీ ఎవరివో?వారు తప్పకుండా 'అల్లాహ్'కు చెందుతాయి అని అంటారు. అలాంటప్పుడు మీరు ఈ విషయాన్ని ఎందుకు అర్థం చేసుకోరు? అని అను. వారిని ఇంకా యిలా అడుగు : సప్తాకాశాలకూ, మహోన్నతమైన పీఠానికీ (అర్ష్) ప్రభువు ఎవరు?వారు తప్పకుండా 'అల్లాహ్' అని అంటారు.

అలాంటప్పుడు మీరు ఎందుకు ఆయనకు భయపడరు? అని అను.

వారితో ఇంకా ఇలా అను : మీరు గనక ఎరిగి వుంటే చెప్పండి.

ప్రతి దానిపై ఆధిపత్యం ఎవరికుందో?

ఇంకా శరణుయిచ్చేవాడు ఎవడో చెప్పండి? ఆయనకు ప్రతిగా శరణు యివ్వగలవాడెవ్వడూ లేడు.

వారు తప్పకుండా : ఈ శక్తి కలవాడు అల్లాహ్‌యే అని అంటారు. అలాంటప్పుడు మీరు ఎలా మోసపోతున్నారు? అని అను."

*(మూమినూన్ : 84-89)*

పై ఆయతులను గమనిస్తే, అసలు వీరు ముష్రిక్కులు అని అల్లాహ్‌చే ఎందుకు ధృవీకరించబడ్డారు అన్న ఆశ్చర్యం కలుగుతుంది. అందుకే నేను ముందే తెలిపాను, ముష్రిక్కులు తౌహీద్ అల్ రుబూబియత్‌ను పూర్తిగా విశ్వసించేవారు. తౌహీద్ అల్ ఉలూహియత్‌లోనే వారు పెడత్రోవ పట్టారు.

యిక దైవేతరుల పట్ల వారి విశ్వాసం ఎలా వుండేదో చూద్దాం.

"ఈ ప్రజలు అల్లాహ్‌ను కాదని తమకు నష్టాన్ని గానీ లాభాన్ని గానీ కలిగించలేని వారిని పూజిస్తున్నారు. పైగా ఇలా అంటున్నారు : వారు అల్లాహ్ వద్ద మా కొరకు సిఫారసు చేస్తారు".

ప్రవక్తా ! వారితో ఇలా అను : "ఆకాశాలలో గానీ, భూమిలో గానీ అల్లాహ్ ఎరుగని విషయాన్ని గురించి ఆయనకు మీరు తెలుపుతున్నారా? ఆయన పరిశుద్ధుడు. ఈ ప్రజలు చేసే షిర్కుకు అతీతుడూ ఉన్నతుడూను."

*(యూనుస్ : 18)*

"జాగ్రత్త! ధర్మం ప్రత్యేకంగా అల్లాహ్‌కు చెందిన హక్కు మాత్రమే. ఇక ఆయనను వదిలి ఇతరులను సంరక్షకులుగా చేసుకున్నవారు "వారు మమ్మల్ని అల్లాహ్‌వద్దకు చేరుస్తారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము" అని అంటారు." *(జుమర్ : 3)*

"ఉజైర్ అల్లాహ్ కుమారుడని యూదులు అంటారు. మసీహ్ అల్లాహ్ కుమారుడని క్రైస్తవులు అంటారు." *(తౌబా : 30)*

పై ఆయతుల ద్వారా తెలిసేదేమిటంటే ముష్రిక్కులు దైవేతరులను 'అల్లాహ్' అని భావించి ఎప్పుడూ పూజించలేదు. పైగా అల్లాహ్‌పై పూర్తి విశ్వాసం వుంచి దైవేతరులను కేవలం సిఫారసుదారులుగానూ, అల్లాహ్ సాన్నిధ్యాన్ని పొందడానికి మధ్యవర్తులుగానూ తలచి ఆరాధించేవారు.

వారి ఈ విశ్వాసాన్నే అల్లాహ్ 'షిర్క్' అని ధృవీకరించాడు.

వారి విశ్వాసాన్ని ఖండిస్తూ ఇలా సెలవిచ్చాడు :

"వారు అల్లాహ్‌ను వదిలి పెట్టి ఇతరులను సిఫారసు దారులుగా చేసుకున్నారా? వారికి ఇలా చెప్పు : వారికి కించిత్తు అధికారంగానీ, ఏ మాత్రం అవగాహన గానీ లేకపోయినా సిఫారసు చేయగలరా? ఇలా అను : సిఫారసు అనేది పూర్తిగా అల్లాహ్ చేతిలో వున్నది. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి ఆయనే. తర్వాత ఆయన వైపునకే మీరు మరలించబడతారు." *(జుమర్ : 43-44)*

అదీగాక ప్రళయం నాడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు :







"మేము మొదటిసారి మిమ్మల్ని ఒంటరిగా సృష్టించినట్లే ఇప్పుడు ఇదిగో మీరు ఒంటరిగా మా ముందు హాజరయ్యారు. మేము ప్రపంచంలో మీకు ఇచ్చినదంతా మీరు అక్కడే వదిలి పెట్టి వచ్చారు. ఇప్పుడు మీ వెంట మీ పనులు నెరవేరడంలో కొంత పాత్ర వుందని మీరు భావించిన మీ సిఫారసు దారులను కూడా మేము చూడటం లేదు. ఇప్పుడు మీ మధ్య సంబంధాలన్నీ తెగిపోయాయి. ఎవరిని గురించి మీరు గర్వపడేవారో వారందరూ మీకు కనుమరుగైపోయారు."

*(అన్‌ఆమ్ : 94)*

దివ్యఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ప్రామాణిక హదీసులను నిశితంగా అధ్యయనం చేస్తే తెలిసే మరొక విషయ మేమిటంటే ముష్రిక్కులు పూజించే దైవేతరులు మొత్తం ఐదు రకాలుగా వుండేవారు.

1. దైవ ప్రవక్తలు
2. గతించిన పుణ్యపురుషులు
3. దైవ దూతలు
4. జిన్నాతులు
5. సూర్య చంద్రులు

వీటిలో దైవ ప్రవక్తలు, గతించిన పుణ్యపురుషుల విగ్రహాలతో పాటు వారి సమాధుల్ని కూడా పూజించడం జరిగేది.

**ప్రవక్తలు, గతించిన పుణ్యపురుషులు :**

"ఉజైర్ అల్లాహ్ కుమారుడని యూదులు అంటారు. మసీహ్ అల్లాహ్ కుమారుడని క్రైస్తవులంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. అల్లాహ్ దెబ్బ వారిపై పడుగాక! వారెలా మోసపోతున్నారు. వారు అల్లాహ్‌ను కాదని తమ పండితులనూ, సన్యాసులనూ తమ ప్రభువుగా చేసుకున్నారు. వాస్తవానికి ఒక్క అల్లాహ్ దాస్యం తప్ప మరెవరి దాస్యాన్నీ చేసే ఆజ్ఞ వారికి యివ్వబడలేదు. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవడూ లేడు. ఆయన పరిశుద్ధుడు. వారు అనే షిర్కు మాటలకు అతీతుడు." *(తౌబా : 30-31)*

విశ్వాసుల మాతృమూర్తి ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం :

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తాను స్వస్థత పొందలేక పోయిన వ్యాధికి గురైనప్పుడు ఇలా పలికారు : అల్లాహ్ యూదులను, క్రైస్తవులను శపించు గాక! వాళ్ళు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకున్నారు.

తదుపరి ఆయెషా (రజి అల్లాహు అన్హ) మాట్లాడుతూ : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), తన సమాధి కూడా పూజింప బడవచ్చని భయ పడ్డారు. అందుకే ఆయన సమాధి స్మశాన వాటికలో కాకుండా నాలుగ్గోడల మధ్య వుంది. అలా అని ఆయన భయపడి వుండకపోతే ఆయన సమాధి కూడా ఆరు బయటే వుండేది.

*(సహీముస్లిం : కితాబుల్ మసాజిద్, బాబ్ : నహ్యీ అన్ బినా ఇల్ మస్జిది అలల్ ఖుబూరి ... )*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన మరణానికి ఐదు రోజుల ముందు ఇలా బోధిస్తుండగా తాను విన్నానని జున్దుబ్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు.

"జాగ్రత్త ! మీకు ముందు గతించిన ప్రజలు తమ ప్రవక్తల, పుణ్య పురుషుల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. మీరు సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకోకండి. నేను మిమ్మల్ని ఈ విషయం నుండి వారి స్తున్నాను."

*(సహీ ముస్లిం : కితాబుల్ మసాజిద్, బాబ్ : నహ్యీ అన్ బినా ఇల్ మస్జిది అలల్ ఖుబూరి ...)*

యిక పుణ్య పురుషుల విషయానికొస్తే వద్ద్, సువా, యగూస్, యఊఖ్ నసర్‌లను గురించి ఇదివరకే తెలుసుకున్నాం. అంతేగాక ముష్రిక్కులు పూజించిన 'లాత్' కూడా గతించిన పుణ్యపురుషుడే.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) సూరహ్ నజ్మ్ లోని ఆయత్ : "ఇప్పుడు చెప్పండి, ఈ లాత్, ఈ ఉజ్జా, మూడోది ఒక దేవత అయిన మనాత్‌ల వాస్తవికతను గూర్చి మీరు కాస్తయినా ఆలోచించారా?" *(నజ్మ్ : 19)*పై వ్యాఖ్యా నిస్తూ ఇలా తెలియజేశారు : లాత్ అనేది ఒక వ్యక్తి పేరు. తాను హాజీలకు శనగ పిండి(సత్తు)ని నీళ్ళతో కలిపి త్రాగించేవాడు." *(సహీ బుఖారి : 4859)*







## దైవ దూతలు :

"దయామయుడైన దేవుని ప్రత్యేక దాసులయిన దైవ దూతలను వారు స్త్రీలుగా నిర్ణయించారు. వారి శరీర నిర్మాణాన్ని వారు చూశారా? వారి సాక్ష్యం వ్రాయబడుతుంది. వారు దానికి సమాధానం చెప్పుకోవలసి వుంటుంది. 'ఆ అనంత కరుణామయుడైన దేవుడు కోరి వున్నట్లయితే మేము వారిని ఎన్నటికీ పూజించి వుండేవారము కాదు' అని వారు అంటారు. వారు ఈ వ్యవహారం యొక్క వాస్తవాన్ని ఏ మాత్రం ఎరుగరు, కేవలం ఊహాగానాలు చేస్తున్నారు."

*(జుఖ్రుఫ్ : 19-20)*

## జిన్నాతులు :

"మానవులలో కొందరు జిన్నాతులలోని కొందరిని శరణు వేడుతుండే వారు. ఈ విధంగా వారు జిన్నాతుల గర్వాన్ని మరింత అధికం చేశారు."

*(జిన్న్ : 6)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) సూరహ్ బనీ ఇస్రాయీల్ లోని ఆయత్ "వారితో ఇలా అను: మీరు అల్లాహ్‌ను కాదని (మీ పనులు నెరవేర్చేవారుగా) భావించి ఆరాధించే వారిని పిలిచి చూడండి. వారు మీ ఏ ఆపదనూ మరల్చనూ లేరు, మార్చనూ లేరు. ఈ ప్రజలు మొరపెట్టుకుంటున్న వారే స్వయంగా తన ప్రభువు సాన్నిధ్యాన్ని పొందడానికి మార్గాన్ని వెతుకుతున్నారు. ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. వారు, ఆయన కారుణ్యాన్ని ఆశిస్తున్నారు, ఆయన శిక్షకు భయపడుతున్నారు. నిజానికి నీ ప్రభువు శిక్షే భయపడదగినటు వంటిది." *(బనీ ఇస్రాయీల్ : 57)* పై వ్యాఖ్యానిస్తూ ఇలా తెలియజేశారు : ముష్రిక్కులలో కొందరు జిన్నాతులను ఆరాధించేవారు. కానీ ఆ జిన్నాతులు తర్వాత ముస్లిములుగా మారిపోయారు. అయినప్పటికీ ఈ ముష్రిక్కులు మాత్రం వారినే ఆరాధిస్తూ అజ్ఞానులు గానే వుండిపోయారు. వీరి విషయంలోనే ఈ ఆయత్ అవతరించింది". *(సహీ బుఖారి : 4714)*

## సూర్యచంద్రులు :

"ఈ రేయింబవళ్ళు, యీ సూర్యచంద్రులు అల్లాహ్ సూచనల లోనివే. సూర్యచంద్రులకు సాష్టాంగ పడకండి. వాటిని సృజించిన అల్లాహ్‌కే సాష్టాంగ

పడండి. మీరు నిజంగానే ఆయనను ఆరాధించే వారు అయితే.''

*(హామీమ్ అస్ సజ్దా : 37)*

పై రుజువుల ద్వారా ముష్రిక్కులు ఐదు రకాల దైవేతరులను ఆరాధించే వారని స్పష్టమయిపోయింది.

యిక వారు దైవేతరుల కోసం ఎలాంటి ఆచరణలు పాటించేవారో తెలుసుకుందాం.

### 1. వేడుకోవడం :

ముష్రిక్కులు దైవేతరులను వేడుకొంటూ వుండేవారు. అందుకే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

''ప్రవక్తా ! వారితో ఇలా అను : అల్లాహ్‌ను కాక మీరు వేడుకొనే ఇతరులకు దాస్యం చెయ్యటం నాకు నిషేధించబడినది.'' *(అన్ఆమ్ : 56)*

''అల్లాహ్‌ను త్రోసిరాజని మీరు వేడుకొంటున్న వారు మీ మాదిరిగానే కేవలం దాసులు.'' *(ఆరాఫ్ : 194)*

''మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించ బడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరినీ ప్రార్థించకండి.'' *(జిన్న్ : 18)*

### 2. సజ్దా చేయడం :

ముష్రిక్కులు దైవేతరులకు సజ్దా కూడా చేసేవారు.

''ఈ రేయింబవళ్ళు, యీ సూర్యచంద్రులు అల్లాహ్ సూచనల లోనివే. సూర్యచంద్రులకు సాష్టాంగ పడకండి. వాటిని సృజించిన అల్లాహ్‌కే సాష్టాంగ పడండి.'' *(హామీమ్ అస్ సజ్దా : 37)*

అదీగాక, హిరా అనే ప్రదేశంలో ప్రజలు తమ నాయకునికి సజ్దా చేసే వారన్న విషయం మనం ఇది వరకే తెలుసుకున్నాం.

### 3. ఖుర్బానీ చేయడం :

ముష్రిక్కులు దైవేతరుల సమాధుల వద్ద, బలిపీఠాల వద్ద జంతువులను ఖుర్బానీ యిచ్చేవారు. అందుకే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.







'బలిపీఠంపై వధించబడిన జంతువు మీకు హరామ్'' *(మాఇద : 3)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉద్బోధించారు:

''ఇస్లాంలో అఖ్ర్ నిషేధించబడినది.''

అబ్దుర్రజ్జాఖ్ కథనం : ప్రజలు అజ్ఞాన కాలంలో సమాధుల వద్ద కెళ్ళి ఆవు, మేక మొదలైన జంతువులను ఖుర్బానీ యిచ్చేవారు.

(సమాధుల వద్ద జంతువులను ఖుర్బానీ యివ్వడాన్ని 'అఖ్ర్' అంటారు.)

*(అబూదావూద్ : 3222)*

### 4. తవాఫ్ చేయడం :

ముష్రిక్కులు అజ్ఞాన కాలంలో హజ్‌తోపాటు కాబా గృహంలో దైవేతరుల విగ్రహాలు పెట్టి దాని ప్రదక్షిణం చేసేవారు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం :

ముష్రిక్కులు (కాబా గృహానికి) తవాఫ్ చేస్తూ - ''లబ్బైక లాషరీ కలక'' (నేను హాజరయ్యాను, నీకు సాటి మరొకరు లేరు) అని పలుకుతున్నప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారితో, 'మీ పాడుగాను! ఇక్కడి వరకే ఆపేయండి' అని అనేవారు. కానీ వారు మాత్రం వచనాలను ముందుకు సాగిస్తూ- ''కానీ నీకు సాటిగా ఒకరున్నారు. అతనికి కూడా ప్రభువు నీవే. అతను దేనికీ యజమాని కాడు. (అంటే నీకు సాటిగా ఒకరున్నప్పటికీ అతనికీ, మరియు అతనికి నీవు ప్రసాదించిన శక్తి సామర్థ్యాలకూ ప్రభువు నీవే. స్వతహాగా వారు దేనికీ యజమానులు కారు) అని అంటూ కాబా గృహ ప్రదక్షిణం చేసేవారు.

*(సహీ ముస్లిం : కితాబుల్ హజ్, బాబ్ : తల్బియతి వ సిఫతిహా వ వక్తిహా)*

### 5. అర్పించుకోవడం :

ముష్రిక్కులు తమ సంపాదనలోని కొంత భాగాన్ని దైవేతరులకు సమర్పించుకొనేవారు.

''అల్లాహ్ కొరకు ఈ ప్రజలు స్వయంగా ఆయనే సృష్టించిన పొలాల

నుండీ, పశువుల నుండీ ఒక భాగాన్ని కేటాయించారు. ఇది అల్లాహ్ కొరకు, ఇది మేము నిలబెట్టిన భాగస్వాముల కొరకు, అని తామే స్వయంగా తీర్మానించుకొని అంటారు. వారు నిలబెట్టిన భాగస్వాములకు చెందే భాగం అల్లాహ్‌కు ఎలాగూ చేరదు. కానీ అల్లాహ్‌కు చెందేది మాత్రం వారు నిలబెట్టిన భాగస్వాములకు చేరిపోతుంది. ఎలాంటి తప్పుడు నిర్ణయాలు చేస్తారు ఈ ప్రజలు.''

*(అన్ ఆమ్ : 136)*

పైన పేర్కొన్న ఆచరణలన్నీ ఆరాధన క్రిందికి వస్తాయి. కాబట్టి యివన్నీ కేవలం అల్లాహ్‌కే చెందాలి. దైవేతరుల కోసం వీటిలో ఏ ఒక్కటి పాటించినా అది నిస్సందేహంగా 'షిర్క్' అవుతుంది.

అందుకే తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నోట అల్లాహ్ ఇలా చాటించాడు :

''ఇలా అను: నా నమాజ్, నా సకల ఆరాధనలూ, నా జీవనం, నా మరణం - సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు ఏ భాగస్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు యివ్వబడింది. అందరి కంటే ముందు విధేయతతో తలవంచే వాణ్ణి నేనే.'' *(అన్ ఆమ్ : 162)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం నాటి ముష్రిక్కులూ, వారి విశ్వాసాలూ, వారి ఆచరణలను గూర్చి తెలుసుకున్నాక ప్రస్తుత ముస్లిం సమాజంపై ఒక్కసారి దృష్టి సారించండి :

ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహము అచ్చు గుద్దినట్లు అవే విశ్వాసాలతో తమ జీవితాన్ని సాగిస్తోంది.

మక్కా బహుదైవారాధకులకు **"దైవేతరులను సిఫారసుదారులుగా విశ్వసించి, వారిని వేడుకోవడం వారిని దైవాలుగా చేయడమే అవుతుంది"** అన్న విషయం బాగా తెలిసివున్న కారణంగానే దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం)వారిని' లా ఇలాహ ఇల్లల్లాహ్ వైపుకు రండి' అని పిలిచినప్పుడు-''ఇతడు మంత్రవాది, అసత్యవాది, సమస్త దైవాల స్థానంలో ఒకే దైవాన్ని నిలబెట్టాడేమిటీ? ఇది ఎంతో విచిత్రమైన విషయం''(38:5)అంటూ వెళ్ళిపోయారు.

లా ఇలాహ ఇల్లల్లాహ్ యొక్క అర్థం వానికి బాగా తెలిసివున్నందున,





దీని స్వీకారం వల్ల తాము దైవేతరుల ఆరాధననూ, వారిని సిఫారసుదారులుగా విశ్వసించడాన్ని పూర్తిగా త్యజించి తమ సంబంధాన్ని కేవలం అల్లాహ్ తోనే పెంపొందించుకోవలసి వుంటుందన్న విషయాన్ని వారు బాగా గ్రహించారు. అందుకే వారు లా ఇలాహ ఇల్లల్లాహ్‌ను స్వీకరించలేదు. కాని దురదృష్టవశాత్తూ నేటి ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహము లా ఇలాహ ఇల్లల్లాహ్ అర్థాన్ని సరిగ్గా తెలుసుకొలేక పోవటంవల్లనే నోటితో సద్వచన సాక్ష్యం ఇస్తున్నప్పటికీ అచరణల్లో మాత్రం దానికి పూర్తి వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది!

**అల్లాహ్‌ను సర్వశక్తి మంతుడు అని మనస్ఫూర్తిగా విశ్వసించినప్పటికీ దైవేతరులను సిఫారసు దారులుగా, అల్లాహ్ సాన్నిధ్యాన్ని పొందడానికి ఉపయోగ పడే మధ్యవర్తులుగా భావించి, వారికి ఆరాధనల్లో భాగం కల్పించిన పాపానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం నాటి వాళ్ళు 'ముష్రిక్కులు' అని అల్లాహ్‌చే, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చే ధృవీకరించబడితే, మరి ఈ కాలం ప్రజలు అవే విశ్వాసాలతో జీవితం సాగిస్తూ ముస్లిములుగా వుండగలరా?**

**రేపు అల్లాహ్ వద్ద సాఫల్యం పొందగలరా?**

కేవలం పుణ్యపురుషుల పేర్లు మారాయి. కానీ విశ్వాసాలు మాత్రం ఒక్కటే.

సమాధి పూజలు నేడు సర్వ సాధారణమైపోయాయి. ఈ కార్యాల్లో నిమగ్నమై వున్నవారిని, ఇవన్నీ షిర్క్ పనులు, సమాధులలో ఖననం చేయబడిన వారు మృతులు, మీ కోసం ఏమీ చేయలేరు అని అన్నప్పుడు తమ ఆచరణలను సమర్థించుకుంటూ సామాన్యంగా వారు **సూరే బఖర : 154** మరియు సూరే **ఆలి ఇమ్రాన్ : 169-171** ఆయతులను రుజువులుగా చూపిస్తారు. అందుకే ఈ ఆయత్‌లను గూర్చి సవివరంగా తెలుసుకోవాల్సిన అవసరం వుంది.

సమాధులలో ఖననం చేయబడిన గత కాలానికి చెందిన పుణ్య పురుషులను గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

''అల్లాహ్‌ను వదిలి, ప్రజలు వేడుకుంటున్న ఇతర శక్తులు ఏ వస్తువుకూ సృష్టికర్తలు కారు. వారు స్వయంగా సృష్టింపబడినవారు. మృతులే కాని సజీవులు కారు. వారు ఎప్పుడు (మళ్ళీ బ్రతికించబడి) లేపబడనున్నారో వారికెంత మాత్రమూ తెలియదు.'' *(నహ్ల్ : 20-21)*

"అల్లాహ్‌ను కాదని, ప్రళయం వచ్చేవరకు అతనికి సమాధానమయినా ఇవ్వలేనివారిని, మొరపెట్టుకుంటున్నవారు తమను మొరపెట్టుకుంటున్నారనే విషయం కూడా ఎరుగని వారిని వేడుకొనే వాడికంటే పరమ భ్రష్టుడయిన మానవుడు ఎవడు వుంటాడు? (ప్రళయం రోజు) మానవులందరినీ సమావేశ పరచినప్పుడు, వారు తమను వేడుకున్న వారికి విరోధులై పోతారు, వారి ఆరాధనను తిరస్కరిస్తారు." *(అహ్‌ఖాఫ్ : 5-6)*

యిక సమాధి పూజారులు ఆధారాలుగా చూపించే ఆయతులలోనికి వద్దాం.

**మొదటి ఆయత్ :**

"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులు అని అనకండి. వాస్తవానికి వారు సజీవులు. కానీ మీరు వారి జీవితాన్ని గ్రహించలేరు." *(బఖర : 154)*

**ఇక రెండవది :**

"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులుగా భావించకండి. వాస్తవానికి వారు సజీవులే. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు."

*(ఆలి ఇమ్రాన్ : 169-171)*

అల్లాహ్, వారిని 'సజీవులు' అని అన్నాడు కాబట్టి వారిని వేడుకోవడంలో తప్పులేదు అని మూర్ఖంగా వాదిస్తూ వుంటారు.

యిక ఈ ఆయతులపై స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏమని వ్యాఖ్యానించారో చూద్దాం :

మస్రూఖ్ (రజి అల్లాహు అన్హు) కథనం :

మేము అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు)తో **ఆలిఇమ్రాన్ 169- 171,** ఆయతులను గురించి అడిగాం. దానికాయన - మేము ఈ ఆయతులను గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అడగ్గా దానికాయన ఈ విధంగా వ్యాఖ్యా నించారని చెప్పారు.

"షహీదుల ఆత్మలు పచ్చటి పక్షుల రూపంలో అర్ష్ క్రింద వ్రేలాడుతూ వుండే లాంతర్ల వంటి గూళ్ళలో వుంటాయి. అవి స్వర్గంలో అటూ ఇటూ తిరుగుతూ, తమకిష్టమైనవి తింటూ తిరిగి తమ గూటిలోకి వచ్చి చేరుతాయి.







ఒకసారి వారి ప్రభువు వారిని-ఇంకేమైనా మీరు కోరుకుంటున్నారా? అని అడిగాడు. దానికి వారు - మాకింకేం కావాలి ప్రభూ! మేం స్వర్గంలో ఎక్కడైనా వెళ్ళగలం, ఏదైనా తినగలం అని జవాబిచ్చారు. వారి ప్రభువు మళ్ళీ అడిగాడు, మళ్ళీ అడిగాడు, మళ్ళీ అడిగాడు. చివరికి వారు, 'మనమేదైనా కోరుకోనిదే మన ప్రభువు యిక మనల్ని వదలడు' అని అనుకొని వారు అల్లాహ్‌తో, మా ప్రభూ! మేము కోరేదేమి టంటే మా ఆత్మలను తిరిగి నువ్వు మా శరీరాలతో కలిపేయి, తద్వారా మేము మళ్ళీ నీ మార్గంలో పోరాడి షహీదులవుతాం అని అన్నారు. ఇది విని, వారి ప్రభువు "యిక వీరికేవిధమైన కోరికలు లేవు" అని అనుకొని వారిని వదిలేశాడు".

*(సహీ ముస్లిం : కితాబుల్ అమారత్, బాబ్ :ఫీ బయాని అన్న అర్వాహష్షుహాదాహి....)*

ఇదండీ ఈ ఆయతులకు సంబంధించిన అసలు విశ్లేషణ.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విశ్లేషణకూ, ప్రస్తుతం జరిగే సమాధి పూజలకూ ఏ మాత్రమైనా సంబంధం వుందా చెప్పండి?

అందుకే దివ్యఖురానునూ, యావత్తు దైవ ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయన సహచరులు చేసిన విశ్లేషణ, వారి దృక్పథం తప్పనిసరి. అప్పుడే మనం పెడత్రోవ పట్టకుండా రుజు మార్గంలో వుండగలుగుతాం. ఎందుకంటే, దివ్యఖురానును అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అవతరింప జేశాడు. ఆయతుల వాస్తవిక అర్థాన్ని కూడా స్వయంగా తనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు తెలియపరిచాడు. ఆ విశ్లేషణనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులకు వినిపించేవారు. అందువల్ల వీరు అల్లాహ్ ఆయతులను తప్పుగా ఎప్పుడూ విశ్లేషించలేరు.

యిక వారి వ్యాఖ్యానాన్నీ, విశ్లేషణనూ పెడచెవిన పెట్టి స్వంత లేక ఇతరుల బుద్ధీ జ్ఞానాలు ఉపయోగించి విశ్లేషించడం మొదలు పెట్టినప్పుడే మార్గ భ్రష్టులయ్యేది. దురదృష్టవశాత్తు ముస్లిం సమాజంలో ఇదే జరిగింది. అసలు ముస్లిం సమాజంలో యిన్ని వర్గాలు ఉనికిలోకి రావడానికి ఇది కూడా ఒక ముఖ్య కారణమై నిలిచింది.

ప్రస్తుత ముస్లిం సమాజంలో సాధారణంగా వినబడే మరో ప్రశ్న కూడా వుంది. అదేమిటంటే : ముష్రిక్కులు అల్లాహ్‌ను విశ్వసించినప్పటికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను నిరాకరించారు కదా. మరి ఒక వ్యక్తి అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)నూ విశ్వసించినప్పటికీ ముష్రిక్ ఎలా కాగలుగుతాడు?

దీనికి జవాబు స్వయంగా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముందుగానే యిచ్చేశారు.

"వారిలో అల్లాహ్‌ను విశ్వసించేవారు ఎంత మంది లేరు! కానీ వారు ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతూ వుంటారు."

*(యూసుఫ్ : 106)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం :

దివ్యఖురానులోని ఆయతు "వాస్తవానికి విశ్వసించిన వారికే మరియు తమ విశ్వాసాన్ని దుర్మార్గంతో కలుషితం చేయని వారికే శాంతి, వారు మాత్రమే రుజుమార్గంపై వున్నారు.*(అన్ఆమ్ : 82)* అవతరించినప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు - ఓ దైవ ప్రవక్తా ! మాలో దౌర్జన్యం చేయని వాడు ఎవడున్నాడు? అని అడిగారు. దానికి అల్లాహ్ 'నిస్సందేహంగా షిర్క్ చేయటం పరమ దుర్మార్గం' (13:14) అన్న ఆయత్‌ను అవతరింపజేశాడు."

*(సహీబుఖారి : 32)*

సౌబాన్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు : నా అనుచర సమాజంలోని కొందరు ముష్రిక్కులతో కలిసి పోయి 'ఔసాన్' ను ఆరాధించనంత వరకు ప్రళయం రాదు. *(అబూదావూద్ : 4252)*

ఇక్కడ 'ఔసాన్' అంటే ఏమిటో కాస్త వివరంగా తెలుసుకోవాల్సిన అవసరం వుంది. ఔసాన్ అనేది 'వసన్' అనే పదానికి బహువచనం.

అల్లాహ్‌కు ప్రతిగా ఆరాధనకు ఉపయోగించే ప్రతి వస్తువూ 'వసన్' అవుతుంది. ఉదాహరణకు: విగ్రహాలు, సమాధులు, ప్రాకృతిక వస్తువులు, కాళ్ళు, చేతుల సంజ్ఞ గల చిహ్నాలూ వగైరా...







అయితే ఆసక్తికరమైన మరో విషయమేమిటంటే - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన హదీసులో 'ఔసాన్' అన్న పదం వాడారు. అస్నామ్ అన్న పదం వాడలేదు. 'అస్నామ్' అనేది 'సనమ్'కు బహువచనం. సనమ్ అంటే విగ్రహం అని అర్థం. ఔసాన్‌లో విగ్రహము కూడా చేరిపోతుంది. అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన భవిష్యవాణి ప్రకారం ముస్లిములలో కొందరు పైన పేర్కొన్న వస్తువులలో దేనినయినా ఆరాధించడం మొదలు పెడతారన్నమాట.

పైన పేర్కొన్న రుజువులు మనకు - **'ఒక విశ్వాసి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను విశ్వసించానని సాక్ష్యమిచ్చినప్పటికీ ఒక్కోసారి తన విశ్వాస ఆచరణల రీత్యా షిర్క్ అనే రొంపిలో పడి ముష్రిక్‌గా మారిపోతాడు'** అన్న నగ్న సత్యాన్ని తెలియజేస్తున్నాయి.

అందుకే 'షిర్క్' నుండి సురక్షితంగా ఎలా వుండగలం? అని తన సహచరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి కొన్ని వచనాలు నేర్పి, దీనిని పఠిస్తూ వుండండి. అప్పుడు అన్ని రకాల షిర్క్ నుండి సురక్షితంగా వుండగలుగుతారు అని సెలవిచ్చారు.

ఆ వచనాలు యివి :

"అల్లాహుమ్మ ఇన్ని ఔజుబిక అన్ నుష్రిక షయ్యాన్ నాలము వనస్తగ్ ఫిరుక లిమా లానాలము".

"ఓ అల్లాహ్ ! నేను బుద్ధిపూర్వకంగా షిర్క్ చేయటాన్నుండి నీ శరణు వేడుతున్నాను. నాకు తెలియకుండానే నీతో పాటు మరెవరినైనా భాగస్వామిగా నిలబెడితే దానికి క్షమాపణలు చెప్పుకుంటున్నాను." *(అహ్మద్)*

యిదండీ కలిమా (సద్వచనం)లోని మొదటి భాగమైన 'లా ఇలాహ ఇల్లల్లాహ్' కు సంబంధించిన విస్తృతమైన వాస్తవికత.

యిక కలిమా లోని రెండవ భాగమైన 'మహమ్మదుర్రసూలుల్లాహ్' యొక్క వాస్తవికతను గూర్చి తెలుసుకుందాం.

73

# మహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం వాస్తవికత

లా ఇలాహ ఇల్లల్లాహ్ మాదిరిగానే మహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం ఆమోదం కూడా కొన్ని ముఖ్యమైన అంశాలపై ఆధారపడి వుంది.

1. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను విశ్వసించడం.
2. అంతిమ ప్రవక్తగా విశ్వసించడం.
3. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రేమించడం.
4. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత చూపడం.
5. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను గౌరవించడం, ఆయనకు సహాయ పడడం.

యిక ఈ మౌలికాంశాలను గురించి వివరంగా తెలుసుకుందాం.

**1. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను విశ్వసించడం :**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను విశ్వసించడమంటే మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అల్లాహ్ యొక్క సత్య ప్రవక్తగా, హృదయాలలో ఏమాత్రం సంకోచం లేకుండా మనస్ఫూర్తిగా విశ్వసించడం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ప్రవక్త".

*(ఫతహ్ : 29)*

మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం ఒక బస్తీకి గానీ, ప్రాంతానికి గానీ, దేశానికి గానీ కాకుండా యావత్తు ప్రపంచ వాసుల కోసం దైవ ప్రవక్తగా పంపించబడ్డారు.



దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

"ఇలా ప్రకటించు : నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి. " *(ఆరాఫ్ : 158)*

"మేము నిన్ను సర్వమానవులకు శుభవార్తను యిచ్చేవాడుగా, హెచ్చరిక చేసేవాడుగా నియమించి పంపాము." *(సబా : 28)*

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు లభించిన ఐదు ప్రత్యేకతలను వివరిస్తూ యిలా ప్రవచించారు.

"ప్రతి ప్రవక్త తన జాతి కొరకే పంపబడ్డాడు. నేను మాత్రం భూలోక వాసులందరికోసం పంపించబడ్డాను." *(సహీ బుఖారి : 438)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

"మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణం ఎవరి చేతిలో వుందో ఆ దైవం సాక్షిగా ! ఈ అనుచర సమాజానికి చెందిన ఏ వ్యక్తి అయినా సరే, యూదుడైనా సరే, క్రైస్తవుడైనా సరే నా గురించి విని తదుపరి నాతో పంపబడిన ధర్మాన్ని విశ్వసించకుండా చనిపోతాడో అతడు తప్పకుండా నరకంలోకి పోతాడు."

*(సహీ ముస్లిం: కితాబుల్ ఈమాన్, బాబ్: ఉజూ బిల్ ఈమాని బిరిసాలతిహి...)*

మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం సమస్త మానవ జాతికే కాకుండా జిన్నాతుల కొరకు కూడా సందేశ హరుడిగా చేసి పంపించబడ్డారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అప్పుడు మేము జిన్నాతుల ఒక వర్గాన్ని ఖురాను వినేందుకు నీ వద్దకు తీసుకువచ్చాము. నీవు ఖారాను పఠిస్తూ ఉండిన స్థలానికి చేరిన తర్వాత వారు పరస్పరం 'నిశ్శబ్దంగా వుండండి' అని చెప్పుకున్నారు. అది చదవడం ముగిసిన పిదప, వారు హెచ్చరిక చేసే వారుగా తమ జాతి వైపునకు తిరిగి వెళ్ళిపోయారు. వారు అక్కడకు వెళ్ళి ఇలా అన్నారు :

ఓ మా జాతి ప్రజలారా! మేము ఒక గ్రంథాన్ని విన్నాము. అది మూసా ప్రవక్త తరువాత అవతరించింది. తనకు పూర్వం అవతరించిన గ్రంథాలను

ధృవీకరిస్తుంది, సత్యం వైపునకూ, రుజుమార్గం వైపునకూ దారి చూపుతుంది. ఓ మా జాతి ప్రజలరా! అల్లాహ్ వైపునకు పిలిచే వాని సందేశాన్ని స్వీకరించండి. అతణ్ణి విశ్వసించండి. అప్పుడు అల్లాహ్ మీ పాపాలను క్షమిస్తాడు, మిమ్మల్ని భయంకరమైన శిక్ష నుండి రక్షిస్తాడు. అల్లాహ్ వైపునకు పిలిచే వాని మాటను వినని వాడు భూమిలో అల్లాహ్‌ను అశక్తుడిగా చేసే శక్తిని కలిగిలేడు. అతనిని అల్లాహ్ నుండి రక్షించేందుకు ఎలాంటి మద్దతుదారులు గానీ, సంరక్షకులు గానీ ఎవరూ వుండరు. అటువంటి వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి వున్నారు." *(అహ్ఖాఫ్ : 29-32)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను విశ్వసించడంలో ఇమిడి వున్న మరో ముఖ్య విషయం ఏమిటంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ దాసులనీ, సందేశహరులని విశ్వసించడం. అంటే ఆరాధనకు యోగ్యులు కాని, తిరస్కారానికి ఏ మాత్రం అవకాశం లేని అల్లాహ్ సందేశహరులన్నమాట!

కానీ ప్రస్తుత ముస్లిం సమాజంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఒక కార్యసాధకుడిగానూ, కష్టాలు తీర్చేవాడిగానూ, ఆయురారోగ్యాలు ప్రసాదించే వాడిగానూ నమ్మి ఆయనను వేడుకొంటూ ఆయనను ఆరాధించే వారు ఎంత మంది లేరు.

ఇలాంటి షిర్క్ పనుల్లో సతతం నిమగ్నమై వుండి 'మహమ్మదుర్రసూలుల్లాహ్' అని వారిచ్చే సాక్ష్యం అల్లాహ్ దగ్గర ఎలా స్వీకరించబడుతుందో చెప్పండి?

ఇటు, స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు అల్లాహ్ ఏమని ఆజ్ఞాపించాడో చూడండి :

"ఇలా చెప్పు: మీకు నష్టం కలిగించటం లేదా మీకు మేలు చేయటం అనేది నా వశంలో లేదు. ఇలా చెప్పు: నన్ను అల్లాహ్ పట్టునుండి ఎవ్వరూ కాపాడలేరు. నాకు ఆయన తప్ప మరొక ఆశ్రయం కూడా లేదు".*(జిన్న్ : 21-22)*

ఇదండీ అసలు వాస్తవం.

## 2. అంతిమ ప్రవక్తగా విశ్వసించడం :

మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అంతిమ ప్రవక్తగా విశ్వసించడంలో ఇమిడి వున్న అంశాలేమిటంటే - తనను దైవ ప్రవక్తల పరంపరను







సమాప్తం చేసే చివరి దైవ సందేశహరులని మనస్ఫూర్తిగా విశ్వసించడం, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన భవిష్యవాణి ప్రకారం ప్రళయం వరకు రాబోయే దాదాపు 30 మంది అసత్యపు ప్రవక్తలను బాహాటంగా త్రోసిపుచ్చడం.

అలాగే దివ్య ఖురానును యావత్ మానవాళి కొరకు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అల్లాహ్‌చే అవతరింప జేయబడిన అంతిమ దైవ గ్రంథమని, ఇంతకు ముందు వున్న ఆకాశ గ్రంథాలను ధృవపరుస్తూ, సత్యా సత్యాలను వేరు చేసి చూపే అంతిమ ధర్మ శాస్త్రమని గూడా గాఢంగా విశ్వసిం చడం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మీలోని ఏ పురుషునికీ తండ్రి కారు. కానీ, ఆయన అల్లాహ్ యొక్క ప్రవక్త. దైవ ప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరివారు. అల్లాహ్ సకల విషయాల జ్ఞానం కలవాడు." *(అహ్జాబ్: 40)*

"ఈ సందేశహరుణ్ణీ, చదువనూ, వ్రాయనూ రాని ఈ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అనుసరించేవారు, అతని ప్రస్తావన వారికి తమ వద్ద వున్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో వ్రాయబడి లభిస్తుంది. అతను వారికి మంచిని ఆజ్ఞాపిస్తాడు, చెడు నుండి నిరోధిస్తాడు. వారికొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతం చేస్తాడు. అపరిశుద్ధమైన వాటిని నిషిద్ధం చేస్తాడు. వారిపై మోపబడి వున్న బరువులను దించుతాడు. వారు బంధించబడి వున్న శృంఖలాలను త్రెంచుతాడు. కనుక అతనిని విశ్వసించీ, సమర్థించీ, అతనికి సహకరించీ, అతనితో అవతరింపజెయ్యబడిన జ్యోతిని అనుసరించే వారు మాత్రమే సాఫల్యం పొందే వారు." *(ఆరాఫ్: 157)*

"మానవులారా! ఈ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీవద్దకు మీ ప్రభువు తరపు నుండి సత్యం తీసుకువచ్చాడు. అతణ్ణి విశ్వసించండి. మీకే మంచిది." *(నిసా: 170)*

"ఎవడైనా ఇస్లాం ను కాక మరొక మార్గాన్ని అవలంబించదలిస్తే ఆమార్గం ఎంత మాత్రమూ ఆమోదించబడదు. అతడు పరలోకంలో విఫలుడౌతాడు, నష్టపోతాడు." *(ఆలి ఇమ్రాన్: 85)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: నేనూ, నాకు ముందు పంపబడిన దైవ ప్రవక్తల పోలిక ఎలాంటిదంటే ఒక వ్యక్తి ఒక గృహాన్ని నిర్మించాడు. దాన్ని ఎంతో అందంగా అలంకరించాడు. కానీ ఒక మూల, ఒక ఇటుక పట్టేంత స్థలాన్ని వదిలేశాడు. ప్రజలు ఆ ఇంట్లో అటూఇటూ తిరుగుతూ ఆ ఖాళీ స్థలాన్ని చూసి (ఇంత అందమైన ఇంట్లో) ఒక్క ఇటుక ఎందుకు పెట్టలేదో! అని ఆశ్చర్యం ప్రకటిస్తారు.

ఆ ఆఖరి ఇటుకలాంటిది నా పోలిక మరియు నేను ఆఖరి దైవ ప్రవక్తను.

*(సహీ బుఖారి : 3535)*

యిక బూటకపు దైవ ప్రవక్తల విషయానికొస్తే-

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో ముసైలమా అను ఒక అసత్య వ్యక్తి తానుదైవ ప్రవక్తనని ప్రకటించుకున్నాడు. చివరికి అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) గారి పరిపాలనా కాలంలో అతణ్ణి హతమార్చడం జరిగింది.

పంజాబ్ రాష్ట్రానికి చెందిన గులాం అహ్మద్ ఖాదియానీ కూడా గతంలో తాను దైవ ప్రవక్తనని ప్రకటించుకొని చాలా మంది అమాయక ముస్లిములను భ్రష్టు పట్టించాడు. నేటికీ ఈ అసత్యవాది అనుయాయులు మన సమాజంలో కానవస్తారు.

మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అంతిమ ప్రవక్తగా విశ్వసించడం అనేది బూటకపు ప్రవక్తలందర్నీ నిర్ద్వంద్వంగా త్రోసిపుచ్చడంతోనే సాధ్యమవుతుంది.

## (3) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమించడం:

'మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యంలో ఇమిడి వున్న మరొక ముఖ్యమైన అంశం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మనస్ఫూర్తిగా ప్రేమించడం. హృదయంలో ఆయన పట్ల ఎలాంటి ఆక్షేపణ లేకుండా వుండడం. అంతేకాదు, ఒక వ్యక్తికి తన తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, ఇతర బంధుమిత్రులందరి కన్నా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రియం కానంతవరకు అతను నిజమైన విశ్వాసి కాలేడు.







అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"తమ తల్లి దండ్రులూ, భార్యా పిల్లలు, వేరే ఇతర మానవులందరికన్నా ఎక్కువగా నన్ను ప్రేమించనంతవరకు మీలో ఏ ఒక్కడూ నిజమైన విశ్వాసి కాజాలడు." *(సహీ బుఖారి : 15)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు:

"ఈ మూడు లక్షణాలు కలిగి వున్నవాడు విశ్వాస మాధుర్యాన్ని అస్వాదిస్తాడు- అందులో ఒకటి- అల్లాహ్, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల అందరికన్నా ఎక్కువగా ప్రేమ కలిగి వుండడం." (అసంపూర్ణ హదీసు)

*(సహీ బుఖారి : 16)*

అంతేకాదు, అల్లాహ్‌నూ ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ ఇతరులందరి కన్నా ఎక్కువగా ప్రేమించని వారికి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గట్టిగా హెచ్చరించారు.

"ఇలా అను: ఒకవేళ మీ తండ్రులూ, మీ కుమారులూ, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు, మీ ఆప్తులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయేమో అని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్త కంటే, ఆయన మార్గంలో శ్రమించటం కంటే మీకు గనక ఎక్కువ ప్రియతర మైతే, అల్లాహ్ తన తీర్పును మీ ముందుకు తీసుకు వచ్చే వరకు నిరీక్షించండి. అల్లాహ్ దోషులకు మార్గం చూపడు."

*(తౌబా: 24)*

అబ్దుల్లా బిన్ హిషామ్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేమొకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంటవున్నాం. ఉమర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త గారి చేతులు పట్టుకొని వున్నారు. తదుపరి ఉమర్ (రజి) - ఓ దైవ ప్రవక్తా! మీరు నాకు నా ప్రాణం తప్ప మిగతా అందరి కన్నా ప్రియమైన వారు అని పలికారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ : ఎంత మాత్రం కాదు! ఎవరి చేతిలో నా ప్రాణం వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షిగా! మీ

ప్రాణం కన్నా కూడా నేను మీకు ప్రియం కానంతవరకు (మీ విశ్వాసం సంపూర్ణం కానేరదు) అని అన్నారు. దీనికి ఉమర్ (రజి అల్లాహు అన్హు) అల్లాహ్ సాక్షిగా ! ఇప్పుడు మీరు నాకు నా ప్రాణం కన్నా ప్రియమైన వారు అని పలికారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బదులు పలుకుతూ: ఇదే (పరిపూర్ణ విశ్వాసం యొక్క) అసలు వాస్తవికత అని అన్నారు. *(సహీ బుఖారి : 6632)*

అయితే ప్రస్తుత ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహము ఇక్కడ కూడా పెడత్రోవ పట్టి దైవప్రవక్తను ప్రేమించడంలో మితిమీరి ప్రవర్తిస్తోంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఆయన స్థాయి నుండి లేపి తనకే మాత్రం తగని విషయాలనూ, కేవలం అల్లాహ్ కే చెందిన గుణగణాలనూ ఆయనకు ఆపాదిస్తోంది.

ఇలా చేసేవారు నోటితో 'మహమ్మదుర్రసూలుల్లాహ్' అని సాక్ష్యం యిస్తూ వున్నప్పటికీ వాస్తవానికి తమ విశ్వాసాల ద్వారా దానిని తిరస్కరించిన వారవుతున్నారు.

వీరిలో కొందరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను 'కాంతి'గా విశ్వసిస్తే మరికొందరు ఆయనను భూమి మీదకు వచ్చిన అల్లాహ్ అవతారము అని తలపోస్తారు.

ఇవన్నీ సూఫీ మరియు షియా మహాశయుల బూటకపు విశ్వాసాలు.

ఇంకా కొందరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అగోచర విషయాలు తెలిసిన జ్ఞాని అనీ ఆయనకు మరణం అసలు రాలేదని గాఢంగా విశ్వసిస్తారు.

యివన్నీ తప్పుడు విశ్వాసాలు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధర్మంతో వీటికేమాత్రం సంబంధం లేదు.

యిక దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు సంబంధించిన అసలు వాస్తవాలను దివ్యఖురాన్ మరియు దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం)గారి ప్రామాణిక హదీసుల వెలుగులో తెలుసుకుందాం.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా మనిషే. ఆయన అల్లాహ్ యొక్క దాసులు మరియు ఆయన ప్రవక్త. అల్లాహ్ తనను ఆఖరి ప్రవక్తగా,







యావత్ ప్రపంచవాసుల కొరకు కారుణ్యంగా చేసి పంపాడు. ఆయన ఆదమ్ సంతతికి నాయకులు.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఇలా చెప్పు: నేను కేవలం ఒక మానవుణ్ణి. మీలాంటివాణ్ణి. నాకు వహీ ద్వారా ఇలా తెలుపబడింది, మీ దైవం కేవలం ఒకే దైవం". *(కహఫ్ : 110)*

"వారితో ఇలా అను : నా ప్రభువు పరిశుద్ధుడు. నేను సందేశాన్ని తెచ్చే మానవమాత్రుడు తప్ప మరింకేమైనా అవుతానా?" *(బనీ ఇస్రాయీల్ : 93)*

"ఇలా అను : నేను కూడా మీలాంటి ఒక మనిషినే."

*(హామీమ్ అస్ సజ్దా : 6)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు : నిస్సందేహంగా నేను కూడా మీ లాంటి ఒక మనిషినే. మీలాగే నేను కూడా మరిచిపోతూ వుంటాను. కనుక నేను మరిచిపోయినప్పుడల్లా నాకు జ్ఞాపకం చేయండి."

*(సహీ బుఖారి : 401)*

ఆ మాటకొస్తే అసలు అల్లాహ్‌చే పంపబడిన దైవప్రవక్తలందరు కూడా మానవులే.

"మేము నీకు పూర్వం కూడా ప్రవక్తలను పంపినప్పుడల్లా మానవులనే ప్రవక్తలుగా పంపాము." *(నహ్ల్ : 43)*

తనను ప్రేమించడంలో హద్దులు మీరే వారిని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తీవ్రంగా హెచ్చరించారు:

ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: క్రైస్తవులు ఈసా (అలైహిస్సలాం) విషయంలో మితిమీరినట్లు మీరు నా విషయంలో మితిమీరకండి. నిస్సందేహంగా నేను అల్లాహ్ దాసుణ్ణి. కనుక నన్ను అల్లాహ్ దాసుడు మరియు ఆయన ప్రవక్త అని అనండి. *(సహీహ్ బుఖారి : 3445)*

యిక అగోచర జ్ఞానానికి సంబంధించిన వాస్తవాలను తెలుసుకుందాం. దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఆకాశాలలోనూ, భూమిలోను అల్లాహ్ తప్ప అగోచర జ్ఞానం కలవాడు లేడు. వారికి (మిధ్యా దేవుళ్ళకు ) తాము ఎప్పుడు లేప బడతారో కూడా తెలియదు కదా!" (నమ్ల్: 65)

"ఆయన (అల్లాహ్) గోప్యంగా వున్నటువంటి, బహిరంగంగా వున్నటువంటి ప్రతి వస్తువును గురించీ తెలిసిన పండితుడు." (రాద్: 8)

"ఆకాశాలలో, భూమిలో దాగి వున్న దంతా అల్లాహ్ ఆధీనంలో వున్నది." (హూద్: 123)

"వారితో ఇలా అను : నా వద్ద అల్లాహ్ నిధి నిక్షేపాలు ఉన్నాయని గానీ, నాకు అగోచర జ్ఞానం కలదని గానీ నేను మీతో చెప్పటంలేదు. ఇంకా నేను దైవ దూతనని కూడా అనటంలేదు. నేను కేవలం నాపై అవతరింపజేయబడే వహీని మాత్రమే అనుసరిస్తాను." (అన్ ఆమ్: 50)

"ఇలా అను: నా ఆధీనంలో స్వయంగా నా లాభ నష్టాలు సైతమూ లేవు. అంతా అల్లాహ్ సంకల్పం మీద ఆధారపడి వుంది.": (యూనుస్: 49)

"వారితో ఇలా అను: నాకు సంబంధించిన లాభ నష్టాలపై నాకు ఏమాత్రం అధికారంలేదు. అల్లాహ్ కోరింది మాత్రమే అవుతుంది. నాకే గనక అగోచర విషయ జ్ఞానం ఉన్నట్లయితే నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది వుండే వాణ్ణి. నాకు ఎన్నటికీ ఏ నష్టమూ వాటిల్లేది కాదు. నేను నా మాటను నమ్మే వారికొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే, శుభవార్త వినిపించే వాణ్ణి మాత్రమే." (ఆరాఫ్ :188)

ఖాలిద్ బిన్ జక్వాన్ కథనం ప్రకారం రబీ బిన్తె ముఅజ్ బిన్ అఫ్రా (రజి అల్లాహు అన్హ) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా పెళ్ళిరోజు మా ఇంటికి విచ్చేశారు. లోపలికొచ్చి, ప్రస్తుతం నువ్వు కూర్చున్నట్లుగానే నా మంచంపై కూర్చున్నారు. ఆ సమయంలో కొందరు పిల్లలు డప్పు వాయిస్తూ బద్ర్ యుద్ధంలో ప్రాణాలర్పించిన మా నాన్న, బాబాయిలను శ్లాఘిస్తూ పాటలు పాడుతున్నారు. అంతలో ఒక అమ్మాయి- 'మాలో ఒక ప్రవక్త వున్నాడు, అతనికి రేపు జరగబోయేదంతా కూడా తెలుసు' అని పాడటం మొదలు పెట్టింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెంటనే కల్పించుకొని 'ఈ మాట అనకు,







ఇది తప్పు ఇంతకు ముందు పలికిన మాటలే పలుకు' అని హితవు చేశారు. (సహీ బుఖారి : 5147)

మస్రూఖ్ కథనం: నేను విశ్వాసుల మాతృమూర్తి ఆయెషా (రజి అల్లాహు అన్హ) ను అమ్మా! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మేరాజ్ రాత్రి తమ ప్రభువును చూశారా? అని అడిగాను. దానికామె ఇలా అన్నారు : నీ మాటలు విని నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నీకు తెలుసా? ఈ మూడు విషయాలను గురించి మీలో ఎవరైనా తన వైపునుంచి ఏదైనా అంటే అతను అబద్ధాల కోరుగా పరిగణించబడతాడు:

(1) ఎవరైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మేరాజ్ రాత్రి తమ ప్రభువును చూశారని అన్నాడంటే వాడు పచ్చి అబద్ధాల రాయుడే. తదుపరి ఆమె ఈ ఆయత్ పఠించారు:

"ఎవరి చూపులూ ఆయనను అందుకోజాలవు. ఆయన మాత్రం అందరి చూపులను అందుకోగలడు." (అన్ ఆమ్ : 103)

"అల్లాహ్ ఏ మానవుని తోనూ ప్రత్యక్షంగా సంభాషించడు. మానవ మాత్రుడికి అది సాధ్యమయ్యే పని కాదు. అల్లాహ్ తన మాటను వహీ ద్వారానో లేక తెరవెనుకనుంచో మాత్రమే మానవునికి చేరవేస్తాడు." (షూరా: 51)

(2) అలాగే రేపు జరగబోయే, విషయాలేవో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు తెలుసు అని అనేవాడు కూడా అబద్ధాల కోరే. ఈ సందర్భంలో ఆమె ఈ ఆయత్ను పఠించారు:

"రేపు తాను ఏమి చేయనున్నాడో ఏ మానవునికీ తెలియదు." (లుఖ్మాన్: 34)

(3) అదే విధంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) (ధర్మానికి సంబంధించిన) ఏదైనా విషయం రహస్యంగా వుంచారని అనేవాడు కూడా అబద్ధాలరాయుడే. దీనికి ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఈ ఆయత్ ను పఠించారు:

"ప్రవక్తా! నీ ప్రభువు నుండి నీపై అవతరించే బోధనలను ప్రజలకు అందజేస్తూ వుండు. ఒక వేళ నీవలా చేయకపోతే దౌత్యబాధ్యతను నెరవేర్చని వాడవుతావు." (మా ఇద: 67)

కనుక అసలు విషయం ఏమిటంటే, “దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం) ను అతని నిజ స్వరూపంలో రెండుసార్లు చూశారు.” *(సహీ బుఖారి : 4858)*

అయితే స్వతహాగా దైవ ప్రవక్తలకు అగోచర జ్ఞానం లేకపోయినప్పటికీ అల్లాహ్ వారికి తెలిపిన అగోచర విషయాల జ్ఞానం మటుకు వారికి వుంటుంది.

ఉదాహరణకు : సమాధి శిక్షకు సంబంధించిన జ్ఞానం, ప్రళయకాల సూచనలు, స్వర్గ నరక విశేషాలు వగైరా...

చూడబోతే ఇవన్నీ అగోచర విషయాలే మరి. కానీ అల్లాహ్ తన ప్రవక్తలకు వీటికి సంబంధించిన జ్ఞానాన్ని యిచ్చాడు. తద్వారా ఆయా ప్రవక్తలు తమ తమ అనుచర సమాజాలకు ఆ విషయాలను తెలియ జేశారు. దివ్యఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

“మీరు ప్రస్తుతం వున్నటువంటి స్థితిలో అల్లాహ్ విశ్వాసులను ఏ మాత్రం వుండనివ్వడు. ఆయన పవిత్రులను అపవిత్రుల నుండి వేరు చేస్తాడు. అయితే అగోచర విషయాల రహస్యాలను తెలుపడం అల్లాహ్ విధానం కాదు. (అగోచర విషయాలు తెలుపడానికి) అల్లాహ్ తన ప్రవక్తలలో తాను కోరిన వారిని ఎన్ను కుంటాడు. కనుక (అగోచర విషయాలను గురించి) అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త లనూ నమ్మండి. మీరు గనక భయ భక్తుల మార్గాన్ని అవలంబిస్తే మీకు పెద్ద బహుమానం లభిస్తుంది.” *(ఆలి ఇమ్రాన్ : 179)*

“ఆయన అగోచర జ్ఞానం కలవాడు. తన అగోచర విషయాలను తాను ఎంచుకున్న ప్రవక్తకు తప్ప మరెవ్వరికీ తెలియ జేయడు.” *(జిన్న్: 26-27)*

ఇదండీ అగోచర జ్ఞానానికి సంబంధించిన వాస్తవికత. యిక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణానికి సంబంధించిన వాస్తవాలను గూర్చి తెలుసుకుందాం:

సృష్టిలోని జీవరాసుల్లో దేనికయినా మరణం అనేది సహజసిద్ధంగా సంభవించే ప్రక్రియ. అల్లాహ్ చేత ఈ భూమి మీదకు ఒకసారి ఉనికి లోకి వచ్చాక ఏదో ఒక రోజు నశింపక తప్పదు. అందుకే సృష్టి ప్రక్రియ ఆరంభమైన కాలం నాటి నుండి నేటివరకు మరణించకుండా చిరంజీవులుగా వుండిపోయిన







వారు ఎవరూ లేరు. దైవ ప్రవక్తలు (అలై హిస్సలాం) తమ దౌత్య బాధ్యతల రీత్యా అల్లాహ్ దృష్టిలో ఉన్నతమైన స్థానం పొందినప్పటికీ వారు కూడా అల్లాహ్ సృష్టిలోని ఒక భాగమే అన్న సంగతి మనం మరువ కూడదు.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

“ఈ పుడమిపై వున్న ప్రతి వస్తువు నాశనమైపోయేదే. కేవలం మహోన్న తుడూ మహోపకారీ అయిన నీ ప్రభువు ముఖం మాత్రమే మిగిలి వుండేది.” *(రహ్మాన్: 26-27)*

“ప్రవక్తా! శాశ్వత జీవితాన్ని మేము నీకు పూర్వం కూడా ఏ మానవునికీ ప్రసాదించలేదు. ఒక వేళ నీవు మరణిస్తే, వారు మాత్రం శాశ్వతంగా జీవించి వుంటారా? ప్రతి ప్రాణీ మృత్యువును తప్పకుండా చవిచూస్తుంది.” *(అంబియా: 34-35)*

“ప్రతి ప్రాణీ మరణాన్ని రుచి చూడవలసి వున్నది.” *(అన్‌కబూత్: 57)*

“ఓ ప్రవక్తా! నీవూ మరణిస్తావు, వారూ మరణిస్తారు. చివరకు ప్రళయం నాడు మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీమీ వ్యాజ్యాలను వినిపిస్తారు”. *(జుమర్: 30)*

“ఇలా అను: నా నమాజ్, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణం సమస్తమూ సకల లోకాలకూ ప్రభువైన కేవలం అల్లాహ్ కొరకే.” *(అన్ ఆమ్: 162)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు మరణమనేదే లేనప్పుడు స్వయంగా తన నోటితో ఆ విషయాన్ని ఎలా ప్రకటించగలరు?

యిక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణం గురించి ఆయన సతీమణులు, సహచరుల విశ్వాసాలను గూర్చి తెలుసుకుందాం :

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణాన్ని గూర్చి చెబుతూ ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఇలా చెబుతుండేవారు: అల్లాహ్ నాకు ప్రసాదిం చిన వరాల్లో ఒక వరం ఏమిటంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణం స్వయంగా నా ఇంట్లోనే, నా వంతు వున్న రోజునే సంభవించింది. దైవ

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అప్పుడు నన్ను ఆనుకొని కూర్చొని వున్నారు మరియు అల్లాహ్ ఆ సమయంలో నా ఉమ్మిని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉమ్మితో జత చేసి ఒకటిగా కలిపేశాడు.

అసలు జరిగిందేమిటంటే - ఆ సమయంలో అబ్దుర్రహ్మాన్ (రజి అల్లాహు అన్హు) ఇంటిలోపలికి విచ్చేశారు. ఆయన చేతిలో మిస్వాక్ వుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాకు ఆనుకొని కూర్చొని ఆ మిస్వాక్ వైపు దృష్టి సారించడం నేను గమనించాను. ఆయన మిస్వాక్ చేయాలనుకొంటున్నారు అని గ్రహించి "ఈ మిస్వాక్ మీకోసం తీసుకోనా?" అని అడిగాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'తీసుకో' అన్నట్లు తల ఊపి సైగ చేశారు. కానీ ఆయన దానిని నమల లేక పోయారు. "మీకోసం నేను మెత్తగా చేసి యివ్వనా?" అని అడిగాను. 'అలాగే' అని తిరిగి సైగ చేశారు. నేను మిస్వాక్‌ను మెత్తగా చేసి యిచ్చాను. సమయంలో ఆయన ముందు ఒక పెద్ద పాత్ర వుంది. తోలుదో కర్రదో (హదీసు ఉల్లేఖకునికి ఇక్కడ సందేహం కలిగింది). అది నీటితో నింపబడి వుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాటి మాటికీ తన చేతుల్ని దానిలోకి పోనిచ్చి వాటిని ముఖంపై త్రిప్పుకుంటూ 'లా ఇలాహ ఇల్లల్లాహ్' మరణంలో యాతన వుంది అని అనేవారు. తర్వాత తన చేతిని పైకి లేపి 'ఫిర్రఫీఖుల్ ఆలా' (పరమోన్నత మిత్రునితో) అంటూ తన తుది శ్వాస విడిచారు. ఆయన చేయి క్రిందికి వంగి పోయింది. (ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్). *(సహీ బుఖారి : 4449)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన సమయంలో ఆ వార్తను జీర్ణించుకోలేని ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఉద్వేగంలో భావ భీతులై- ఎవరైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను మరణించారని అంటే నా ఖడ్గం తో అతణ్ణి రెండు ముక్కలు చేస్తాను అని పలకడం మొదలు పెట్టారు ఆ సమయంలో జరిగిన ఒక ముఖ్యమైన సంఘటనను గమనించండి:

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన సమయంలో అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) గారు విచ్చేశారు. ఆ సమయంలో ఉమర్ (రజి అల్లాహు అన్హు) ప్రజలతో ఏదో





సంభాషిస్తున్నారు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) - ఓ ఉమర్ ! కూర్చో అని అన్నారు. కానీ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కూర్చోడానికి నిరాకరించారు. ఇంతలో ప్రజలు ఉమర్ (రజి అల్లాహు అన్హు) ను వదిలి అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) దగ్గరికొచ్చి కూర్చున్నారు. ఆయన ఖుత్బా పలుకులు పలికి ఇలా అన్నారు: "అమ్మాబాద్! మీలో ఎవరైతే మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఆరాధించేవారో, వారు మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించారని తెలుసుకోవాలి, మరియు ఎవరైతే అల్లాహ్‌ను ఆరాధించేవారో వారు తెలుసుకోవాల్సిందేమిటంటే అల్లాహ్ ఎల్లప్పుడూ సజీవంగా వుండేవాడు, అతనికి మరణం రాదు."

"అల్లాహ్ స్వయంగా ఈ విషయాన్ని తెలియజేశాడు: మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక ప్రవక్త తప్ప మరేమీ కారు. అతనికి పూర్వం ఇంకా ఎందరో ప్రవక్తలు గతించారు. అలాంటప్పుడు ఒకవేళ అతను మరణిస్తే లేక హత్య చెయ్యబడితే మీరు వెనుకంజ వేసి మరలిపోతారా? జ్ఞాపకం వుంచుకోండి, మరలి పోయేవాడు అల్లాహ్‌కు ఏమాత్రం నష్టం కలిగించలేడు. కానీ, అల్లాహ్ కు కృతజ్ఞత చూపే దాసులుగా జీవించేవారిని ఆయన తగువిధంగా బహూకరిస్తాడు." *(ఆలి ఇమ్రాన్: 144)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: అల్లాహ్ సాక్షి! ఆ సమయంలో అందరికీ ఎలాంటి సందేహం కలిగిందంటే, అసలు అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడన్న విషయం ఇప్పటి వరకు ప్రజలకు తెలియనే తెలియదు. ఎప్పుడైతే అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఈ ఆయత్‌ను పఠించారో అందరూ ఆయన ద్వారా ఈ ఆయత్‌ను నేర్చుకున్నారు. ఆ సమయంలో ప్రజల స్థితి ఎలా వుందంటే ఈ ఆయత్‌ను ఎవరు విన్నా వెంటనే దాన్ని పఠించడం మొదలు పెట్టేవాడు.

హదీసు ఉల్లేఖకుడు జుహ్రి కథనం:

తర్వాత నాకు సాద్ బిన్ ముసైద్ (రజి అల్లాహు అన్హు), ఉమర్ (రజి అల్లాహు అన్హు) తనతో యిలా చెప్పారని తెలియజేశారు: అల్లాహ్ సాక్షి! అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) ఈ ఆయత్‌ను పఠిస్తున్న సమయంలో నాకు తెలివి వచ్చింది.

ఆయన ద్వారా 'దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించారు' అని పఠించడం జరిగినప్పుడు నేనొక్కసారిగా కంపించి పోయాను. ఆ క్షణంలో నా పాదాలు నా శరీర బరువును మోయలేక భూమిలోకి ఇంకి పోతానేమోనన్న అనుమానం కలిగింది. *(సహీ బుఖారి : 4454)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రీ.శ. 571 సం॥లో అరేబియాలోని మక్కా నగరంలో ఖురైష్ జాతిలోని బనీ హాషిమ్ తెగకు చెందిన అబ్దుల్లా, ఆమెనా అనే దంపతులకు జన్మించారు. బాల్యంలోనే తల్లి దండ్రులను కోల్పోయి ఒక అనాథగా, సామాన్య మానవునిగా, తన బాబాయి 'అబూ తాలిబ్' దగ్గర జీవితం గడిపారు. తన 40 వ యేట దైవ ప్రవక్తగా అల్లాహ్‌చే నియమించబడ్డారు. అంతకు ముందు అసలు గ్రంథం అంటే ఏమిటో, విశ్వాసం అంటే ఏమిటో కూడా తనకు తెలియదు *(షూరా: 52)*. అలాగే తనపై ఖురాన్ అవతరిస్తుందని కూడా ఆయన ఎన్నడూ ఊహించలేదు *(ఖసస్: 86)*. ఒక సామాన్య మానవునిగా కష్టసుఖాలను అనుభవిస్తూ దైవ దౌత్య బాధ్యతలను నిర్వహిస్తూ వాటిలో ఎదురైన విపత్కర పరిస్థితులను ధైర్యంగా అధిగమిస్తూ తన 23సం॥ల దౌత్య కాలంలో దైవ ధర్మాన్ని ఈ లోకానికి విజయవంతంగా చాటి చెప్పి తన 63వ యేట మరణించారు. ఆయన సహచరులు తను మరణించిన చోటైన ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఇంట్లోనే ఆయనను ఖననం చేశారు. ఇవండీ క్లుప్తంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు సంబంధించిన వాస్తవాలు.

యిక ఈ వాస్తవాలను తెలుసుకున్న తర్వాత భారతీయ ఉపఖండంలోని సూఫీ మహాశయుల గ్రంథాలను ఒక్కసారి తిరగేస్తే ఎన్నో బూటకపు విశ్వాసాలూ, వాస్తవాలకు విరుద్ధంగా వున్న విషయాలు మనకు కానవస్తాయి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీది ప్రేమతో మితిమీరి ఒకరు స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అల్లాహ్ (అల్లహ్ క్షమించు గాక) అని సెలవిస్తే, ఇంకొకరు అయనకు అగోచర జ్ఞానాన్ని అంటగట్టారు.

ఒకరు- దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా హృదయంలో మూడు సం॥లు బస చేశారు. 'ఆయనను అడక్కుండా నేనే పనీ చేయలేదు' అని ప్రకటిస్తే,







మరొకరు ఏకంగా 'తాను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ప్రత్యక్షంగా దర్శించాను' అని చాటుకున్నారు!

యిక వీరి గ్రంథాల్లో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ రోజు కూడా మానవుల సహాయార్థం భూమ్మీదికి వేంచేస్తారని, బాధితుల కష్టాలు తీరుస్తారని, ఆకలిగొన్న వారికి అన్నం తెచ్చియిస్తారని, అనారోగ్యానికి గురైనవారికి మందులు కూడా తెస్తారని తెలియ జేసే కట్టు కథలు కోకొల్లలు. చివరికి ఒక మదర్సా యొక్క లెక్కలు తనఖీ చేయడానిక్కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన నలుగురు ఖలీఫాలతో ప్రత్యక్షంగా ఆ మదర్సాకు వేంచేశారని వ్రాసుకున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీద వుండాల్సిన ప్రేమ ఇదేనా చెప్పండి? అసలు ఒకసారి మరణించిన తర్వాత మళ్ళీ ఈ భూమి మీదకు భౌతికంగా తిరిగిరావడం అనేది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంలో లేని తప్పుడు విశ్వాసం. కేవలం షహీదులే, అల్లాహ్ దగ్గర వారికి దొరికిన ఉన్నత స్థానాలకు, మహాభాగ్యాలకు పొంగిపోయి భూమి మీదకు తిరిగి రావాలని కోరుకుంటారు. తద్వారా మళ్ళీ వారు అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసి మళ్ళీ ఆ స్థానాలు పొందగలగడానికి. కానీ అల్లాహ్ వారిని కూడా అనుమతించలేదు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

"మరణించిన తర్వాత అల్లాహ్ వద్ద మంచి ప్రతిఫలం దొరికిన తర్వాత గూడా తిరికి ఈ భూమి మీదకు రావడానికి ఇష్టపడే వాడు ఎవడూ లేడు.ఒక వేళ అతనికి ఈ భూమీ, దానిలోని సర్వస్వమూ యిచ్చివేసినా సరే. కేవలం షహీద్ (వీరమరణం పొందిన వాడు) మాత్రమే తన అమరగతికి లభించిన ప్రాముఖ్యతను చూసి భూమి మీదకు తిరిగివెళ్ళి మళ్ళీ అల్లాహ్ మార్గంలో పోరాడాలి అని కోరుకుంటాడు." *(సహీ బుఖారి : 2795)*

## 4) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు విధేయత చూపడం:

'మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యం అల్లాహ్ సన్నిధిలో ఆమోద యోగ్యం కావడానికి కావలసిన ముఖ్యమైన అంశాలలో ప్రధాన మైనది ఆయనకు విధేయత చూపటం.

అంటే- దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెచ్చిన సందేశాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించి, ఆయన తెలియజేసిన సమస్త (గోచర, అగోచర) విషయాలను గురించి మనసులో ఎలాంటి సందేహాలు లేకుండా నిస్సంకోచంగా ధృవీకరించి ఆయన యిచ్చిన ఆజ్ఞలకు పూర్తిగా కట్టుబడి తమ జీవితాన్ని సాగించడం అన్నమాట.

ఆ మాటకొస్తే అసలు దైవ ప్రవక్తల అవతరణ ఉద్దేశ్యం కూడా అదే.

"మేము ఏ ప్రవక్తను పంపినా అల్లాహ్ అనుజ్ఞ ప్రకారం అతనికి విధేయత చూపాలనే పంపాము." *(నిసా : 64)*

దివ్యఖురానునూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే ధార్మిక విషయాల్లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు మరియు ఆయన విధేయతకు ఎంత ప్రాధాన్యత వుందో అర్థమవుతుంది.

అసలు యావత్తు ధర్మం అనేది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పైనే అవతరించింది కనుక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను, ఆయన విధేయతను ప్రక్కన బెట్టి ధర్మంపై సజావుగా నడవడం అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యంకాదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సమస్త పాపాలకు అతీతులవడమే కాకుండా ధార్మిక విషయాల్లో అల్లాహ్ ఆజ్ఞయిస్తేనే తప్ప తమ నోటితో ఎప్పుడూ ఏమీ తెలియజేయరు.

అందుకే దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"మీ సహచరుడు దారి తప్పనూ లేదు, తప్పుదారి పట్టనూ లేదు. అతను తన మనో వాంఛలను అనుసరించి చెప్పటం లేదు. ఇది ఒక వహీ, అతనిపై అవతరింప జేయ బడుతున్నది." *(నజ్మ్: 3-4)*

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నోట విన్న ప్రతి హదీసునూ జ్ఞాపక ముంచుకోవడానికి గాను వ్రాసుకొనే వాణ్ణి. దీనికి ఖురైష్ జాతివారు నన్ను వారిస్తూ, "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా విన్న ప్రతిమాటనూ వ్రాస్తున్నావా? వాస్తవానికి ఆయన మానవ మాత్రులు. కోపంలో, సంతోషంలో రెండు పరిస్థితుల్లోనూ సంభాషిస్తూ వుంటారు" అని హితవు పలికారు. దానితో నేను వ్రాయడం







మానేశాను. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర ఈ విషయమై ప్రస్తావించాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన చేతి వ్రేలితో నోటి వైపుకు సైగ చేస్తూ- 'వ్రాస్తూ వుండు! నా ప్రాణం ఎవరి చేతిలో వుందో ఆ దైవం సాక్షిగా ! దీని నుండి సత్యం తప్ప మరేదీ రాదు' అని ఉద్భోదించారు. *(అబూదావూద్: 3646)*

దివ్య ఖురానును అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అవతరింప జేశాడు. ఆయతుల వాస్తవిక అర్థాన్ని సైతం తనే తెలియజేశాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన మాటల (హదీసులు) తోనూ చేతల (సున్నత్) తోనూ వాటి అసలు అర్థాన్ని ప్రజలకు వివరించే వారు.

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రకటించారు:

"బాగా వినండి! నాకు గ్రంథం (ఖురాను) యివ్వబడింది. దానితోపాటు దాని లాంటిదే మరొకటి (సున్నత్) కూడా." *(అబూదావూద్: 4604)*

కాబట్టి ఖురాను మరియు హదీసుల మధ్య తారతమ్యం అనేది మనం ఎట్టి పరిస్థితుల్లోను చూపలేము. వాస్తవానికి దివ్య ఖురాను అల్లాహ్ యొక్క ఆజ్ఞ అయితే హదీసులు దాని క్రియాత్మక విశ్లేషణా రూపం. హదీసుల ద్వారానే మనం దివ్యఖురానును సరిగ్గా అర్థంచేసుకోగలం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ప్రజలారా! మీ ప్రభువు తరపు నుండి మీపై అవతరింపజేయబడిన (ఖురాను మరియు హదీసులు) దానిని అనుసరించండి. మీ ప్రభువును కాదని ఇతర సంరక్షకులను అనుసరించకండి, కానీ మీరు హితబోధను స్వీకరించటం అరుదు." *(ఆరాఫ్: 3)*

"ఇప్పుడు ఈ జ్ఞాపికను నీపై అవతరింపజేశాము. తద్వారా నీవు ప్రజల ముందు వారికోసం అవతరింప జేయబడిన ఉపదేశాన్ని (సున్నత్ ద్వారా) స్పష్టంగా వివరించడానికి, (స్వయంగా) ప్రజలు కూడా ఆలోచించడానికి." *(నహ్ల్: 44)*

అందుకే అల్లాహ్ ముందుగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఒక సంపూర్ణ ఆదర్శ పురుషునిగా తీర్చిదిద్దాడు. ఆతర్వాత అతనికి విధేయత చూపమని సమస్త మానవులకు ఆజ్ఞాపించాడు.

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) లో మీకు

ఒక మంచి ఆదర్శం వుంది. అల్లాహ్‌పై, అంతిమ దినంపై ఆశలు పెట్టుకొని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికి.” *(అహ్‌జాబ్ : 21)*

సాద్ బిన్ హిషామ్ బిన్ ఆమిర్ ఉల్లేఖించిన ఒక సుద్ధీ హదీసులో ఇలా తెలియజేశారు : నేనొకసారి విశ్వాసుల మాతృమూర్తి ఆయెషా (రజి అల్లాహు అన్హ)తో అమ్మా! నాకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి శీలం గురించి చెప్పండి, అని విన్నవించుకున్నాను. దానికామె - నువ్వు ఖురాన్ చదవ లేదా? అని ప్రశ్నించారు. నేను జవాబిస్తూ - “ఎందుకు చదవలేదు, చదివాను” అని అన్నాను. ఆమె మాట్లాడుతూ- “దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి శీలం సంపూర్ణంగా దివ్య ఖురానులోని ఆజ్ఞలకు ప్రతిరూపంగా వుండేది”అని అన్నారు.

*(సహీ ముస్లిం : కితాబుస్సలాతిల్ ముసాఫిరీన్, బాబ్ : సలాతిల్లైలి వ అందది రకాతిన్ నబీ (సల్లల్లాహు అలైహి వసల్లం)*

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత చూపడం, నేడు ప్రామాణిక హదీసుల రూపంలో గ్రంథస్థం చేయబడి వున్న ఆయన సున్నత్‌లను అనుసరించడం లాంటి విషయాల ప్రాముఖ్యతను గురించి అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చాలా గట్టిగా నొక్కి చెప్పడమే కాకుండా వీటిని పెడచెవిన పెట్టిన వారికి తీవ్రంగా హెచ్చరించారు కూడా. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత చూపడం అనేది ఆయన సున్నత్‌లను అనుసరించడం ద్వారానే సాధ్యమవుతుంది. కాబట్టి ఈ రెండు విషయాల గురించి సవివరంగా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ముందు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత చూపడం యొక్క ప్రాధాన్యత మరియు అతనికి అవిధేయత చూపి ఇతరులకు విధేయత చూపడం వల్ల సంభవించే నష్టాలను గురించి తెలుసు కుందాం!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయత చూపడం అనేది అల్లాహ్ దృష్టిలో ఎంత ముఖ్యమైనదంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతను స్వయంగా తన విధేయతగా అల్లాహ్ తేల్చి చెప్పాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయన విధేయత







ప్రాముఖ్యతను వివరిస్తూ దివ్యఖురాను లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

“ప్రవక్తకు విధేయత చూపినవాడు వాస్తవానికి అల్లాహ్‌కు విధేయత చూపినట్లే.” *(నిసా: 80)*

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీకు యిచ్చిన దాన్ని తీసుకోండి, ఆయన మిమ్మల్ని వారించిన దాని జోలికి పోకండి .” *(హష్ర్: 7)*

“ప్రవక్తా! నీవు ప్రజలకు ఇలా చెప్పు: మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమవుంటే నన్ను అనుసరించండి. అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడూను. వారితో ఇంకా- అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపండి అని అను. ఒకవేళ వారు నీ సందేశాన్ని స్వీకరించకపోతే, అల్లాహ్ తనకూ తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపడానికి నిరాకరించిన వారిని (కాఫిర్లను) ప్రేమించటం అనేది నిశ్చయంగా జరుగదు.” *(ఆలి ఇమ్రాన్ : 31- 32)*

“విశ్వాసులారా! మీరు అల్లాహ్‌కు విధేయత చూపండి, ప్రవక్తకు విధేయత చూపండి. (అవిధేయత చూపి) మీ పనులను వృథా చేసుకోకండి.”

*(మహమ్మద్ : 33)*

“విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ కూ ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపండి. ఆజ్ఞ విన్న తరువాత దాని నుండి మరలకండి.”

*(అన్‌ఫాల్ : 20)*

“నమాజును స్థాపించండి, జకాతును యివ్వండి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు విధేయులుగా వుండండి.” *(నూర్: 56)*

“అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏ విషయంలోనైనా ఒక తీర్పు చేసినపుడు విశ్వాసి అయిన ఏ పురుషునికైనా, విశ్వాసురాలైన ఏ స్త్రీకయినా తర్వాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్ళీ ఒక నిర్ణయం తీసుకొనే హక్కులేదు. ఇంకా ఎవడైనా అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ అవిధేయత చూపితే అతను స్పష్టంగా మార్గ భ్రష్టతకు గురి అయినట్లే.”

*(అహ్‌జాబ్ : 36)*

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను ఉల్లంఘించేవారు, తాము ఏదైనా ఉపద్రవంలో చిక్కుకు పోతామేమో అని, తమపై బాధాకరమైన శిక్ష ఏదైనా అవతరిస్తుందేమో అనీ భయపడాలి." *(నూర్: 63)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు :

"నా అనుచర సమాజంలో, నిరాకరించిన వారు తప్ప మిగిలిన వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు." దానికి సహచరులు - ఓ దైవ ప్రవక్తా! నిరాకరించిన వారంటే ఎవరు? అని ప్రశ్నించగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - "నాకు విధేయత చూపిన వాడు స్వర్గంలో వుంటాడు. నా మాట వినని వాడు నిరాకరించినవాడు" అని వివరించారు. *(సహీ బుఖారి : 7280)*

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఉమర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధి కొచ్చి ఇలా విన్న వించుకున్నారు. మేము యూదుల ద్వారా కొన్ని విషయాలు వింటున్నాము. అవి మాకు మంచివిగా తోస్తున్నాయి. ఆ విషయాలను మేము వ్రాసుకోవచ్చా? దీనికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - ఏమిటీ? యూదులు, క్రైస్తవులు (తమ ధర్మ విషయంలో) సంశయంలో పడిపోయినట్లుగా మీరు కూడా (మీ ధర్మ విషయంలో) సంశయానికి లోనవుతున్నారా? వాస్తవానికి నేను ఒక స్పష్టమైన, తేజోవంతమైన షరియత్తును తీసుకువచ్చాను. ఈ రోజు మూసా (అలైహిస్సలాం) కూడా జీవించి వున్నా (ఆయనకు కూడా) నన్ను అనుసరించడం తప్ప మరో మార్గం వుండేది కాదు. *(అహ్మద్)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

"నేను మిమ్మల్ని దేన్నుంచైనా వారిస్తే దానికి దూరంగా వుండండి. దేనికైనా ఆజ్ఞాపిస్తే మీ శక్తి కొలదీ దానిని ఆచరించండి. మీకు ముందు గతించిన వారు తమ ప్రవక్తలతో అనవసర ప్రశ్నలు వేసి వారితో వివాదపడి నాశనమయ్యారు."
*(సహీ ముస్లిం: కితాబుల్ ఫజాయెల్, బాబ్: కరాహతి ఇక్సారిస్సవాలి మిన్ జరూరతన్ గైరి)*







ఉర్వా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం :

జుబైర్ (రజి అల్లాహు అన్హు) కు ఒక అన్సారీ సహచరునితో (సాబిత్ బిన్ ఖైస్ (రజి అల్లాహు అన్హు)) హిరా ప్రాంతంలో వున్న ఒక కాలువ విషయంలో గొడవ జరిగింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కల్పించుకొని జుబైర్ (రజి అల్లాహు అన్హు)తో- 'నీవు నీ పొలానికి నీళ్ళు పట్టుకున్నాక నీ ప్రక్కవాడికి నీళ్ళను వదిలేయి.' అని హితవు చేశారు. దీనిపై అన్సారీ సహచరుడు మాట్లా డుతూ- 'ఓ దైవ ప్రవక్తా ! అతను మీ మేనత్త వరుస సోదరుడనే కదా మీరలా చేసింది' అని అన్నాడు. ఇది విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ముఖం రంగు మారిపోయింది. ఆయన మాట్లాడుతూ - 'జుబైర్! నీ పొలానికి నీళ్ళు పట్టు. పొలం అంతా నిండనంతవరకు నీళ్ళను వదలకు' అని ఆజ్ఞాపించారు.

జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం : దివ్యఖురాన్‌లోని "కాదు, మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! నీ ప్రభువు సాక్షిగా ! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయ నిర్ణేతగా స్వీకరించనంత వరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏమాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంతవరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు" అనే దైవ సూక్తి ఈ సందర్భంలోనే అవతరిం చిందని నా అభిప్రాయం. *(సహీ బుఖారి : 4585)*

పై సంఘటన అనేది ఒక మనిషి యొక్క రోజువారీ జీవితంలో సామా న్యంగా సంభవించే మామూలు విషయం. అయినప్పటికీ ఇలాంటి మామూలు విషయాల్లోనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అవిధేయతను అల్లాహ్ సహించనప్పుడు ధార్మిక విషయాల్లో, వివిధ ఆచరణలలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అవిధేయతను అల్లాహ్ సహిస్తాడా చెప్పండి?

మరో సంఘటన కూడా గమనించ దగ్గదే.

దివ్యఖురాన్‌లోని "మీరు బలహీనత ప్రదర్శించినప్పుడు మీ కర్తవ్యం విషయంలో పరస్పర విభేదాలకు గురి అయినప్పుడు మీరు వ్యామోహపడిన వస్తువును (విజయ ధనం) అల్లాహ్ మీకు చూపగానే మీరు మీ నాయకుని

ఆజ్ఞను ఉల్లంఘించారు" *(ఆలి ఇమ్రాన్ : 152)* అనే దైవ సూక్తిని గురించి వివరిస్తూ బరా (రజి అల్లాహు అన్హు) ఇలా తెలియజేశారు :

ఉహద్ పోరాటం జరిగిన నాడు ముష్రిక్కులకూ, మాకూ ముఖాముఖి యుద్ధం జరిగింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బాణ విద్యలో ప్రవేశమున్న బృందాన్ని (పర్వత శిఖరంపై) కూర్చోబెట్టి అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు)ని వారికి సారథిగా నియమిస్తూ ఇలా ఉపదేశించారు : "(యుద్ధ రంగంలో) మీరు మమ్మల్ని విజేతలుగా చూసినా, పరాజితులుగా చూసినా మీరు మాత్రం ఉన్న చోటు నుండి కదలకూడదు. మా సహాయార్థం మీరు రావలసిన అవసరం కూడా లేదు." ఈ నేపథ్యంలో అవిశ్వాసులతో యుద్ధం మొదలయ్యింది. అవిశ్వాసులు (బెంబేలెత్తి) పారిపోసాగారు. అవిశ్వాసుల స్త్రీలు తమ బట్టలను పిక్కల పైదాకా ఎత్తి పర్వతం పైకి పారిపోవటం నేను గమనిం చాను. వారి పట్టీలు సైతం కనిపించ సాగాయి. తాము మాటేసిన చోటు నుండి కదల కూడదని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన తాకీదును గుర్తు చేస్తూ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) వారికి (బాణ విద్యలో ఆరితేరిన వాళ్ళు) ఎంతగానో సముదాయించారు. కానీ వాళ్ళు సుతారమూ అంగీక రించలేదు. (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను ధిక్కరించి తమ యిష్టానుసారం ఆ స్థలాన్ని వదిలారు. ఫలితంగా) ముస్లిములు పరాజయాన్ని చవిచూశారు. దానితో పాటు 70 మంది ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు కూడా అమరగతులయ్యారు. *(సహీ బుఖారి : 4043)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి కేవలం ఒక్క ఆజ్ఞను ధిక్క రించిన కారణానికే దాదాపు విజయం ఖాయమైపోయిన యుద్ధంలో పరాజితులు కావడమే కాకుండా, 70 మంది సహచరుల ప్రాణాల్ని కూడా కోల్పోవలసి వచ్చింది. మరి యుద్ధం లాంటి అతి సున్నితమైన సమయాల్లో కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అవిధేయతకు ఏ మాత్రం తావు లేనపుడు, జీవితానికి సంబంధించిన ఇతర సమయాల్లో దాని అనుమతి ఎలా వుంటుంది?

*కాస్త ఆలోచించండి!*





84

# దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయత-లాభాలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతకు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన ప్రాధాన్యతను బట్టి దాని లాభాలు కూడా అలానే వున్నాయి.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ విధేయత చూపేవారు అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారితో ఉంటారు. అంటే ప్రవక్తలు, సత్యసంధులు, షహీదులు, సజ్జనులూను, ఎవరికి దొరికినా ఈ స్నేహితులు ఎంత మంచి వారు"! *(నిసా: 69)*

"ఎవరయితే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు విధేయత చూపాడో అతడే గొప్ప సాఫల్యాన్ని పొందుతాడు". *(అహ్‌జాబ్ :71)*

"అల్లాహ్‌కూ, ప్రవక్తకూ విధేయత చూపేవారూ, అల్లాహ్‌కు భయపడే వారూ, ఆయన పట్ల అవిధేయతకు దూరంగా వుండేవారు మాత్రమే విజయం పొందుతారు." *(నూర్ : 52)*

"అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ విధేయత చూపేవాణ్ణి అల్లాహ్, క్రింద కాలువలు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశింప జేస్తాడు. ఆ వనాలలో అతడు కలకాలం వుంటాడు. అసలు ఇదే గొప్ప సాఫల్యం". *(నిసా : 13)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు: 'నా అనుచర సమాజంలో, నిరాకరించిన వారు తప్ప మిగిలిన వారంతా స్వర్గంలో ప్రవేశిస్తారు.' దానికి సహచరులు, ఓ దైవ ప్రవక్తా! నిరాకరించిన వారంటే ఎవరు? అని అడగ్గా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - 'నాకు విధేయత చూపిన వాడు స్వర్గంలో వుంటాడు. నా మాట వినని వాడు నిరాకరించిన వాడు', అని వివరించారు.

*(సహీ బుఖారి : 7280)*





దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

# దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అవిధేయత - నష్టాలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అవిధేయత చూపడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను ఉల్లంఘించేవారు, తాము ఏదైనా ఉపద్రవంలో చిక్కుకు పోతామేమో అనీ, తమపై బాధాకరమైన శిక్ష ఏదైనా అవతరిస్తుందేమో అనీ భయపడాలి". *(నూర్ : 63)*

"అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను వ్యతిరేకించే వారు తీవ్రంగా అవమానంపాలు చేయబడతారు, వారికి పూర్వం వారు అవమానం పాలు చేయబడిన విధంగా". *(ముజాదలహ్ : 5)*

"నిశ్చయంగా అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)నూ వ్యతిరేకించేవారు నీచాతినీచమైన సృష్టికి చెందినవారు." *(ముజాదలహ్ : 20)*

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఉమర్ (రజి అల్లాహు అన్హు) తౌరాత్ గ్రంథం తీసుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు: ఓ దైవ ప్రవక్తా! ఇది తౌరాత్ గ్రంథం. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దీనికి మౌనం వహించారు. తదుపరి ఉమర్ (రజి అల్లాహు అన్హు) తౌరాత్‌ను చదవసాగారు. దైవ ప్రవక్త ముఖారవిందం (కోపంతో) కందిపోయింది. ఈ పరిస్థితిని గమనించిన అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఓ ఉమర్! మాయం చేయువారు మీరు మాయమైనట్లుగా అనుభూతి చెందుగాక! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ముఖారవిందం వైపు చూడరా? అని అన్నారు. ఉమర్ (రజి అల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ

సల్లం) వైపు దృష్టి సారించారు. (ఆయనకు విషయం అర్థమయ్యింది). నేను అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆగ్రహం నుండి అల్లాహ్ శరణు వేడుతున్నాను. అల్లాహ్ ప్రభువు కావటంపై, ఇస్లాం (దైవ) ధర్మం కావటంపై, మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ ప్రవక్త కావటంపై మేము సంతృప్తులమై వున్నాము అని విన్నవించుకున్నారు.

తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉపదేశించారు : ఎవరి ఆధీనంలో మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణం వుందో ఆ శక్తిమంతుని సాక్షి! ఒక వేళ ఈనాడు మూసా (అలైహిస్సలాం) గారు వేంచేసినా, మీరు నా బదులు ఆయన విధానాన్ని అనుసరిస్తే సన్మార్గం నుండి తొలగిపోతారు. ఒకవేళ మూసా (అలైహిస్సలాం) జీవించి వుండి, నా దౌత్య కాలాన్ని ఆయన పొంది వుంటే, ఆయన కూడా నన్నే అనుసరించేవారు. *(దారిమి)*





దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

# ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరుల విధేయత

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయత ప్రాధాన్యత, దాని లాభాలు, మరియు అవిధేయత వల్ల జరిగే నష్టాలను గురించి తెలుసుకున్న తర్వాత స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియ సహచరులు ఆయనకు ఎలా విధేయత చూపేవారో తెలుసుకుందాం. వారి విధేయతకు సంబంధించిన ఎన్నో దృష్టాంతాలు ప్రామాణిక హదీసు గ్రంథాల్లో క్రోడీకరించబడి వున్నాయి. ఉదాహరణకు కొన్నింటిని గూర్చి తెలుసుకుందాం.

హుదైబియా ఒప్పందం జరిగిన తర్వాత మక్కా నుండి ముష్రిక్కుల ప్రతినిధిగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికి వచ్చిన ఉర్వా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) (ఆ సమయంలో తను ఇంకా ముష్రిక్ గానే వున్నారు) తిరిగి ఖురైషీయుల దగ్గరకి వెళ్ళి ఇలా పలికారు :

ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్ సాక్షి! నేను ఇప్పటి వరకు పెద్దపెద్ద రాజులను కలుసుకున్నాను. ఖైసర్, ఖిస్రా, నజ్జాషీ లాంటి మహారాజులను కూడా చూశాను. కానీ అల్లాహ్ సాక్షి! మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఆయన సహచరులు గౌరవించినట్లుగా ఏ మహారాజునూ అతని సహచరులు గౌరవించడం నేను చూడలేదు. అల్లాహ్ సాక్షి! ఒక వేళ ఆయన (దైవ ప్రవక్త) ఖాండ్రించి ఉమ్మేసినా, అతని నోటి నుండి వెలువడే కఫం కూడా (భూమి మీద పడకుండా) ఆయన సహచరుల్లోని ఒకరి అరచేతిలోనే పడుతుంది. దానినతడు తన ముఖానికీ ఇతర చర్మానికీ రాసుకుంటాడు. ఆయన (దైవ ప్రవక్త) ఏదైనా ఆజ్ఞ యిస్తే వెంటనే వారు దానిని పాటిస్తారు. ఆయన వజూ చేస్తే వారిలో ప్రతి ఒక్కడూ ఎలాగైనా ఆ నీటిని పొందడానికి ప్రయత్నం చేస్తాడు. ఆయన సంభాషిస్తున్నప్పుడు ఆయన

సహచరులు నిశ్శబ్దంగా దానిని వింటారు. ఆయన గౌరవార్థం వారు ఆయన కళ్ళ వైపు కూడా సూటిగా చూడరు. *(సహీ బుఖారి : 2731, 2732)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : మేము మద్యం సేవించే వారం కాదుగానీ, మీరు ఫదీఖ్ అని పిలిచే ద్రాక్ష రసం మాత్రం త్రాగే వాళ్ళం. నేనొక రోజు ఇదే రసాన్ని అబూ తల్హా (రజి అల్లాహు అన్హు), మరియు ఆయనతో పాటు ఎంతో మంది ఇతర సహచరులకు త్రాగిస్తుండగా అకస్మాత్తుగా ఓ వ్యక్తి మా దగ్గరకొచ్చి, ఏమిటీ, మీరు ఇంకా వినలేదా? అని ప్రశ్నించాడు. దానికి వారంతా-ఏ విషయం అని అడిగారు. ఆ వ్యక్తి వివరిస్తూ 'మద్యం నిషేధించ బడింది' అని అన్నాడు.

వాళ్ళంతా వెంటనే నాతో - 'ఓ అనస్! ఈ కుండలన్నీ పారబోయి' అని అన్నారు. వారంతా ఆ వ్యక్తిని మరో ప్రశ్న కూడా వేయలేదు సరికదా అతనితో వాదించడం గానీ, వంకలు పెట్టడం గానీ చేయకుండా వెంటనే దాన్ని వదిలేసారు. *(సహీ బుఖారి : 2464)*

అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) కథనం : ఒకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులకు నమాజ్ చేయిస్తుండగా నమాజ్ మధ్యలోనే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన చెప్పులను విడిచి ఎడమ వైపున వుంచారు. దీనిని గమనించిన ప్రియ సహచరులు, వారు కూడా తమ చెప్పులను విడిచేశారు. నమాజ్ ముగించిన తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - 'మీరు మీ చెప్పులను ఎందుకు విడిచారు' అని అడిగారు. సహచరులు జవాబిస్తూ - మీరు పాదరక్షలు విడుస్తుండగా గమనించి మేము కూడా మిమ్మల్ని అనుసరించాము అని విన్నవించుకున్నారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివరణ యిస్తూ యిలా అన్నారు :

జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి నా పాదరక్షలకు మాలిన్యం అంటు కుందని తెలిపారు, లేక అది బాధాకరమైనది అని పలికారు. (అందుకే నేను వాటిని విడిచాను.) తిరిగి మాట్లాడుతూ : నమాజ్ చేయడానికి మీరు మస్జిద్‌కు వచ్చినప్పుడు మీ పాద రక్షలను బాగా చూసుకోండి. వాటికి గనక మలినం







ఏదైనా అంటుకున్నట్టు కనిపిస్తే బాగా శుభ్రం చేయండి, తిరిగి వాటిని తొడిగి నమాజ్ చేయండి. *(అబూదావూద్ : 650)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు రాత్రి వేళ మస్జిదే అఖ్సాను చూపించడం జరిగిన సమయంలో తెల్లారగానే ప్రజల్లో అనుమానాలు రేకెత్తసాగాయి. కొందరు విశ్వసించిన వారు సైతం తమ విశ్వాసాన్ని త్యజించారు. తిరిగి అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) గారి దగ్గరికొచ్చి 'మీరు మీ స్నేహితుణ్ణి చూడటం లేదా? తనకు గత రేయి బైతుల్ మఖ్దిస్ ను చూపించడం జరిగిందని చాటుతున్నాడు!' అని విన్నవించుకున్నారు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) వారితో - ఆయన నిజంగానే ఇలా పలికారా? అని అడిగారు. అవునని వారు జవాబిచ్చారు. అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) మాట్లాడుతూ - 'ఒకవేళ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నిజంగానే అలా పలికి వుంటే ఆయన సత్యవంతులు' అని అన్నారు.

వారు- ఇప్పటికీ మీరు ఈ విషయాన్ని ధృవీకరిస్తున్నారా మరియు రాత్రికి రాత్రే బైతుల్ మఖ్దిస్ వెళ్ళి పెందల కడనే యిక్కడికి వచ్చేశారని విశ్వసిస్తున్నారా? అని అడిగారు.

అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు), అవునని జవాబిచ్చి, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి నేనీవిషయాన్నే కాదు, ఇంతకన్నా దూరంగా వున్న దానిని గురించి కూడా ధృవీకరిస్తాను. ఉదయం సాయంత్రం నాపై ఆకాశం నుండి వహీ అవతరించిందని ఏదైనా సమాచారమిస్తే దానిని కూడా విశ్వసిస్తాను అని వివరించారు.

అప్పటి నుండి అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) 'అల్ సిద్దీఖ్' (సత్య సంధుడు) అని పిలువబడ్డారు. *(ముస్తద్రక్ హాకిం)*

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం : ఒకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) శుక్రవారం నాడు ప్రసంగించడానికి వేదిక పైకి ఎక్కి కూర్చొని- 'ప్రజలారా! కూర్చోండి' అని అన్నారు. ఈ పలుకులు వినగానే (మస్జిద్ లోపలకు వస్తూ ద్వారం దగ్గర వున్న) అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) తలుపు దగ్గరే కూర్చుండి పోయారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)

ఇది గమనించి, 'ఓ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ! మీరు లోపలికి వచ్చి కూర్చోండి' అని పలికారు. *(అబూదావూద్ : 1091)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియ సహచరుల విధేయతకు సంబంధించిన కొన్ని దృష్టాంతాలు యివి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను వారు ఎంతగా ప్రేమించేవారో, ఆయన ఆజ్ఞలకు ఎంత నిర్దిష్టంగా కట్టుబడి జీవితం సాగించేవారో పై సంఘటనల ద్వారా మనకు బోధపడుతుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞ చిన్నదైనా, పెద్దదైనా వారు దానికి ఏ మాత్రం వంకలు పెట్టకుండా అన్నిటికీ సమాన ప్రాధాన్యత నిచ్చేవారు. వారి ఈ దృక్పథమే వారికి 'రజి అల్లాహు అన్హు' (అల్లాహ్ వీరితో సంతృప్తి చెందాడు) అన్న స్థాయికి చేర్చింది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞలను వాళ్ళెంత సీరియస్‌గా తీసుకొనే వారో మరో ఉదాహరణ గమనించండి :

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం : బానిసగా వున్న ముగైస్ (రజి అల్లాహు అన్హు) ఓ రోజు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తో మాట్లాడుతూ - 'ఓ దైవ ప్రవక్తా! ఆమె (బరీరా (రజి అల్లాహు అన్హా)) దగ్గర నా గురించి సిఫారసు చేయరా' అని విన్నవించుకున్నారు. దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఓ బరీరా! అల్లాహ్‌కు భయపడు. అతను నీభర్త మరియు నీ తనయుడికి తండ్రి కూడా' అని హితవు పలికారు.

దీనిపై బరీరా (రజి అల్లాహు అన్హా) - ఓ దైవ ప్రవక్తా! ఇలా చేయమని మీరు నన్ను ఆజ్ఞాపిస్తున్నారా? అని అడిగారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ, "లేదు, నేను కేవలం సిఫారసు చేస్తున్నాను" అని అన్నారు.

ముగైస్ (రజి అల్లాహు అన్హు) కళ్ళల్లో నీళ్ళు చెంపలపై రావడం గమనించిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) (అక్కడే వున్న) అబ్బాస్ (రజి అల్లాహు అన్హు)తో - మీకు ముగైస్ (రజి అల్లాహు అన్హు)కు బరీరా (రజి అల్లాహు అన్హా) పట్ల వున్న ప్రేమ మరియు బరీరా (రజి అల్లాహు అన్హా)కు







ముగైస్ (రజి అల్లాహు అన్హు) పట్ల వున్న ద్వేషాన్ని చూసి ఆశ్చర్యం కలగడం లేదా? అని పలికారు. *(అబూదావూద్ : 2231)*

ఇతర హదీసుల ద్వారా- దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బరీరా (రజి అల్లాహు అన్హా)కు తన భర్త బానిసగా వున్నందున అతనితో కలిసి వుండటానికీ, లేదా విడిపోవడానికి స్వేచ్ఛను ప్రసాదించారనీ, అందుకు ఆమె- నాకు ఇంత ఇంత ధనాన్ని యిచ్చినా అతనితో కలిసి వుండను అని పలికారని తెలుస్తుంది. *(అబూదావూద్ : 2232-2235)*

ఈ సంఘటన పైకి మామూలుగా కనబడినా ఇందులో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరుల ఒక ప్రత్యేక దృక్పథం నిక్షిప్తమై వున్నది. అదేమిటంటే-

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బరీరా (రజి అల్లాహు అన్హా) దగ్గర చేసిన సిఫారసు గురించి ఆమె దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, ముగైస్ (రజి అల్లాహు అన్హు) తో కలిసి వుండమని మీరు నన్ను ఆజ్ఞాపిస్తున్నారా? అని అడగడం, దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - ఆజ్ఞాపించడం లేదు, కేవలం సిఫారసు చేస్తున్నానని ప్రకటించడం, దానిని ఆమె నిరాకరించడం.

బరీరా (రజి అల్లాహు అన్హా) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను - మీరు నన్ను ఇలా చేయమని ఆజ్ఞాపిస్తున్నారా? అని అడగడంలో గల ఉద్దేశ్యం ఏమిటంటే యిది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞయో కాదో ముందు తెలుసుకోవడం, ఒక వేళ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బరీరా (రజి అల్లాహు అన్హా)గారి ప్రశ్నకు 'అవునని' జవాబిచ్చి వుంటే ఆమె దగ్గర మరో మార్గం వుండేది కాదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను శిరసావహిస్తూ ముగైస్ (రజి అల్లాహు అన్హు)ను స్వీకరించాల్సి వచ్చేది.

ఎందుకంటే దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏ విషయంలోనైనా ఒక తీర్పు చేసినపుడు విశ్వాసి అయిన ఏ పురుషునికైనా, విశ్వాసురాలైన ఏ స్త్రీ కైనా తరువాత తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్ళీ ఒక నిర్ణయం తీసుకొనే హక్కు లేదు. ఇంకా ఎవడైనా అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ అవిధేయత చూపితే అతను స్పష్టంగా మార్గ భ్రష్టతకు గురి అయినట్లే. " *(అహ్‌జాబ్ : 36)*

ఈ ఆయత్‌లో అల్లాహ్, తను గానీ, తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గానీ ఒక నిర్ణయం చేసిన తర్వాత ఆ విషయంలో యితరులు మరొక నిర్ణయం తీసుకోవడాన్ని తమ అవిధేయతగా వర్ణించి చెప్పాడు. ఈ విషయం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియ సహచరులకు బాగా తెలిసి వుంది.

అందుకే వారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞలకు, అభిప్రాయాలకూ ఒక నిర్దిష్టమైన తేడా చూపించేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చే ఆజ్ఞల విషయంలో మాత్రం, చిన్నది, పెద్దది అన్న తేడా చూపకుండా ప్రతి ఆజ్ఞనూ ఖచ్చితంగా పాటించేవారు. కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వెలిబుచ్చే అభిప్రాయాల విషయంలో మాత్రం అలా చేసేవారు కాదు.

అందుకే బరీరా (రజి అల్లాహు అన్హ) ముందుగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మాటల్ని జాగ్రత్తగా విని, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అడిగి మరీ తెలుసుకొని, ఇది ఆయన ఆజ్ఞ కాదు, కేవలం సిఫారసు మాత్రమే అని నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే తన నిర్ణయాన్ని ప్రకటించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞల విషయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియ సహచరుల దృక్పథం యీ విధంగా వుండేది. యిక ప్రస్తుత ముస్లిం సమాజం విషయానికొస్తే, రోజువారీ దైనందిన జీవితంలో మనలోని చాలా మంది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన ఆజ్ఞలను-ఇది కేవలం సున్నత్ మాత్రమే అనీ, ఫర్జ్ కాదనీ, ఇది కేవలం అభిలషణీయం అనీ వంకలు చూపి వెళ్ళిపోతుంటారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియ సహచరుల దృక్పథానికీ, వీరి దృక్పథానికీ ఎంత తేడా వుందో చూడండి!

మరి ఇలాంటి దృక్పథంతో సాఫల్యం ఎలా పొందగలమో చెప్పండి? అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఏ ఆజ్ఞను కూడా చిన్నచూపు చూడకుండా తమ శక్తి కొలదీ వాటిని పాటించడానికి ప్రయత్నిస్తూ వుండాలి. అప్పుడే మనం సాఫల్యం పొందగలమని ఆశించవచ్చు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయత ప్రాధాన్యత, దాని ప్రయోజనాలు, అవిధేయత వల్ల వాటిల్లే నష్టాలు, ఆయన (సల్లల్లాహు అలైహి







వసల్లం) ప్రియ సహచరుల విధేయతా దృక్పథం... యివన్నీ తెలుసుకున్న తర్వాత యిక ప్రస్తుత ముస్లిం సమాజంపై ఒక్కసారి దృష్టి సారించండి!

కేవలం అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ విధేయత చూపాల్సిన ఈ అనుచర సమాజం వివిధ వర్గాలుగా చీలిపోయి తమ తమ కాలాల్లో ధార్మికంగా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన పండితుల వెంట పడి వున్నది. అరేబియా భూభాగంలో ప్రతి కాలంలోనూ పేరుగాంచిన ధార్మిక పండితులు వెలసినప్పటికీ ముఖ్యంగా నలుగుర్ని తమ తమ నాయకులుగా ఎంపిక చేసుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు బదులుగా వీరికి విధేయత చూపిస్తూ, ధార్మిక విషయాల్లో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన తీర్పులను పెడచెవిన బెట్టి తమ తమ నాయకుల తీర్పులను పాటిస్తోంది.

అసలు వర్గాలుగా చీలిపోవడమే అల్లాహ్ దృష్టిలో పెద్దనేరం.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"తమ ధర్మాన్ని ముక్కలు ముక్కలుగా చేసి ముఠాలుగా చీలిపోయిన వారితో నిశ్చయంగా నీకు ఏ సంబంధమూ లేదు. వారి వ్యవహారం అల్లాహ్ ఆధీనంలో వుంది. ఆయనే వారికి తెలుపుతాడు, వారు ఏమేమి చేశారో."

*(అన్ ఆమ్ : 159)*

"అల్లాహ్ వైపునకు మరలుతూ, ఆయనకు భయపడండి, నమాజును స్థాపించండి. తమ ధర్మాన్ని వేర్వేరుగా రూపొందించుకున్న, మరియు, వర్గాలుగా చీలిపోయిన ముష్రిక్కులలో కలిసిపోవకండి. ప్రతి వర్గమూ తన వద్ద వున్న దానితోనే ఆనంద పడుతున్నది." *(రూమ్ : 31-32)*

"స్పష్టమైన ఉపదేశాలను పొందిన తరువాత కూడా ఎవరైతే తెగలుగా చీలిపోయారో, ఎవరైతే విభేదాలకు గురి అయ్యారో, వారి మాదిరిగా మీరూ కావద్దు. కొందరి ముఖాలు (సంతోషంతో) ప్రకాశిస్తూ వుండే రోజున మరికొందరి ముఖాలు నల్లబడిపోయే రోజున, ఇటువంటి వైఖరిని అవలంబించే వారికి కఠిన శిక్ష పడుతుంది. ఎవరి ముఖాలైతే నల్లబడి పోతాయో (వారితో ఇలా అనబడు తుంది) - విశ్వాస భాగ్యం పొందిన తరువాత కూడా మీరు అవిశ్వాస వైఖరిని (కుఫ్ర్) అవలంబించారా? సరే, కృతఘ్నత చూపిన దానికి ఫలితంగా మీరు

ఇప్పుడు ఘోరమైన శిక్షను చవిచూడండి". *(ఆలి ఇమ్రాన్ : 105-106)*

యిక ప్రజలు విధేయత చూపిస్తున్న ఆ నలుగురు ఇమాములు అబూ హనీఫా (రహమతుల్లా అలై), మాలిక్ (రహమతుల్లా అలై), షాఫయీ (రహమతుల్లా అలై), మరియు అహ్మద్ బిన్ హంబల్ (రహమతుల్లా అలై).

సామాన్య ప్రజానీకం కేవలం అజ్ఞానం చేత యీ వర్గాలలో చిక్కుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతను త్యజించి ఇతరుల వెంట నడుస్తూ వున్నప్పటికీ, ఆశ్చర్యమేసే విషయమేమిటంటే చాలా మంది ఉలమాలు, పండితులు సైతం ఇదే బాటలో నడుస్తున్నారు. ఇలా ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహం రుజుమార్గం నుండి వైదొలిగిపోయింది.

తమ దృక్పథానికి ఆధారంగా సామాన్యంగా వీరు చూపే ఖురానులోని ఆయత్ ఇది :

"విశ్వసించిన ప్రజలారా! విధేయత చూపండి అల్లాహ్‌కూ, విధేయత చూపండి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ మరియు మీలో అధికారం అప్పగించబడిన పెద్దలకు. మీ మధ్య ఏ విషయంలోనైనా వివాదం తలెత్తితే దాన్ని అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ నివేదించండి. మీరు నిజంగానే అల్లాహ్ మీదా, అంతిమ దినం మీదా విశ్వాసం కలవారే అయితే ఇదే సరియైన పద్ధతి, ఫలితాన్ని బట్టి కూడా ఇదే ఉత్తమ మైనది." *(నిసా : 59)*

యిక వీరి వాదనలో గల వాస్తవాన్ని గూర్చి తెలుసుకుందాం.

కాస్త నిశితంగా ఈ ఆయత్‌ను పరిశీలిస్తే అర్థమయ్యే విషయమేమిటంటే:

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఏ విషయంలోనైనా బేషరతుగా విధేయత చూపాలి.

కానీ ఇతరుల విషయంలో మాత్రం అలా కాదు. వారి మాటలు, తీర్పులూ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాలకు లోబడి వున్నప్పుడే వారికి కూడా విధేయత చూపాలి. అలా కాని పక్షంలో వారికి విధేయత చూపాల్సిన అవసరం లేదు.

అందుకే అల్లాహ్ - "మీ మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తినపుడు దానిని అల్లాహ్ వైపునకు (అంటే ఖురానులో) మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి







వసల్లం) వైపుకూ (అంటే హదీసులలో) మళ్ళించండి" అని అన్నాడు. అంటే- ఈ రెండిట్లో వాటి సమాధానాన్ని వెతకండని అన్నమాట.

అసలు ఈ ఆయత్ అవతరణ ఉద్దేశ్యం కూడా యిదే. కానీ దురదృష్ట వశాత్తూ, దీనిని తప్పుగా చిత్రీకరించి తమతమ దృక్పథాలను సరియైనవని నిరూపించుకునేందుకు వాడుకుంటున్నారు.

యిక ఈ ఆయత్ అవతరించిన సందర్భాన్ని గనుక గమనిస్తే అసలు విషయం అంతా కళ్ళకు కట్టినట్లు అర్థమవుతుంది.

అలి (రజి అల్లాహు అన్హు) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్సారులలోని ఒక వ్యక్తిని (అబ్దుల్లా బిన్ హుజైఫా (రజి అల్లాహు అన్హు)) ఒక సైనిక దళానికి అధిపతిగా నియమించి, ఆ సైనిక దళానికి - 'మీ నాయకునికి విధేయత చూపండి' అని తాకీదు చేసి (జిహాద్ కోసం) పంపించారు. మార్గ మధ్యంలో అతనికి (ఏ విషయంలోనో) కోపం వచ్చి సైనిక దళంతో - నాకు విధేయత చూపమని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీకు ఆజ్ఞాపించలేదా? అని అడిగాడు. దానికి వారంతా 'అవును' అని పలికారు. అతను - 'అయితే నా కోసం కట్టెలను ప్రోగు చేయండి' అని ఆజ్ఞాపించాడు. వారంతా కట్టెలను ప్రోగు చేశారు. తదుపరి అతను- 'వీటిని మండించండి' అని ఆజ్ఞ యిచ్చాడు. వారంతా కట్టెల్ని మండించారు. తిరిగి అతను, 'యిక దీనిలోకి దూకండి' అని వారిని పురమాయించాడు. (అతనికి విధేయత చూపిస్తూ) వాళ్ళంతా దానిలోకి దూకాలని అనుకున్నంతలోనే కొందరు ఒకరి భుజాలను మరొకరు పట్టుకొని తమ నాయకునితో- ఈ అగ్ని నుండి రక్షించబడాలనే మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వైపునకు మరలాము. (మీరు మళ్లీ ఇదే అగ్నిలోకి దూకమంటున్నారేమిటి?) అని మాటిమాటికీ అంటూ పోయారు. ఈ లోగా అగ్ని కాస్తా చల్లారి పోయింది, ఇటు నాయకుని కోపం కూడా చల్లబడి పోయింది. ఈ వార్త దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి చేరింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ, ఒకవేళ వారు (తమ నాయకుని ఆజ్ఞ మేరకు) ఆ అగ్నిలోకి దూకి వుంటే ప్రళయ దినం వచ్చే వరకు దాని నుండి బయటకు రాగలిగేవారు కాదు.

'(ఇతరులకు) విధేయత చూపడం అనేది కేవలం మంచి ఆచరణలలోనే' అని వివరించారు. *(సహీ బుఖారి : 4340)*

ఈ సందర్భంలోనే పై ఆయత్ *(నిసా : 59)* అవతరించింది.

ధార్మిక పరంగా మంచి ఆచరణలు అంటే - కేవలం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆదేశాలకు అనుగుణంగా వున్న ఆచరణలు.

ఇక్కడ పాఠకులందరికీ సవినయంగా నేనొక ప్రశ్న వేయదలుచుకున్నాను. దీనిని, కాస్త నిష్పక్షపాతంతో ఆలోచిస్తూ తమతమ హృదయాలను అడగండి. మీ హృదయాలు మీకు ఏమని జవాబిస్తాయో చూడండి.

స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నియమించిన నాయకుడే ఒక వేళ తప్పు చేస్తే, అతనికి విధేయత చూపండని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన ఆజ్ఞను పాటిస్తూ ఆ సైనిక దళం గనుక ఆ తప్పును అనుసరిస్తే వారు కూడా అల్లాహ్ శిక్ష నుండి తప్పించుకోలేక పోతే, మరి ఏ ఇమాములయితే తమ జీవితంలో ఒక్కసారి కూడా తమకు విధేయత చూపమని చెప్పలేదో (వారి అసలు బోధనలను మున్ముందు వివరిస్తాను), వారికి బేషరతుగా విధేయత చూపమని షరియత్తు కూడా ఆజ్ఞాపించ లేదో, అలాంటి వారికి గుడ్డిగా విధేయత చూపి వారి ఆజ్ఞలను శిరసావహించి, వారి ఆదేశాలకను గుణంగా జీవితం కొనసాగిస్తే అల్లాహ్ శిక్ష నుండి మనం తప్పించుకోగలమా?

నిస్సందేహంగా తప్పించుకోలేము.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయత ముందు ఇతర దైవ ప్రవక్తల విధేయత స్వీకార యోగ్యం కానప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజానికి చెందిన వ్యక్తుల విధేయత (ధార్మికంగా వారెంత గొప్ప వారైనా సరే) అల్లాహ్ సన్నిధిలో ఎలా స్వీకార యోగ్యం కాగలుగుతుంది?

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రియ సహచరులు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞల ముందు ఇతరులకు ఏ మాత్రం ప్రాధాన్యత యిచ్చేవారు కాదు. ఇతరులు ఎంత పేరు ప్రఖ్యాతులు గడించిన వారైనా సరే. వారి ఈ దృక్పథమే వారిని ఉన్నత శిఖరాలకు చేర్చింది.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఒక రోజు కొందరితో సంభాషిస్తూ యిలా అన్నారు.

“మీరు పలికే మాటల మూలంగా మీ పైకి ఆకాశం నుండి రాళ్ళ వర్షం







కురవవచ్చు. ఎందుకంటే నేను మీతో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారని అంటుంటే మీరేమో అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు), ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా అన్నారని చెబుతున్నారు”

అలాగే సిరియా వాసుల్లోని ఒక వ్యక్తి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) దగ్గరికొచ్చి హజ్ తమత్తు (ఉమ్రా మరియు హజ్‌ను కలిపి చేయడం)ను గురించి అడిగాడు. ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) జవాబిస్తూ- ‘అదొక మంచి ఆచరణ’ అని పలికారు. ఆ వ్యక్తి మాట్లాడుతూ మరి మీ నాన్నగారు (ఉమర్ (రజి అల్లాహు అన్హు)) దీని నుండి వారించే వారే? అని అన్నాడు. దానికాయన - నీ పాడుగాను! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా పాటించి, ఆజ్ఞాపించిన దాన్ని మా నాన్నగారు వారిస్తే నీవు ఆయన అభిప్రాయాన్ని స్వీకరిస్తావా లేక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞనా? అని అడిగారు.

ఆ వ్యక్తి జవాబిస్తూ - ‘దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞనే స్వీకరిస్తాను’ అని పలికాడు.

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) మాట్లాడుతూ - మరైతే వెళ్ళు. (వెళ్ళి దానిని నిస్సంకోచంగా పాటించు) అని పలికారు. *(ముస్నద్ అబూ యాలా)*

మరి చూడబోతే అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు), మరియు ఉమర్ (రజి అల్లాహు అన్హు)ల స్థానం ఎంతో గొప్పది. అయినప్పటికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు విరుద్ధంగా ఎవరి ఆజ్ఞలకు కూడా రవ్వంత విలువను యివ్వలేదు ఆయన సహచరులు. అందుకే మనం కూడా వారి దృక్పథంపై నడుస్తూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు పూర్తి విధేయత చూపాలి. ఇతరులకు విధేయత అనేది వారిచ్చే ఆజ్ఞలు, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాలకు అనుగుణంగా వున్నాయా లేవా అన్న షరతుపై ఆధారపడి వుంటుంది. అంతేకాని గ్రుడ్డిగా మాత్రం కాదు.

యిదండీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సంబంధించిన అసలు విధేయత.

# నలుగురు ఇమాములు

యిక ధార్మికంగా ప్రఖ్యాతి గాంచిన నలుగురు ఇమాములను గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

1. ఇమామ్ అబూ హనీఫా (80 హి - 150 హి)
2. ఇమామ్ మాలిక్ (93 హి - 179 హి)
3. ఇమామ్ షాఫయీ (150 హి - 204 హి)
4. ఇమామ్ అహ్మద్ (164 హి - 241 హి)

ఇందులో ఇమామ్ షాఫయీ (రహమతుల్లా అలై) ఇమాం మాలిక్ (రహమతుల్లా అలై)కు శిష్యులు కాగా 'సహీ బుఖారీ' గ్రంథ కర్త అయిన ఇమాం బుఖారీ (రహమతుల్లా అలై), ఇమాం అహ్మద్ బిన్ హంబల్ (రహమతుల్లా అలై) శిష్యుల్లో ఒకరు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణానంతరం ఆయన ప్రియ సహచరులు ధర్మ ప్రచార నిమిత్తం అరేబియా భూభాగంలో నలువైపులా ప్రయాణించారు. సాధారణంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మొత్తం హదీసుల సంపూర్ణ జ్ఞానం ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులైనప్పటికీ వారికి గూడా వుండేది కాదు. క్రియాత్మకంగా ఇది సంభవం కూడా కాదు. అందుకే వారు ఇతర సహచరుల ద్వారా ఏదైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)గారి హదీసును తెలుసుకున్నప్పుడు దాని ప్రకారమే తమ దృక్పథాన్ని మార్చుకొనేవారు. తమ స్వంత అభిప్రాయాలకు ఏమాత్రం విలువ నిచ్చేవారు కాదు. ఇదే దృక్పథాన్ని వారు, తమ శిష్యులైన తాబయీలకూ, తర్వాత తాబయీలు తమ శిష్యులైన తబా తాబయీలకు నేర్పారు. ఈనలుగురు ఇమాముల దృక్పథం కూడా ఖచ్చి తంగా ఇలాగే వుండేది. వారి దగ్గరికి చేరిన హదీసుల





విషయంలోనైతే, వాటి ప్రామాణికతను ధృవ పరుచుకున్న తర్వాత వాటికను గుణంగానే తీర్పు చెప్పే వారు. వారికి తెలియని విషయాల్లో మాత్రం పరిస్థితులను విశ్లేషించి తమ అభిప్రాయాలను వెలిబుచ్చేవారు. అందుకే ఆ అభిప్రాయాల తోపాటు 'రేపు ఎవరికైనా ఈ విషయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసు దొరికితే నా అభిప్రాయాన్ని వదిలేసి, ఆ హదీసు ప్రకారం మీరు నడుచుకోవాల్సి వుంటుంది.' అన్న షరతు కూడా విధించేవారు.

అయితే ఈ రోజు ఖచ్చితంగా దీనికి విరుద్ధమైన దృక్పథాన్ని మనలోని చాలామంది కలిగివున్నారు.

ఈనలుగురు ఇమాముల అభిప్రాయాలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాలకు అనుగుణంగా వున్నా, లేకపోయినా ఎట్టిపరిస్థితుల్లో నైనా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదేశాన్ని సైతం వదులుకోవడానికి సిద్ధపడుతున్నారు గానీ తమ తమ నాయకుల అభిప్రాయాలను మాత్రం వదులుకోవడానికి యిష్టపడటం లేదు.

వీరి అంధానుసరణ వీరిని ఒక్కోసారి గ్రంథ ప్రజలలాగ ముష్రిక్కులుగా కూడా మార్చే అవకాశంవుంది.

ఎందుకంటే దివ్యఖురానులో అల్లాహ్ గ్రంథ ప్రజలను గూర్చి యిలా సెలవిచ్చాడు.

'వారు అల్లాహ్ ను కాదని తమ పండితులనూ, సన్యాసులనూ తమ ప్రభువులు గా చేసుకున్నారు." *(తౌబా : 31)*

అదీ బిన్ హాతిం (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఓ రోజు సూరే తౌబాలోని - "వారు అల్లాహ్ ను కాదని తమ పండితులనూ, సన్యాసులనూ తమ ప్రభువులుగా చేసుకున్నారు." అన్న ఆయత్ ను పఠించి, గ్రంథ ప్రజలు తమ పండితులనూ, సన్యాసులనూ ప్రత్యక్షంగా పూజించరు కానీ, వారి పండితులు, సన్యాసులూ దేనినైనా హలాల్ (ధర్మ సమ్మతం) చేస్తే దాన్ని వారు హలాల్‌గా పరిగణిస్తారు, మరియు వారు దేనినయినా హరాం (నిషిద్ధం) చేస్తే వీళ్ళుకూడా నిషిద్ధం చేసుకుంటారు. (ఇలా చేయడం పరోక్షంగా వారిని పూజించడమే అవుతుంది.)"

*(తిర్మిజి: అబ్వాబ్ తఫ్సీరుల్ ఖురాన్: తఫ్సీర్ సూరే తౌబా)*

అంటే అల్లాహ్ హలాల్ చేసిన దానిని వీరు హరాం చేసేవారు, మరియు అల్లాహ్ హరాం చేసిన దానిని వీరు హలాల్ చేసేసేవారు. ఆమాటకొస్తే నేటికీ క్రైస్తవ సమాజంలో మనమీ విషయాన్ని గమనించవచ్చు. మద్యాన్నీ, పంది మాంసాన్నీ ఇంజీల్ నిషేధించినప్పటికీ వీరి పండితులు మాత్రం వాటిని, వారికోసం ధర్మసమ్మతం చేసేశారు. ఫలితంగా నేడు క్రైస్తవులు యథేచ్ఛగా పందిమాంసాన్ని, మద్యాన్నీ ఉపయోగిస్తున్నారు.

ఇమాములకు గుడ్డిగా విధేయత చూపే వారు కూడా అజ్ఞానం చేత ఒక్కో సారి ఇలాంటి పనులకు పాల్పడి తమకు తెలియ కుండానే ముష్రిక్కు లుగా మారిపోయే ప్రమాదం వుంది.

ఎంత దురదృష్ట కరమైన పరిస్థితి యిది!

స్వయానా 'మహమ్మదుర్రసూలల్లాహ్' అని సాక్ష్యం యిచ్చిన వారికే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసులను స్వీకరించండి, హదీసుల ప్రకారం జీవితాన్ని మలుచుకోండి అని చెప్పాల్సి వస్తోంది!

యిక ఈ నలుగురు ఇమాముల బోధనలు చూద్దాం:

వీరి బోధనలను గురించి ఈ కాలపు ప్రసిద్ధ హదీసువేత్త అయిన షేఖ్ నాసిరుద్దీన్ అల్బానీ (రహ్మతుల్లా అలై) గారు తన గ్రంథమైన 'సిఫతుస్సలాతున్నబీ' లో చక్కగా పొందుపరిచారు. వాటిలో కొన్ని యివి.

**ఇమాం అబూహనీఫా (రహమతుల్లా అలై) :**

(1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసే నా అభిమతం. *(ఇబ్నె ఆబిదీన్ - అల్ హాషియా)*

(2) మా అభిప్రాయాలను మేమెక్కడి నుండి తీసుకున్నామో తెలుసుకోకుండా వాటిని స్వీకరించడం మీలో ప్రతి ఒక్కరికీ నిషేధించబడినది. *(షరానీ- అల్ మీజాన్)*

(3) నేనొకవేళ దైవ గ్రంథానికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసుకు విరుద్ధంగా ఏదైనా పలికితే దానిని త్రోసిపుచ్చండి. *(అల్ ఫులానీ: ఈకాజ్ అల్ హిమామ్)*





దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

**ఇమాం మాలిక్ బిన్ అనస్ (రహమతుల్లా అలై):**

(1) నేనొక మానవ మాత్రుణ్ణి. కొన్నిసార్లు సత్యంపై వుంటాను, కొన్ని సందర్భాల్లో తప్పులు కూడా చేస్తాను. అందుకే నా అభిప్రాయాలను పరికించండి. దైవ గ్రంథం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌లకు అను గుణంగా వుంటే వాటిని స్వీకరించండి, వాటికి విరుద్ధంగా వున్నవాటిని త్రోసిపుచ్చండి. *(ఇబ్నె అబ్దుల్ బర్ర్: జామియుల్ బయానుల్ ఇల్మ్)*

(2) మాలో ప్రతి ఒక్కరి మాటను స్వీకరించనూ వచ్చు, రద్దు చేయనూ వచ్చు. కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విషయంలో తప్ప. *(ఇబ్నె అబ్దుల్ బర్ర్: జామియుల్ బయానుల్ ఇల్మ్)*

**ఇమామ్ షాఫయీ (రహమతుల్లా అలై):**

(1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసే నా అభిమతం. *(షరానీ)*

(2) కేవలం సున్నత్‌ను మాత్రమే అనుసరించండి. దాని ప్రక్కకు జరిగి ఇతరుల మాటల్ని అసలు పట్టించుకోకండి. *(అబూ నయీమ్: హిల్యా అల్ ఔలియా)*

(3) యావత్తు ముస్లిం సమాజం ఏకగ్రీవంగా అంగీకరించిన విషయ మేమీటంటే - ఒకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్ తెలిసిన తర్వాత ఇతరుల అభిప్రాయాలను బలపరచడం కోసం దానిని (సున్నత్‌ను) నిరాకరించడం పూర్తిగా నిషేధం. *(ఫులానీ)*

**ఇమాం అహ్మద్ బిన్ హంబల్ (రహమతుల్లా అలై):**

(1) నా అభిప్రాయాన్ని అనుసరించకండి. మాలిక్ , షాఫయీ, ఔజాయి (రహ మతుల్లా అలై) గారి అభిప్రాయాలను కూడా అనుసరించకండి. వీరెక్కడి నుండైతే ఆధారాలు పొందారో (ఖురాను, హదీసులు) అక్కణ్ణుంచే మీరూ పొందండి. *(ఫులానీ)*

(2) ఔజాయి (రహమతుల్లా అలై) అభిప్రాయం, మాలిక్ (రహమతుల్లా అలై)

అభిప్రాయం, అబూహనీఫా (రహమతుల్లా అలై) అభిప్రాయం- ఇవన్నీ కేవలం అభిప్రాయాలే. నా దృష్టిలో ఇవన్నీ ఒక్కటే. ఆధారాలు కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయన సహచరుల ఉల్లేఖనాలు మాత్రమే.

*(ఇబ్నె అబ్దుల్ బర్: జామియుల్ బయానుల్ ఇల్మ్)*

(3) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను తిరస్కరించేవాడు మార్గభ్రష్టత ఆంచుల్లో నిలబడి వున్నాడు. *(ఇబ్నె ఖయ్యూం అల్ జౌజి)*

ఇంతటి భయ భక్తులు కలిగిన ఇమాముల స్థాయిని ఏ విధంగా మార్చే సింది నేటి ముస్లిం సమాజం. ఈ ఇమాముల పేర్లు చెప్పి నేడు ప్రజలు గావించే నిర్వాకాలకు ఈ ఇమాములు అతీతులు.

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయ తను ప్రక్కన బెట్టి తమతమ నాయకుల అడుగుజాడల్లో నడిచేవారు ప్రళయం రోజు చేసే ఆక్రందనలను దివ్యఖురానులో అల్లాహ్ చక్కగా చిత్రీకరించాడు.

"తిరస్కారుల ముఖాలను నిప్పులపై అటూ ఇటూ త్రిప్పటం జరిగేనాడు వారు ఇలా అంటారు : అయ్యో! మేము అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ విధేయత చూపివుంటే ఎంత బాగుండేది. ఇంకా ఇలా అంటారు: ఓ మా ప్రభూ ! మేము మా నాయకులకూ, మా పెద్దలకూ విధేయత చూపాము. వారు మమ్మల్ని రుజుమార్గం నుండి తప్పించారు. ఓ ప్రభూ! వారికి రెట్టింపు యాతనను విధించు. వారిని తీవ్రంగా శపించు." *(అహ్‌జాబ్ : 66-68)*

"అల్లాహ్ వారిని శిక్షించే సమయాన వారు ప్రపంచంలో ఏ నాయకుల, ఏ మార్గదర్శకుల అడుగుజాడల్లో నడిచేవారో, ఆ నాయకులు , ఆ మార్గదర్శ కులు తమ అనుచరులతో ఏ మాత్రం సంబంధం లేని విధంగా ప్రవర్తిస్తారు. కానీ వారికి శిక్ష మాత్రం తప్పదు. ఇంకా వారి సకల సాధనా సంపత్తుల పరంపర తెగిపోతుంది. అప్పుడు అనుచరులు ఇలా అంటారు: మాకు (ప్రపంచానికి మళ్ళీతిరిగి పోయే) మరొక అవకాశం లభిస్తే, వారు ఈ రోజు మమ్మల్ని త్యజిస్తున్న విధంగానే మేమూ వారిని అప్పుడు త్యజిస్తాము. ఈ విధంగా ప్రపంచంలో వారు







చేసిన కర్మలను అల్లాహ్ వారి ముందు వుంచుతాడు. వారు నిస్పృహతో, తీవ్ర అవమాన భారంతో కృంగి పోతారు. అయినప్పటికీ నరకాగ్ని నుండి బయట పడడం వారికి సాధ్య పడదు." *(బఖర: 166- 167)*

వీరి లాంటి వారి ఆచరణలకు దొరికే ప్రతిఫలం గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"తనకు రుజుమార్గం విశదమైనప్పటికీ ఎవడైనా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు వ్యతిరేకంగా నడుం బిగించి, విశ్వాసుల వైఖరి కాక మరో వైఖరి అవలంబిస్తే అతణ్ణి మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము, ఇంకా అతణ్ణి నరకంలో పడవేస్తాము. అది అతి నీచమైన నివాస స్థలం." *(నిసా : 115)*

"వారితో ఇలా అను: తాము చేసిన పనుల విషయంలో అందరికంటే ఎక్కువగా విఫలులయ్యేవారు ఎవరో, నష్టపోయేవారు ఎవరో మేము మీకు తెలుపమంటారా? వారెవరంటే, ప్రాపంచిక జీవితంలో వారు చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయాయి, అయినా వారు తాము చేసేదంతా సవ్యంగానే వుందని భావిస్తారు". *(కహఫ్ : 103)*

ఈ సందర్భంలో అల్లామా హాలీ (రహమతుల్లా అలై) గారు ప్రస్తుత ముస్లిం సమాజ వాస్తవిక స్థితిని గూర్చి వర్ణిస్తూ చెప్పిన కవితను వివరించడం సబబుగా అనిపిస్తోంది!

ఇతరులొకవేళ విగ్రహారాధన చేస్తే, వారేమో కాఫిర్లు
దైవానికెవరైన కొడుకును ఆపాదిస్తే, వారేమో కాఫిర్లు
అగ్నిముందెవరైన వంగి సజ్దా చేస్తే, వారేమో కాఫిర్లు
నక్షత్రాల్లో గనక చమత్కార ముందంటే, వారేమో కాఫిర్లు

ముస్లిముల విషయంలో మాత్రం విశాలమయిన మార్గాలు
తమ యిష్టం వచ్చిన వారికి చేయ వచ్చు ఆరాధనలు !

దైవ ప్రవక్తను కూడ దైవంగా చేయవచ్చు
ఇమాముల స్థాయిని నబీ కన్న పెంచవచ్చు!

మజార్లపై రాత్రిపగలు ఏదైనా అర్పించవచ్చు
షహీదుల వద్ద కెళ్ళి ఏదైనా అడగవచ్చు!

అయినా సరే తౌహీద్ పై, ఏమాత్రం తేడారాదు
విశ్వాసమేమీ చెరగదు, ఇస్లాము కూడ పోదు!

షిర్క్ ఇదని అనడాన్కిక ఏమాత్రం తావులేదు
దీని నిర్వచనం మారింది భారతదేశం నందు!
ఎప్పుడూ గర్వపడిందో ఏ విషయంలోనైతే ఇస్లామ్
ఆ మహా భాగ్యాన్ని సైతం పోగొట్టుకొంది
నేటి ముస్లిం సమాజం!!

అల్లామా హాలి (రహమతుల్లా అలై) గారి కవితను చదివిన తర్వాత ఆయన ముస్లిం సమాజ స్థితికి ఎంతగా కుమిలి పోయేవారో అర్థమవుతోంది. తన ఆవేదననూ, బాధనూ యిలా కవితారూపంలో వెలిబుచ్చారు.







# సున్నత్ - బిద్అత్

యిక సున్నత్, బిద్అత్‌లను గూర్చి తెలుసుకుందాం.

సున్నత్ అంటే 'విధానము', 'సంప్రదాయము' అని అర్థం.

షరియత్ పరంగా సున్నత్ అంటే - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి విధానము అని అర్థం. అంటే - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆజ్ఞలు, స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పాటించిన ఆచరణలు, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సమక్షంలో చేయబడిన పనులకు ఆయన మౌనం వహించడం కానీ, అయిష్టాన్ని వ్యక్తం చేయకపోవడం గానీ జరిగి వుంటే అలాంటి పనులు - ఇవన్నీ సున్నత్ క్రిందికి వస్తాయి. ఇవన్నీ ఏ మాత్రం చెక్కు చెదరకుండా నేటికీ ప్రామాణిక హదీసు గ్రంథాల్లో నిక్షిప్తం గావించబడివున్నాయి.

యావత్తు ధర్మాన్ని, దివ్య ఖురానునూ, దానిలోని ఆదేశాల వాస్తవిక స్థితి గతులనూ మనం కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ద్వారానే తెలుసుకో గలుగుతాము.

దివ్య ఖురానులో అల్లాహ్ తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నుద్దేశించి యిలా సెలవిచ్చాడు:

"వాస్తవంగానే అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)లో మీకు ఒక మంచి ఆదర్శం వుంది. అల్లాహ్‌పై, అంతిమదినంపై ఆశలు పెట్టుకొని అత్యధికంగా అల్లాహ్‌ను స్మరించే ప్రతి వ్యక్తికీ". *(అహ్‌జాబ్ : 21)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అల్లాహ్ ఒక మంచి ఆదర్శ పురుషునిగా ధృవీకరించాడు. కనుక మన రోజువారీ దైనందిన జీవితంలో ప్రొద్దున

నిద్ర లేచినప్పటి నుండి రాత్రి నిద్ర పోయే వరకు చేసే ధార్మిక మరియు ప్రాపంచిక కార్యాల్లో మనం కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌ను అనుసరించాలి. అప్పుడే మన ఆచరణలు అల్లాహ్ వద్ద ఆమోదించబడతాయని ఆశించవచ్చు.

సున్నత్ ప్రాముఖ్యతను గూర్చి దివ్య ఖురానులో అల్లాహ్ మరియు తన ప్రామాణిక హదీసుల్లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గట్టిగా నొక్కి చెప్పారు. అంతేకాక దీనిని పెడచెవిన పెట్టిన వారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు.

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను ఉల్లంఘించే వారు, తాము ఏదైనా ఉపద్రవంలో చిక్కుకు పోతామేమో అనీ, తమపై బాధాకరమైన శిక్ష ఏదైనా అవతరిస్తుందేమో అనీ భయపడాలి". *(నూర్ : 63)*

"విశ్వాసులారా! అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముందు నడవకండి." *(హుజురాత్ : 1)*

"తనకు రుజుమార్గం విశదమైనప్పటికీ ఎవడైనా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు వ్యతిరేకంగా నడుం బిగించి, విశ్వాసుల వైఖరి కాక మరో వైఖరి అవలంబిస్తే అతణ్ణి మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము, ఇంకా అతణ్ణి నరకంలో పడవేస్తాము. అది అతి నీచమైన నివాస స్థలం." *(నిసా : 115)*

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు : నా సున్నత్‌ను అనుసరించటం పట్ల విముఖత చూపినవాడు నావాడు కాడు." (అసంపూర్ణ హదీసు) *(సహీ బుఖారి : 5063)*

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రభోదించారు :

"నేను మీ మధ్య రెండు వస్తువులను వదిలి వెళుతున్నాను. వాటి ప్రకారం గనక మీరు అమలు చేస్తే, ఎన్నటికీ పెడత్రోవ పట్టరు. (వాటిలో) ఒకటి దైవ గ్రంథం, రెండవది నా సున్నత్." *(హాకిమ్)*







అర్‌బాజ్ బిన్ సారియా (రజి అల్లాహు అన్హు) కథనం : ఒక రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు నమాజ్ చేయించారు. నమాజ్ తర్వాత మా వైపుకు తిరిగి మమ్మల్ని ఉద్దేశ్యించి ఎంతో ఉద్వేగపూరితమైన ఉపన్యాసం ఇచ్చారు. అది విని ప్రజలు కన్నీరు మున్నీరయ్యారు. హృదయాలు వణికి పోయాయి. అంతలో ఓ వ్యక్తి ఓ దైవ ప్రవక్తా! ఈనాటి మీ ప్రసంగం వీడ్కోలు తీసుకొనే వ్యక్తి ప్రసంగం లాగుంది. ఈ సందర్భంలో మీరు దేనిని గురించి మాకు గట్టిగా బోధించ దలిచారు? అని విన్నవించుకున్నాడు. దీనికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) - నేను మీకు అల్లాహ్‌కు భయపడడం గురించి, అమీర్ (నాయకుడు) మాటవినడం గురించి, అతనికి విధేయత చూపటం గురించి గట్టిగా చెబుతున్నాను, ఒక వేళ అతను (అమీర్) నల్లజాతికి చెందిన బానిసైనా సరే. (బాగా గుర్తుంచుకోండి)! నా తదనంతరం జీవించి వుండేవారు ఉమ్మత్‌లో ఎన్నో విభేదా లను చవిచూస్తారు. అలాంటి పరిస్థితుల్లో మీరు నా సున్నత్ పై అమలు చేయడాన్ని అనివార్యం చేసుకోండి మరియు సన్మార్గ గాములైన ఖలీఫాల పద్ధతిని పట్టుకోండి. వాటితో అతుక్కుపోండి, వాటిని దంతాలతో అదిమి వుంచండి. ఇంకా ధర్మంలో సృష్టించబడిన కొంగ్రొత్త విషయా లకు (బిద్‌ఆత్‌లకు) దూరంగా వుండండి. ఎందుకంటే ధర్మంలో సృష్టించబడిన ప్రతి క్రొత్త విషయం బిద్‌అత్ అవుతుంది. ప్రతి బిద్‌అత్ మార్గ భ్రష్టతకు ఆనవాలు" అని ప్రభోదించారు. *(అబూదావూద్ : 4607)*

ప్రస్తుత ముస్లిం సమాజంలో మరో రకం వ్యక్తులు కూడా తారస పడుతుం టారు. వారికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు పూర్తి విధేయత చూపా లనే వుంటుంది.

కానీ ఆచరణల్లో మాత్రం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను మించి పోవడానికి ప్రయత్నిస్తూ వుంటారు. దానిక్కారణం - ఆయన దైవ ప్రవక్త కాబట్టి ఆయనతో మనకేం పోలిక? పుణ్యం విషయంలో కూడా ఆయనతో మనం సరితూగలేం కనుక ఆయన కన్నా ఎక్కువగా ఆచరణలను పాటించాలని చెప్పుకొంటూ పోతుంటారు.

ఖచ్చితంగా ఇలాంటి మనస్తత్వం కలిగిన వ్యక్తులే దైవ ప్రవక్త (సల్లల్లాహు

అలైహి వసల్లం) కాలంలో కూడా వుండేవారు. వారికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏ సందేశం యిచ్చారో చూడండి.

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం : ముగ్గురు సహచరులు (అలి బిన్ అబూ తాలిబ్, అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్, ఉస్మాన్ బిన్ మజ్ఊన్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సతీమణుల ఇళ్ళకు వచ్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆరాధనల గురించి అడిగారు. వారికి జవాబు యివ్వబడింది. (అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కొంత సమయం దైవారాధనలో గడిపి తదుపరి విశ్రాంతి కూడా తీసుకుంటారని వారికి తెలియ జేయబడింది).

అయితే వాళ్ళు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆరాధనలను స్వల్పమని తలపోశారు. 'దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో మాకెలాంటి పోలికా! ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి భూత భవిష్యత్ కాల పొరపాట్లు కూడా మన్నించబడ్డాయి. అందుకే మనం ఆయన కన్నా ఎక్కువగా ఆరాధనలు చేయవలసి వుంది' అని పరస్పరం చెప్పుకున్నారు. కడకు వారిలో ఒకతను, తాను ఎల్లకాలం రాత్రిళ్ళు మేల్కొని వుండి నమాజ్ చేస్తానని అంటే, తాను నిరాఘాటంగా ఉపవాసాలు పాటిస్తానని, వాటిని ఎప్పుడూ త్యజించననీ రెండో వ్యక్తి అన్నాడు. మూడో వ్యక్తి - తాను స్త్రీలకు దూరంగా వుంటానని, అసలు వివాహమే చేసుకొననీ తీర్మానించుకున్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వచ్చిన తర్వాత (విషయం తెలిసి) - మీరీ విధంగా అన్నమాట నిజమేనా? అని అడిగారు. (అవును అని వాళ్ళు అంగీకరించిన తర్వాత) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా హెచ్చరించారు : జాగ్రత్త! అల్లాహ్ సాక్షి! నేను మీ అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడేవాణ్ణి. మీ అందరి కన్నా ఎక్కువగా భక్తి ప్రపత్తులు కలవాణ్ణి. అయితే నేను ఉపవాసం వుండడంతో పాటు ఉపవాస విరమణ కూడా చేస్తాను. రాత్రి జాగరణ చేయడంతో పాటు విశ్రాంతి కూడా తీసుకుంటాను. నేను స్త్రీలను వివాహం కూడా చేసుకున్నాను. (బాగా గుర్తుంచుకోండి)! ఎవరైతే నా సున్నత్ పట్ల వైముఖ్య ధోరణి చూపుతాడో అతడితో నాకు సంబంధం లేదు. *(సహీ బుఖారి : 5063)*







దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పై వివరణతో అర్థమయ్యే విషయమేమిటంటే : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్‌లో బుద్ధి పూర్వకంగా హెచ్చుతగ్గులు చేయడం కూడా 'మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యానికి వ్యతిరేకం. అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మాన్ని అనుసరించ గోరేవారు ఆయన సున్నత్ విషయంలో తగు జాగ్రత్త వహించాలి. లేకపోతే మన ఆచరణలు మనకు తెలియకుండానే వృథా అయిపోయే అవకాశం వుంది.

# సలఫ్ మరియు సున్నత్

సలఫ్ అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలం మొదలుకొని మొదటి మూడు తరాలకు చెందిన ముస్లిములని మనం ఇది వరకే తెలుసు కున్నాం.

సలఫ్ అంతా సున్నత్‌కు అత్యధిక ప్రాధాన్యత నిచ్చేవారు. సున్నత్‌కు వ్యతిరేకంగా ఎవరి ఆలోచనలకూ, అభిప్రాయాలకూ, వారెంత గొప్పవారైనా సరే, వారు ఏ మాత్రం విలువనిచ్చేవారు కాదు.

కొన్ని ఉదాహరణలు చూడండి :

ఉర్వా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఇలా తెలిపారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆచరిస్తూ వుండిన ఏ విషయాన్నీ నేను పరిత్యజించలేను. ఆయన ఆజ్ఞల్లో, ఆచరణల్లో ఏ ఒక్కదానినీ పరిత్యజించినా మార్గ భ్రష్టుణ్ణి అయిపోతానేమో నన్న భయం నాకుంది." *(సహీ బుఖారి)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం : కేవలం (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌ను) పాటించండి. (ధర్మంలో) క్రొత్త విషయాలు సృష్టించకండి. ఎందుకంటే అవి (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌లు) మీకు సరిపోతాయి. *(దారిమి)*

సూఫియాన్ సౌరీ (రహమతుల్లా అలై) వివరించిన ఒక సుదీర్ఘ ఉల్లేఖనంలో, తన దగ్గరికి ఉత్తరం వ్రాసి ప్రశ్నించిన ఒక వ్యక్తికి జవాబుగా ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహమతుల్లా అలై) ఇలా వ్రాసి పంపారు:

అమ్మాబాద్! నేను నీకు అల్లాహ్‌కు భయపడమని, ఆయన ధర్మంలో మధ్యేమార్గాన్ని అవలంబించమని, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)





సున్నత్‌ను అనుసరించమని, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్‌లన్నీ స్పష్టమయ్యాక కూడా బిద్దతీలు సృష్టించిన బిద్అత్ లను వదిలి దూరంగా వుండమని వసీయతు చేస్తున్నాను. దైవ కృప వల్ల వీటి వల్లనే మార్గ భ్రష్టత నుండి నిన్ను నీవు రక్షించుకో గలుగుతావు.

నీకు ముందు గతించిన వారు (సలఫ్‌లు) వేటితో నైతే సంతృప్తి చెందారో (ఖురాను మరియు హదీసులు) నీవు కూడా వాటితోనే సంతృప్తి చెందు. దీనికి కారణం - వాళ్ళు నీ కన్నా ధర్మాన్ని బాగా ఎరిగినవారు. వారు ఏ విషయాలనైతే వారించారో వాటిని ఖచ్చితమైన జ్ఞానంతోనే వారించారు. సామాజిక విషయాల్లో కూడా వారికి మనకన్నా మంచి అవగాహన వుండేది. ప్రతి మంచి విషయంలోనూ వారిది మనకన్నా పై చేయి వుండేది. *(అబూదావూద్: 4612)*

అబూ అమ్ర్ ఔజాయీ (రహమతుల్లా అలై) కథనం : ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పటికీ మీరు మాత్రం మీకు ముందు గతించిన వారి (సలఫ్) ఆదర్శాలకు లోబడి జీవించండి. ఇతరుల అభిప్రాయాలు మీకెంత రంజింప జేసినా వాటిని ఏ మాత్రం అనుసరించకుండా జాగ్రత్తపడండి.

*(ఖతీబ్ బగ్దాదీ : షర్ఫ్ అస్‌హాబుల్ హదీస్)*

# బిద్అత్ (నూతనాచారము)

బిద్అత్ అంటే ఒక కొత్త విషయాన్ని సృష్టించడం అని అర్థం.

షరియత్తు పరంగా బిద్అత్ అంటే - 'పుణ్యఫలాపేక్షతో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సున్నత్‌కు ఏ మాత్రం సంబంధం లేకుండా ధర్మంలో సృష్టించబడిన ఒక కొత్త ఆచారము' అని అర్థం.

బిద్అత్ వల్ల వాస్తవిక ధర్మం యొక్క రూపు రేఖలే మారిపోతాయి. అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బిద్అత్ లను ప్రవేశ పెట్టడం నుండి గట్టిగా వారించారు. బిద్అతీల పర్యవసానం చాలా దారుణంగా వుంటుందని హెచ్చరించారు.

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

"నేను కౌసర్ సరస్సు వద్ద (మళ్ళీ మీకు) తారసపడతాను. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కడూ దాని జలం సేవిస్తాడు. ఒకసారి ఆ నీరు త్రాగిన వారికి ఇక ఎన్నడూ దాహం వేయదు. మరికొంత మంది కూడా అక్కడికొస్తారు. వారిని నేను గుర్తు పడతాను. వాళ్ళు కూడా నన్ను తమ ప్రవక్తగా గుర్తు పడతారు. కానీ వాళ్ళను నా దగ్గరికి రానీయకుండా అడ్డుకోవడం జరుగుతుంది. అప్పుడు నేను- వాళ్ళు నా అనుచర వర్గం వారే (వాళ్ళను అనుమతించండి) అని అంటాను. నాకప్పుడు - ఓ మహమ్మద్ ((సల్లల్లాహు అలైహి వసల్లం)! మీ తదనంతరం వీళ్ళు (మీ ధర్మంలో) ఎలాంటి క్రొత్త విషయాలు సృష్టించారో మీకు తెలియదు" అని నాకు తెలియజేయబడుతుంది.

నేనప్పుడు - "దూరమై పొండి, నా తదనంతరం ధర్మం రూపు రేఖలను





మార్చేసిన వారు నాకు దూరమై పొండి" అని అంటాను.

*(సహీ ముస్లిం: కితాబుల్ ఫజాయెల్, బాబ్ : ఇజ్‌బాతి హౌజి నబీయ్యినా (సల్లల్లాహు అలైహి వసల్లం))*

అలి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"దైవేతరుని పేర పశువును జిబహ్ చేసే, భూమి హద్దులను మార్చివేసే, తన తండ్రిని శపించే, బిద్అతీ కి ఆశ్రయమిచ్చే ప్రతి వ్యక్తినీ అల్లాహ్ శపించాడు." *(సహీ ముస్లిం : కితాబుల్ అజాహి)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరైనా ధర్మంలో లేని ఏదైనా పనిని చేస్తే అది దైవ సమక్షంలో ధూత్కరించబడుతుంది." *(సహీ బుఖారీ : 2697)*

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు: బాగా గుర్తుంచుకోండి! అన్నిటికన్నా శ్రేష్ఠమైన పలుకు అల్లాహ్ గ్రంథం, శ్రేష్ఠమైన మార్గం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మార్గం, అత్యంత నీచమైన పని బిద్అత్ ను సృష్టించడం మరియు ప్రతీ బిద్అత్ మార్గ భ్రష్టతకు సోపానం.

*(సహీ ముస్లిం : కితాబుల్ జుమా, బాబ్ : రఫవుస్సౌతి బిల్ ఖుతుబతి)*

బిద్అత్ ను సృష్టించే వారి పట్ల దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు కూడా చాలా కఠినంగా వ్యవహరించేవారు.

అబూ మూసా (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో ఇలా సెలవిచ్చారు.

మస్జిద్‌లో కొందరు వలయాకారాల్లో కూర్చొని వారిలో ఒకరిచ్చే ఆదేశం మేరకు వాళ్ళు కంకర్రాళ్ళపై 100 సార్లు సుబ్‌హానల్లాహ్, 100 సార్లు అల్‌హమ్దు లిల్లాహ్ మరియు 100 సార్లు అల్లాహు అక్బర్ అని పఠిస్తూ ధ్యానించే ఒక క్రొత్త ఆచారాన్ని ప్రవేశ పెట్టారని తెలిసి అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు)

మస్జిద్‌లో ప్రవేశించి ఒక సమూహం దగ్గరికొచ్చి 'నేనేం చూస్తున్నా నిక్కడ?' అని వారిని ప్రశ్నించారు.

వారు జవాబిస్తూ : 'ఓ అబూ అబ్దుర్రహ్మాన్ ! మేమీ కంకర్రాళ్లపై లెక్కిస్తూ తక్బీర్, తహ్‌లీల్ మరియు తస్బీహ్ పఠిస్తున్నాము' అని అన్నారు.

ఇబ్నె మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) జవాబిస్తూ : (మీరీ కంకర్రాళ్ళపై మాత్రం మీ పుణ్యాలను కాదు) మీ పాపాలను లెక్కించండి : (వాస్తవానికి) 'మీ పుణ్యాలేవియూ వృథా కాబోవని నేను గ్యారంటీ యిస్తున్నాను'అని అన్నారు.

తిరిగి మాట్లాడుతూ - ఓ మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజమా! ఇంత త్వరగా మీరు మార్గ భ్రష్టులై పోవడం చూసి మీపై జాలేస్తోంది. ఇంకా మీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు పెద్ద సంఖ్యలో (మీ మధ్యే) వున్నారు. ఇంకా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బట్టలు కూడా చిరగ లేదు. ఇంకా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) (వాడిన) కంచాలు కూడా విరగలేదు.

నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షి! మీరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మార్గం కన్నా ఉత్తమమైన మార్గంపైనైనా వున్నారు లేక మార్గ భ్రష్టత ద్వారాలు తెరుస్తున్నారు అని అన్నారు. ఇది విని వారు - ఓ అబూ అబ్దుర్రహ్మాన్! అల్లాహ్ సాక్షి! మా సంకల్పం (ఈ కొత్త ఆచరణ ద్వారా) కేవలం పుణ్యఫలాపేక్షయే. దీనిపై ఆయన (రజి అల్లాహు అన్హు) జవాబిస్తూ : చాలా మంది (తమ ఆచరణల ద్వారా) పుణ్యాన్నిఆశిస్తారు. కానీ పుణ్యం దగ్గరికి చేరడం వారి అదృష్టంలో వుండదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాకిలా సెలవిచ్చి వున్నారు: మీలో కొందరుంటారు, వాళ్ళు ఖురాను చదువుతారు. కానీ అది వారి గొంతుల్లో నుండి క్రిందికి దిగదు. (అంటే దాని ప్రభావం వారి హృదయాలపై ఏ మాత్రం పడదు). అల్లాహ్ సాక్షి! 'మీరు ఆ కోవకే చెందిన వారేమో అని నా అనుమానం' అని వారి దగ్గర్నుంచి వచ్చేశారు.

*(సునన్ దారిమి)*

మరి చూడబోతే సుబ్ హానల్లాహ్, అల్ హమ్దులిల్లాహ్, అల్లాహు అక్బర్ అని ధ్యానించడం పుణ్యకార్యమే. కానీ వారు ధ్యానం చేసిన పద్ధతి దైవ ప్రవక్త







(సల్లల్లాహు అలైహి వసల్లం) నేర్పింది కాదు. అందుకే అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) అలా చేసే వారిని మస్జిద్ నుండి గెంటేశారు.

## మరో సంఘటన :

మహమ్మద్ బిన్ అబ్దుర్రహ్మాన్ అద్రమీ, ఒక వ్యక్తిని, ఒక బిద్‌అత్ ను గురించి ప్రజలకు తెలిపి దానిని ఆచరించమని ఆదేశించడం చూసి, ఆ వ్యక్తితో ఇలా అడిగారు:

'నీవు ప్రజలకు చెప్పే కార్యం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు), ఉమర్ (రజి అల్లాహు అన్హు), ఉస్మాన్ (రజి అల్లాహు అన్హు), అలీ(రజి అల్లాహు అన్హు) గార్లకు జ్ఞానం వుందా లేదా?' దానికా వ్యక్తి-" లేదు, వారికి దీని జ్ఞానం లేదు' అని అన్నాడు.

దానికాయన - 'అయితే వారికి తెలియనిది నీకు తెలిసిందన్న మాట' అని అన్నారు. ఆ వ్యక్తి వెంటనే - 'అలాగయితే వారికీ విషయం తెలుసు అని నేనంటాను' అని అన్నాడు.

ఆయన- (నీవనుకున్నట్లు వారికి తెలుసు అని అనుకుంటే) ఆ విషయం గురించి మాట్లాడడం గానీ, ఇతరులకు ఆచరించమని చెప్పకుండానే వారు సంతృప్తి చెందారా లేదా? అని అడిగారు.

దానికతను - 'నిస్సందేహంగా సంతృప్తి చెందారు' అని అన్నాడు.

ఆయన తిరిగి మాట్లాడుతూ - మరి వారికి సంతృప్తి కలిగించిన విషయం నీకు సంతృప్తి కలిగించదా? అని అడిగారు.

ఆ వ్యక్తి విషయం అర్థం చేసుకొని తను చేసే పనిని విరమించుకున్నాడు. అక్కడే వున్న వారి ఖలీఫా కలుగ జేసుకొని, వారితో సంతృప్తి చెందని వాడికి అల్లాహ్ ఎప్పుడూ సంతృప్తి పరచకుండుగాక! అని అన్నారు.

*(ఖతీబ్ బగ్దాదీ : తారీఖుల్ బగ్దాద్)*

ఈ రోజు ముస్లిం సమాజం దురదృష్ట వశాత్తూ అసంఖ్యాకమైన బిద్‌అత్ లలో యిరుక్కుపోయింది. చాలా మందికైతే తాము పుణ్యకార్యాల పేరుతో ఎన్నో బిద్‌అత్ లకు జీవం పోస్తున్నామని కూడా అసలు తెలియదు. మిలాదున్నబీ, గ్యార్మీ, ఖురాన్ ఖానీ, దహుం, చెహులుం, సాంవత్సరీకం వంటి ఎన్నో ఆచారాలు,

చివరికి మసీదులలో ప్రతి ఫర్జ్ నమాజు తర్వాతా జరిగే సామూహిక దుఆ - ఇవన్నీకూడా నేడు ధార్మిక రూపం దాల్చుకున్నాయి. ముస్లిం సమాజంలోని ఒక పెద్ద సమూహం అత్యంత భక్తి శ్రద్ధలతో వీటిని ఆచరిస్తోంది. వీటికోసం విచ్చల విడిగా ధనాన్ని ఖర్చు చేస్తోంది. కానీ వాస్తవానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంతో ఈ దురాచారాలకు ఏ విధమైన సంబంధమూ లేదు.

మిలాదున్నబీ ని పురస్కరించుకొని స్వయంగా నాకు ఎదురైన ఒక అనుభవాన్ని యిక్కడ చర్చించాలనిపిస్తోంది.

ఓ యువకుడు నాతో ఓ రోజు మాట్లాడుతూ యిలా అనడం మొదలు పెట్టాడు.

యువకుడు : మీరు మిలాదున్నబీ ఊరేగింపులో పాల్గొనరు. మీకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీద ప్రేమ లేదా?

నేను : మంచి ప్రశ్నే వేశావు. నీ వద్ద తీరిక సమయం వుంటే మనం కాస్త వివరంగా దీని గురించి మాట్లాడుకుందాం. సరేనా?

యువకుడు : సరే, చెప్పండి.

నేను : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీద వున్న ప్రేమను ప్రకటించడానికి మిలాదున్నబీ (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినం) జరుపు కుంటారా? ఊరేగింపు కూడా దానికేనా?

యువకుడు : అవును, దానికే.

నేను : సరే, నీ మాటను ఒప్పుకుంటున్నాను. కానీ ఓ విషయం అడుగుతాను, చెప్పు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఆయన సహచరులు ప్రేమించేవారా కాదా?

యువకుడు : నిస్సందేహంగా ప్రేమించేవారు.

నేను : వారికన్నా ఎక్కువగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మరెవరైనా ప్రేమించగలరా?







యువకుడు : లేదు.

నేను : నీ అభిప్రాయం బలపడడానికి నీకో విషయం కూడా చెబుతాను విను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఆయన ప్రియ సహచరులు ఎంతగా ప్రేమించే వారంటే, ఆయన నోటి నుండి వెలువడే కఫాన్ని కూడా వారు క్రింద పడనీయకుండా తమ అరచేతుల్లో పట్టుకొని శరీరాలకు రాసుకొనేవారు.

యువకుడు : అవును.

నేను : మరి మనలో ఎవరైనా ఆ పని చేయగలరా? నిజా యితీగా చెప్పు.

యువకుడు : బహుశా చేయలేరేమో.

నేను : మరి అంతగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ప్రేమించిన ఆయన సహచరులు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మ దినాన్ని (మిలాదున్నబీ) పండుగగా ఎప్పుడైనా జరుపుకున్నారా?

యువకుడు : (మెల్లగా) లే ... దు.

నేను : మిలాదున్నబీ పేరుతో ఊరేగింపులు జరిపారా?

యువకుడు : లేదు.

నేను : మరి వారికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పట్ల ప్రేమ లేదా? వుందనీ, మరియు వారిలాగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మరెవ్వరూ ప్రేమించలేరనీ నువ్వే ఇంతకు ముందు ఒప్పుకున్నావు.

ఆ యువకుడు విషయం అర్థం చేసుకొని నిశ్శబ్దంగా మారు మాట్లాడ కుండా వెళ్ళిపోయాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీది ప్రేమను ఆయనకు పూర్తి విధేయత చూపి, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ లను అనుసరిస్తూ ప్రకటించాలి గానీ, బిద్అత్ లు ప్రవేశ పెట్టి, ఊరేగింపులు జరిపి కాదు.

# యాసిడ్ టెస్ట్

యిక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయత గురించి ఆఖరిగా దివ్యఖురాన్‌లో అల్లాహ్ పెట్టిన యాసిడ్ టెస్ట్ లాంటి విశ్వాస పరీక్షను గురించి తెలుసుకుందాం. ఇది మోమిన్‌లు (నిజమైన విశ్వాసులు) మరియు మునాఫిఖ్ (కపట విశ్వాసులు) లను వేరు చేసే పరీక్ష.

'మహమ్మదుర్రసూలల్లాహ్' అని సాక్ష్యమిచ్చే ప్రతి ఒక్కరూ ఈ విశ్వాస పరీక్షను నెగ్గాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అలా కాని పక్షంలో, అతను ప్రజల దృష్టిలో ఎలా వున్నా అల్లాహ్ దృష్టిలో మాత్రం కపట విశ్వాసిగా ముద్ర వేయబడతాడు. తర్వాత నరకంలోని అట్టడుగు ప్రదేశానికి చేరాల్సి వుంటుంది.

"కపటులు నరకంలో అట్టడుగు ప్రదేశానికి పోతారు. వారికి సహాయం చేసేవాడెవడూ దొరకడు." *(నిసా: 145)*

యిక ఈ విశ్వాస పరీక్ష లోనికి వద్దాం.

సూరహ్ నూర్ లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

47 : మేము అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)నూ విశ్వసించాము, (వారి) విధేయతను అంగీకరించాము అని వారు అంటారు. ఆ తర్వాత వారిలోని ఒక వర్గం (విధేయత పట్ల) విముఖత చూపుతుంది. అటువంటి వారు ఎంత మాత్రం విశ్వాసులు కారు.

48 : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి మధ్య వున్న వ్యాజ్యం విషయంలో తీర్పు చెప్పడానికి వారిని అల్లాహ్ వైపునకూ, ప్రవక్త





(సల్లల్లాహు అలైహి వసల్లం) వైపునకూ రమ్మని పిలిచినప్పుడు వారిలోని ఒక వర్గం విముఖత చూపుతుంది.

49 : కానీ ఒక వేళ సత్యం గనక వారికి అనుకూలంగా వుంటే వారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు పెద్ద విధేయులు మాదిరిగా వచ్చేస్తారు.

50 : వారి హృదయాలకు (కపట) రోగమేదైనా తగిలిందా? లేదా వారు సంశయంలో పడిపోయారా? లేదా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి అన్యాయం చేస్తారని భయమా? అసలు విషయమేమిటంటే దౌర్జన్య పరులు వారే.

51 : విశ్వసించిన వారి మాట ఏమిటంటే : తమ వ్యాజ్యాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పరిష్కరించే విషయంలో వారు అల్లాహ్ వైపునకూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వైపునకూ పిలువబడితే, వారు - 'మేము విన్నాము' 'విధేయత చూపాము' అని అంటారు. అటువంటి వారే సాఫల్యం పొందు తారు.

52 : అల్లాహ్‌కూ ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూ విధేయత చూపేవారు, అల్లాహ్‌కు భయపడేవారు, ఆయన పట్ల అవిధేయతకు దూరంగా వుండేవారు మాత్రమే విజయం పొందు తారు. *(నూర్ : 47-52)*

పై ఆయత్‌లలో మొదటి మూడు ఆయతులు కపట విశ్వాసుల లక్షణా లను బహిర్గతం చేస్తుండగా ఆఖరి రెండు ఆయతులు నిజమైన విశ్వాసుల లక్షణాలను తెలియజేస్తున్నాయి.

పై ఆయత్‌లలో 'అల్లాహ్ వైపుకు రండి' అంటే దివ్యఖురాన్ వైపుకు అనీ, 'ప్రవక్త వైపుకు రండి' అంటే ప్రామాణిక హదీసుల వైపుకు రండి అన్న విషయాన్ని గ్రహించాలి.

యిక ప్రతి వ్యక్తీ తన దృక్పథాన్ని, వ్యవహార సరళిని నిజాయితీగా ఈ

ఐదు ఆయతుల మీద వుంచి పరీక్షిస్తే అతని హృదయం అతనికి తనే వర్గంలో చేరి వున్నాడో చెప్పేస్తుంది.

ఇదండీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విధేయతకు సంబంధించిన యాసిడ్ టెస్ట్!

**5) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను గౌరవించడం, సహాయపడటం:**

'మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యంలో ఇమిడి వున్న మౌలికాంశాలలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను గౌరవించడం, సహాయ పడటం కూడా ఒకటి. ఇది లేకుండా మహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం పరిపూర్ణం కానేరదు.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ప్రవక్తా! మేము నిన్ను సాక్షి (షాహిద్) గానూ, శుభవార్త అందజేసే వానిగానూ, హెచ్చరిక చేసే వానిగానూ చేసి పంపాము. ఎందుకంటే, ప్రజలారా! మీరు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ విశ్వసించాలనీ, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సహకరించాలనీ, అతనిని గౌరవించాలనీ, ఉదయం సాయంత్రం అల్లాహ్‌ను స్తుతించాలనీ". *(ఫతహ్: 8-9)*

"అతనిని (దైవప్రవక్తను) విశ్వసించి, సమర్థించి, అతనికి సహకరించి, అతనితో అవతరింపజెయ్యబడిన జ్యోతి(దివ్యఖురాన్)ని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందుతారు." *(ఆరాఫ్ : 157)*

"(ఇంకా ఆ ఆస్తులలో) తమ యిళ్ళ నుండి, తమ ఆస్తి పాస్తుల నుండి తరిమి వేయబడిన నిరుపేద శరణార్థులకు కూడా హక్కు వుంది. వారు అల్లాహ్ అనుగ్రహాన్ని, ఆయన ప్రసన్నతను కోరుకుంటారు. ఇంకా వారు అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూ సహాయ పడేందుకు సదా సంసిద్ధంగా వుంటారు. వారే రుజువర్తనులు." *(హష్ర్ : 8)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణానంతరం ఆయనకు సహాయపడటం ఎలా అంటే ఆయన సున్నత్‌లను తగు విధంగా గౌరవించి







వాటిని అనుసరించడం ద్వారా, ఆయన బోధనలను ఇతరులకు చేరవేయడం ద్వారా అన్నమాట!

యిక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను గౌరవించడం అంటే - ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసిన విషయాలన్నింటినీ ధృవీకరించి, ఆయన సున్నత్‌లకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి గౌరవిస్తూ, వాటికి వ్యతిరేకంగా ఎవరి అభిప్రాయాలకు కూడా విలువ నివ్వకుండా వుండాలి.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)పై దరూద్, సలాములు పంపుతూ వుండాలి. ఈ విషయంలో కూడా మనం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులకు నేర్పిన పద్ధతినే అనుసరించాలి. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నేర్పిన వచనాలతోనే దరూదు, సలాములు పంపిస్తూ వుండాలి. అయితే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేయని పద్ధతుల్ని అవలంబిస్తూ కొన్ని ప్రత్యేక సమయాలు తమకోసం కేటాయించుకొని కేవలం ఆ సమయాల్లోనే తమ స్వరచిత దరూద్, సలాములు పంపేవారు మనకు చాలా మంది కానవస్తుంటారు. ప్రతి శుక్రవారం నమాజు తర్వాత మసీదుల్లో నిలబడి సామూహికంగా సలాములు పఠించడం, ప్రతి అజాన్‌కు ముందు దరూద్ పఠించడం - వీటికి నిదర్శనాలు. ఇవన్నీ కూడా త్యజించవలసిన తప్పుడు కార్యాలు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను నేరుగా ఆయన పేరుతో సంభాషించకుండా అల్లాహ్ ప్రవక్త అని లేదా దైవ ప్రవక్త అనీ లేదా మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అనీ సంభాషించాలి.

"ప్రవక్తా! నీ వద్దకు పంపబడిన గ్రంథాన్నీ, నీకు పూర్వం పంపబడిన గ్రంథాలను మేము విశ్వసించాము అని ప్రకటన చేసి తమ వ్యవహారాల పరిష్కార నిమిత్తం తాగూత్ వద్దకు పోవాలని కోరే వారిని నీవు చూడలేదా? వాస్తవానికి తాగూత్‌ను తిరస్కరించండి అని వారిని ఆదేశించడం జరిగింది. షైతాను వారిని పెడత్రోవ పట్టించి సన్మార్గానికి బహుదూరంగా తీసుకుపోవాలని చూస్తాడు. వారితో, అల్లాహ్ పంపిన దాని వైపుకు రండి, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వైపుకు రండి అని చెప్పినప్పుడు ఆ కపటులు నీ వైపుకు రాకుండా వుండటాన్ని నీవు చూస్తావు". *(నిసా : 60-61)*

అందుకే జీవితానికి సంబంధించిన సమస్త వ్యవహారాల్లో ఇతరుల మార్గం అనుసరించకుండా కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఆదర్శంగా తీసుకొని ఆయన సున్నత్ లను అనుసరించడాన్ని విధిగా చేసుకోవాలి. ఇదే మనం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు యిచ్చే అత్యుత్తమ గౌరవం.

ఆఖరిగా - 'మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యం యొక్క వాస్తవికతను గూర్చి షేఖ్ మహమ్మద్ బిన్ అబ్దుల్ వహాబ్ (రహమతుల్లా అలై) గారు యిచ్చిన సంపూర్ణమైన క్లుప్త వివరణ యిది :

"మహమ్మదుర్రసూలుల్లాహ్ అని సాక్ష్యమివ్వడంలో ఇమిడి వున్న పరమార్థ మేమిటంటే - ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞలను పాటించాలి, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసిన (గోచర, అగోచర) సమస్త విషయాలను (మనస్ఫూర్తిగా) ధృవీకరించాలి, ఆయన వారించిన విషయాల నుండి దూరంగా వుండాలి, మరియు కేవలం ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేసిన పద్ధతి (సన్నత్) ప్రకారమే అల్లాహ్‌ను ఆరాధించాలి".

ఎంత చక్కని వివరణ యిది.

ఇలా చేయగలిగినప్పుడే 'మహమ్మదుర్రసూలుల్లాహ్' అని మనమిచ్చే సాక్ష్యం అల్లాహ్ వద్ద ఆమోద యోగ్యం కాగలుగుతుంది.

ఇదండీ 'మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యం యొక్క వాస్తవికత.

జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఇస్లాం ను గురించి అడిగిన ప్రశ్నకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన సమాధానంలో - సద్వచన సాక్ష్యం తరువాత వున్న నమాజ్, రంజాన్ నెల ఉపవాసాలు, హజ్ గురించి మనం ఇది వరకే తెలుసుకున్నాం.

యిక జిబ్రయీల్ (అలైహిస్సలాం) అడిగిన రెండవ ప్రశ్నలోనికి వద్దాం.





దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

# ఈమాన్

వాస్తవానికి ఈమాన్ అనేది విశ్వాసాలూ, ఆచరణల కలయిక. విశ్వాసాలు అనేవి హృదయము మరియు నోటితో సంబంధం కలిగి వుంటే, ఆచరణలు మాత్రం హృదయము, నోరు మరియు ఇతర అవయవాలతో సంబంధం కలిగి వుంటాయి.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"కానీ అల్లాహ్ మీలో విశ్వాసం పట్ల ప్రేమను కలుగజేశాడు, దానిని మీకు మనోరంజకమైనదిగా చేశాడు." *(హుజురాత్ : 7)*

"విశ్వసించండి అల్లాహ్‌నూ, ఆయన పంపిన నిరక్షరాస్యుడైన ప్రవక్తను". *(ఆరాఫ్ : 158)*

మనం నోటితో పలికే 'లా ఇలాహ ఇల్లల్లాహ్, మహమ్మదుర్రసూలుల్లాహ్' సాక్ష్యం యొక్క అర్థం కూడా యిదే.

ఈమాన్‌కు హృదయం ద్వారా, నోటి ద్వారా సంబంధం వుందని దీని ద్వారా తెలుస్తోంది.

యిక ఆచరణలు కూడా ఈమాన్‌లో అంతర్భాగమే అని చెబుతూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ఈ మీ విశ్వాసాన్ని అల్లాహ్ ఏ మాత్రం వృథా కానివ్వడు". *(బఖర : 143)*

అంటే ఖిబ్లా మార్పుకు పూర్వం ముస్లిములు చదివిన నమాజులు అన్న మాట. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనా నగరానికి వలస వచ్చిన తరువాత దాదాపు 16, 17 నెలల వరకు కూడా బైతుల్ మఖ్దిస్ వైపుకు తిరిగే నమాజ్ చేసేవారు. ఆ తరువాత ఖిబ్లా మార్పుకు సంబంధించిన దైవసూక్తి అవతరించినది. కానీ అప్పటికే కొంతమంది సహచరులు నిర్యాణం చెంది

వున్నారు. అందుకే కొందరు ముస్లి ములు, మరణించిన తమ సోదరుల నమాజ్ విషయం ఏమవుతుందో అని ఆందోళన పడుతున్న తరుణంలో ఈ ఆయత్ అవతరించింది. *(సహీ బుఖారి : 40)*

ఈ ఆయత్‌లో అల్లాహ్ నమాజ్‌ను ఈమాన్ లాగా వివరించి చెప్పాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా తన ప్రామాణిక హదీసుల్లో ఆచరణలను ఈమాన్ లాగా వివరించి చెప్పారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

ఈమాన్ శాఖలు 70కి పైగా లేక 60కి పైగా వున్నాయి. అందులో అన్నిటికన్నా ఉత్తమమైనది 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలకడం మరియు అన్నిటికన్నా తక్కువైనది దారిలో పడివున్న నష్టం కలిగించే వస్తువును తీసేయడం, బిడియం కూడా విశ్వాసంలో భాగమే.

*(సహీ ముస్లిం : కితాబుల్ ఈమాన్, బాబ్ : బయాని అదది షోబిల్ ఈమాని)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇతర హదీసుల్లో జిహాద్‌నూ, లైలతుల్ ఖద్ర్‌లో చేసే ప్రార్థనలనూ, రంజాన్ నెల ఉపవాసాలనూ, తరావీహ్ నమాజు చదవడాన్నీ, మరియు ప్రతిరోజూ ఐదు సార్లు నమాజ్ సలుపడాన్నీ కూడా ఈమాన్ అని వివరించారు.

ఇంకో హదీసులో- అన్నింటికన్నా ఉత్తమ ఆచరణ ఏది? అని తన సహచరులు అడిగిన ప్రశ్నకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ - "అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నూ విశ్వసించడం" అని పలికారు. *(సహీ బుఖారి : 26)*

ఈమాన్ లో ఇమిడి వున్న ముఖ్య విషయం ఏమిటంటే - అది పెరుగుతూ తగ్గుతూ వుంటుంది. అల్లాహ్‌కు విధేయత చూపడం ద్వారా ఇది పెరిగితే, అతనికి అవిధేయత చూపడం ద్వారా తగ్గుతూ వుంటుంది.

"వారి సమక్షంలో అల్లాహ్ ఆయతులు పారాయణం చెయ్యబడినప్పుడు వారి విశ్వాసం పెరుగుతుంది". *(అన్‌ఫాల్ : 2)*







"తమ విశ్వాసానికి వారు అదనంగా యింకా విశ్వాసాన్ని పెంచుకోవాలని". *(ఫతహ్ : 4)*

"విశ్వసించిన వారి విశ్వాసాన్ని వాస్తవంగానే (అవతరించిన ప్రతి సూరా) పెంచింది". *(తౌబా : 124)*

".... దానిని విని వారి విశ్వాసం ద్విగుణీకృతమయ్యింది." *(ఆలి ఇమ్రాన్ : 173)*

"ఈ సంఘటన వారి విశ్వాసాన్నీ, వారి ఆత్మ సమర్పణను మరింత అధికం చేసింది." *(అహ్‌జాబ్ : 22)*

హంజలా (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో తను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర ఇలా విన్నవించుకున్నారు: ఓ దైవ ప్రవక్తా! మేము మీ సన్నిధిలో వున్నప్పుడు మీరు మాకు స్వర్గ నరక విశేషాలను గూర్చి వివరిస్తుంటే వాటిని మేము కళ్ళారా చూస్తున్నామా అన్న అనుభూతి కలుగుతూ వుంటుంది. కానీ మేము తిరిగి మా భార్యా పిల్లల దగ్గరికెళ్ళే సరికి వారి ధ్యాసలో మరియు ఇతర వ్యవహారాల్లో పడి చాలా విషయాలు మరిచి పోతూ వుంటాము. దీనికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ : నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తి స్వరూపుని సాక్షిగా! ఒక వేళ మీకు ఎల్లవేళలా నా సన్నిధిలో వున్నప్పుడు కలిగే అనుభూతే కలుగుతూ వుండి మీరు గనక అల్లాహ్‌ను జ్ఞాపకం వుంచుకుంటే (స్వయానా) దైవ దూతలు మీతో మీ పరుపుల మీద, మీరు దారిలో నడుస్తూ వున్నప్పుడు కరచాలనం చేస్తారు. (వాస్తవమేమిటంటే) ఓ సమయం ప్రాపంచిక వ్యవహారాల కోసమైతే మరో సమయం అల్లాహ్ ధ్యానం కోసం (ఈ మాటలు మూడు సార్లు పలికారు) అని హితవు పలికారు.

*(సహీ ముస్లిం : కితాబుత్తౌబా, బాబ్ : ఫజ్లి దవామిజ్జిక్రి వ జవాజి తర్కి జాలిక)*

పైన పేర్కొన్న రుజువుల ద్వారా ఈమాన్ అనేది ఎల్లప్పుడూ ఒకేలాగ వుండదనీ, అది పెరుగుతూ, తగ్గుతూ వుంటుందనీ స్పష్టంగా తెలుస్తోంది.

ఈమాన్ లో ఇమిడి వున్న మరో విషయం ఏమిటంటే అది అందరి మధ్య ఒకేలాగ వుండదు. వ్యక్తి వ్యక్తికీ మారుతూ వుంటుంది.

"ఇప్పుడు వారిలో ఒకడు తన ఆత్మకు అన్యాయం చేసుకుంటున్నాడు, మరొకడు మధ్యస్థంగా వుంటున్నాడు, ఇంకొకడు అల్లాహ్ అనుమతితో పుణ్యకార్యాల్లో ముందడుగు వేస్తున్నాడు." *(ఫాతిర్ : 22)*

జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఈమాన్ గురించి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు అడిగిన ప్రశ్నకు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) యిచ్చిన జవాబు యిది :

ఈమాన్ అంటే - అల్లాహ్‌నూ, ఆయన దూతలనూ, ఆయన గ్రంథాలనూ ఆయన ప్రవక్తలనూ, పరలోక దినాన్నీ మరియు విధివ్రాత, దాని మంచీ చెడులను విశ్వసించాలి.

ఈ విషయాన్నే ధృవ పరుస్తూ దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో, పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌నూ, అంతిమ దినాన్నీ, దూతలనూ, అల్లాహ్ అవతరింప జేసిన గ్రంథాన్నీ, ఆయన ప్రవక్తలనూ హృదయ పూర్వకంగా విశ్వసించటం." *(బఖర : 177)*

"మేము ప్రతి వస్తువునూ ఒక విధి నిర్ణయంతో పాటు సృష్టించాము". *(ఖమర్ : 49)*

వాస్తవానికి ఈ ఆరు విషయాలు విశ్వాసానికి మూల స్థంభాల లాంటివి. వీటిలో ఏది లోపించినా అతని విశ్వాసం అల్లాహ్ సన్నిధిలో స్వీకార యోగ్యం కాదు. అదీగాక, హృదయంలో విశ్వాసం పటిష్ఠంగా వున్నప్పుడే ఎవరైనా మనస్ఫూర్తిగా తదనుగుణంగా ఆచరించగలుగుతారు.

అల్లాహ్ యిష్టపడేది కూడా అదే.

యిక ఈ ఆరు విషయాలను గూర్చి వివరంగా తెలుసుకుందాం.

**1) అల్లాహ్‌ను విశ్వసించడం :**

అల్లాహ్‌ను విశ్వసించడమంటే, అల్లాహ్ ఉనికినీ, ఆయనకు ముందు ఎవరూ లేరనీ, ఆయన తర్వాత కూడా ఎవరూ లేరనీ, ఆయన ఏకత్వాన్నీ అంటే







రుబూబియత్, ఉలూహియత్, అస్మా వ సిఫాత్‌లలో ఒక్కడనీ, మనస్ఫూర్తిగా విశ్వసించడం అన్నమాట.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"భూమిలోనూ, ఆకాశాలలోనూ ప్రతి వస్తువూ అల్లాహ్ పవిత్రతను కొనియాడుతోంది. ఆయనే శక్తి మంతుడు, వివేక వంతుడూను. భూమ్యాకాశాల సామ్రాజ్యానికి ప్రభువు ఆయనే. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తున్నాడు, మరణాన్నీ కలిగిస్తున్నాడు, ప్రతి వస్తువుపై అధికారం కలిగి వున్నాడు. ఆయనే ఆరంభమూ, ఆయనే అంతమూ, ఆయనే బాహ్యమూ, ఆయనే గూఢమూ. ఆయనకు ప్రతి వస్తువును గురించి తెలుసు. ఆయనే ఆకాశాలనూ భూమినీ ఆరు దినాలలో సృష్టించాడు, తరువాత అధికార పీఠాన్ని (అర్ష్‌ను) అధిష్టించాడు. భూమి లోపలకు పోయేదీ, అందులో నుండి బయటకు వచ్చేదీ, ఆకాశం నుండి దిగేదీ, దాని లోపలికి ఎక్కేదీ అంతా ఆయన జ్ఞాన పరిధిలో వుంది. మీరు ఎక్కడ వున్నా ఆయన మీతో వున్నాడు. మీరు ఏ పని చేస్తూ వున్నా దానిని ఆయన చూస్తున్నాడు. ఆయనే భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి. సమస్త వ్యవహారాలూ నిర్ణయ నిమిత్తం ఆయన వైపునకే తీసుకుపోబడతాయి. ఆయనే రాత్రిని పగలులోకి, పగలును రాత్రిలోకి ప్రవేశింపజేస్తాడు. హృదయాలలో దాగి వున్న రహస్యాలను సైతం ఆయన ఎరుగును". *(హదీద్ : 1-6)*

"అల్లాహ్ - ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం ఆయన. ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుజ్ఞ లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? ప్రజల ముందు వున్న దానినీ ఆయన ఎరుగును, వారికి గుప్తంగా వున్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియ జెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయనకున్న జ్ఞాన విశేషాలలోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన రాజ్యాధికారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి వున్నది. వాటి సంరక్షణ ఆయనకు ఎంత మాత్రం అలసట కలిగించదు. ఆయనే సర్వాధికుడు, సర్వోత్తముడూను". *(బఖర : 255)*

"ఇలా చెప్పెయ్యి : ఆయన అల్లాహ్ - అద్వితీయుడు, అల్లాహ్ నిరపేక్షా పరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అవసరమూ లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు కూడా ఎవరూ లేరు."

*(ఇఖ్లాస్ : 1-4)*

## 2) దైవ దూతలను విశ్వసించడం :

దైవ దూతలు అగోచర విషయాలకు సంబందించిన వారు. వారు కూడా ఇతర సృష్టి రాసుల లాగ అల్లాహ్‌చే సృష్టించబడినవారు. గౌరవనీయులైన అల్లాహ్ దాసులు. అల్లాహ్ వీరిని మానవ బలహీనతలకు అతీతంగా, ఎల్లప్పుడూ అల్లాహ్‌ను ఆరాధించేవారుగా, సమస్త పాపాలకు దూరంగా చేసి కాంతితో సృష్టించాడు. విధి నిర్వహణలో తన ఆజ్ఞలకూ, ఆదేశాలకూ కార్యరూపం యిచ్చే అతి మహత్తరమైన బాధ్యతను అల్లాహ్ వీరిపై మోపాడు. దైవదూతలు కూడా ఈ విషయాల్లో గర్వానికి ఏ మాత్రం లోను కాకుండా అత్యంత వినయ విధేయతలతో అల్లాహ్‌ను ఆరాధిస్తూ, ఆయన ఇచ్చే ఆజ్ఞలకు శిరసావహించి తదనుగుణంగా వాటిని ఆచరణలో పెడుతూ వుంటారు.

"భూమిపైనా, ఆకాశాలలోనూ సృజింప బడినవన్నీ అల్లాహ్‌వే. ఆయన వద్ద ఉండే (దైవ దూతలు) వారు తమను తాము గొప్పవారుగా భావించుకొని ఆయన దాస్యాన్ని ధిక్కరించరు, బాధపడరు కూడా. రేయింబవళ్ళూ ఆయన స్తోత్రం చేస్తూనే వుంటారు, విశ్రమించరు." *(అంబియా : 19-20)*

"వారు (దైవదూతలు) అల్లాహ్ దాసులు, వారికి గౌరవం ఇవ్వబడింది. వారు ఆయన సాన్నిధ్యంలో ముందుకు వచ్చి మాట్లాడరు. కేవలం ఆయన ఆజ్ఞ ప్రకారమే నడుచుకుంటారు." *(అంబియా : 26-27)*

"నీ ప్రభువు సన్నిధిలో సన్నిహిత స్థానం కలిగి వుండే దైవ దూతలు ఎన్నడూ తమ గొప్పతనానికి గర్వపడి ఆయన ఆరాధనకు విముఖులు కారు. ఆయనను స్తుతిస్తూ వుంటారు. ఆయన ముందు సజ్దా చేస్తూ వినమ్రులై వుంటారు."

*(ఆరాఫ్ : 206)*







"వారు (దైవ దూతలు) ఎన్నటికీ అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించరు. వారు తమకు ఏ ఆజ్ఞ యిచ్చినా దానిని పాటిస్తారు." *(తహ్రీమ్ : 6)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు : దైవదూతలు కాంతితో సృష్టించబడ్డారు, జిన్నాతులు పొగలేని అగ్ని యొక్క మంటతో సృష్టించబడ్డారు మరియు ఆదమ్ (అలైహిస్సలాం) మీకిది వరకే (ఖురానులో) వివరించబడ్డ దానితో (అంటే మట్టితో)

*(సహీ ముస్లిం : కితాబుజ్జుహుద్, బాబ్ : ఫీ అహాదీసి ముతఫర్రిఖతిన్)*

ఇక వీరి సంఖ్యా విషయానికొస్తే - వీరి సంఖ్య కేవలం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసుల ద్వారా వీరి సంఖ్య చాలా ఎక్కువగానే వుందని అర్ధమవుతుంది.

మాలిక్ బిన్ సాసా (రజి అల్లాహు అన్హు) మేరాజ్ యాత్రను గురించి ఉల్లేఖించిన సుదీర్ఘమైన హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

(ఏడవ ఆకాశం దాటాక) అక్కణ్ణుంచి నన్ను 'బైతుల్ మామూర్' దగ్గరకు తీసుకెళ్ళడం జరిగింది. దాన్ని చూసి నేను - "ఇదేమిటి అని అడిగాను. జిబ్రయీల్ (అలైహిస్సలాం) జవాబిస్తూ : ఇదే బైతుల్ మామూర్ అని ఇక్కడ ప్రతిరోజూ డెబ్బై వేల మంది దైవదూతలు ప్రార్థన చేస్తారు. ఇలా ప్రార్థన చేసిన డెబ్బై వేల మంది దైవ దూతలు తిరిగి ప్రళయం రోజు వరకూ ఇక్కడ ప్రార్థన చేయ డానికి రాలేరు" అని వివరించారు. (అంటే వారి సంఖ్య అసంఖ్యాకంగా వున్నం దున ఏ ఒక్కరికీ ఇక్కడ రెండవ సారి ప్రార్థన చేసే అవకాశమే రాదన్నమాట)

*(సహీ బుఖారి : కితాబుల్ బద్‌యిల్ ఖల్ఖ్, బాబ్ : జిక్రుల్ మలాయిక)*

దైవదూతలను విశ్వసించడంలో ముఖ్యంగా మూడు అంశాలు ఇమిడి వున్నాయి. అవేమిటంటే :

1) దైవ దూతల ఉనికిని విశ్వసించడం
2) వారి గుణగణాలను విశ్వసించడం
3) వారు నిర్వహించే కార్యాలను విశ్వసించడం.

**దైవదూతల ఉనికిని విశ్వసించడం :**

దైవదూతల ఉనికిని విశ్వసించడమంటే - దైవదూతలు కూడా అల్లాహ్ సృష్టిలో అంతర్భాగమని విశ్వసించడం. వారిలో కొందరి పేర్లను అల్లాహ్ మనకు తెలియజేశాడు, కొందరి పేర్లను తెలుపలేదు.

వీరిలో జిబ్రయీల్ (అలైహిస్సలాం), మికాయీల్ (అలైహిస్సలాం), మాలిక్ (అలైహిస్సలాం) మరియు ఇస్రాఫీల్ (అలైహిస్సలాం) ప్రముఖులు.

**వారి గుణగణాలను విశ్వసించడం:**

వారి గుణగణాలను విశ్వసించడమంటే - అల్లాహ్ వారిని ఏయే విశేష గుణాలతోనయితే సృజించాడో వాటిని హృదయపూర్వకంగా విశ్వసించడం. అల్లాహ్ దైవదూతలను రెక్కలు కలవారుగా, ఆయన ఆజ్ఞానుసారం తమ రూపాలను మానవాకారంలోకి మార్చుకొనగలవారుగా, సమస్త పాపాలకు అతీతంగా సృజించాడు.

"అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన ఆకాశాలనూ, భూమినీ సృష్టించాడు. ఆయన దైవ దూతలను సందేశ హరులుగా నియమిస్తాడు. వారికి రెండేసి, మూడేసి, నాలుగేసి రెక్కలు వుంటాయి." *(ఫాతిర్ : 1)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం) ను ఆయన అసలు రూపంలో చూడగా ఆయనకు 600 రెక్కలు వున్నాయి.

*(సహీ బుఖారి:4856)*

అలాగే, దివ్యఖురానులో అల్లాహ్ మర్యమ్ (అలైహిస్సలాం), ఇబ్రాహీం (అలైహిస్సలాం) మరియు లూత్ (అలైహిస్సలాం) ల వృత్తాంతాలను వివరిస్తూ దైవదూతలు మానవాకారంలో వీరి దగ్గరకు రావడాన్ని ప్రస్తావించాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు కూడా 'హదీసే జిబ్రయీల్'లో వివరించబడిన విధంగా జిబ్రయీల్ (అలైహిస్సలాం) మానవాకారంలోనే విచ్చేశారు. ఆ మాటకొస్తే తన ఇరవై మూడేళ్ళ దౌత్య కాలంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం) ను ఆయన







అసలు రూపంలో కేవలం రెండు సార్లు మాత్రమే చూశారు.

*(సహీ బుఖారి : 4855)*

**వారు నిర్వహించే కార్యాలను విశ్వసించడం :**

దైవ దూతలు రాత్రింబవళ్ళూ అల్లాహ్ స్తోత్రంతో పాటు ఆయన ఆరాధన చేస్తూ వుంటారు. దీనికి వారు గర్వపడరు. ఏ మాత్రం అలసటనూ ప్రదర్శించరు. అయితే దివ్యఖురానునూ, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను క్షుణ్ణంగా అధ్యయనం చేస్తే కొన్ని ప్రత్యేక దైవదూతలను అల్లాహ్ కొన్ని ప్రత్యేక కార్యాల నిర్వహణ బాధ్యతలను అప్పగించి వున్నాడని అర్థమవుతుంది.

1) జిబ్రయీల్ (అలైహిస్సలాం) కు దైవ ప్రవక్త లందరి వద్దకూ 'వహీ'ని తీసుకెళ్ళే బాధ్యత.
2) మికాయీల్ (అలైహిస్సలాం) కు వర్షము, వివిధ వృక్షరాసుల బాధ్యత.
3) ఇస్రాఫీల్ (అలైహిస్సలాం) కు ప్రళయం ఆరంభానికి ముందూ, తిరిగి యావత్ మానవ జాతిని పునరుజ్జీవింప జేసేందుకు శంఖం పూరించే బాధ్యత.
4) మాలిక్ (అలైహిస్సలాం) మరియు ఆయన సహాయకులకు నరకవాసులను శిక్షించే బాధ్యత.
5) మలికుల్ మౌత్ మరియు ఆయన సహాయకులకు ప్రాణాలు తీసే బాధ్యత.
6) కిరాముల్ కాతిబూన్‌లకు ప్రజల ఆచరణలను రికార్డు చేసే బాధ్యత.
7) మున్కర్ నకీర్ లకు సమాధిలో ప్రశ్నించే బాధ్యత.
8) కొందరికి అర్ష్ ను మోసే బాధ్యత.
9) కొందరికి, తల్లుల గర్భాలలో బిడ్డ రూపం దాల్చిన పసిపిల్లల జాతకాన్ని వ్రాసే బాధ్యత.

10) కొందరికి, ధార్మిక సమావేశాలను సందర్శించి అక్కడ జరిగిన విశేషాలను (అల్లాహ్‌కు అంతా తెలిసి వున్నప్పటికీ) అల్లాహ్‌కు చేరవేసే బాధ్యత.

వీరేకాక, ఇంకా ఎందరో అసంఖ్యాకమైన దైవ దూతలు ఇతర కార్యాలలో నిమగ్నమై వుంటారు. వారి వాస్తవిక విషయాలు అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.

“నీ ప్రభువు సైన్యాలను స్వయంగా ఆయన తప్ప మరెవరూ ఎరుగరు.”
*(ముద్దస్సిర్ : 31)*

యిక దైవ దూతలను విశ్వసించడము వల్ల మనకు కలిగే ప్రయోజనాల విషయానికొస్తే- దైవ దూతల శక్తి సామర్థ్యాలను తెలుసుకోవడం ద్వారా మనం అల్లాహ్ గొప్పదనాన్నీ, ఆయన అధికారాలను, శక్తి సామర్థ్యాలను ఊహించవచ్చు. అంతే కాక, అల్లాహ్ వారిని మానవ మాత్రులను కనిపెట్టుకొని వుండే బాధ్యతను అప్పగించి, కొన్ని ప్రత్యేక ఆచరణలు చేసే వ్యక్తుల గురించి ప్రార్థన మరియు సిఫారసు చేసే అధికారాన్ని కూడా వారికి యిచ్చాడు.

దైవ దూతలు ప్రార్థించే వ్యక్తుల్లో - రాత్రి పడుకొనే ముందు వజూ చేసి, అల్లాహ్ ధ్యానం చేసి పడుకొనే వారు, మస్జిద్‌లో నమాజ్ కోసం వేచి చూసే వారు, నమాజ్‌లో మొదటి పంక్తిలో నిలబడేవారు, ప్రత్యక్షంగా తమ ముందు లేని తమ సోదరుణ్ణి గురించి ప్రార్థించే వారు, నమాజులో ఫాతిహా సూరా పఠించిన తర్వాత ఇమాం తో కలిసి బిగ్గరగా ఆమీన్ పలికేవారు, అనారోగ్యంతో వున్న రోగులను పరామర్శించేవారు కొందరు.

### 3) అల్లాహ్ గ్రంథాలను విశ్వసించడం :

అల్లాహ్ గ్రంథాలంటే - మానవాళి శ్రేయస్సు కొరకు వివిధ కాలాల్లో ఈ భూమిపైకి పంపబడిన దైవ ప్రవక్తలపై అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలు అన్నమాట.

“ప్రతి యుగానికీ ఒక గ్రంథం వున్నది.” *(రాద్ : 38)*

అల్లాహ్ గ్రంథాలను విశ్వసించడంలో నాలుగు అంశాలు ఇమిడి వున్నాయి.







1. అల్లాహ్ గ్రంథాలన్నీ, స్వయంగా అల్లాహ్ ఆకాశం నుండి తన ప్రవక్తలపై అవతరింపజేసిన సత్యగ్రంథాలనీ, ఏ ప్రవక్తా తన స్వహస్తాలతో లిఖించినవి కావని మనస్ఫూర్తిగా విశ్వసించాలి.

“ఇలా ప్రకటించండి: మేమంతా అల్లాహ్‌నూ, ఆయన మా వైపుకు పంపిన హితోపదేశాన్నీ విశ్వసించాము. ఇంకా ఇబ్రాహీము, ఇస్మాయీలు, ఇస్‌హాఖు, యాఖూబు, యాఖూబు సంతానంపై అవతరించిన దానినీ, మూసాకూ, ఈసాకు ఇతర ప్రవక్తలందరికీ వారి ప్రభువు ప్రసాదించిన దానినీ మేము విశ్వసించాము. వారిలో ఏ ఒక్కరి పట్లా మేము భేదభావం చూపము. మమ్మల్ని మేము ముస్లిములుగా అల్లాహ్‌కు సమర్పించుకున్నాము.” *(బఖర : 136)*

2. అల్లాహ్ మనకు తెలియజేసిన గ్రంథాలను విశ్వసిస్తూ, ఆయన తెలియజేయని గ్రంథాలను కూడా విశ్వసించాలి.

అంటే - జబూర్ దావూద్ (అలైహిస్సలాం) పై, తౌరాత్ మూసా (అలైహిస్సలాం)పై, ఇంజీలు ఈసా (అలైహిస్సలాం) పై మరియు ఆఖరిగా ఖురాను మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అవతరించిన గ్రంథాలని విశ్వసించాలి.

దివ్యఖురాన్‌లో అల్లాహ్ తౌరాతు నుద్దేశించి యిలా సెలవిచ్చాడు.

“మేము జీవితానికి సంబంధించిన ప్రతి రంగానికి కావలసిన హిత బోధనూ, ప్రతి వ్యవహారానికి సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకత్వాన్నీ శిలా ఫలకాలపై వ్రాసి మూసా (అలైహిస్సలాం)కు యిచ్చాము.” *(అరాఫ్ : 145)*

ఈసా (అలైహిస్సలాం) నుద్దేశించి యిలా అన్నాడు :

“మేము ఆయనకు ఇంజీలును ప్రసాదించాము”. *(మాఇద : 46)*

దావూద్ (అలైహిస్సలాం) నుద్దేశించి యిలా సెలవిచ్చాడు :

“మేము దావూదు (అలైహిస్సలాం)కు జబూర్‌ను ప్రసాదించాము”.
*(నిసా : 163)*

యిక దివ్యఖురాను నుద్దేశ్యించి యిలా సెలవిచ్చాడు :

“ప్రవక్తా ! నీపై తాను అవతరింపజేసిన దానిని (ఖురానును) తన జ్ఞానంతో అవతరింప జేశానని అల్లాహ్ సాక్ష్యమిస్తున్నాడు. దీనికి దైవదూతలు కూడా సాక్షు

లుగా వున్నారు, అల్లాహ్ సాక్షిగా ఉండటమే సరిపోయినప్పటికీ." *(నిసా : 116)*

వీటితో పాటు అల్లాహ్ మనకు తెలియజేయని ఇతర ప్రవక్తలపై అవతరించిన గ్రంథాలను కూడా విశ్వసించాలి.



3. దివ్యఖురానును 'అల్ ఫుర్ఖాన్ (సత్యాసత్యాలను వేరు పరచి చూపే గ్రంథం) అని అల్లాహ్ సెలవిచ్చాడు. కనుక దివ్య ఖురానులో ప్రస్తావించబడిన ఏ విషయమైనా ఇతర గ్రంథాల ద్వారా కూడా ధృవీకరించబడితే, అలాంటి విషయాలను మాత్రం మానవ స్వరచనలతో భ్రష్టు పట్టకుండా ఇప్పటికీ సురక్షితంగా వున్న సత్య విషయాలు అని విశ్వసించడం.

దివ్యఖురాను తప్ప మిగతా గ్రంథాలన్నీ మానవుల స్వరచనలతో మిళితమై పోయి భ్రష్టుపట్టి పోయాయి. కానీ అంతిమ దైవ గ్రంథమైన ఖురాను విషయంలో అలా జరగలేదు. అది సాధ్యం కూడా కాజాలదు. కారణం దివ్యఖురాను సంరక్షణ బాధ్యతలను అల్లాహ్ స్వయంగా తనపై వేసుకున్నాడు.

"ఈ జ్ఞాపిక (జిక్ర్) ను మేమే అవతరింప జేశాం. స్వయంగా మేమే దీనిని రక్షిస్తాము." *(హిజ్ర్ : 9)*

4. అంతిమ దైవ గ్రంథమైన ఖురాను అవతరించిన తరువాత, యిక అన్ని గ్రంథాలను వదిలి కేవలం ఖురాను ఆదేశాలను మాత్రమే ఆచరణలో పెట్టడం.

దివ్య ఖురాను నుద్దేశ్యించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

" అతనిని (దైవప్రవక్తను) విశ్వసించి, సమర్థించి, అతనికి సహకరించి, అతనితో అవతరింపజెయ్యబడిన జ్యోతి(దివ్యఖురాన్)ని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందుతారు." *(ఆరాఫ్ : 157)*

"ప్రవక్తా! మేము నీ వద్దకు పంపిన ఈ గ్రంథం సత్యాన్ని తీసుకు వచ్చింది. తనకు ముందు వున్న గ్రంథాన్ని ధృవీకరిస్తుంది, దానిని పరిరక్షిస్తుంది." *(మాఇద : 48)*

"మేము ఈ గ్రంథాన్ని నీపై ఎందుకు అవతరింప జేశామంటే వారు గురి



దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

అయిన విభేదాల యధార్థాన్ని నీవు వారికి స్పష్టం చేయాలని, ఈ గ్రంథం తనను విశ్వసించే వారికొరకు మార్గదర్శకత్వంగానూ, కారుణ్యంగానూ అవతరించింది." *(నమ్ల్ : 64)*

అంటే - ఇతర గ్రంథాలను మానవులు తమ స్వరచనలతో కలిపి భ్రష్టు పట్టించడం వల్ల ఖురాన్ వాటిలోని అసత్యాలను ఎత్తి చూపుతూ సత్యసందేశాలను తీసుకొని అంతిమ దైవ గ్రంథంగా అవతరించింది.

అందుకే యిక ప్రళయం వచ్చే వరకు కేవలం దివ్య ఖురానులోని ఆదేశాలకు లోబడే జీవితం సాగించవలసి వుంటుంది.

యిక దైవ గ్రంథాలను విశ్వసించడం ద్వారా కలిగే ప్రయోజనాలేమిటంటే - తన దాసులంటే అల్లాహ్‌కు ఎంత ప్రేమో, వారి గురించి ఆయన ఎంత శ్రద్ధ తీసుకుంటాడో మనం గ్రహించవచ్చు. తద్వారా అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ జీవితం సాగించి అల్లాహ్ మెప్పును పొందవచ్చు.

## 4) దైవ ప్రవక్తలను విశ్వసించడం :

ఈ పుడమిపై మానవులకు మార్గదర్శకత్వం కోసం వివిధ కాలాల్లో వారి వారి జాతులలో నుండే ఒక వ్యక్తిని తన ప్రవక్తగా ఎన్నుకొని అల్లాహ్ తన ధర్మాన్నీ సందేశాలనూ అతనిపైకి అవతరింపజేశాడు. తద్వారా ఆ జాతికి మార్గ దర్శకత్వం చూపాడు.

యిలా ప్రతి జాతిలోకీ ఒక ప్రవక్త 'అల్లాహ్‌ను ఆరాధించండి, మిధ్యా దేవుళ్లకు దూరంగా వుండండి' అన్న సందేశం తీసుకొని పంపబడ్డాడు. వారిపై కేవలం అల్లాహ్ ఆదేశాలను స్పష్టంగా అందజేసే బాధ్యత తప్ప మరొక బాధ్యత వుండేది కాదు.

"మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింప జేశాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేశాము. అల్లాహ్‌ను ఆరాధించండి, మిధ్యా దైవాల ఆరాధనకు దూరంగా వుండండి." *(నమ్ల్ : 36)*

"విషయాన్ని స్పష్టంగా అందజేసే బాధ్యత తప్ప మరొక బాధ్యత కూడా ప్రవక్తలపై వుందా?" *(నహ్ల్ : 35)*

దైవప్రవక్తలంతా మానవమాత్రులే. వారు మానవ బలహీనతలకు అతీతులేం కాదు. అయితే అల్లాహ్ వారిని దైవ దౌత్య పదవి కోసం ఎన్నుకొని వారికి రుజుమార్గం చూపించాడు. తమ దౌత్య పదవి రీత్యా, తమ భక్తి ప్రపత్తుల రీత్యా వారు అల్లాహ్‌కు అత్యంత ప్రియమైన వారయి వున్నారు. అంతేకానీ, వారు స్వతహాగా తమంతట తాము ఏ సూచనను తేగలిగే శక్తిని కలిగి వుండరు. కేవలం అల్లాహ్ వారికి ప్రసాదించినది తప్ప.

"వారి ప్రవక్తలు వారితో ఇలా అన్నారు : నిజంగానే మేము మీ వంటి మానవులం తప్ప మరేమీ కాము. కానీ అల్లాహ్ తన దాసులలో తాను అనుగ్రహిం చదలిచిన వారిని అనుగ్రహిస్తాడు. ఏదైనా ప్రమాణాన్ని తెచ్చి మీకు యివ్వటం అనేది మా అధికారంలో లేదు. ప్రమాణం అనేది అల్లాహ్ అనుమతి తోనే రాగలుగుతుంది. విశ్వాసులు అల్లాహ్‌నే నమ్ముకోవాలి." *(ఇబ్రాహీం : 11)*

యిక దైవ ప్రవక్తలను విశ్వసించడంలో ఇమిడి వున్న అంశాలను గూర్చి తెలుసుకుందాం:

1. అల్లాహ్ చే పంపబడ్డ సమస్త సందేశహరులలో ఏ మాత్రం భేద భావం చూపకుండా అందర్నీ విశ్వసించడం.

"మేము అల్లాహ్ పంపిన ప్రవక్తలలోని ఏ ఒక్కరినీ భేదభావంతో చూడము. మేము ఆదేశం విన్నాము. శిరసా వహించాము." *(బఖర : 285)*

"అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తలనూ తిరస్కరించేవారూ, అల్లాహ్, ఆయన ప్రవక్తల మధ్య భేదభావం చూపేవారూ, మేము కొందరిని విశ్వసిస్తాము, మరికొం దరిని విశ్వసించము' అని అనేవారూ, అవిశ్వాస విశ్వాసాల మధ్య ఒక కొత్త మార్గాన్ని కనిపెట్టాలనే ఉద్దేశ్యం కలవారూ - వారందరూ పరమ అవిశ్వాసులే. అటువంటి అవిశ్వాసుల కొరకు మేము అత్యంత అవమానకరమైన శిక్షను సిద్ధం చేసి వుంచాము. దీనికి భిన్నంగా అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తలందరినీ విశ్వసించి, వారి మధ్య భేదభావం చూపని వారికి మేము వారి ప్రతిఫలాన్ని తప్పక ప్రసాది స్తాము. అల్లాహ్ అధికంగా మన్నించేవాడూ, అనన్యంగా కరుణించేవాడూను".

*(నిసా : 150-152)*







అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రకటించారు : నేను విశ్వసించాను అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తలనూ."

*(సహీ ముస్లిం : కితాబుల్ ఫితన్, బాబ్ జిక్రి ఇబ్నె సయ్యాద్)*

దైవ ప్రవక్తలలో ఏ ఒక్కరిని తిరస్కరించినా అందర్నీ తిరస్కరించినట్లు అవుతుంది.

"నూహ్ జాతి వారు దైవ ప్రవక్తలను తిరస్కరించారు."

*(అష్ షుఅరా : 105)*

మరి చూడబోతే వారు కేవలం నూహ్ (అలైహిస్సలాం) ను మాత్రమే తిరస్కరించారు. కానీ అల్లాహ్ వారిని సమస్త దైవ ప్రవక్తలను తిరస్కరించారని ధృవీకరించాడు.

2. అల్లాహ్ తెలియజేసిన ప్రవక్తలను విశ్వసిస్తూ ఆయన తెలియజేయని ప్రవక్తలను కూడా విశ్వసించడం.

"ఓ ప్రవక్తా! నీకు పూర్వం మేము ఎంతో మంది ప్రవక్తలను పంపాము. వారిలో కొందరి పరిస్థితులను నీకు తెలిపాము, కొందరిని గురించి తెలుపలేదు."

*(మూమిన్ : 78)*

అల్లాహ్ ప్రభవింపజేసిన సందేశహరులలో నూహ్ (అలైహిస్సలాం) మొదటి వారు కాగా మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) చివరి వారు.

"ఆయన నూహ్ ప్రవక్తకు ఆజ్ఞాపించిన ధర్మాన్నే నీకు కూడా నిర్ణయిం చాడు. దానినే ఇప్పుడు నీ వైపుకు మేము వహీ ద్వారా పంపాము. దానినే మేము ఇబ్రాహీము (అలైహిస్సలాం)కూ, మూసా (అలైహిస్సలాం)కూ, ఈసా (అలైహిస్సలాం) కూ బోధించాము. ఈ ధర్మాన్ని స్థాపించండి అనీ, దానిని గురించి విభేదాలకు లోనుకాకండి అనీ తాకీదు చేస్తూ." *(షూరా : 13)*

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో ప్రళయ దినాన ప్రజలు ఆదమ్ (అలైహిస్సలాం) దగ్గరకి సిఫారసు కోసం వెళ్ళినప్పుడు ఆయన ఇలా అంటారని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెలియజేశారు:

"నేను విశ్వ ప్రభువు సన్నిధిలో మీ కొరకు సిఫారసు చేసేటంతటి వాణ్ణి కాను. మీరు నూహ్ (అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళండి. ఆయన అల్లాహ్ ప్రభవింప జేసిన సందేశహరులలో మొట్టమొదటి వారు." *(సహీ బుఖారి: 6565)*

"మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మీలోని ఏ పురుషునికీ తండ్రికారు. కానీ ఆయన అల్లాహ్ ప్రవక్త. దైవ ప్రవక్తల పరంపరను సమాప్తం చేసే చివరి వారు. అల్లాహ్ సకల విషయాల జ్ఞానం కలవాడు."

*(అహ్'జాబ్ : 40)*

అల్లాహ్ తెలియజేసిన ప్రవక్తల్లో ఐదుగురు ముఖ్యమైన వారు.

"ఓ ప్రవక్తా! మేము దైవ ప్రవక్తలందరితో చేయించిన వాగ్దానాన్ని జ్ఞాపక ముంచుకో, నీతో కూడా (చేయించాము) మరియు నూహ్ (అలైహిస్సలాం), ఇబ్రహీం (అలైహిస్సలాం), మూసా (అలైహిస్సలాం), ఈసా (అలైహిస్సలాం)తో కూడా (చేయించాము)". *(అహ్'జాబ్ : 7)*

3. దైవ ప్రవక్తలంతా తమపై మోపబడిన దౌత్య బాధ్యతను సక్రమంగా నిర్వహించారని విశ్వసించడం.

4. మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అంతిమ దైవ ప్రవక్త అయినందున మరియు ప్రళయం వరకు యిక ఏ ప్రవక్తా రాడు గనక సమస్త విశ్వాస, ఆచరణలలో, జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలోనూ ఆయనను ఆదర్శంగా తీసుకొని, ఆయనకు విధేయత చూపుతూ ఆయన సున్నత్ ప్రకారం జీవితాన్ని కొనసాగించడం.

యిక దైవ ప్రవక్తలను విశ్వసించడం ద్వారా కలిగే ప్రయోజనమేమిటంటే మానవులంటే అల్లాహ్‌కు ఎంత ప్రేమో, వారి మానాన వారిని వదిలిపెట్టకుండా, వారికి రుజుమార్గం చూపడానికి ఆయన ఎంత తాపత్రయపడతాడో మనం గ్రహిం చవచ్చు. తద్వారా ఆయనకు కృతజ్ఞతలు తెలిపే దాసులుగా జీవితం గడిపి ఇహపరలోకాల్లో సాఫల్యం పొందవచ్చు.

## 5) పరలోక దినాన్ని విశ్వసించడం :

పరలోక దినమంటే మానవులందర్నీ పునరుజ్జీవింప జేసి, వారి కర్మలను







గురించి విచారణ జరిపి, వాటికనుగుణంగా స్వర్గ బహుమానాలు కానీ లేక నరక యాతన గానీ వారికి ప్రసాదించే దినం. ఆ తర్వాత స్వర్గ వాసులంతా శాశ్వతంగా స్వర్గంలోనూ, నరకవాసులంతా శాశ్వతంగా నరకంలోనూ వుండి పోతారు. యిక వారికి మరణం అనేది సంభవించదు. యీ విషయాలన్నిటినీ మనస్ఫూర్తిగా విశ్వసించాలి.

అయితే ఇది ఎప్పుడు సంభవిస్తుందో అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియదు.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నిశ్చయంగా ప్రళయ గడియ తప్పకుండా వస్తుంది. అది వచ్చే విషయం గురించి ఏ మాత్రం సందేహం లేదు. కానీ చాలా మంది నమ్మరు".

*(మూమిన్ : 59)*

"మీకు ఏ విషయం గురించి వాగ్దానం చేయబడుతోందో అది సత్యం. కర్మలకు ప్రతిఫలం లభించటం అనే పని తప్పకుండా జరుగవలసి వున్నది."

*(జారియాత్ : 5-6)*

"ఆ ఘడియకు సంబందించిన జ్ఞానం అల్లాహ్ వద్ద మాత్రమే వున్నది."

*(లుఖ్మాన్ : 34)*

యిక పరలోక దినాన్ని విశ్వసించడంలో ఇమిడి వున్న అంశాలను గూర్చి తెలుసుకుందాం.

పరలోక దినాన్ని విశ్వసించడమంటే - మరణాన్నీ, సమాధిలో ప్రశ్నించబడ టాన్నీ, సమాధిలో దొరికే బహుమానాలు లేక శిక్షలు, శంఖం పూరించబడటం, మానవులంతా సమాధులలో నుండి పునరుజ్జీవులై ఒక చోట సమీకరించబడటం, కర్మల విచారణ, నరకంపై వున్న పుల్ సిరాత్ వంతెన, కౌసర్ సరస్సు, సిఫారసు, ఆఖరుగా స్వర్గ నరకాలు - ఇవన్నీ సత్యమని మనస్ఫూర్తిగా విశ్వసించడం.

### మరణం:

మరణాన్ని గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"మీపై నియమించబడిన మృత్యుదూత మిమ్మల్ని పూర్తిగా కైవసం

చేసుకుంటాడు. తరువాత మీరు మీ ప్రభువు వైపునకు మరలింపబడి తీసుకు పోబడతారు." *(సజ్దా : 11)*

"ప్రతి మనిషీ మరణిస్తాడు. మీరంతా మీ పూర్తి ప్రతిఫలాన్ని ప్రళయం నాడు పొందుతారు." *(ఆలి ఇమ్రాన్ : 185)*

**సమాధి విచారణ - బహుమానాలు, శిక్షలు :**

సమాధి జీవితాన్ని గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"ఈ (మరణించేవారి) అందరి వెనుక ఒక గోడ (బర్‌జఖ్) అడ్డంగా వున్నది. అది మరొక జీవితం వచ్చే వరకు వుంటుంది." *(మూమినూన్ : 100)*

"ఈ దుర్మార్గులు మరణ వేదనలో మునిగితేలుతూ వుండగా దైవదూతలు తమ హస్తాలను చాపి - ఇటు తెండి! బయటకు తియ్యండి మీ ప్రాణాలను, అల్లాహ్ పై అపనింద మోపి అన్యాయంగా కూసిన కూతలకూ, ఆయన ఆయతుల పట్ల తలబిరుసుతనం ప్రదర్శించినందుకూ ఫలితంగా ఈ రోజు మీకు అవమాన కరమైన శిక్ష విధించబడుతుంది అని అంటూ వుండగా ఆ దృశ్యాన్ని నీవు చూడగలిగితే ఎంత బాగుంటుంది!" *(అన్ ఆమ్ : 93)*

బారా బిన్ ఆజిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు : ఖురానులోని "ఒక స్థిరమైన వాక్కు ఆధారంగా ఇహలోకం లోనూ పరలోకం లోనూ విశ్వాసులకు అల్లాహ్ నిలకడను ప్రసాదిస్తాడు." (14:11) అన్న దైవ సూక్తి సమాధి శిక్షను వివరిస్తూ అవతరించింది. (సమాధిలో) మృతునితో "నీ ప్రభువు ఎవరు? అని అడగబడుతుంది. దానికతడు అల్లాహ్ నా ప్రభువు మరియు నా ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అని జవాబిస్తాడు. పై ఆయతుకు వివరణ యిదే."

*(సహీ ముస్లిం : కితాబుల్ జన్న వసిఫతి, బాబ్ : అర్జిల్ మక్ అది అలల్ మయ్యతి వ అజాబిల్ ఖబ్రి)*

ఇతర హదీసుల్లో "నీ ధర్మం ఏది?" అని కూడా ప్రశ్నించబడతాడని వచ్చింది. పై హదీసులో స్థిర వాక్కు అంటే 'లా ఇలాహ ఇల్లల్లాహ్, మహమ్మదు ర్రసూలుల్లాహ్' అని తెలుస్తూనే వుంది. అయితే కేవలం విశ్వాసులు మాత్రమే పై ప్రశ్నలకు సరియైన సమాధానం యివ్వగలుగుతారు. దానికి వారి సమాధి







విశాలం గావింపబడుతుంది. ముష్రిక్కులు, కపట విశ్వాసులు అక్కడ సరియైన సమాధానం యివ్వలేరు. ఫలితంగా వారు ప్రళయం రోజు వరకు సమాధిలో శిక్షించబడుతుంటారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు. "మీరు మీ మృతుల్ని ఖననం చేయడం మానేస్తారేమో అన్న సంకోచం నాకు వుండకపోతే నేను అల్లాహ్‌తో సమాధి శిక్షను మీకు వినిపించమని ప్రార్థించేవాణ్ణి."

*(సహీ ముస్లిం : కితాబుల్ జన్న వ సిఫతి, బాబ్ : ఆర్జిల్ మక్ అది అలల్ మయ్యతి వ అజాబిల్ ఖబ్రి)*

మృతునికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం (సమాధిలో) అతని నివాసాన్ని చూపించటం జరుగుతూ వుంటుంది.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు. 'మీలో ఎవరైనా చనిపోతే అతనికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అతని నివాసాన్ని చూపించటం జరుగుతుంది. మృతుడు గనక స్వర్గవాసి ఐతే అతనికి స్వర్గంలోని తన నివాసాన్ని, నరకవాసి అయితే నరకంలోని తన నివాసాన్ని చూపించటం జరుగుతుంది. అతనితో, ఇది నీ నివాస స్థలం, ప్రళయం రోజు అల్లాహ్ నీకు ఇక్కడికే చేరుస్తాడు' అని అతనితో చెప్పబడుతుంది.

*(సహీ ముస్లిం : కితాబుల్ జన్న వ సిఫతి, బాబ్ : అర్జిల్ మక్ అది అలల్ మయ్యతి వ అజాబిల్ ఖబ్రి)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా ప్రతి నమాజ్‌లోనూ సమాధి శిక్ష నుండి అల్లాహ్‌ను శరణు వేడుకొనే వారు.

దురదృష్ట వశాత్తూ నేటి ముస్లిం సమాజంలో కొందరు సమాధి శిక్షను తిరస్కరిస్తున్నారు. ఇలా చేసి వారు అల్లాహ్‌నూ ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)నూ బాహాటంగా తిరస్కరిస్తున్నారు. ఇలాంటి వారు అల్లాహ్‌కు భయపడాలి.

**పునరుత్థాన దినము - కర్మల విచారణ :**

పునరుత్థాన దినమును గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మానవులారా! మీకు మరణానంతర జీవితం గురించి ఏదైనా సందేహం వుంటే మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి. మేము మిమ్మల్ని మట్టితో సృష్టించాము, తర్వాత వీర్యబిందువుతో, ఆ తర్వాత నెత్తుటి గడ్డతో, ఆపై మాంసపు కండతో, అది రూపం కలదిగానూ రూపం లేనిదిగానూ ఉంటుంది. (మేము ఈ విషయాన్ని) మీకు యథార్థం ఏమిటో స్పష్టం చెయ్యాలని (తెలుపుతున్నాము). మేము కోరిన (వీర్య బిందువు) దానిని ఒక ప్రత్యేక కాలం వరకు మాతృ గర్భాలలో నిలిపి వుంచుతాము. తరువాత మిమ్మల్ని ఒక శిశువు రూపంలో బయటకు తీస్తాము, మీరు నిండు యౌవన దశకు చేరటానికి. మీలో ఒకడు ముందుగానే వెనుకకు పిలుచుకోబడతాడు, మరొకడు అతి నికృష్టమైన వయస్సు వైపునకు మరలింపబడతాడు, అంతా తెలిసిన తర్వాత కూడా ఏమీ తెలియకుండా ఉండటానికి. ఎండిపోయిన నేలను మీరు చూస్తున్నారు. తర్వాత మేము దానిపై వర్షం కురిపించగానే అకస్మాత్తుగా అది పులకరిస్తుంది మరియు ఉబుకుతుంది. ఇంకా అన్ని రకాల మనోహరమైన మొక్కలను మొలకెత్తించటం ప్రారంభిస్తుంది. దీనికంతటికీ కారణం అల్లాహ్‌యే సత్యం కావడం, ఆయన మృతులను బ్రతికించటం మరియు ప్రతిదానిపై అధికారం కలిగి వుండటం. ఇంకా ఏమిటంటే ప్రళయ ఘడియ తప్పకుండా వచ్చి తీరుతుంది. ఇందులో ఏ అనుమానానికీ ఆస్కారం లేదు. గోరీలలోకి వెళ్ళిపోయిన వారిని అల్లాహ్ తప్పకుండా లేపుతాడు."

*(హజ్ : 5-7)*

"ఏమిటీ, నేను చనిపోయిన తర్వాత మళ్ళీ నన్ను బ్రతికించటం నిజంగానే జరుగుతుందా? అని అంటాడు మనిషి. అసలు అతడు ఏమీ కానపుడే మేము అతనిని సృష్టించామన్న విషయం అతడికి జ్ఞాపకం రావటం లేదా? నీ ప్రభువు సాక్షిగా! మేము వారందరినీ, వారితో పాటు షైతానులను కూడా పోగు చేస్తాము".

*(మర్యమ్ : 66-68)*

"ఆ రోజున శంఖం పూరించ బడుతుంది. ఆకాశాలలో, భూమిలో వున్న వారంతా చచ్చి పడిపోతారు, అల్లాహ్ సజీవంగా వుంచదలుచుకున్నవారు తప్ప. తరువాత రెండోసారి శంఖం పూరించబడుతుంది. అప్పుడు ఒక్కసారిగా అందరూ లేచి చూడటం ప్రారంభిస్తారు. భూమి తన ప్రభువు తేజస్సుతో వెలిగిపోతుంది.







కర్మల చిట్టా తీసుకు రాబడుతుంది. దైవ ప్రవక్తలూ, సాక్షులూ అందరూ హాజరు పరచబడతారు. ప్రజలకు సరిగ్గా న్యాయంగా తీర్పు చేయబడుతుంది. వారికి ఎలాంటి అన్యాయమూ జరుగదు. ప్రతి ఆత్మకూ అది చేసుకున్న కర్మల ప్రకారం పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ప్రజలు చేస్తున్నదంతా అల్లాహ్‌కు తెలుసు.

*(జుమర్ : 68-70)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు :

ప్రజలారా! మీరంతా (ప్రళయం నాడు) నగ్నంగా, సున్నతి చేసుకోని స్థితిలో సమావేశ పరచబడతారు. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - 'మేము మొదట్లో సృష్టిని చేసినట్లే మళ్ళీ దానిని చేస్తాము. ఇది మాపై బాధ్యతగా వున్న ఒక వాగ్దానం. ఈ పనిని ఎలాగైనా చేయవలసే వున్నది.' (21:104) అన్న సూక్తి పఠించారు.

బాగా తెలుసుకోండి! తీర్పు దినం నాడు అందరి కంటే ముందు ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారికి బట్టలు తొడిగించడం జరుగుతుంది.

*(సహీ ముస్లిం : కితాబుల్ జన్న వ సిఫతి, బాబ్ : ఫనాయిద్దునియా వ బయానిల్ హషరి యౌమిల్ ఖియామహ్)*

దీనిపై ఆయెషా (రజి అల్లాహు అన్హా) (ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ) ఓ దైవ ప్రవక్తా ! 'మగవాళ్ళు, ఆడవాళ్ళు నగ్నంగా ఒకే చోట సమావేశమైతే ఒకర్నొకరు చూసుకోరా?' అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ- 'ఆ సమయంలో ప్రజలు తీవ్రమైన ఆందోళనకు గురై ఒకర్నొకరు కనీసం చూసుకొనే స్థితిలో కూడా వుండరు' అని పలికారు.

*(సహీ ముస్లిం : కితాబుల్ జన్న వ సిఫతి, బాబ్ : ఫనాయిద్దునియా బయానిల్ హషరి యౌమిల్ ఖియామహ్)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం). "ఆ రోజున ప్రజలందరూ సకలలోకాల ప్రభువు సమక్షంలో నిలబడతారు" అన్న (83:6) దైవ సూక్తి పై వ్యాఖ్యానిస్తూ : ప్రజలు సకల లోకాల ప్రభువు ముందు తమ కర్మల విచారణ కొరకు నిలబడే రోజు

చెమటలో తమ చెవుల వరకు మునిగి వుంటారు అని తెలియజేశారు.

*(సహీ బుఖారి : 4938)*

"ప్రజలు తమ కర్మలను చూసుకునేందుకు గాను, ఆ రోజున భిన్న పరిస్థితుల్లో అల్లాహ్ వైపునకు మరలుతారు. ఆ తరువాత ఎవడైనా రవ్వంత సత్కార్యం చేసి వున్నా సరే దాన్ని అతను చూసుకుంటాడు. అలాగే ఎవడైనా రవ్వంత దుష్కార్యం చేసి వున్నా సరే దాన్ని అతను చూసుకుంటాడు."

*(జిల్‌జాల్ : 6-8)*

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

'తీర్పు దినం రోజు అల్లాహ్ ఎవడి దగ్గర్నుండైనా లెక్క తీసుకుంటే యిక వాడు వినాశం పాలైనట్లే'. దీనికి ఆయెషా (రజి అల్లాహు అన్హ) మాట్లాడుతూ - మరి అల్లాహ్ 'అతని నుండి తేలిక పాటి లెక్క తీసుకో బడుతుంది *(84 :8)* అని సెలవిచ్చాడుగా' అని విన్నవించుకున్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ - 'తేలికపాటి లెక్క అంటే వాళ్ళు కేవలం హాజరు పరచ బడతారు. (కానీ వారిని లెక్కతీసుకోకుండానే వదిలేయడం జరుగుతరింది) కానీ ఎవడి దగ్గర్నుండైతే లెక్క తీసుకుంటాడో వాడు వినాశం పాలైనట్లే' అని వివరించారు. *(సహీ బుఖారి : 4939)*

## పుల్ సిరాత్ :

దీనిని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"మీలో నరకం దరిదాపులకు పోనివాడెవడూ లేడు. ఇది ఒక నిర్ణీత విషయమే దానిని నెరవేర్చటం నీ ప్రభువు బాధ్యత. తర్వాత మేము (ప్రపంచంలో) భయభక్తులు కలిగి వున్న వారిని రక్షిస్తాము. దుర్మార్గులను అందులో (నరకం) వారు పడి వున్న స్థితిలోనే విడిచి పెడతాము." *(మర్యమ్ : 71-72)*

పుల్ సిరాత్ వంతెన నరకం పైన నిర్మించ బడివుంది. ప్రతి ఒక్కరికీ ఆ వంతెనను దాటవలసి వుంటుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులను పరిశీలిస్తే మనుషులు తమ తమ విశ్వాస ఆచరణలను బట్టి కొందరు మెరుపు







వేగంతో దాన్ని దాటిపోతే, కొందరు వాయువేగంతో, కొందరు మెల్ల మెల్లగా, కొందరు గాయాలతో దాటిపోగా మరి కొందరు మాత్రం వంతెన క్రిందనే వున్న నరకంలో పడిపోతారని తెలుస్తుంది. అలాగే అది వెంట్రుక కన్నా సన్నగా, ఖడ్గం కన్నా పదునుగా వుంటుంది.

## కౌసర్ సరస్సు :

కౌసర్ సరస్సు గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"ప్రవక్తా! మేము నీకు కౌసర్‌ను ప్రసాదించాము." *(కౌసర్ : 1)*

కౌసర్ అనేది ఒక సరస్సు. ప్రళయం రోజు ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు అల్లాహ్ తరపు నుండి ప్రసాదించబడుతుంది. అతి దాహం తో గొంతెండి పోయే ఆ సమయంలో ఒకసారి కౌసర్ జలాన్ని సేవిస్తే యిక శాశ్వతంగా దాహం వేయదు.

జున్దుబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు.

"నేను కౌసర్ వద్ద మీకు ముందుగా వెళ్ళి (మీ కోసం) ఎదురు చూస్తుం టాను".

*(సహీహ్‌ముస్లిం : కితాబుల్ ఫజాయెల్, బాబ్ : ఇజ్‌బాతి హౌజి నబీయ్యనా (సల్లల్లాహు అలైహి వసల్లం))*

## సిఫారసు :

యిక సిఫారసు విషయానికొస్తే, ప్రామాణిక హదీసుల ద్వారా తెలిసే దేమిటంటే - ముందు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), తర్వాత ఇతర ప్రవక్తలు, దైవ దూతలు, విశ్వాసులు, చివరికి దివ్యఖుర్‌ఆన్- తనను పఠించిన వారి గురించి, రోజా(ఉపవాసం)- తనను పాటించిన వారిగురించి సిఫారసు చేస్తారు. అయితే వీరంతా అల్లాహ్ అనుమతి యిచ్చిన తరువాతనే యీ పని చేయగలరు.

"ఆయన అనుమతి ఇస్తే తప్ప ఎవడూ సిఫారసు చేయలేడు".

*(యూనుస్ : 3)*

ఆఖరికి అల్లాహ్ కూడా తన పిడికిలి నిండా మానవుల్ని పట్టుకొని నరకం నుండి బయటకు తీస్తాడు. వారు తమ జీవితాల్లో ఒక్క మంచి పని కూడా చేసి వుండరు.

అయితే కేవలం ఏకదైవారాధకుల గురించే (వారి ఇతర పాపాలమన్నింపు నిమిత్తం) ఎవరైనా సిఫారసు చేస్తారన్న విషయాన్ని మనం గ్రహించాలి. షిర్క్ చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు గనక వారి గురించి ఏవరూ సిఫారసు చేయరు.

"ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేశాడు. వారి నివాసం నరకం. అటువంటి దుర్మార్గులకు సహాయంచేసే వాడెవ్వడూ లేడు". *(మాఇద : 72)*

**స్వర్గము - నరకము:**

స్వర్గ నరకాల ఉనికిని గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

"స్వర్గం భూమ్యాకాశాల అంత విశాలమైనది. అది భయ భక్తులు కలవారి కొరకు తయారు చేయబడింది." *(అలి ఇమ్రాన్ : 133)*

"తరువాత మరొకసారి అతను 'సిద్‌రతుల్ మున్తహా' వద్ద ఆయన (జిబ్రాయీల్ (అలైహిస్సలాం)) ను దిగుతూ వుండగా చూశాడు. అక్కడికి దగ్గరలోనే 'జన్నతుల్ మావా' (స్వర్గ నివాస స్థలం) ఉంది." *(నజ్మ్ : 13-15)*

"అవిశ్వాసుల కొరకు తయారు చెయ్యబడిన ఆ అగ్ని నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి." *(అలి ఇమ్రాన్ : 131)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) : ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు : "అల్లాహ్ స్వర్గ నరకాలను సృష్టించాక జిబ్రయీల్ (అలైహిస్సలాం)తో - వెళ్ళు! వెళ్ళి స్వర్గాన్ని చూసిరా అని అన్నాడు." *(అబూదావూద్ : 4744)*

పైన పేర్కొన్న రుజువుల ద్వారా స్వర్గ నరకాలు ప్రస్తుతం ఉనికిలోకి వచ్చి వున్నాయనీ మరియు 'స్వర్గ నరకాలనేవి ప్రస్తుతం లేనేలేవు' అని కొందరు వాదించే వాదనలో ఏ మాత్రం సత్యం లేదనీ తెలుస్తోంది.







యివన్నీ పరలోక దినాన్ని విశ్వసించడంలో ఇమిడి వున్న ముఖ్య అంశాలు.

యిక పరలోక దినాన్ని విశ్వసించడంలో కలిగే ప్రయోజనాలేమిటంటే :

1. తీర్పు దినంనాడు పరాభవం పాలు కాకుండా వుండటానికి ఈ జీవితంలో ఎల్లప్పుడూ మంచి పనుల కోసం తాపత్రయ పడటం.
2. తీర్పు దినం నాటి శిక్షలు మరియు నరకాగ్నిని దృష్టిలో పెట్టుకొని ఈ జీవితంలో చెడు పనులకు దూరంగా వుండగలగటం.
3. తాను చేసే ప్రతి పనికీ రేపు అల్లాహ్ సమక్షంలో జవాబు యివ్వ వలసి వుంది అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవడం ద్వారా తాము చేసే ప్రతి కార్యానికి ముందు దాని మంచి చెడ్డలు విచారించు కోవడం.
4. స్వర్గంలోని అనుగ్రహాలను దృష్టిలో పెట్టుకొని జీవితంలో ఎదు రయ్యే ప్రతి కష్టాన్నీ ఎంతో సహనంతో, ధైర్యంతో ఎదుర్కోగలగటం.

**6) విధి వ్రాతనూ, దాని మంచీ చెడులనూ విశ్వసించడం :**

విధి వ్రాతనూ, దానిలోని మంచీ చెడులను విశ్వసించడమంటే - అల్లాహ్, యావత్తు సృష్టితాలను తన జ్ఞానము, వివేకాన్ని ఉపయోగించి ఒక విధి వ్రాత ప్రకారం సృష్టించాడనీ, అల్లాహ్‌కు అన్ని సృష్టితాల విధి వ్రాతను గూర్చి పూర్తి జ్ఞానం వున్నదనీ, అంతా ఒక గ్రంథంలో నమోదు చేయబడి వుందనీ, సృష్టితాలన్నీ తమ తమ విధి వ్రాత ప్రకారమే ఒక దశ నుండి మరొక దశకు చేరుకొని చివరికి తమ విధి వ్రాతలో నమోదు కాబడిన గమ్యస్థానానికి చేరుకుంటాయని మనస్ఫూర్తిగా విశ్వసించడం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"మేము ప్రతి వస్తువునూ ఒక విధి వ్రాత ప్రకారం సృష్టించాము."

*(ఖమర్ : 49)*

"జ్ఞాపకం తెచ్చుకోండి : యుద్ధ సమయంలో అల్లాహ్ మీ దృష్టికి శత్రువు లను కొద్ది మందిగా చూపాడు. వారి దృష్టికి మిమ్మల్ని తగ్గించి చూపాడు. జరుగ

వలసివున్న దానిని అల్లాహ్ అమలులోకి తీసుకురావడానికి." *(అన్‌ఫాల్ : 44)*

"అల్లాహ్ ఆదేశం అమలులోకి రావాల్సిందే." *(అహ్‌జాబ్ : 37)*

ఇదే విషయాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

"బాగా తెలుసుకోండి! మీ పైకి వచ్చిపడింది ఎట్టి పరిస్థితుల్లోనూ రాకుండా వుండేది కాదు మరియు మీపైకి రానిది ఎట్టి పరిస్థితుల్లోనూ మీపైకి వచ్చి పడేది కాదు." *(అబూదావూద్ : 4699)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ప్రతి వస్తువుకూ ఒక విధి నిర్ణయమై వున్నది. చివరికి నిస్సహాయత మరియు సామర్థ్యాలకు కూడా."

*(సహీ ముస్లిం : కితాబుల్ ఖద్ర్, బాబ్ : కుల్లు షయ్యిన్ బిల్ ఖద్రి)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రబోధించారు: నీకేదైనా కష్టం వాటిల్లినపుడు, ఇలా ఇలా చేసి వుంటే ఈ కష్టం దాపురించేది కాదు అని అనకు. దానికి బదులుగా "అల్లాహ్ విధి వ్రాతలో ఇలానే రాసి వుంది. ఆయన తాను కోరుకున్నది చేస్తాడు" అని అను.

*(సహీ ముస్లిం : కితాబుల్ ఖదర్, బాబ్ :ఇమాన్ బిల్ ఖదర్)*

యిక విధి వ్రాత, దాని మంచీ చెడులను విశ్వసించడంలో ఇమిడి వున్న అంశాలను గురించి తెలుసుకుందాం :

**1. జ్ఞానము :**

అంటే భూమ్యాకాశాలూ, వాటి మధ్య వున్న ప్రతి వస్తువూ, అది చిన్నదైనా పెద్దదైనా సరే, దానికి సంబంధించిన పూర్తి జ్ఞానం అల్లాహ్‌కు వుందనీ, ఆయన జ్ఞానం ప్రతి వస్తువునూ పరివేష్టించి వుందనీ, తన దాసుల ప్రతి కదలికకు సంబంధించిన జ్ఞానం అల్లాహ్‌కు వుందనీ, వారు చేయ తలపెట్టిన ప్రతి కార్యం అల్లాహ్ జ్ఞాన పరిధిలో వుందని మనస్ఫూర్తిగా విశ్వసించడం.







"ఆయనే అల్లాహ్ - ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు. దృశ్యాదృశ్య విషయాలన్నీ ఎరిగినవాడు." *(హష్ర్ : 22)*

"అల్లాహ్ జ్ఞానం ప్రతి వస్తువునూ పరివేష్టించి వున్నది." *(తలాఖ్ : 12)*

"అగోచర విషయ జ్ఞాని అయిన నా ప్రభువు సాక్షిగా! అది (ప్రళయం) మీ మీదకు తప్పకుండా వస్తుంది. రవ్వంత వస్తువైనా సరే ఆయనకు ఆకాశాల లోనూ గోప్యంగా లేదు, భూమిపైనా గోప్యంగా లేదు." *(సబా : 3)*

**2. అంతా ముందే లిఖించబడి వుండటం :**

అంటే - సృష్టి ఆవిర్భావము మొలుకొని ప్రళయం వరకు జరుగబోయే ప్రతి విషయాన్ని అల్లాహ్ ముందుగానే ఒక గ్రంథంలో వ్రాయించి వుంచాడని విశ్వసించడం.

"ఆకాశంలోనూ, భూమిపైనా ఉన్న ప్రతి వస్తువును గురించి అల్లాహ్‌కు తెలుసని నీవు ఎరుగవా? అంతా ఒక గ్రంథం (లౌహె మహఫూజ్)లో వ్రాయబడి వుంది. అల్లాహ్‌కు ఇదేమంత కష్టమైనది కాదు." *(హజ్ : 70)*

"రవ్వ కంటే పెద్దదైనా సరే, రవ్వ కంటే చిన్నదైనా సరే అంతా ఒక స్పష్టమైన దస్త్రములో వ్రాయబడి వున్నది." *(సబా : 3)*

ఉబాదా బిన్ సామిత్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు :

అన్నింటికన్నా ముందు అల్లాహ్ కలాన్ని సృష్టించాడు. తర్వాత దానికి 'వ్రాయి' అని ఆదేశించాడు. అది 'నా ప్రభువా! నేనేం వ్రాయను?' అని విన్నవించుకుంది. దానికి అల్లాహ్ 'ప్రళయం వరకు సంభవించబోయే ప్రతి విషయం యొక్క విధి వ్రాతను వ్రాయి' అని పలికాడు.

ఉబాదా బిన్ సామిత్ (రజి అల్లాహు అన్హు) తన కొడుక్కి హితోపదేశం చేస్తూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా కూడా సెలవిచ్చారని అన్నారు.

"ఇక ఎవరైతే దీనిని (ఈ విశ్వాసాన్ని) వదిలి వేరే దాని (విశ్వాసం)పై మరణిస్తే అతను నాలోని వాడుకాదు. (అంటే ముస్లిం కాదు)."

*(అబూదావూద్ : 4700)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచిస్తుండగా తాను విన్నానని అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు: అల్లాహ్ సమస్త సృష్టితాల విధి వ్రాతను భూమ్యాకాశాలను సృష్టించడానికి 50 వేల సంవత్సరాల ముందు వ్రాశాడు. ఆ సమయంలో అతని అర్ష్ నీళ్లపై వుండేది".

*(సహీ ముస్లిం : కితాబుల్ ఖదర్, బాబ్ : హిజాజి ఆదమ వ మూసా అలై హిస్సలాం)*

**3.** అల్లాహ్ తాను అనుకున్నది చేస్తాడనీ, తన దాసుల కార్యాలు కూడా ఆయన సంకల్పానికి అనుగుణంగానే వుంటాయని, ఆయన అనుమతి లేనిదే ఏదీ కార్యరూపం దాల్చదనీ మనస్ఫూర్తిగా విశ్వసించడం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నీ ప్రభువు తాను కోరినది సృష్టిస్తాడు." *(ఖసస్ : 68)*

"తనకు ఇష్టమైన దానిని చేసే అధికారం అల్లాహ్‌కు వున్నది." *(ఇబ్రాహీం: 27)*

"మాతృ గర్భాలలో మీ రూపాలను తన యిష్టానుసారం తీర్చి దిద్దేది ఆయనే కదా." *(ఆలి ఇమ్రాన్ : 6)*

తన దాసుల కర్మలను గూర్చి యిలా సెలవిచ్చాడు :

"అల్లాహ్ గనక సంకల్పించి వుంటే వారికి మీపై ఆధిక్యాన్ని ఇచ్చి వుండే వాడు. నిశ్చయంగా వారూ మీతో పోరాడి వుండేవారే." *(నిసా : 90)*

"అల్లాహ్ గనక సంకల్పించి వున్నట్లయితే, వారు ఆ విధంగా చేసి వుండేవారు కాదు. కనుక వారిని తమ తప్పుడు నిందారోపణలు చేసుకోవడానికి వదిలి పెట్టండి." *(అన్ ఆమ్ : 137)*

"ఏ ఆపద అయినా అల్లాహ్ అనుమతి లేనిదే ఎన్నటికీ రాదు." *(తగాబున్ : 11)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచిస్తుండగా తాను విన్నానని అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) తెలియజేశారు: "మానవుల హృదయాలు అల్లాహ్ యొక్క రెండు వ్రేళ్ళ మధ్య ఒకే హృదయం







లాగ వున్నాయి. ఆ కరుణామయుడు తాను తలచిన రీతిలో వాటిని త్రిప్పుతాడు. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రార్థించారు : ఓ అల్లాహ్! హృదయా లను త్రిప్పేవాడా! మా హృదయాలను నీ విధేయత వైపునకు త్రిప్పు".

*(సహీ ముస్లిం : కితాబుల్ ఖద్ర్, బాబ్ : తస్రీ ఫిల్లాహి తఆలల్ ఖులూబ కైఫషా అ ...)*

**4.** అల్లాహ్‌యే ప్రతి వస్తువుకూ, దాని గుణగణాలకూ, దాని ఆచరణలకూ సృష్టి కర్త అని మనస్ఫూర్తిగా విశ్వసించడం.

"ప్రతి వస్తువునూ సృష్టించిన వాడు అల్లాహ్‌యే. ప్రతి వస్తువుకూ సంరక్ష కుడు కూడా ఆయనే." *(జుమర్ : 62)*

"ఆయన ప్రతి దానినీ సృష్టించాడు. తరువాత దానికి ఒక విధినీ నిర్ణయిం చాడు." *(ఫుర్ఖాన్ : 2)*

ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన జాతి వారితో ఇలా అన్నారు :

"వాస్తవానికి అల్లాహ్‌యే మిమ్మల్ని సృష్టించాడు, మీరు తయారు చేసే వస్తువులనూ సృష్టించాడు." *(సాఫ్ఫాత్ : 96)*

**5.** విధి వ్రాతను విశ్వసించడంలో ఇమిడి వున్న మరో ముఖ్య విషయం ఏమిటంటే కేవలం విధివ్రాతను నమ్మి, మన ఆఖరి గమ్యస్థానం ముందుగానే నిర్ణయమై పోయినందున యిక చేసేదేమీ లేదనుకొని ఏ పనీ చేయకుండా వూరికే కూర్చుండిపోకుండా, తమ శాయశక్తులా అల్లాహ్‌కు విధేయత చూపుతూ, మంచి పనులు చేస్తూ వుండటం.

ఈ విషయంలో అల్లాహ్ ప్రతి ఒక్కరికీ తమ ఇష్ట ప్రకారం నడుచుకొనే అవకాశం ఇచ్చాడు. అయినప్పటికీ వారి సంకల్పాలూ, శక్తి సామర్థ్యాలూ - అన్నీ కూడా అల్లాహ్ ఆధీనంలో వున్నాయి.

"ఇక ఎవరైనా సరే, ఇష్టమైతే, తమ ప్రభువు వైపునకు మరలే మార్గాన్ని అవలంబించవచ్చు." *(సబా : 39)*

"ఇది సత్యం. మీ ప్రభువు తరపు నుండి వచ్చింది. యిక ఇష్టమైన వారు దీనిని స్వీకరించనూ వచ్చు, ఇష్టం కాని వారు దీనిని తిరస్కరించనూ వచ్చు." *(కహఫ్ : 29)*

"మీకు సాధ్యమైనంత వరకు అల్లాహ్‌కు భయపడుతూ వుండండి, వినండి, విధేయత చూపండి." *(తగాబున్ : 16)*

"ఇది సకల లోకాల వారికొరకు ఒక హితోపదేశం, మీలో రుజుమార్గాన నడవదలచిన ప్రతి వ్యక్తి కొరకు, సకల లోకాల ప్రభువైన అల్లాహ్ తలచనంత వరకు మీరు తలచినంత మాత్రాన ఏమీ కాదు." *(తక్వీర్ : 27-29)*

ఇటు విధి నిర్ణయమూ, అటు తాను కోరుకున్నది చేయడానికి ప్రసాదించబడిన స్వేచ్ఛ - ఈ రెండింటి మధ్యగల వాస్తవిక సంబంధాన్ని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చాలా చక్కగా వివరించి చెప్పారు:

అలీ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఒక సుదీర్ఘమైన హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు : మీలో ప్రతి వ్యక్తి గమ్యస్థానం స్వర్గమో, నరకమో అన్నది అల్లాహ్ ముందుగానే వ్రాసేశాడు. అంతేకాదు, అతను మంచి వాడయి వుంటాడా లేక చెడ్డవాడయి వుంటాడా అన్నది కూడా. దీనిపై సహచరులలో నుండి ఒక వ్యక్తి లేచి - 'ఓ దైవ ప్రవక్తా! మరలాంటప్పుడు మేము కేవలం మా విధి వ్రాతను నమ్ముకొని ఆచరణలన్నింటినీ త్యజించి వూరికే కూర్చోవచ్చుగా' అని విన్నవించుకున్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ : ఆచరించండి. (ఎందుకంటే) ప్రతి ఒక్కరికీ వారి ఆచరణ సుగమంగా చేయబడింది. సన్మార్గ గాములకు సన్మార్గం సుగమం గావించబడితే, మార్గ భ్రష్టులకు మార్గ భ్రష్టత సుగమం గావించబడింది. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దివ్యఖురానులోని "ఎవడు (అల్లాహ్ మార్గంలో) ధనాన్ని వినియోగించాడో, (దైవ అవిధేయతకు) భయపడ్డాడో, మంచిని సత్యమని అంగీకరించాడో అతనికి మేము సన్మార్గంలో నడిచేందుకు సౌకర్యాన్ని కలుగ జేస్తాము. ఎవరు పిసినారితనం వహించాడో, (అల్లాహ్ పట్ల) నిర్లక్ష్య వైఖరి అవలంబించాడో, పైగా మంచిని





తృణీకరించాడో, అతనికి మేము కఠిన మార్గంలో నడిచేందుకు సౌకర్యాన్ని కలుగజేస్తాము." (92: 5-10) అన్న దైవ సూక్తులు పఠించారు.

*(అబూదావూద్ : 4694)*

విధివ్రాత, దాని మంచీ చెడులను విశ్వసించడం ద్వారా కలిగే ప్రయోజనా లేమిటంటే :

1. ఏదైనా పనిని ప్రారంభించినప్పుడు మనిషి కేవలం అల్లాహ్ పైనే ఆధార పడతాడు. ఆ పనికి దొరికిన సాఫల్యం, ముందుగా తను తీసుకున్న జాగ్రత్తల ఫలితం కాదనీ, 'అల్లాహ్ ఆధీనంలో వున్న అన్ని విషయాల విధి నిర్ణయ పర్య వసానం' అని మనస్పూర్తిగా స్వీకరిస్తాడు.

2. మనిషి, తన పనిలో దొరికిన సాఫల్యానికి గర్వపడకుండా ఉంటాడు. ఎందుకంటే ఆ సాఫల్యానికి కారణం కేవలం అల్లాహ్ అనుగ్రహమే అని అతడు గ్రహించి వుంటాడు. తద్వారా ఆ అనంత కరుణామయుడికి కృతజ్ఞతలు తెలిపి తన విధేయతను చాటుకుంటాడు.

3. మనిషి తన దైనందిన జీవితంలో జరిగే సంఘటనలతో పూర్తిగా సంతృప్తి పడుతూ, శాంతి యుతంగా తన జీవితాన్ని గడపగలుగుతాడు. జరిగే సంఘటనలు అతనికి అనుకూలంగా లేకపోయినప్పటికీ మనస్సులో ఏ మాత్రం బాధ పడకుండా ధైర్యంగా నిలబడగలుగుతాడు. ఎందుకంటే జరిగేదంతా అల్లాహ్ విధి నిర్ణయ ప్రకారమే జరుగుతుంది కాబట్టి.

"భూమిపై గానీ లేదా స్వయంగా మీ ఆత్మలపై గానీ అవతరించే ఏ ఆపద అయినా సరే, దానిని మేము ఉనికిలోకి తీసుకు వచ్చే ముందు ఒక గ్రంథంలో వ్రాసిపెట్టకుండా ఉండలేదు. అలా చేయటం అల్లాహ్‌కు చాలా సులభం. (ఇదంతా ఎందుకంటే) మీకు ఎలాంటి నష్టం జరిగినా, దానికి మీరు బాధపడకుండా ఉండాలని, అల్లాహ్ మీకు ఏదైనా ప్రసాదిస్తే దానికి మీరు మురిసిపోకుండా వుండాలని. తమను తాము గొప్ప వారమని భావించి అహం భావం ప్రదర్శించేవారిని అల్లాహ్ ప్రేమించడు." *(హదీద్ : 22-23)*

అయితే దివ్యఖురానులో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రామాణిక హదీసులలో ఎన్నో రుజువులు వున్నప్పటికీ దురదృష్ట వశాత్తు ముస్లిం

సమాజంలోని కొన్ని వర్గాలు విధివ్రాతను, దాని మంచీ చెడులను బాహాటంగా తిరస్కరించాయి. మనిషి తన యిష్ట ప్రకారం ఆచరణలను అమలులో పెట్టడానికి అసలు స్వేచ్ఛనే ప్రసాదించలేదని కొందరు విశ్వసిస్తే, మరికొందరు కేవలం మనిషి స్వేచ్ఛా సంకల్పాలపైనే అతని ఆచరణలు ఆధారపడి వున్నాయనీ, అల్లాహ్ విధి నిర్ణయ ప్రభావం వాటిపై ఏ మాత్రం వుండదని తలపోశారు. ఇలా వారు రుజుమార్గం నుండి వైదొలగిపోయారు.

వాస్తవానికి సత్యం అనేది ఈ రెండు తప్పుడు విశ్వాసాలకు మధ్యన వుంది అన్న విషయం మనం తెలుసుకున్నాం.

యిదీ విధివ్రాత, దాని మంచీ చెడులకు సంబంధించిన అసలు వాస్తవికత.

యిక జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అడిగిన మూడవ ప్రశ్న అయిన'ఇహ్సాన్' ను గురించి వివరంగా తెలుసుకుందాం.





దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మం

# ఇహ్సాన్

ఇహ్సాన్ అనేది ధర్మానికి చెందిన అత్యున్నత స్థాయి.

ఇహ్సాన్ అంటే - అల్లాహ్‌ను మనం ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగా ఆరాధించడం, ఒక వేళ మనం అతణ్ణి చూడలేకపోయినా తను మాత్రం మనల్ని చూస్తున్నాడు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవడం.

వాస్తవానికి 'ఇహ్సాన్' అనేది మంచిని చేయడంలో ఉదాత్త వైఖరిని కలిగి వుండడం - అన్న అర్థంలో వాడబడుతుంది. అంటే మనిషి తనకు వీలైనంతగా మంచి పనులను ఉదార బుద్ధితో నిత్యం చేస్తూ వుండాలి.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"నిస్సందేహంగా భయ భక్తులతో పని చేస్తూ ఉదాత్త వైఖరిని (ఇహ్సాన్) కలిగి వుండేవారితో అల్లాహ్ ఉంటాడు." *(నహ్ల్ : 128)*

మనిషి తన ధనం ద్వారా, పేరు ప్రతిష్టల ద్వారా, జ్ఞానం ద్వారా, శరీరం ద్వారా ఎల్లప్పుడూ ఇతరులపై 'ఇహ్సాన్' చేస్తూ వుండాలి.

ఇక వీటి వివరాల్లోకి వస్తే :

ధనం ద్వారా ఇహ్సాన్ చేయడమంటే - మనిషి తన ధనాన్ని మంచి పనుల కోసం ఖర్చు చేయటం, జకాత్ చెల్లించడం, సదఖా (దానం) యివ్వడం వీటిలో శ్రేష్టమైనది జకాత్. ఇది గనక ఎవరిలోనైనా లోపిస్తే అతను ఇస్లాం మూల స్థంభాల్లో ఒక దాన్ని త్యజించినవాడై పోతాడు, తద్వారా అతని ధర్మం సంపూర్ణం కాకుండా మిగిలిపోతుంది.

జకాత్ తర్వాత మనిషి సాధారణంగా ఇతరులపై చేసే ఖర్చులు, దానాలు పరిగణ లోనికి వస్తాయి. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండి, చేతులారా మిమ్మల్ని మీరు వినాశం పాలు చేసుకోకండి. మేలు చేసేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు." *(బఖర : 195)*

"మేము ఏమి ఖర్చు చెయ్యాలి? అని ప్రజలు నిన్ను అడుగుతారు. (నీవు వారికి ఇలా చెప్పు) మీరు ఏమి ఖర్చు చేసినా దానిని మీ తల్లిదండ్రుల కొరకూ, బంధువుల కొరకూ, అనాథలు, నిరుపేదలు, బాటసారుల కొరకూ ఖర్చు చెయ్యండి. మీరు ఏ మేలు చేసినా దాన్ని అల్లాహ్ తెలుసుకుంటాడు."

*(బఖర : 215)*

పేరు ప్రతిష్టల ద్వారా ఇతరులపై ఇహ్సాన్ చేయడమంటే - మనిషి తనకు అల్లాహ్ ప్రసాదించిన పేరు ప్రతిష్టలను మంచి కార్యాలకోసం ఉపయోగించడం, మంచి కార్యాల్లో సిఫారసు చేయడం - తద్వారా తన పేరు ప్రతిష్టలను ఇతరులకు మేలు చెయ్యటం కోసం ఖర్చు చెయ్యటం.

అయితే చెడ్డపనుల్లో, ధర్మయుక్తం కాని పనుల్లో తన పేరు ప్రతిష్టలను ఉపయోగించకూడదు. దీనివల్ల స్వయంగా తనే మార్గభ్రష్టుడై పోయే ప్రమాద ముంది.

"మంచికి, దైవభక్తికి సంబంధించిన పనులలో అందరితోనూ సహకరించండి. పాపకార్యాలలో, అత్యాచారాలలో ఎవరితోనూ సహకరించకండి. అల్లాహ్‌కు భయపడండి, ఆయన శిక్ష బహు కఠినమైనది." *(మాఇద : 2)*

జ్ఞానం ద్వారా ఇతరులకు 'ఇహ్సాన్' చేయడమంటే - అల్లాహ్ తనకు ప్రసాదించిన జ్ఞానాన్ని ఇతరులకు బోధించడం, తద్వారా ప్రజల్లో వ్యాపించి వున్న అజ్ఞానపు అంధకారాన్ని జ్ఞానమనే వెలుగుతో దూరం చేయడానికి కృషి చేయడం. ఇలా తన జ్ఞానాన్ని ఇతరుల మేలు కోసం ఖర్చు చేయడం.

దివ్య ఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

"తెలిసిన వారూ, తెలియని వారూ సమానులు కాగలరా?" *(జుమర్ : 9)*

"అల్లాహ్ దాసులలో జ్ఞానులు మాత్రమే అల్లాహ్‌కు భయపడతారు."

*(ఫాతిర్ : 26)*







"మీలో విశ్వసించిన వారికి, జ్ఞానం ప్రసాదించబడిన వారికి అల్లాహ్ ఉన్నత స్థానాలు ప్రసాదిస్తాడు." *(ముజాదలహ్ : 11)*

అబూ ఉమామ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"మీలో అందరికన్నా అల్పంగా వున్న వ్యక్తిపై నాకెలాంటి విశిష్టత వుందో, అలాంటి విశిష్టతే ఒక జ్ఞానికి సాధారణ దాసునిపై వున్నది. తదుపరి ఆయన ఇలా సెలవిచ్చారు: నిస్సందేహంగా ప్రజలకు మంచిని బోధించే వారి మీద అల్లాహ్ తన కారుణ్యాన్ని కురిపిస్తాడు. ఇంకా దైవ దూతలు, భూమ్యాకాశాల్లో వున్నవారు, చివరికి చీమలు తమ కన్నాల నుండి, చేపలు (నీటిలోపలి నుండి) కూడా వారి మీద అల్లాహ్ కారుణ్యం వర్షించాలని ప్రార్థిస్తూ వుంటారు."

*(తిర్మిజి : అబ్ వాబుల్ ఇల్మ్, బాబ్ మాజా అఫీ ఫజ్లిల్ ఫిఖహి అలల్ ఇబాదతి)*

పైన పేర్కొన్న రుజువుల ద్వారా జ్ఞానానికున్న ప్రాధాన్యత అర్థమవుతుంది. అయితే తమ జ్ఞానం ద్వారా ఇతరులకు 'ఇహ్సాన్' చేసేవారు ఈ పనిని చేస్తున్నపుడు కాస్త వివేకంతో వ్యవహరించాల్సి వుంటుంది. తమ బోధనలు క్లుప్తంగా, సమగ్రంగా శ్రోతల హృదయాల్లోకి చొచ్చుకు పోయేలా వుండాలి. దీని కోసం ఒకేసారి కొన్ని గంటల సమయం తీసుకోకుండా జాగ్రత్త పడాలి. ప్రజల సౌలభ్యాన్ని, సౌకర్యాన్నీ దృష్టిలో పెట్టుకొని మసలు కోవాలి. అలా కాని పక్షంలో ప్రజలు అతని జ్ఞానంతో ప్రయోజనం పొందడం మాట అటుంచి ఏకంగా విసుగెత్తి పోయే ప్రమాదముంది.

ఇక శరీరం ద్వారా ఇతరులకు 'ఇహ్సాన్' చేయడమంటే- అల్లాహ్ తమకు ప్రసాదించిన శారీరిక బలాన్నీ, శక్తి సామర్థ్యాలనూ ఇతరులకు మేలు చెయ్యటం కోసం ఉపయోగించడం.

మన దైనందిన జీవితంలో తారసపడే ముసలివారు, గ్రుడ్డివారు, ఆడ వాళ్ళకూ వారిదగ్గర వున్న బరువును ఎత్తడం ద్వారా, వారిని సురక్షితమైన స్థలానికి చేర్చడం ద్వారా, వారికి సరైన మార్గం చూపించడం ద్వారా మేలు చేయడం ఈ కోవలోనికి వస్తాయి.

దీనిని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరికైనా తన వాహనం పైకి ఎక్కడానికి, దాన్ని నడపడానికి సహాయపడటం లేదా అతని బరువును వాహనంపై పెట్టడం- (ఇవన్నీ కూడా) సదఖాయే.
*(సహీ బుఖారి)*

పైన వివరించబడిన ఇహ్సాన్‌లు అన్నీ మనిషి అల్లాహ్ దాసుల కోసం చేస్తాడు.

యిక అల్లాహ్‌ను ఆరాధించడంలో ఇహ్సాన్ విషయాని కొస్తే- అది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివరణ ప్రకారం: అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూస్తున్నట్లు అతణ్ణి అరాధించడం, ఒక వేళ మనం అతణ్ణి చూడలేకపోయినా తను మాత్రం మనల్ని చూస్తున్నాడు అని గుర్తుపెట్టు కోవడం.

ఇందులో రెండు విషయాలు చెప్పబడ్డాయి.

**మొదటిది :**

అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూస్తున్నట్లు అతణ్ణి ఆరాధించడం. అంటే- మనిషి గంపెడంత ఆశతో, నిర్దిష్టమైన తాపత్రయంతో మనసును లగ్నం చేసి చేయబడే ఆరాధన. వాస్తవానికి ఈ రెండు విషయాలే మనిషికి ఒక రకమైన హృదయ తన్మయత్వానికి గురిచేసి తద్వారా అతణ్ణి అల్లాహ్ ఆరాధనకు పురిగొలుపుతాయి.

కారణం, తనకు ప్రియమైనదేదో అతనికి కావాల్సి వుంటుంది. దానితో అతడు 'అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూస్తున్నట్లు' ఆరాధించడం మొదలు పెడతాడు, తన హృదయాన్ని అల్లాహ్ వైపుకే త్రిప్పి, అతని వైపుకే మరలుతాడు, ఆయన సాన్నిధ్యాన్నే కోరుకుంటాడు.

**యిక రెండవ అంశం:**

ఒక వేళ మనం అల్లాహ్‌ను చూడలేక పోయినా అతను మాత్రం మమ్మల్ని చూస్తున్నాడని గుర్తుపెట్టుకోవటం.

దివ్యఖురానులో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ప్రవక్తా! నీవు ఏ స్థితిలో వున్నా, ఖురాను నుండి దేనిని వినిపించినా,







మానవులారా! మీరు ఏది చేసినా ఆ అన్ని సందర్భాలలోనూ మేము మిమ్మల్ని చూస్తూనే వున్నాము." *(యూనుస్: 61)*

అల్లాహ్ మనల్ని చూస్తున్నాడని గుర్తుపెట్టుకొని అతణ్ణి ఆరాధించడం- దీనిలో అల్లాహ్ యెడల భయం, ఆయన శిక్ష నుండి తప్పించుకోవాలన్న తపన అనే రెండు అంశాలు ఇమిడి వుంటాయి. ఇది ఇహ్సాన్ లో రెండో స్థాయికి చెందుతుంది. ఈ రంగంలో జ్ఞానం ప్రసాదించబడ్డ అనుభవజ్ఞులైన పండితులు దీనిని మొదటి స్థాయి ఇహ్సాన్ కన్నా తక్కువగా అంచనా వేశారు.

ఒక వేళ అల్లాహ్‌ను ప్రత్యక్షంగా చూస్తున్నట్లు ఆరాధించ లేకపోతే, నిర్దిష్టమైన ఆశతో, తాపత్రయంతో మనసును లగ్నం చేయలేకపోతే, కనీసం అతను మనల్ని చూస్తున్నాడన్న విషయమైనా గుర్తుపెట్టుకొని అతణ్ణి ఆరాధించాలి. తద్వారా మనం భయంతో , అతని శిక్షనుండి ఎలాగైనా తప్పించుకోవాలన్న ఉబలాటంతో అల్లాహ్‌ను ఆరాధించగలుగుతాము.

ఆరాధన సారాంశాన్ని ప్రముఖ పండితులు అల్లామా ఇబ్నె ఖయ్యూం అల్ జౌజి (రహమతుల్లా అలై) ఇలా వివరించారు:

అనంత కరుణామయుడైన అల్లాహ్ ఆరాధనలో రెండు ముఖ్యమైన అంశాలు ఇమిడి వున్నాయి. మొదటిది పరిపూర్ణమైన ప్రేమ కాగా రెండవది సంపూర్ణమైన నమ్రత, అణకువ.

అంటే- అల్లాహ్‌ను ఆరాధించటంలో అతని యెడల పరిపూర్ణమైన ప్రేమ సంపూర్ణమైన నమ్రత, అణకువలతో పాటు తన నిస్సహాయత చోటు చేసుకోవాలి.

ప్రేమలో అల్లాహ్ సాన్నిధ్యాన్ని పొందాలన్న తాపత్రయం ఇమిడివుంటే, నమ్రత, అణకువల్లో ఆయన యెడల భయం ఇమిడి వుంటుంది.

ఇదండీ అల్లాహ్ ఆరాధనలో ఇహ్సాన్ కు సంబంధించిన వాస్తవికత. ఇలా గనక ఎవరైనా అల్లాహ్‌ను ఆరాధించడం మొదలుపెడితే నిశ్చయంగా అతను అల్లాహ్ ఇష్టపడే దాసులలోకి చేరిపోవచ్చు.

తద్వారా ప్రదర్శనా బుద్ధికి ఏమాత్రం గురికాకుండా, ఇతరుల మెప్పును కూడా ఆశించకుండా కేవలం అల్లాహ్ సాన్నిధ్యాన్ని ఆశిస్తూ, ఆయనకే భయ

పడుతూ, అతనికే విధేయత చూపిస్తూ, అతణ్ణే నమ్ముకొని, తన జీవితాన్ని ఆయన దాస్యంలోనే గడిపి , చివరికి ఇహపరలోక సౌఖ్యాలను పొందగలుగుతాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తీసుకువచ్చిన ధర్మం ఇదే!

"నా రుజుమార్గం ఇదే, కనుక మీరు దీని పైనే నడవండి, వేరే మార్గాలపై నడవకండి. ఎందుకంటే అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి తొలగించి విచ్ఛిన్న పరుస్తాయి. మీ ప్రభువు మీకు చేసిన హితోపదేశం యిదే". *(అన్ ఆమ్: 153)*

అని అల్లాహ్, మరియు

"నా మార్గం ఇది, నేను మరియు నా సహచరులు పూర్తి జ్ఞానంతో, నమ్మకంతో అల్లాహ్ వైపునకు పిలుస్తున్నాము. అల్లాహ్ పరిశుద్ధుడు మరియు నేను ముష్రిక్కుల లోని వాడను కాను". *(యూసుఫ్ : 108)*

అని ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రభోదించిన వాస్తవిక ధర్మం యిదే!

ఈ ధర్మం పైనే స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తోపాటు, సలఫుస్సాలిహీన్‌లు కూడా నడిచారు. కనుక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజమైన మనం కూడా వారి అడుగు జాడల్లో నడుస్తూ, విశ్వాస ఆచరణలలో కేవలం వారి దృక్పథాన్ని స్వీకరించి పెద్ద పాపాలయిన షిర్క్, బిద్అత్, తల్లిదండ్రుల అవిధేయత, బంధుత్వసంభంధాలు త్రేంచుకోవడం, చేతబడి, నరహత్య, వడ్డీ, సారాయి, జూదము, వ్యభిచారము, అబద్ధమాడడం, అమాయక ముస్లిం స్త్రీలపై అపనింద వేయటం వగైరా ... లకు దూరంగా వుంటూ జీవితం సాగించాలి. అప్పడే మనం అల్లాహ్ కృపకు పాత్రులై ఇహపరలోకాల్లో సాఫల్యం పొందే అవకాశం వుంది!







# చివరిగా....

చివరిగా నేనందరికీ, ముఖ్యంగా నేటి యువతీ యువకులకు సవిన యంగా చేసే మనవి ఏమిటంటే-

ఒక్కసారి ఆలోచించండి!

ప్రస్తుతం వున్న ఈ అవమానకరమైన జీవితాలు కష్టాలూ, దౌర్జన్యాల కడలిలో యిక ఇలాగే సాగిపోవాల్సిందేనా?

ముస్లిం సమాజం ప్రతి రంగలో ఎదురు దెబ్బలు తినాల్సిందేనా?

మన తరువాతి తరాలకు మనం వారసత్వం గా కేవలం అల్లాహ్ క్రోధాన్నీ, ఆయన శిక్షలనే యిచ్చి వెళదామా?

ప్రళయం రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గనక మనల్ని "మీకళ్ళ ముందు ప్రజలు నా ధర్మాన్ని భ్రష్టు పట్టిస్తుంటే మీ వంతు కృషిగా మీరేం చేశారు?" అని ప్రశ్నిస్తే దానికి ఏం సమాధానం చెబుదాం?

లేదు- అలా ఎప్పటికీ జరగకూడదు.

"మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా! అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలను క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించే వాడూను. మీ మీదకు శిక్షరాక మునుపే, మీకు ఎవరి నుండీ సహాయం లభించని పరిస్థితి ఏర్పడక మునుపే మీరు మీ ప్రభువు వైపునకు మరలి ఆయనకు విధేయత చూపండి!

మీకు తెలియకుండానే మీ మీదకు అకస్మాత్తుగా శిక్షరాక ముందే మీ ప్రభువు అవతరింప జేసిన ఉత్తమ విషయాలను అనుసరించండి!

*(జుమర్ : 53 - 55)*

“పశ్చాత్తాపపడి, విశ్వసించి, మంచి పనులు చెయ్యటం ప్రారంభించే వాడు తప్ప- అటువంటి వారి చెడులను అల్లాహ్ పుణ్యాలుగా మారుస్తాడు.”

*(ఫుర్ఖాన్: 70)*

అని అల్లాహ్ మనకు హితబోధ చేస్తున్నాడు.

కనుక ఇప్పుడైనా కళ్ళు తెరవండి-

ముందు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మానికి సంబంధించిన జ్ఞానాన్ని అంటే- దివ్య ఖురానులో మరియు ప్రామాణిక హదీసులలో గ్రంథీకృతమై వున్న దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు సలఫుస్సాలిహీన్‌ల విశ్వాసాలూ, ఆచరణలకు సంబంధించిన జ్ఞానాన్ని సముపార్జించండి!

బూటకపు విశ్వాసాలకు, క్రొత్త పోకడలకు స్వస్తి పలకండి!

ప్రాతః కాలం మొదలుకొని రాత్రి పడుకొనే వరకు చేసే ప్రతి పనినీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ప్రకారం చేయడాన్ని అనివార్యంగా చేసుకోండి!

ముందు స్వయంగా ఆచరణలో పెట్టి తర్వాత ఇతరులకు వాటిని బోధించండి!

అందరూ కలిసి ముస్లిం సమాజంలో పేరుకు పోయి వున్న తప్పుడు విశ్వాసాలనూ, క్రొత్త పోకడలనూ వేర్లతో సహా పెకిలించి వేయండి!

అంధానుసరణ, వ్యక్తి పూజలు, వర్గాలూ... వీటన్నింటినీ త్యజించి కేవలం దివ్య ఖురాను, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ప్రామాణిక హదీసులు పునాదిగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), ఆయన ప్రియ సహచరులు నెలకొల్పిన సమాజం లాంటి ఒక పరిశుద్ధ ముస్లిం సమాజాన్ని స్థాపించండి!

అప్పుడే అల్లాహ్ అనుగ్రహాలు కూడా ఈ సమాజం పై వర్షిస్తాయి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన భవిష్యవాణి ప్రకారం ఎల్లప్పుడూ సత్యం పై స్థిరంగా వుండే వర్గం కూడా పైన వివరించిన కార్యకలాపాలను నిర్వహిస్తూ మీకళ్ళ ముందే వుంటుంది. దానిని గుర్తించండి, దానికి సహకరించండి!





దైవ గ్రంథం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), గారి ప్రామాణిక హదీసులూ, మరియు వాటిని అర్థం చేసుకోవడంలో సలఫ్‌ల దృక్పథం- వీటినే పునాదిగా చేసుకొని సత్యం పైనే స్థిరంగా వున్న ఆ వర్గంతోనే మీరూ అతుక్కుపొండి!

సమాజ సంస్కరణకు మీ వంతు కృషి చేయండి!

అప్పుడే మనం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తెచ్చిన ధర్మాన్ని, మరలా దాని వాస్తవిక రూపంలో స్థాపించ గలుగుతాం. తద్వారా ఇహపర లోకాల్లో సాఫల్యం పొందగలుగుతాం!

“తరువాత ఏ వ్యక్తి అయినా ఇలా అనే పరిస్థితి రాకూడదు సుమా! అల్లాహ్ విషయంలో నేను చూపిన నిర్లక్షతకు నేను ఎంతో చింతిస్తున్నాను. పైగా నేను ఎగతాళి చేసే వారిలో చేరిపోయాను, లేదా అయ్యో! అల్లాహ్ నాకు సన్మార్గం చూపివుంటే నేను కూడా భయ భక్తులు కలవారిలో చేరి పోయేవాణ్ణి, లేదా శిక్షను చూసి అయ్యో! నాకు మరొక అవకాశం దొరికితే ఎంత బాగుండును. నేను కూడా సత్కార్యాలు చేసేవారిలో కలిసిపోతాను. (అప్పుడు అతనికి ఈ జవాబు దొరక కూడదు) లేదు- నా వాక్యాలు నీ వద్దకు వచ్చాయి కానీ నీవు వాటిని తిరస్కరించావు, విర్రవీగావు. నీవు అవిశ్వాసులలోనివాడవు.”

*(జుమర్ : 56- 58)*

అని అల్లాహ్ మనల్ని గట్టిగా హెచ్చరిస్తున్నాడు. ఈ విషయాన్ని సదా గుర్తు పెట్టుకోండి!

అల్లాహ్ మనందరికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ధర్మంపై నడిచే, దాన్ని తిరిగి స్థాపించే సద్బుద్ధిని ప్రసాదించు గాక!! *(ఆమీన్)*

వసల్లల్లాహు అలా మహమ్మదిన్ వ ఆలిహి వ సహబిహి వసల్లమ తస్లీమన్ కసీరా.

## ఈ పుస్తక రచన నిమిత్తం దివ్యఖురానుతో పాటు నేను సహాయం తీసుకున్న ఇతర గ్రంథాలు, పుస్తకాలు

1. సహీ బుఖారి
2. సహీ ముస్లిం
3. అబూదావూద్
4. తిర్మిజి
5. ఇబ్నె తైమియా (రహమతుల్లా అలై) గారి 'అల్ అఖీదతుల్ వాసితియా'
6. డా॥ అబూ అమీనా బిలాల్ ఫిలిప్స్ గారి 'ది ఫండమెంటల్స్ ఆఫ్ తౌహీద్'
7. డా॥ సాలెహ్ బిన్ ఫౌజాన్ గారి 'ది అఖీదా ఆఫ్ తౌహీద్' (ఇంటర్నెట్ ప్రతి)
8. హాఫిజ్ అల్ హాకిమీ గారి 'ఆలముస్సున్నహ్ అల్ మన్షూరా లీ ఈతిఖాద్ అత్తాయిఫా' (ఇంటర్నెట్ ప్రతి)
9. రాబియా అత్తవీల్ గారి 'హఖీఖతే షహాదతైన్' (ఇంటర్నెట్ ప్రతి)
10. ఇమాం నవవీ (రహమతుల్లా అలై) గారి 'రియాజుస్సాలిహీన్'
11. షేఖ్ నాసిరుద్దీన్ అల్బానీ (రహమతుల్లా అలై) గారి "సిఫతుస్సలాతున్నబీ"
12. అబ్దుల్ అజీజ్ బిన్ అబ్దుల్లా బిన్ బాజ్ (రహమతుల్లా అలై) గారి 'ముఖాలాత్ వ ఫతావా.'
13. ఇక్బాల్ కీలానీ గారి 'తఫ్హీముస్సున్నహ్' పరంపర లోని పుస్తకాలు.
14. ఫవ్వాద్ అబ్దుల్ బఖి గారి 'మహా ప్రవక్త మహితోక్తులు'
15. ఇబ్నె ఖుదామా గారి 'ది రేడియన్స్ ఆఫ్ ఫేత్' (ఇంటర్నెట్ ప్రతి)
16. సాలెహ్ ఉసైమీన్గారి 'షరియత్ కే తీన్ బునియాదీ ఉసూలోఁ కీ షరహ్' మరియు ఇతర చిన్నపుస్తకాలు.





## అల్ అసర్ ఇస్లామిక్ సెంటర్ ఆశయాలు

- ప్రామాణికమైన ధార్మిక గ్రంథాలు - ఖచ్చితంగా ఖుర్ఆన్, హదీసుల వెలుగులోనే రూపొందించబడిన వివిధ ప్రచురణాలయాల పుస్తకాలకు ప్రాచుర్యం కల్పించటం.
- అరబీ, ఉర్దూ, తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలలో ఇస్లామీయ ధార్మిక పుస్తకాలను ప్రజలకు అందజేయటం.
- ఇస్లామీయ ధార్మిక ప్రసంగాలకు సంబంధించిన అనేక రకాల ఆడియో, వీడియో క్యాసెట్లు, సి.డి.లు మరియు డి.వి.డి. లను తయారు చేసి ప్రజలకు అందజేయటం.
- దావత్ (ధర్మప్రచార), సంఘ సంస్కరణా కార్యక్రమాలు నిర్వహించటం,
- ప్రజలలో ఇస్లామ్ పట్ల వున్న అపోహలను తొలగించి వారికి సరైన అవగాహన కల్పించటం.

## మా సందేశం

★ జ్ఞానం (ఇల్మ్)

★ ఆచరణ (అమల్)

★ పిలుపు (దావత్)

★ సహనం (సబ్ర్)

"కాలం సాక్షిగా! నిశ్చయంగా మానవుడు నష్టంలో పడి ఉన్నాడు. అయితే **విశ్వసించి, సత్కార్యాలు** చేసిన వారు, పరస్పరం సత్యం గురించి **ఉపదేశించినవారు**, ఒండొకరికి **సహనం** (స్థయిర్యం) గురించి తాకీదు చేసినవారు మాత్రం నష్టపోరు." *(ఖుర్ఆన్ : సూరా 103)*